సంపుటము 21
సంచిక 8

భారతి

తారణ, శ్రావణము
1944 ఆగస్టు

స్వగ్రామటి

— శ్రీ దేశిరాజు వెంకటరమణరావు —

బంగారంబులు పండు భారత ధరా ప్రాసాద శృంగంబులం
దంగారంబులు తెచ్చి చల్లి రెవరో ఆ పేరులం బిల్చుచే
శృంగారం బనిపించెనా? యితరము ల్లేవా? రసాలమ్ము కీ
ర్తిం గొండాడుట కివ్వి యేల హుమయుద్దీనుం, జహాంగీరునుఁ ?

దగ్ధతూణీర కోదండాస్త్ర విరథ మన్మథ కృతాంత నవీన మధురథనువు
జరఠ భూజకర మృత్స్నా రంధ్రముఖ సముద్గత హరిన్మణి రమ్యకాంతి రేఖ
కేదార దేవతాగృహ ప్రతిష్ఠిత శార్ఙ్గధరవధూ తారుణ్య తరళమూర్తి
సప్తస్వరరథపురస్సౌవిదల్లకపాణి విభుతా ప్రకాశక వేత్రలతిక
తీయనగు సన్న బంగారు తీఁగ చెఱకుఁ - బాలుఁ ద్రావిన నా జిహ్వ పరువులిడదు
తృప్తమయి, ప్రేయసీ బహూకృత నిజోష్ఠ-మసృణ మందారమంజరీమాధ్వికాలకు.

ఆకులమాటునం దజ్ఞాతసైరంధ్రి వాసనచే పట్టువలయు పండు
అరముగ్గి తనంతఁ దా రాలి పడు పండు స్వాచ్ఛందవర్తిని వారవనిత
కావువైచిన ముగ్గకమె నిల్చు కనబోయి యాడేరని విముగ్ధహృదయ కన్య
దెబ్బలు తిని క్రుళ్లి తిన పీలుకానిది కుష్ఠరోగిణి, చావుఁ గోరు నవద
తోఁటలకుఁ బోయి, యొడినిండ దొంగిలించి-యిసుములం గప్పి పసిపిల్ల లింటి కరిగి
మరలివచ్చు నిమేషమ్మునకే ముగ్గు-నివి సపోటాలు మృదుఫలవృతజాతి.

నిడుత్రాటిమ్రాకుల నిశ్రేణి నెట్లబ్బ నిలిపి రాకాశమ్ము నిలువులంట
బిగువైన పెనుద్రాళ్ళఁ బెనవైచి యెట్లబ్బ కంబాల శిఖరాలఁ గట్టినారు
పడిపోవ కెట్లబ్బ పైకేగివత్తురు నీలాల నునుమబ్బు నేల రాల
నివి ప్రతిష్ఠించినా రెట్లబ్బ గట్టిగా నుయ్యాల లూఁగుచో నొరగకుండ

గనుచుఁ జప్పట్లు కొట్టుచు గంతులిడుచుఁ-జుట్టు మూఁగిన పిల్లల చుంచు మువ్వ
మెత్తుకొని నిల్చు జనపద ప్రేక్షకాంగ-నా హృదయపీఠి మోయు నుత్సాహభరము.

గిలుగిలుక్కున నందియలు మ్రోసితేఁ జాలుఁ గమ్మని నీరాలు కడవెడన్ని
తళుతళుక్కున మేను తులకించితేఁ జాలు నమృతరసా లూరినట్టి వన్ని
నిగనిగన్నగ మోము నగుపించితేఁ జాలుఁ గొబ్బెర చన్నీళ్లు కోరినన్ని
కిలకిల దంతాలు వెలిఁబుచ్చితేఁ జాలుఁ జెఱకుల పానకా ల్చేదినన్ని
కంకణాల్ గల్లుమన మృదుకరకిసాల-మెత్తితేఁ జాలు మధువు లర్థించినన్ని
బావు లొనగును స్నేహ మేపాటిదో వి-ధుంతుదవిధూతవిధుముఖ ధూర్తజనుల.

ఆరిపోయినది సంధ్యాచిత్రకోచిస్సు వెలిగింపరా దీపకళిక లింక
కందిపోవును లోనఁ గైటభారాతి ప్రేముడికత్తె పీవరా పూవుసురటి
విదియచంద్రుని రేఖ అదె కారుమబ్బులో రాకేల దడసె మార్దంగికుండు
విచ్చేయుచుండురు విన భక్తబృందము సేయకున్నా రేల చెక్కభజనఁ
జల్లఁగాలి హిమాచల సానుశిఖర - ఝరమహేశాన దిక్కోణ జనితమయ్యె
నులుముత్తెమె దూరనభమునం దొక్కసారి - వానవచ్చిన నిండ్లకుఁ బారవలయు.

అనుకోను కృష్ణరాయలతోనె తెల్గు శౌర్యపుఁ గప్పురపుఁదావు లడఁగిన వని
అనుకోను నేను పెద్దనతోనె ఆంధ్రసాహిత్యశారద అస్తమించిన దని
అనుకోను తిమ్మరుసయ్యతో ఖైదునఁ దెలుఁగుఁబ్రజ్ఞయుఁ గడతేరిన దని
అనుకోను విఠలుఁ జెక్కిన శిల్పితోనె శిల్పకళావనిజ మూకు రాల్చినదని
అవి వశింపనెలేదని యందుఁ బూర్వ - నాగరికతాస్రవంతి కీనాఁడు కట్టె
యానకట్టయుఁగూడ లే దందు కొనలు - గ్రామటికలందుఁ గొ[illegible]ంటఁ గానఁబడుట.

ఆస్థాన హైమ సింహాసనం బిద్ది అన్యాయమ్ము వెలిచెడునట్టిచోటు
ప్రత్యూషస్నాయంవిరామవేళలను పేరోలగమ్ముండు నిం దూరిపెద్ద
పక్షపాతము, ధనవ్యయము లేకుండ నెంతటి చిక్కుతో నున్న తగవుఁ దీర్చు
నిట శిలామూర్తియై తృణశయ్య గమనించి చదికిలంబడ్డది శాస్త్రధర్మ
పుణ్యధేనువు ప్రామజ్జిమోకసీడ - శాంతిపరిమళశీతల శ్వసనవీచి
వీచిపోవుఁ గృషీవల స్వేదలవము - లంతరంతర్థిగా నలసాలసగతి.

నీతంత్రీనఖచాలనోద్గతఝురీనిర్హ్రాదముల్ నిన్న నా
యాతప్తశ్రవణాలకు న్మధువు లందించెఁ స్వయంక్లృప్తముల్
జాతీయోజ్జ్వల గీతు లేనిచట నాలాపింతు నుత్సాహినై
ఆ తంబూరయు లోహతాళములు నా కందిత్తువా దానరీ !

కవిత్వమూ - బ్రాహ్మణత్వమూ

❋

= శ్రీ చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి =

కవిత్వం - బ్రాహ్మణత్వం ఈరెంటికీ చుట్టరిక ముందునా? అనఁగా, కవిత్వసామగ్రిలో బ్రాహ్మణత్వంకూడా వొకటా? అని ప్రశ్నించేవారు యిప్పుడు పలువు రున్నారు. దీని క్కారణం అప్పకవీయం. ఆపుస్తకంలో కవినిగూర్చి వ్రాస్తూ "ధరణీసురుఁడు ప్రశాంతుఁడు" అంటూ ఆరంభించఁబడింది. దానికి యేదైనా సంస్కృతంలో మూలంవుందేమో అని వెదికితే అహోబలపండితుఁడు "సత్కులీన శ్శుచి ర్దక్ష శ్ఛందో వ్యాకరణాదివిత్" అని యేదో ప్రాచీనశ్లోకం వుదాహరించాఁడు. అందులో వున్న 'సత్కులీన' శబ్దానికి అప్పకవిపద్యంలో వున్న 'ధరణీసురుఁడు' తెలుఁగేమో? గుణికి దారెఁడు హెచ్చుతగ్గుగా అప్పకవిఅనువాదం సరిపోతుంది గాని బ్రాహ్మణేతరులలో చాలామంది (సంస్కృతంలోసహా) కవు లుండడంచేత ఆలక్షణ నిర్వచనం దోషదూషితం కాకతప్పదు. సత్కులీనత్వ మనేది బ్రాహ్మణులకే కాదు. బ్రాహ్మణేతరులకుకూడా కావాచే. కులోచితధర్మములను చక్కఁగా పాటించే యేకులస్థుఁడుగాని సత్కులీనుఁడుగా వ్యవహరింపఁ బడతాఁడు. అయితే అప్పకవికి బ్రాహ్మణేతరులు కవులుగావుండడం యిష్టం కాదని అతనిపీఠికలోని మఱొక పద్యం తెలుపుతుంది. అతని కాలంనాఁటికి బ్రాహ్మణేతరులలో కవులు లేరేమో అనుకుంటే అదీ పొసఁగదు. కువిందుఁడు-భోజరాజునాఁటివాఁడు-సుప్రసిద్ధసంస్కృతభాషాకవిగా అతని రచనే సాక్ష్యమిస్తుంది.

"హే సాహసాంక! కవయామి వయామి యామి"
"శ్వంకారయుక్తాహి గిరః ప్రశస్తాః."

ఇతఁడు తంతువాయి (సాలె) కులజుఁడు. కుమ్మరి కులస్థురాలు మొల్లకూడా అప్పకవికి పూర్వురాలేకదా. కృష్ణదేవరాయలు అప్పకవికి పూర్వుఁడే అయినా అతని ఆముక్తమాల్యదలో పెద్దన్నగారి పద్యాలు (వంశవర్ణనకు సంబంధించినవి) వుండడంచేత ఆగ్రంథ మంతా పితామహుఁడు రచించినట్లే అభిప్రాయపడ్డాఁడు మన అప్పకవి.

వేదశాస్త్రములవిషయంలో బ్రాహ్మణేతరులలో సుప్రసిద్ధులు మృగ్యులుగాని కవితారచనలో మృగ్యులు గారు. వేదానికి స్వరబాధ. శాస్త్రానికిదురవగాహత్వపీడ యివి అధికారిమృగ్యత్వహేతువులు. అప్పకవిపద్యంలో వున్న 'ధరణీసుర' శబ్దం లక్షణయాద్విజత్వపరం చేసికొని సమన్వయించుకుందామన్నా భట్టుమూర్తి వగైరాలు శూద్రులుగానే పరిగణింపఁబడతారు. భటరాజులకు యజ్ఞోపవీతా లున్నా ఆచారాలు శూద్రాచారాలే.

యేవిధంచేత చూచినా కవి ధరణీసురుఁడుగానే వుండాలనే లక్షణనిర్వచనం యుక్తంగా కనపడదు. ఆవిశేషణం మాత్రమే కాదు; 'ప్రశాంతుఁడు' అనేది కూడా బాధించేదే. కవులు వేములవాడ భీమకవి వగయిరాలు శాంతులుగారు.

చ. "గరళపుముద్దలోహ మవ
గాఢ మహోశనికొట్లు సమ్మెటల్,
హరునయనాగ్ని కొల్మి యుర
గాధిపు కోరలు పట్టుకార్లు ది
క్కరటి శిరంబు దాయి లయ
కాలుఁడు కమ్మరి వైరివీర సం
హరణగుణాభిరాముఁడగు
మైలము భీమన ఖడ్గసృష్టికిన్."

భీమకవిగారి యింటిపేరు మైలమువారే అనియు, వేములవాడ అనేది నివసించే గ్రామాన్ని బట్టి వచ్చిన పేర నన్నీ తెల్పేది. ఆయా వేములవాడ నైజాంమండలంలోనూ ఉంది. గోదావరిజిల్లాలోనూ ద్రాక్షారామ దాపున వుంది. భీమకవి అక్కడివాఁడా యిక్కడివాఁడా అనే చర్చ లోఁగడ చాలామంది చేసి విరమించారు. ప్రస్తుతం మన క్కావలసింది భీమన ప్రశాంతుఁడేనా అనేదే.

ఉ॥ "పెండెలనాగి చెక్కులను....రామకవి కుంజరహస్తము....యాకసుమాల ధారుణీమండలనాథుఁబోలు...." (ఇది తురగావారిది.)

అప్పకవినిర్వచనం అతివ్యాప్త్యాదిదోషగ్రస్త మవడ మట్లుండఁగా అహోబలపండితుఁడు వుదాహరించిన సత్కులీన శ్శుచి ర్దక్షః అనేదానిలో వున్న సత్కులీన విశేషణార్థాన్నికూడా కవిత్వం అపేక్షిస్తుందని నియతంగా చెప్పడం పొసఁగదు. పదకవిత్వమో, పద్యకవిత్వమో,

జంగంకథలు వగైరాలో అల్లేవాళ్ల చిరకాలాన్నుంచి వున్నట్లే ఆయారచనలు సాక్ష్యంయిస్తాయి. కులాభిమానప్రయుక్తమైన పోట్లాటలు కాపులకీ బ్రాహ్మలకీ వున్నాయంటే, అవివాదాలు బ్రాహ్మలలో బ్రాహ్మలకే శాఖాభేదప్రయుక్తంగా కనపడుతూ వున్నప్పుడు జాత్యంతరులతో వుంటే ఆశ్చర్యమేమిటి? వైదికులకీ నియోగులకీ మళ్లా వారిలో అవాంతరులకీ యీదురభిమానాలు వుంటూనే వున్నాయి. అయీ పోట్లాటలకి జంకి కవిత్వం బ్రాహ్మలసేకాని అన్యులసే కాని ఆశ్రయించి, యితరులను అస్పృశ్యులనుగా భావించి నిరసిస్తుందనడానికి యేప్రాజ్ఞుఁడూ సమ్మతింపఁడు. కవిత్వమూ గానమూ యివి వొకరి సొత్తులు గావు. అందఱివీని. సహజంగా పుట్టేవి. శ్లో. "గాంధర్వంచ కవిత్వంచ.... సహజా గుణాః" వేశ్యాజాతిలోకన్న మిన్నాగా భామవేషం వినిపించే పాత్రలు కడజాతిలో వున్నారు. యిప్పుడే కాదు కృతయుగంలోకూడా యీఅంశాన్ని ధ్రువపఱచాలంటే హరిశ్చంద్రోపాఖ్యానం తోడ్పడుతుంది. వేశ్యజాతిలో స్త్రీలూ పురుషులూ మహాకవులే వున్నారుగదా?

యిటీవల లక్షణనిర్వచనం అతివ్యాప్త్యాదిదోషదూషితంగా పాడయిందిగాని పూర్వలాక్షణికు లేర్పఱచింది చూడండీ యెంత చక్కఁగా వుందోను:

శ్లో. శక్తి ర్నిపుణతా లోక శాస్త్రకావ్యాద్యవేక్షణాత్,
కావ్యజ్ఞశిక్షయాభ్యాస ఇతి హేతు స్తదుద్భవే.

ఇందులో కులాలప్రసక్తి లేదు. శాస్త్రపదం వున్నా అదివుంటే విద్వత్కవి అనిపించుకుంటాఁడు. లేకపోతే "ఘర్షసురన్నది రుద్రరూపమై" మాదిరిని రచించే కవి అనిపించుకుంటాఁడు. పూర్వం కవిత్వం చెప్పేవాళ్ళకు భాషాపాండిత్యం ఆవశ్యకంగా వుండేది గాని యిపుడు నవ్యసాహిత్యపరిషత్తు ఆపీడ వదిల్చింది. కాని హరిజనకవులు చెప్పే కవిత్వాలు నిర్దుష్టభాషలోనే కనపడుతూ వున్నాయి. నేను ప్రత్యక్షంగా కొన్నికవిత్వాలు చూచే యీమాట వ్రాస్తున్నాను. అందఱికీ అందుబాటుశైలిలో లేవనేకారణంచేతనే కదా యిప్పుడు చాలామందికవులు భారతాదులను నిరసిస్తున్నారు. యీనిరసించడం యింకా పూర్తిగా లోకామోదాన్ని పొందినట్లు లేదుగాని పొందినవెంటనే యెవరో వొకరు క్రొత్తశైలిలో వ్రాయనే వ్రాస్తారు. యిప్పుడు మనకు ముఖ్యంగా విచారించుకోఁదగ్గది కవిత్వానికీ బ్రాహ్మణ్యానికీ సంబంధం వుందా అనేదే. అట్టి సంబంధం లేదనే యెన్నో సందర్భాలు తెల్పుడు చేస్తున్నాయి. కవిత్వం రచించేవారిలో నూటికి తొంభైమందికి (బ్రాహ్మణులలోనే) శాస్త్రం చదువుకున్నా బుఱ్ఱకెక్కఁడు. కాళిదాసంతవాఁడు శ్లో॥ "నమఃప్రామాణ్యవాదాయ మత్కవిత్వాపహారిణే" అని వొక్కఁదండం పెట్టి మానుకున్నాఁడని విద్వత్పరంపర చెప్పుకుంటుంది. భార్యా కాపరానికి వచ్చాక చదు వేలా సాఁగదో అదేవిధంగా కవితారచనలోకి దిగి పెట్టోమొట్టో గిలుకుతూవుంటే శాస్త్రాభ్యాసమున్నూ సాగఁదు. అసలు దాని (శాస్త్రం) లో ప్రవేశమంటూ అయితే యేదో కొంత అర్జించ వీలవుతుంది గాని అది "అనభ్యాసే విషం శాస్త్రమజీర్ణే భోజనం విషమ్." అన్న శ్లోకానికి వుదాహరణంగా పరిణమింపచేస్తుంది. అందుచేత యీరెంటికీ సామానాధికరణ్యం కుదరదు. విద్వత్త అభ్యాససాధ్య మనిన్నీ, కవిత్వం జన్మలో పుట్టుకవచ్చే దనిన్నీ అందఱూ యెఱుఁగిందే. కనక యిందులో రెండోదానికి జాత్యాదులతో ఆవశ్యకత లేదు. బ్రాహ్మణేతరులకు తర్క వ్యాకరణాది శాస్త్రాలు అభ్యాసంవల్లకూడా సాధ్యపడవా అంటారేమో? సాధ్యపడవనే చెప్పవలసివస్తుంది. దానికి తథ్యంగా బ్రాహ్మణేతరులలో కవులే కనపడుతున్నారు గాని శాస్త్రజ్ఞులు కనపడటం లేదు. శాస్త్రజ్ఞత్వ మనఁగా శిష్యులకు పాఠాలు చెప్పే శక్తి గాని అల్లాటప్పా ప్రవేశం కాదు. ఒక బ్రాహ్మఁడు పదిపంద్రెండేళ్ళు వ్యాకరణం చదివి కాశీనుంచి వచ్చి "ప్రత్యాహారే ష్విరాం నగ్రహణం, అనునాసిక ఇత్యాది నిర్దేశాత్" అనే వాక్యానికి అర్థం తెలియనేలే దన్నాఁడు. ఆ యీ వాక్యం సిద్ధాంతకౌముదిలో మొదటి పుటలోనే వుంది. దీన్ని బట్టి శాస్త్రప్రవేశం యెందఱికి ([illegible] కృషి చేసిన వారికే) అవుతుందో తెలుసుకోవచ్చును. తర్క వ్యాకరణాలు కనక సంప్రదాయంగా చెప్పువుంటే తర్కశాస్త్రంలో త్వరగానే ప్రవేశం కలుగుతుంది. కాని అవి త్వరలో ప్రవేశం కలగనీయవు. తపోహిదురతిక్రమం. కొంత వోపిక పట్టి చదివితే వ్యాకరణానికి అనుగ్రహం కలిగి పేలపిండి మాదిరిని చరచర అనుభూతం అవుతుందిగాని తర్కం ఆలాటిది కాదు. చదివినకొద్దీ అయోమయంగా పరిణమిస్తుంది. అందుచేతనే. 'అయోముఖమూ, పిష్టగర్భమూ' అంటారు వ్యాకరణాన్ని. తర్కాన్నో? 'పిష్టముఖమూ, అయోగర్భమూ' అంటారు. దీన్ని యీలా వుంచుదాం.

నేఁటికాలంలో ప్రతివిషయమూ తల్లక్రిందులుగా మాఱింది. పూర్వం యేది మంచో అది యిప్పుడుచెడ్డ. మీసాలనుగూర్చి చర్చించుకుందాం. అవి వుంచుకోవడం పూర్వం ప్రతాపానికే కాదు, శోభకూకూడా ప్రేరకం. యిప్పుడో? అవి యేపూటకాపూట అంట గొఱుక్కుంటేనే తప్ప కచేరీలోనూ అర్హత లేదు, గదిలోనూ అర్హతలేదు. మహాత్మ

దీయులు, క్షత్రియులు, వెలమవారు వీరందఱూ ప్రాణాన్నైనా గడ్డిపఱకమాదిరిని త్యజించేవారుగాని మీసాన్ని త్యజించేవారు కారు. యిప్పుడో? ఆయా పౌరుషప్రధానజాతులవారందఱూ వీరలు పాదీపవీ వ్యయంగా చేసుకున్నట్లు మీసాలవిషయంలో చాలా శ్రద్ధ పుచ్చుకోవడం అందఱూ యెఱిఁగిందే. మీసంలో వుండేవెంట్రుకలు తాకట్లు పెడితే పూర్వం కరెన్సీకన్నా యిను మిక్కిలిగా పని చేసేవి. యెందఱో పౌరుషవంతులు ఋణం తెచ్చుకోడానికి తాకట్టుకు వాట్లనే వుపయోగించుకొనేవా రని వినికిడి. మీసాలకూ గడ్డాలకూ సంబంధించిన యితిహాసాలు చాలావున్నాయి. (కవులు శ్లోకాలూ, పద్యాలూ తాకట్టుపెడితే పౌరుషవంతులు మీసాలు). అయినుకపాతర త్రవ్వడానికి మొదలెడితే వ్యాసం తేలదు. ఒక మతగురువుగారి మీసమూ గడ్డమూ దాఁచి వుంచి ఆమతస్థులలో మహారాజు లెవరేనా అపవిత్రస్థలానికి యాత్రకు వెడితే వాకవెంట్రుకను ప్రసాదంగా యిస్తారని చెప్పఁగా విన్నాను. 'హైఫేమిలీ' వారికే గాని ఆరాజులలోకూడా ఆప్రసాదం పుట్టదఁట! అట్టి మహాపదార్థం "శివ! శివ! తాని లుఠంతి గృధ్రపాదైః" అనే దురవస్థకు లక్ష్యమయింది.(అసలు తీసివేసినా అందమే మఱో దురవస్థ? సిగ్గుసిగ్గు)

మనకు ప్రస్తుతం కవిత్వం. దానికీ పాండిత్యానికీ చుట్ట ఱికం వుందా లేదా? అనేది. అక్కఱ లేదని పలువురు శలిస్తున్నారు. అంతతో సరిపెడితే సంతసమే. సిగ్గుసిగ్గు! యెంతటి మహాకవినేనాసరే 'పుంసివా కొమ్మెక్కి'రకం కవులు ధిక్కరిస్తూ న్నారు. అంతతో సరిపెట్టడం లేదు. "నీకేం తెలుసు పో వెధవ. కంక. ముండమోపి." యిత్యాదిగా వావి దుదుమన్నారు. ఇట్టి ప్రసంగం తప్పు. కూడదని మంద లించడానికి యెవరేనా పెద్దలు సాహసిస్తే వారినికూడా యిను మిక్కిలిగా దూఱుకూన్నారు. "అట్టిపండితులలో నరయ నూటికి నొక్కరుండు కవీశ్వరుఁ డుండునేమొ?" అని మాచిన్నతనంలో అనుకొనేవాళ్లం. యిప్పుడు పాండిత్యానికీ కవిత్వానికీ సంబంధమే లేదని రుజువౌతూ వుండడంచేత జన్మాంతరవాసనచేత పుట్టిన ధార వొక్కటే రచనకు మూలమని తేలింది. ("గారెలపెండివంట" పద్యం గీరతంలో చూ. "దారిణా జిక్కిన" అనేపద్యంకూడ చూ.)మునుపు తనకు పుట్టినధారకు తోడుగా శాస్త్రాలోకన లోకాలోకనాదులు వుంచే బాగుంటుందని వాట్లను సంపాదించడానికి యత్నించేవారు. అది కొంతశ్రమతో చేరినపని కనక యిప్పుడు ఆసామగ్రినే తగ్గించడం మంచిపనిగా వూహించి వున్నదాన్నికూడా తగ్గించుకుంటూ వున్నారు. యీరకంలో కొందఱు అవసరంగా యేపూర్వమహాకవినో పుచ్చుకొని అతణ్ణి దూషించడానికి ఆరంభిస్తూన్నారు. దానిస్వరూపంయిది—

ఉ. "ఉదయం బస్తనగంబు సేతువు హిమ
        వ్యూహంబునుం జుట్టిరా
    విదితంబైన మహీజా మహేంద్రకవితా
        విద్యాబలప్రౌఢిమీ
    కెదురేరీ"

అన్నాఁడుకదా రామలింగం. యిది నన్నయాదులను ధిక్కరించినట్లా కాదా అంటూ తలాతోఁకా లేని వాదానికి వుపక్రమించి యెనిమిదో అర్థాన్ని యేకరు పెడుతున్నారు. రామలింగం యేశతాబ్దంవాఁడు, నన్నయ్యేశతాబ్దికాలంవాఁడు అనే విచారణ ఆయావ్యక్తులకు స్ఫురించకుండా వుంటుందా? ఆయాసందర్భం రామలింగకవికి సమకాలీనులకే చెల్లుతుంది గాని యెన్నఁడో వచ్చి స్వర్గ మలంకరించినవాళ్ల కేం సంద ర్భిస్తుంది?—

శా. "ఈశ్రీజీ విన్నమఁడోలు సత్కవులు రే
        రీమేటికాలమ్మునన్" (శ్రీనాథుఁడు)

ఆయీ మాట శ్రీనాథుఁడికి పూర్వముండుంటే తిక్కన మొదలయినవారికిఁగాని, పరముండుంటే పెద్దనాదులకుఁగాని యెట్లు సమన్వయిస్తుంది? వేదాంతదేశికులవారు "శిరస్సు నిహితం మయా పద మదక్షిణం లక్ష్యతామ్" అని ప్రతిజ్ఞ చేశారు. యింతకన్న ఘోరమైన, పండితలోకానికి అవమాన కరమైన ప్రతిజ్ఞ అంటూ వుంటుందా? యీ దేశికులవారి ప్రతిజ్ఞనుగూర్చి వ్యాసాంతమందు కొంతవ్రాస్తాను. యిది యెన్నఁడో స్వర్గమో మోక్షమో పొందిన శంకరాచార్యులకు సమన్వయిస్తుం దని యేమాత్రం పరిశీలన వున్నా అనుకోవడం తటస్థిస్తుందా?

అస లుపక్రమించిన విషయంవేఱు. బ్రాహ్మణ్యానికీ కవిత్వానికీ లంకెగా యెవరేనా చెప్పడానికి పూనుకుంటే ఆమాట అపహాస్యాస్పద మేనా, కాదా అనేది. అప్పకవికి కొద్ది గొప్ప యీ పిచ్చి అభిప్రాయం వున్నట్టు అతని వ్రాఁత కొంత సాక్ష్య మిస్తుంది. విశ్వకర్మజాతిలో త్రాసులు- బంగారు తూఁచుకొనేవి—చేసే కుటుంబాలు కొన్ని తునివద్ద యేదో వూళ్ళో వుండేవి. ఆ కుటుంబస్థులు ఆ శిల్పం తమ కూఁతుళ్ళ కొడుకులు చూస్తూ వుంటే చేసేవారు కారు. అలాగే వైద్యులు కొందఱు కొన్ని ఔషధాలు భద్రంగా కాపాడేవారు. అలాగే కొన్ని మామిడిజాతులు న్నూ. (జహంగీరు జహూజాపసందు పద్యం చూ.) తుదకు యివన్నీ వారువారు అనుకున్నట్లు తమలోనే వుండక

అంతటా వ్యాపించాయి. ఆలాగే కవిత్వమూ యిప్పుడు ఆబాలగోపాలమూ ఆబ్రహ్మస్తంబ పర్యంతమూ (తెలుఁగన్న మాట) వ్యాపించింది. శ్రీనాథుఁడు "నీవుసుంగవివి గావు గదా?" అన్నాఁ డని ఒక వినికిడి కలదు. దీన్నిబట్టి చూచినా బ్రాహ్మణులలోనే కాక యీ కవిత్వం సర్వత్రా వ్యాపించి పూర్వమున్నూ వుండేదని తెలుస్తుంది. అది విద్వత్కవిత్వమా, కాదా అన్నది విచారణాంతరం. గంభీర హృదయులు తేలిక ప్రసంగాలు యెన్నఁటికీ చేయరు. చేసే వాళ్ళను ఆమోదించరు. గాని లఘుహృదయులు జాతిని యెత్తిపొడవడం పూర్వమూ వుండేది. వాసిరెడ్డివారి సంస్థానంలో బుచ్చివెంకు అనే కళావంతుఁడు వుండేవాఁడు. అతణ్ణి బ్రాహ్మణకవులు—

క. "ఈ-న్యంకేల? వానికిం గం
ఠంకే యుచ్చోట నిలువ రసవంతముగుణా"

అని (పాపం) కులాచారాన్ని పురస్కరించుకొని శ్లేషించేటప్పటికి ఆకవి ఒక్క మంచి "ఊరకే మన్నన మాలి మాకొలము మాట దలంతురు" అని చక్కని జవాబు చెప్పినట్లు వినికిడి. ఆజవాబు చెప్పడంలో "చేమకూర వెంకన్నకు లోవమేమి?" అని విజయవిలాస గ్రంథకర్తని స్పృశించడంచేతనే చేమకూర మహాకవి లక్ష్మణామాత్య తనూభవుఁడే కాని బ్రాహ్మణుఁడుమాత్రం కాఁడని తెలియవచ్చింది. ముప్పది యిద్దఱు నియోగుల సీసంలో యితఁడున్నాఁడు. యితఁడు గ్రంథాంతగద్యంలో గోడమీఁదిపిల్లి వాటంగా ప్రవర్తించాఁడు. తండ్రికి అమాత్య పదం వాడి తనకు వాడుకో లేదు. (యిప్పుడయితే వాడు కొనేవాఁడే) యిటీవల బుచ్చివెంకుకూ, బ్రాహ్మణకవులకూ జరిగిన వివాదవల్ల యథార్థం బైటఁ బడింది. బుచ్చివెంకు అన్నట్లు— "పన్నిన సత్ప్రబంధమున బాగును నో[illegible] జూడ"వలయును గాని "నీవు బ్రాహ్మఁడవు, విశ్వబ్రాహ్మఁడవు, నియోగివి, వైదికివి, వైశ్యుఁడవు, క్షత్రియుఁడవు, కమ్మవు, కాపవు, బలిజివి, మాలవు—ఆఁడుదానవు" అంటూ వివరించడంకన్న శోచ్యస్థితి వుండదు. (భిజానకమనిశి ప్తః కిమిజా ర్నీరసో భవేత్") యెవరో లఘుహృదయు లిట్టి కలహాలకు పుపక్రమించినా వాళ్లని పెద్దలు- లేదా విజ్ఞులు జవాబివ్వడం (అనగా అలఘుహృదయులతో వాదించడం) అనాలోచనపని. వీరిపెద్దతికాన్ని అవలివారు గమనింపరు. అనరానిమాటలు (బండ బూతులు) అందురు. వీరికి అట్టి మాటలు రావు. వస్తాయే అనుకుందాం. అప్పుడు అంత కన్నను వీరు లఘుహృదయులు కావలసి వస్తుంది గదా? అందుచేత అట్టివారి తిట్లను గణించడం ప్రమాదం. వారిచ్చే అభార్థివాక్యాలు "పర్వీత బుధపోమయో॰" అన్నట్లుంటాయి. అట్టిమాటలను ఖండించడం యెందు కంటాను. వారికి యెవ్వరూ అడ్డరు. బస్ ఇంతే. యేదో ప్రసక్తాను ప్రసక్తంగా యీవిషయం మధ్యలో తగిలింది.

కవిత్వానికీ బ్రాహ్మణ్యానికీ లంకె అని అప్పకవి అన లేదు గాని యేదో నీచోపమానం పెట్టి శూద్రకవిత్వాన్ని గూర్చి కొంత ప్రసంగించడం అనాలోచనగానే నాకు కన పడింది. "తెలివి యొకరిసొమ్మా?" అన్నాఁడు క్షేత్రయ్య. అయితే యితరకులాలలో తెలివి అనేపదార్థం వున్నా దానిని విద్యలో వుపయోగపఱచక ద్రవ్యాకర్షణకు అనుకూలించే వ్యవసాయాది సద్వృత్తులయందు (నిజం చెపుతాను. నాకు కవిత్వంకంటే వర్తకం కష్టసాధ్యంగా కనపడుతుంది) వినియోగించడంచేత బ్రాహ్మణులలో వున్నంతమందిగాని, కొంత మందిగాని లేకపోవడం తటస్థించింది. చిరకాలాన్నుంచి విద్యాకృషి లేని కుటుంబంలో జన్మించిన వ్యక్తికి విద్యాగోష్ఠిలోకి కాలుపెట్టినప్పుడు బ్రాహ్మణకులజులకుబలె చురుకుగా ఆవాసన అంటదు. అదేనా సంస్కృతమున్నూ, తత్సమపద భూయిష్ఠంగా వుండే తెలుఁగున్నూ అభ్యసించడంలోనే, ఇంగ్లీషులో బ్రాహ్మ రెంతో యితరులూ అంతే. అయినా యీవిషయంలోనూ కొంత విశేషం వున్నట్టు వినికి. దక్షిణాదిబ్రాహ్మలవలె మన ఆంధ్రులు కొన్ని పరీక్షలలో వుత్తీర్ణులు కారేరనీ, దక్షిణదేశస్థులలోనున్నూ తామ్రపర్ణీతీరస్థులు మతీ బుద్ధిసూక్ష్మత కలవారనిన్నీ చెప్పుకుంటారు. దాని క్కారణం అనదివుదకమే అంటారు. ఆనీటిలో తామ్రం వుందని దానిపేరే చెపుతూవుంది. బ్రాహ్మణులే కాదు. తదితరులుకూడా మిక్కిలి బుద్ధిశాలులు దక్షిణదేశంలో వున్నారు. బ్రాహ్మణేతరులలో అణువంలో పుస్తూలమైనకవు లున్నారని వినికి. దక్షిణా గాథకాః అంటే బుద్ధిశాలులు. ఆయీ మాట సిద్ధాంతకౌముదిలో వుంది. బహుశః యీమాట భాష్యంలో కూడా వుందేమో జ్ఞాపకం చాలదు. (శా. "లేరే యెందఱో అగ్రాహ్యకేల్లు తెలుపుర్లవేః అయ్యంగారికే పేరే మల్లడి కృష్ణ సామికె కదుం బెంపేమి?" జయంతి చూ) బుద్ధిమత్తగాని, విద్యావత్తగాని, ధనవత్తగాని, గుణవత్తగాని, ఆవత్తగాని యీవత్తగాని యేవత్తగాని వొకరిసొత్తు గాదు. యిది మాదే అనిన్నీ, యితరులు దీనికి తగరనిన్నీ అనుకోవడం, వారిని దూషించడం యివి అనాలోచనపనులు. నాకు మొదటినుంచీ యీపట్టింపు లేదు. నాకు వచ్చిన నాల్గక్షరాలూ తప్పోవొప్పో బ్రాహ్మణులకేనా సరే బ్రాహ్మణేతరులకేనా సరే చెప్పడమే నా కలవాటు. అప్పకవిరోజుల్లో నేను వుంటే ఆయన నన్ను

గాఢంగా మందలించేవాఁడేమో: వేదం నాకు రానూరాదు. వచ్చినకాస్తా నన్నెవరూ అడగనూ లేదు; నేను చెప్పనూ లేదు. శాస్త్రమున్నా దిదో. యిఁకనల్లా అందఱికీ అందుబాటులో వుండేవి తెలుఁగుముక్కలు. అందులో నేనా వ్యాకరణం యెవరికో (బ్రాహ్మణ్లోనూ అంతే) గాని యెక్కఁడు. అందుచేతే నేను స్కూళ్లోకూడా బాలవ్యాకరణం చెప్పేవాణ్ణే కాను. సంవత్సరానికి నాలుగు గడియలకన్న నేను గ్రామరు కింద ఖర్చుపెట్టేవాణ్ణే గాను. నా గ్రామరు యావత్తూ యింతలో యిమిడేది:

(౧) అకారానికిఁ గాని ఇకారానికిఁ గాని సంధి చేయాలని నియమంలేదు – మీచిత్తం.

(౨) ఉకారానికి వాక్యం ముగింపులోతప్ప సంధి చేయండి తప్పకుండాను.

(౩) ద్రుతప్రకృతికం (నకారపొల్లు) మీఁద వుంటే కచటతపలు గజడదబలుగా మార్చుకోండి.

ఈమూడు మాటలూ చెప్పడానికి యెన్నాళ్ళు కావాలి? కొన్ని నిమిషాలు చాలునుకదా. కాంపోజిషను యావత్తూ వీట్లతోనే నెగ్గించేవాణ్ణి. తెలుఁగుటీచరు వ్యాకరణమే చెప్పడం లేదని యినస్పెక్టరుగారికి యేలాతెలిసిందో (మంథపూడి కామేశ్వరరావు పంతులుగారు) నన్ను ప్రశ్నించారు. అప్పుడు నేను—"అయ్యా! వ్యాకరణం ప్రత్యేకించి అభ్యసింపవలసిన శాస్త్రం గాని యెన్నో సబ్జెక్టుల్లో అదీ వొకటిగా చేర్చి చెప్పతగ్గదిగాదు. కనక నేను ఏదో పరీక్షప్యాసుకు అనుకూలించేమార్గంగా అవసరమైనంతవఱకే బోధిస్తున్నాను. యెంతో క్రోడీకరించి తగ్గించి తగ్గించి చెప్పినా ఆ కాస్తా కూడా అంటనివాళ్ళు బోలెడున్నట్లు తమరు చిత్తగించే ఉన్నారు గదా?" అని వారికి తృప్తి కలిగేటట్టు నా అనుభూతిని యేకరు పెట్టిన పిమ్మట వారు ఆమోదించినట్లే నాకు తోఁచింది. యిది యిప్పటికి సుమారు ముప్పది యేళ్ళకు పూర్వపు సంగతి. యిటీవల స్కూలుపిల్లల కాంపోజిషనుకున్నూ పత్రికలలోని సంపాదకీయాలు వగయిరాలకూ అంత నిక్కచ్చి వ్యాకరణం అక్కఱలేదని అభిప్రాయం మాఱింది. కాలరీతి ప్రతి విషయానికీ లఘుత్వంగా ఉండడాన్ని అపేక్షిస్తూ వుంది. గురుత్వాన్ని సహించేటట్టు కనపడదు.

తెలుఁగని పేరుకాని వ్యాకరణం బోధ చేయవలసివస్తే సంస్కృతానికి వున్నంత కాకపోయినా కొంతేనా కష్టం వుంటుంది. గాని తేలికలో తేలదు. బ్రాహ్మణ కవులు చాలామంది ఆయీ కారణంచేతనే వ్యాకరణం మాకు లొంగవలసినదే కాని మేము వ్యాకరణానికి లొంగేది లేదని శాసిస్తున్నారు. "ఛందో వ్యాకరణాదివిత్" అని లక్షణం శాసించిన మాట సత్యం. ఆ శాసనం ఆనకట్టకు పూర్వం అమలు జరిగింది. గాని యీ యిరవయ్యో శతాబ్దానికి పనికిరాదని పలువురు యువకవులు కట్టు కట్టి పని చేస్తున్నారు.

శబ్దం బ్రహ్మస్వరూప మనిన్నీ, దాన్ని సుస్వరంగానూ నిర్దుష్టంగానూ వుచ్చరించినప్పుడే అది పుణ్యజనక మవుతుంది గాని అన్యథాగా వ్యవహరిస్తే యేదో కొంపమునక్కా కారణంగా పరిణమిస్తుందని పూర్వాచార్యుల శాసనం. ఆ యీ శాసనా లన్నీ యిప్పుడు అకించిత్కరాలుగా బుట్టదాఖ లవుతూ వున్నాయి. పూర్వపండితుల చర్యలూ, వారిప్రతిజ్ఞలూ తల్చుకుంటే యిప్పటివాళ్ళ విశృంఖలత్వం యేదో విధంగా పరిణమించినట్లు కనపడుతుంది. ఆ పండితరాయలు, ఆ వేదాంత దేశికులు, ఆప్రతిజ్ఞలు యిప్పటివాళ్ళకు రుచించవు సరిగదా, అవి తమకు మర్యాదభంజకాలని కూడా విచారపడతారు.

'వాచా మాచార్యతాయాః
పద మనుభవితుం కోఽస్తి ధన్యో మదన్యః'

ఆయీ శ్లోకం చాలా పెద్దది. పండితరాయలవారిది యీగర్జితం. "ఆసేతుహిమాచలపర్యంతమూ వున్న పండిత మండలిని నేను ప్రశ్నిస్తున్నాను: వాక్పతి అనే పేరుకు యీభూలోకంలో నాకు తప్ప మఱొకఁడు వున్నాఁడా? వున్నట్టయితే, నిశంకం వదంతు" అనిగర్జించాఁడు పండితరాయలు. (ఘనుల పండితరాయాదికవులు చూపు గ్రీవలంబట్టిపోదుము దేవునైన లక్ష్యపెట్టము, చూ) యేదో ఆగర్జించడానికి అవసరం వచ్చింది కనకనే అతఁ డట్లు గర్జించాఁడుగాని తీరి కూర్చుని గర్జించ లేదు. పండితరాయలు వేఁగినాటి బ్రాహ్మఁడు. వెల్నాటిశాఖవారు ఆ యీ గర్జింపు మా పూర్వులకు అవమానకరం అని విచారిస్తే యేం ప్రయోజనం? ఆ పండితరాయలకు సమకాలీనులుగా వుండే భట్టోజీ దీక్షితులు, అప్పయ్య దీక్షితులు వీరు ప్రతిఘటించికూడా వోడిపోయారు. అంతవఱకు అది పండితలక్షణమే కాని అన్యథా అతణ్ణి వంచించలేక అతఁడు లవంగి అనే తురుష్క కన్యకను పెండ్లిచేసుకున్నాఁడని మిషపెట్టి బహిష్కరించడం వగయిరాలు యీ కాలంలోనే అయితే శోచ్యం. అతఁడు నిరాఘాటమైన శక్తికలవాఁడు. కనకనే ఆకాలపు ఢిల్లీ చక్రవర్తి (శహాజహాను)అతనికి పండితరాయలు అనే బిరుదాన్ని యిచ్చి గౌరవించాఁడు. ఆ గౌరవించడంగాని ఆ గర్జించడం గాని అంతకు పూర్వకాలంలో వుండే యితరశాఖాపండితులకుఁ గాని కవులకుఁగాని అవమానకర మంటూ విచారించడం 'పృష్ఠతాడనా ద్దంతభంగః' వంటిది కాకుండునా? యీలా

విచారించడంకంటే మా బ్రాహ్మలలో పూర్వం యింతటి దిగ్దంతులు వుండేవారని యితరశాఖీయులుకూడా గర్వించడం యుక్తంకదా?

"దివిజకవివరు గుండియల్ దిగ్గురనఁగ
నరుగుచున్నాఁడు శ్రీనాథుఁ డమరపురికి"

దీని కర్థమేమిటి? యీలోకంలో వుండేకవుల నందఱినీ వోడించడ మయిందనేనా? ఆ వోడించడం తనకన్న కొంత పూర్వకాలంలో వుండే కవిబ్రహ్మ కున్నూ, చాలాపూర్వీకుఁడైన నన్నయ్యకున్నూ కూడా సంఘటిస్తుందా? తనకు సమకాలీనుఁడైన గౌడడిండిమభట్టువఱకే సంఘటిస్తుందా? శ్రీనాథుఁడు వైదీకి కాఁడు. నియోగి. అపును గాని మన దేశంలో విస్తరించి వుండే ఆర్వేలనియోగిన్నీ కాఁడు. యిందుకు అతని పద్యపాదం 'పాకనాఁటింటిపాఁడవు బాంధవుఁడవు' అనేదే పక్కాణిస్తుంది. ఆనందించక అసూయపడి విచారించవలసి వస్తే శ్రీనాథుని విజయానికి పాకనాఁటివారుతప్ప యితర నియోగులున్నూ-వైదికులు సరేసరి-యావన్మందిన్నీ విచారించవలసివస్తుంది. అందులో "మహి మున్ వాగనుశాసనుండు సృజియింపన్"అని వుండడంచేత నన్నయ్యగారి చుట్టాలున్నూ (వైదికులన్నమాట). మఱిన్నీ "కుండలీంద్రుండు తన్మహనీయస్థితిమూలమై నిలువన్"అని వుండడం చేత తిక్కన సోమయాజులుగారి బంధువులున్నూ (ఆర్వేలవారన్నమాట) యెక్కువగా అసూయపడవలసి వస్తుంది. యింతేకాదు. ఆంధ్రకవితాపితామహుఁడుగారి శాఖవారు (నందవరీకులన్నమాట)కూడా పాకనాఁటివారు తమవారు కారు గనక విచారింపవలసినవారే అవుతారు. వీరే కాదు. యింకా మఱిచాను. తెనాలిరామలింగకవి అగ్రశాఖికాకోకిలం కనుక శుక్లయజుశ్శాఖానియోగులున్నూ శ్రీనాథుని ఐశ్వర్యానికి విచారింపవలసిన వారే కాని యీక్షణంవఱకు యెవ్వరుగాని యిట్టి విచారానికి భాజనులు కాకపోవడం మన అదృష్టం. రామలింగకవి ప్రథమశాఖవారిలో వైదికే కాని నియోగికాఁడనే పక్షంలో వారికీ విచారం తప్పదు. యింతకీ 'యీవిచారం అసలు యుక్తమేనా' అనే ప్రశ్నకు జవాబు వుందా? నన్నయ్యగాని, తిక్కన్నగాని, రామలింగంగాని, పెద్దన్నగాని శ్రీనాథుఁడి కాలంలో వున్నారా? లేరుగదా? 'అమరపురి' పద్యంలో లేకపోయినా మఱోపద్యంలో "తఃక్షోణి న్నినుఁ బోలు సత్కవులు లేరీనాటికాలమ్ములో—"అని వుండనేవుంది. వుండదే అనుకుందాం 'పార్థ ఏవ ధనుర్ధరః.' యీమాటకు రాముఁడు గాని రావణుఁడుగాని అశోకుఁడుగాని గుఱి అవుతారా? భవతు.

శ్రీనాథుని ఆత్మశ్లాఘాపరత్వం మాట విచారకారకం అంటారా? అనండి. కవులలో తన్నుఁగూర్చి అంతో యింతో వ్యంగ్యంగానో వాచ్యంగానో కత్థించుకోని (కత్థ శ్లాఘాయాం) వారెవరు? కవికుల గురువు కాళిదాసు 'మందః కవియశః ప్రార్థీ' అన్నాఁడు కనుక యీయన్ని పుచ్చుకుందామా? యీవిధంగా రఘువంశంలో వినయాన్నే కనపరిచాఁడు. శాకుంతలంలోనో? "అభిరూపభూయిష్ఠా పరిషదియం. తదత్ర కాళిదాసగ్రథితవస్తునా నవేన నాటకేనోపస్థాతవ్యం"— నాఁటిసభలో చాలామంది పండితులున్నారట; అందుచేత కాళిదాసుగారి నాటకంగాని పనికి రాదట? వాచ్యార్థంలోనే కొంత కత్థనం కనపడుతూ వుంది. యిఁక వ్యంగ్యానికి ప్రోవదీస్తేనో? పండితులంతగా లేని సభలో అయితే యే కవిదేనా నాటకం పనికివస్తుందిగాని పండితభూయిష్ఠమైన సభలో అయితే కాళిదాసుదే గాని పనికి రాదు. యీలాగే నన్నయ్య—

(౧) "నిత్యసత్యవచను మత్యమరాధిపాచార్యు
నన్నపార్యు"

(౨) "అమలోదాత్తమనీష నే నుభయకావ్యప్రౌఢి
పాటించుశిల్పమునం బారగుఁడన్"

అని కవిబ్రహ్మ యిదేరీతిని అందఱికీ చూపవచ్చును.

౪౦ యేళ్లనాఁడు కవిసింహగర్జితము లనే పేరుతో వొక చిన్న పుస్తకం ప్రచురింపఁబడింది. వలసినవారు దానిలో చూచుకుంటారు. కీ॥ శే॥ కస్తూరి శివశంకరకవిగారు యేదో సందర్భంలో వొక వ్యాసం వ్రాశారు. అందులో ఆయీవిషయంకూడా స్వల్పంగా స్పృశించినట్లు జ్ఞాపకం. (అది 'గుంటూరిసీమ'లో వుంటుంది) అయితే ఆయీకవులు తమ గొప్పఁదనాన్ని చెప్పుకున్నారు గాని యితరులమీఁదకి దూఁకినట్లు లేదంటారేమో? ఆ చెప్పుకోవడంలో వ్యంగ్యం తీస్తే దూఁకడమూ కనపడుతుంది. పోనివ్వండి. అంత శ్రమ యెందుకు. వాద్యమే దొరుకుతూ వుండఁగా? లోఁగడ—

"శిరస్సు నిహితం మయా పద మదక్షిణం
లక్ష్యతామ్".

యీశ్లోకం యెందుకుఁ బుట్టిందో యెఱుఁగుదురా? రామానుజమతం యెవళ్లు వొప్పరో? అనఁగా వారిసిద్ధాంతాన్ని ఆమోదించి (చక్రాంకనాదికం, ఊర్ధ్వపుండ్రధారణం వగైరా) ప్రవర్తించక వివదిస్తారో; అట్టిప్రతివాదిపండితశేఖరేనా సరే వారి శిరస్సులయందు నా కాలు—కాదుకాదు యెడమకాలు పెట్టఁబడింది. అనఁగా పెట్టితీరుతానన్నమాట. యీమాటలు "తదన్యమత దుర్మద జ్వలితచేతసాం వాదినాం" అనే మూఁడవచరణంలో కనపడుతూవున్నాయి?

(మతప్రచారకులలో శ్రీనందిరాజు దీక్షితులుగారు తిరుమణి తిరుచూర్ణధారకులనుగూర్చి ప్రతిజ్ఞ చేయడం, మరుకుమిల్లివారు యెదిరించడం వగయిరాలు గ్రంథవిస్తరభీతిచేత వుదాహరించ లేదు) కుడికాలు పెడితే యెక్కడ ప్రతివాదులను గౌరవించినట్లవుతుందో అని యెడమకాలన్నాఁడు. తదన్య — రామానుజులవారికన్న యితరులయొక్క, మత-మతములు, అద్వైతం, ద్వైతం, శైవం, శాక్తేయం, ఇవన్నీ కావచ్చును గాని దేశికులవారి తాత్పర్యంమాత్రం అద్వైతమతమనియ్యేవే. అద్వైతమతోద్ధారకులు ఆదిశంకరులు గతించి అప్పటికి కొన్నిశతాబ్దాలు అయినా శంకరులనెత్తిమీఁద వేదాంత దేశికులు యెడమకాలు పెట్టినట్లయిందనిన్నీ. ఆయీ దేశికులవారేమి, అసలు విశిష్టాద్వైతమతోద్ధారకులు శ్రీ రామానుజులవారేమి, యింకా శ్రీ వైష్ణవమత ప్రచారకులు మరి కొందఱేమి శంకరులవారి భాష్యం అంటూ పుట్టివుంది గనక "అమర్చినదానిలో అత్త వ్రేలెట్టింది." అన్నమాదిరిని తమ మతానికి అనుకూలించే మాటలు వ్రాసుకున్నారు గాని ఆయనలో యెన్నోవంతున్నూ కారని అద్వైతపుణాఁ డెవరేనా ప్రసంగిస్తే యేంలాభం? దేశికులకాలంలో వున్న పండితులు, లేదా పండితుఁడు-"ఇదుగో నేను శాంకరమతంవాణ్ణి. నన్ను జయించు చూదాం. అప్పుడు నీయెడం కాలు నీవు పెట్టనక్కఱలేదు. నీకంత శ్రమెందుకు. నేనే నానెత్తిమీఁద పెట్టుకుంటాను" అని యెదిరిస్తే యేదో జరుగుతుంది. అంతేకాని ఆకాలం గతించాక "నన్ను కొడితే యేంలాభం, మాబావని కొట్టిచూడు" అన్నట్టు వాగ్వ్యయం చేయడం మొదలెడితే యేంప్రయోజనం? యేదో పొరఁబాటో తొందరపాటో ఆవాగ్వ్యయానికి కారణమనుకుందాం. విద్యావయోవృద్ధులు-క్షేమంకోరిన వారు "నాయనా, నీత్రోవ సరియైనదికాదు. వేదాంతదేశికుంప్రతిజ్ఞ శంకరులకు సమన్వయింపదు. కాలంవేఱు" అని బోధిస్తే వారిని పట్టుకొని తిట్టడం, తలకు తగని దాంబికాలు పలకడం. ఇదంతా క్షంతవ్యం కాదు. వేదాంత దేశికులవారి ప్రతిజ్ఞకు తగిన కారణం ఆకాలంలో వుండక పోదు. దేశికులు శ్రీమహావిష్ణువుయొక్క ఘంటయొక్క అవతారమని ఆమతస్థులు విశ్వసిస్తారు. కవితార్కిక సింహుఁడు అనే ఈపేరున్నూ వేదాంతదేశికులు అనేపేరున్నూ ఆయనకు వాడతారుగాని అసలు తలిదండ్రులు పెట్టిన పేరు యెవరూ వాడరు.

శ్లో. కవితార్కికసింహాయ కళ్యాణ గుణశాలినే
శ్రీమతే వేంకటేశాయ వేదాంతగురవే నమః.

ఆయీ శ్లోకంవల్ల ఆయనపేరు తెల్పినట్లయింది. అలాటి మహానుభావుని కాలు నెత్తిమీఁదకు రావడం అదృష్టమేకాని యెందుకూ కొఱగానివాదాలు చేయువారిని మందలింపడంకూడా పాపమే.

తెలుఁగుకవులలో రామలింగం ముష్కరుఁడుగా అతని కొన్నిపద్యాలు (తెలియనివన్నితప్పులని— ఒకనికవిత్వమం దెనయు నొప్పులుఁదప్పులు, వగయిరా) తెల్పుతు చేసినా అతఁడు శ్రీవైష్ణవభక్తుఁడని అతని పాండురంగమాహాత్మ్యం రుజువు చేస్తుంది. అలాగే ఆయీ దేశికులవారు లోఁగడ వుదాహరించిన ప్రతిజ్ఞాశ్లోకభాగంవల్ల దుర్వాసమహామునిమాదిరిగా కనపడినా అశ్లోకపూర్వార్ధం చూస్తే రెండవ తొండరడిప్పొడియాళ్వారుగా తోఁపకమానదు. చూడండి—

శ్లో. "యతీశ్వరసరస్వతీ సురభితాశయానాం సతాం,
వహామి చరణాంబుజం ప్రణతిశాలినా మౌళినా"

చూడండీ, యెంత వినయం వుందోను? "యెవరు శ్రీరామానుజులవారి వాక్యములను ఆదరించి వర్తించు మహాభక్తులో వారి పాదమును వంచిన తలమీఁద పెట్టుకుంటాను" అనికదా దానిభావము. మహాపురుషుల ప్రకృతిలో పరస్పరవిరుద్ధధర్మాలు కలిసి వర్తిస్తాయి. వారి ఆశ్రమాలలో లేళ్లూ పెద్దపులులూ కలసి మెలసి వుంటాయి. ఆయన సమకాలీనులు మతచర్చలో దేశికులకు వోడిపోయినవారేకాని గెలిచినవారు లేరని ఆమతస్థులే కాదు నిజమైన చరిత్ర తెలిసిన మతాంతరులుకూడా విశ్వసిస్తారు. శ్లో॥ శత్రోరపిగుణా వాచ్యా, దోషావాచ్యాగురోరపి" అనికదా అభియుక్తోక్తి. ఆయీ దేశికులవారిప్రతిజ్ఞ క్రొత్తది లాగువున్నా క్రొత్తది మాత్రం కాదు. భారతంసభాపర్వంలో సహదేవుఁడు యీప్రతిజ్ఞనే చేసియున్నాఁడు. కాని అది మాకూటస్థులకు అవమానకరంగా వుందని విషాదపడ్డవా రెవ్వరూలేరు. అది బాహుబలస్ఫోరకం. ఇదో? విద్యాబలస్ఫోరకం. అయితే యింకో మాట యేమిటంటారా "రాజు వచ్చినా రాకళ్లకు పాపయ్యం లేనా?" (బొబ్బిలిపాట) అన్నట్లు, యీదేశికుల కాలంలో ఆదిశంకరు లుంటే యేమయేదో? యెందుకు యీప్రశ్న?— "పెట్టఁగల ఐచ్చలిపాదును కొనఁగల గేదె తిని పోయింది" పైప్రశ్న భావనాబలాన్ని వినియోగించి జవాబు చెప్పతగినది. అద్వైతులేమో మాశంకరులే గెలిచేవా రని సంతుష్టి పడతారు. విశిష్టాద్వైతులు మాదేశికులే గెలిచి తీరుతారని చెప్పుకొని సంతుష్టి పడతారు. అయితే యింకో శంక. శంకరులు ఆకాలంలో లేరుగనక దేశికులవారి యెడమకాలు బాధ ఆయనకు లేశమూ సంఘటింపదు. యెవరేనా సంబంధిస్తుందే అయ్యో అని దుఃఖిస్తే అది అజ్ఞానవిలసితమే

కాని అన్యంకాదు. లేదా, దురభిమానమనుకోవాలి. దాన్ని ఆలా వుంచుదాం. అప్పయ్యదీక్షితులవారు దేశికుల కాలంలో వున్నారుగదా? సాక్షాత్తూ బ్రహ్మపరావతారం. ఆయన్ని దేశికులు వోడించి ఆయననెత్తి మీఁద యెడమకాలు పెట్టినట్లైనా దేశికుల వారు? అంటే వినండి. అసలు దేశికుల కాలంలో యావత్తుమంది అద్వైతపండితులతోటీ వాదం తటస్థించే వుంటుందని చెప్పఁగలమా? యేదో సభలో యేకొందఱితోటో వాదం వచ్చివుండును. అప్పుడు దేశికుల వారు యింతటి ఘోరప్రతిజ్ఞ చేయడానికి తగినంత హేతువు తారసమై వుండును. అంతేనే కాని అవచ్ఛేదకావచ్ఛేదేనా అద్వైతులు దేశికుల యెడమకాలు నెత్తిని పెట్టుకోవలసిన దురవస్థ వచ్చి యుండదు. "అదుగో పులి యిదుగో తోఁక." ఫలితార్థం దేశికులవారు అద్వైతమతసిద్ధాంతాలు ఖండించి విశిష్టాద్వైతాన్ని పోషించిన మహామహులు అన్నది. పని పడితే దేశికులవారు దేవుణ్ణికూడా యెదిరించే ధైర్యం కలవా రనడానికి కొన్ని యితిహాసా లున్నాయి.

శ్లో॥ ఐశ్వర్యమదమత్తోఽసి మాం నజానాసి దుర్మతే!
వక్త్రైః పరిభవే ప్రాప్తే మదధీనా తవస్థితిః"

యీ శ్లోకం పాకానాకసందర్భంలో దేశికులవారు శ్రీతిరుపతివేంకటేశ్వర స్వామినిగూర్చి చెప్పవలసి వచ్చిందని చెప్పఁగావిన్నాను. దానికి వున్న పుట్టుపూర్వోత్తరాలు తెలియని వాళ్లు "దేశికులు యెంత దుర్మార్గుఁడు. దేవుణ్ణే 'దుర్మతీ' అని సంబోధించాఁడే యిఁక యితనికి యెవ రడ్డుతారు? 'తల్లిచెవులు తెంపినవానికి పినతల్లిచెవులు బీఱపువ్వులూ గావుగదా', అంటూ దూషిస్తారు. వారివెనక తత్వం తెలియని అమాయికులు "కాఁబోలును. అది కర్ణకఠోరంగానే వుంది. నాకైతే దేశికులవా రంటే భక్తిగాని యీవిషయంలో నామనస్సున్నూ నొచ్చింది. అయితేమాత్రం యేంచేసేది? ఆయనయెదట కిక్కురుమనలేం" అంటూ ఆరంభిస్తారు. అంతేనేకాని దేవుణ్ణికూడా అంతమాట యెందు కనవలసివచ్చిందో అనే విచారణదాఁకా యెవరికీగాని బుద్ధి ప్రసరింపదు. దేవుఁడున్నాఁడా, లేదా అనే ప్రసక్తి తటస్థించినప్పుడు స్వామివా రేరో దేశికులవారికి సహాయం చేయవలసివచ్చిందనిన్నీ, ఆసహాయం గుడితలుపులు కుంచెకోలతో అవసరం లేకుండానే వాటంతట అవి విడిపోవడమే స్వరూపం కలదనిన్నీ చెప్పుతుంటారు. దేశికులవారు కోరిన పని స్వామివారు చేయకపోయేటప్పటికి దేశికులకు పట్టరాని ఆగ్రహం వచ్చింది. యెందుచేత? త్రికరణశుద్ధిగా 'భగవంతుఁ డున్నాఁడు' అనే నమ్మికతో వున్నవాఁడై యితరులను నమ్మిస్తూన్నారుకదా దేశికులు; అట్టి పరమభక్తునిపట్ల తన సత్త చూపకపోతే భక్తునిపాట్లేమికావాలి? "దాసుఁడిపాట్లు పెరుమాళ్లకే యెఱుక" కనక ఆసందర్భంలో దేశికులవారి నోటమ్మట పైవాక్యం వచ్చిందంటే ఆస్తికుఁ డెవ్వఁడూ ఔచిత్యానికి భంగంగా తలఁపఁడు. త్యాగరాజు యేమని గానం చేశాఁడు? "అలనాఁడు కనకకశిపునిందారు" అంటూ గానం చేశాఁడు. ఆయన లోకాన్ని మోసం చేసే స్వభావం కలవాఁడేనా? తప్పకుండా భగవంతుఁ డున్నాఁడని విశ్వసించినవాఁడు కావుననే "ఎందు దాఁగినాఁడో మారాముఁ డెందుకు దయరాదో?" అని గానం చేశాఁడు.

భగవత్సత్తనుగూర్చి నాస్తికులు వితండవాదం చేస్తారు. వారికి భగవంతుఁడు వొక్కసారి కనపడితే లేనిపోనివాదాలతో గ్రంథాలు పెరగవుగాని ఆసృష్టికర్తకు 'నీవు లేవు' అనే వాళ్లందఱికీ కనపడడమేనా పని? (యే యథా మాం ప్రపద్యంతే తాం స్తథైవ భజామ్యహమ్). ఆదిన్నీకాక తనకోసం జపతపాలు చేసిక్కృశించేవాళ్లకే దిక్కులేదే? అట్టిదేవుఁడు నాస్తికులకు కనపడి తనసత్తాను ధ్రువపరచుకోవాలా? వున్నాఁడన్న వాళ్లకి వున్నట్లున్నూ లేఁడన్నవాళ్లకు లేనట్లున్నూ వర్తిస్తాఁడు ఆ మాయామానుష విగ్రహుఁడు; ఆమాటా త్యాగరాయలే వ్రాసుచ్చారు-"కద్దన్నవారికి కద్దు కద్దని మొఱలిడిన పెద్దలబుద్ధులు నేఁ డబద్ధ మౌనె".

ఇది విషయాంతరం. యిప్పటి నాగరికులు కొందఱు దేశికులవారిని మెచ్చకపోదురుగాక. ఆకాలంలోవారు పూజించారు. విశిష్టాద్వైతులందఱికీ ఆయనమాటంటే వేదం. అద్వైతులేనా "యేదీ నీయెడమకాలు మానెత్తిమీఁద యేలా పెడతావో పెట్టు" అన్నట్లుగా ఐతిహ్యం కనపడదు. ఆయనప్రతిజ్ఞా శ్లోకం యతిరాజ సప్తతిలో నలభై యోది. కావలసినవారు చూచుకోండి. ఆయన కట్టి శక్తిసామర్థ్యాలు వుండఁబట్టే ఆశ్లోకం అప్పుడు లోకంలో నిల్వగల్గింది. లేకపోతే గాడడిండిమభట్టుకంచుఢక్కాకి పట్టిన దుర్గతే దానికిన్నీ పట్టేది.

ఆకాలం పీకు తోడుకాగదా లెవరిచ్చారంటే "నా అముదపుచే నిచ్చిం" దని జవాబిస్తే సహించేది కాదు. అన్నట్లు దేశికులవారు వెంకటేశ్వరస్వామిని బెదరించాక యేం జరిగిందో వ్రాయనేలేదు. యేంజరుగుతుంది? భక్తపరాధీనుఁడు శ్రీవేంకటేశ్వరుఁడు దేశికులకు అనుకూలంగా వర్తించినట్లే వినికిడి.

ఆ యీప్రతిజ్ఞలు వగయిరాలుగాని, ఆ యీభగవత్ప్రత్యక్షాలు గాని యెక్కువ తెలివికలవారు విశ్వసింపకపోదురుగాక, విశ్వసించేవారే నూటికి తొంభై మంది. వేదాంతదేశికుల

ప్రతిజ్ఞాశ్లోకం మళ్లా వొకసారి వుదాహరించి వ్యాసం ముగిస్తాను—

శ్లో. "యతీశ్వరసరస్వతీసురభిశాళయానాం సతాం
వహామి చరణాంబుజం ప్రణతిశాలినా మౌళినా,
తదన్యమతదుర్మద జ్వలిత తేజసాం వాదినాం
శిరస్సు నిహితం మయా పద మదక్షిణం లక్ష్యతామ్"

యిందులో 'అదక్షిణం' అనేపదానికి యెడమకాలనే కాక క్రియావిశేషణంగా వ్యాఖ్యానిస్తే 'నిర్దయం' అనే అర్థం కూడా చెప్పవచ్చును. కాని ఆమతస్థులు ఆయీమార్దవాన్ని సహించరో యేమో? యేలా చెప్పినా పాదం శిరస్సు ధరించడం తప్పదన్నది సిద్ధాంతమేకదా?

సరే; వ్యాసారంభం యెక్కడ? ముగింపెక్కడ? ఉపక్రమోపసంహారాలకు సంబంధబాంధవ్యా లుండవద్దా అంటే వుండవలసిందే కాని అసలు నామార్గం యేదో క్రొత్త పుంత. దేన్నిగురించో మొదలుపెడతాను. మధ్యమధ్య "సత్రాజుపెళ్లిలో గుర్రాజు కొకపోఁచ"లెన్నో జ్ఞప్తికి తగులుతాయి. వాట్లకోసం మళ్లా హెడ్డింగులు పెట్టి వ్రాసేదేమిటని దానిలోనే నాల్గుమాటలు వ్రాసివిడుస్తూ వుంటాను. అయీ యావత్తు వ్రాఁతకున్నూ సారం—

(౧) కవిత్వానికీ బ్రాహ్మణ్యానికీ లంకె లేదు.

(౨) యేకవిప్రతిజ్ఞలు ఆకవికాలీనులకేకాని తత్పూర్వులకుఁగాని, తదనంతర కాలీనులకుఁగాని సమన్వయింపవు. సమన్వయిస్తాయి అనుకోవడం యుక్తిదూరమేకాక—వ్యక్తిదూరమేకాక అనుభవదూరం కూడాను.

ఆయీ రెండు అంశాలున్నూ. అవాంతరంగా యింకా కొన్ని దొర్లి వుంటే వుండవచ్చును. ముసలివ్రాఁత నల్లమందు వ్రాఁత. యేదో నాకే దారస్తంగా వుంటుంది. కవిత్వానికీ బ్రాహ్మణ్యానికీ సంబంధం లేదని ప్రాక్కాలీనులు క్షత్రియాదుల వల్లనే తేలింది. (మాఘుఁడు వైశ్యుఁడని విద్వత్పరంపర చెపుతారు) కాని కవిత్వానికీ పాండిత్యానికీ చుట్టరికం అక్కఱలేదని యీశతాబ్దానికి పూర్వం తేలలేదు. చూడండీ, వాక్కు రేఫశకటరేఫలను గూర్చి యెందఱు యెంత శ్రమచేశారోను. 'ద్విరేఫదర్పణం' వగయిరాలు చూస్తే వైనంగతి తెలుస్తుంది. యిటీవల తెలుఁగుమీఁటినకొలఁదిని యతిప్రాసలు, వ్యాకరణం వగయిరాలుకూడా అనావశ్యకాలన్నంతవఱకు వచ్చింది. అందుచేత యేదో గణబద్ధం చేసే మాత్రంలో వుండేవ్యక్తి మహాభారతకర్త వ్యాసులను పట్టుకొని తోఁచినట్లల్లా అనడం, యేవో కర్ణకటువైన ప్రతిజ్ఞలు చేయడం యీస్థితికి వచ్చింది యీనాఁడు కవిత్వం. తీరా యెదురుకుంటే "మాబావని కొట్టిమాడు" అనడానికే అధికారంగాని అంతకు మించి లేదు. ఆయీరకంవారితో కొందఱు వాదానికి వుపక్రమిస్తూన్నారు. అది శోచనీయం. ఆఖరికి 'సేయబ్బజిజ్ఞాసా, సీతాతజిజ్ఞాసా'వలె పరిణమించింది. ఆఖరికేకాదు దానిధోరణి మొదటనే అట్టివాసన కొట్టింది. పెద్దలు అట్టివాదం పెట్టుకోరాదు. భవభూతి "ఘటానాం నిర్మాతు స్త్రిభువనవిధాతుశ్చకలహః" అన్నాఁడా లేదా? "భవే దద్యశ్వోవా కిమివా బహునా పాపిని కలౌ." శాంతం పాపం. దాసు శ్రీరామకవిగారు "పున్నెమా? పూరుషార్థమా? బిఱుఁసువు చేసిన బ్రాహ్మణార్థమా?" అన్నారు. కనక పెద్దలు యిట్టి వారితో వాదాలు పెట్టుకోవడం నాకు అభిమతం కాదని నమస్కార పూర్వక విజ్ఞప్తి. యేబావకు ఐశ్వర్యంగాని వొకటే తెగని ఆశ్రయించి వుండదు. అందఱినీ సంతోషపెడుతూ వుంటుంది పర్యాయంగా; కొన్నాళ్లు దేవతలేలితే కొన్నాళ్లు రాక్షసులు. అప్పుడు వారి కి వీరు సలాం. ఇప్పుడో? వీరికి వారు సలాం. యింతే ఐశ్వర్యప్రకృతి. మురారి యేమన్నాఁడు?—

శ్లో. "కస్మైచి త్కపటాయ.... నీచాన్నిచరోపసర్పణ మహో మేత త్కమాచార్యకమ్" అన్నాఁడు. దీని తాత్పర్యం వ్రాయవలసివస్తే చాలా పెరుఁగుతుంది. చిరకాలం రావణున్ని ఆశ్రయించిన లక్ష్మి రాముణ్ణి (మనుష్యమాత్రుణ్ణి)ఆశ్రయించిందని ఫలితార్థం. వేదశాస్త్రాలనుగూర్చి చెప్పలేనుగాని తక్కినవిద్యలు జాతిభేదంతో పని లేకుండా అందఱికీ అలవడతాయనే నేను అనుకుంటాను. వేదానికి శాస్త్రానికి వున్న దారి రోఁగడ వుదాహరించే వున్నాను. పుస్తకాలు చూచి వేదం వల్లించినా అది సక్రమమైన అభ్యాసం కాదు. దాన్ని శ్రుతిఅనడంలోనే వుంది ఆతాత్పర్యం. సంప్రదాయసిద్ధంగానిదీ యేవిద్యా ఫలించదు. కనక వేదమంటే మావంటి బ్రాహ్మణబ్రువులకు భయం. దాని అంగాలన్నా (వ్యాకరణాదులు)అంతే. జర్మనీలో వేదార్థం తెలిసినవా రున్నారంటారే; వున్నమాట నిజమే. వారికి ఉచ్చారణ కుదరదు. వారికే కాదు దశవిధ బ్రాహ్మణులలో యెందఱికో కుదరదు. "ఆంధ్రులకూ ద్రావిడులకూ" మాత్రమే యీమహాభాగ్యం. వీరు వేదం పఠిస్తూ వుంటే తక్కిన అష్టవిధబ్రాహ్మణులూ చాలా ఆప్యాయనంగా విని ఆనందిస్తారు. యిఁకముందేనా వేదానికి ఆంధ్రులూ ద్రావిడులూ మాత్రమే జీవం నిల్పాలికాని యితరులవల్ల ఆయీ కార్యం తుదనెగ్గదు. కర్ణాటకులూ మహారాష్ట్రులూ వేదం చెప్పుకోవడం మట్టుకు క్వాచిత్కంగా

వుండని వినికిడి వుంది. మూర్ధరులలో చెప్పుకోవడంకూడా దృశ్యాదృశ్యమే. మాగురువులరోజులలో లోకైకమహావిద్వాంసులు దాలశాస్త్రిలవారు యజ్ఞం చేసినప్పుడు శ్రోతులు మన ఆంధ్రదేశాన్నుంచే ఆహ్వానింపబడ్డారని మాపరమగురువుల వల్ల విన్నాను. ఇది విషయాంతరం.

కవిత్వం యావత్కాలాలవారిదీగాని వొకకులంవారిది కాదన్నది ప్రధానాంశం. ఆయామాట వారివారి మాతృభాషకే సమన్వయిస్తుంది. సంస్కృతకవిత్వంధార వున్నంతలో సాధ్యంకాదు. కాని క్వాచిత్కంగా స్త్రీశూద్రులలో సంస్కృత కవు లున్నారని మంజువాణి రుజువుచేసింది వేశ్య. తెలుగులాగే వ్యావహారికంలో దాన్ని నడపడానికి అవకాశం లేదు. అది యావత్తూ గ్రంథాలద్వారా గురువులద్వారా సంపాదించుకోతగ్గదే కాని వ్యవహారంవల్ల అలవడేది చాలా తక్కువ. మన ఆంధ్రంలో సంస్కృతం కొంత మార్పుచేసి సంస్కృతాన్ని(తత్సమం)కల్పుకుంటున్నాం. కన్నడంలోనో? అఱవం లోనో? లేక ఆరెంటిలోనూ కూడానో? మార్పు లేని సంస్కృతాన్ని కలిపి మణిప్రవాళ నామంతో వాడుకుంటారని విన్నాను. శిష్టసమ్మతిలేదు గాని మన భాషలోకూడా కొంచెంగా కనపడుతుంది ఆలాటికవిత్వం.

శ్లో॥ తిండికైతె పదిమంది వసంతి,
తండులాలు గృహమందు నసంతి,
రండనాకొడుకులెల్ల హసంతి
కొండగోగులు గృహే విలుఠంతి.

యీరచన చాలా అందంగానే వుంది. అఱవకవిత్వానికివలె ప్రాసమాత్రం వుంది. ఆఖరుచరణంలో రెండున్నూ, తక్కినచరణాలలో వాక్యాంశలన్నీ కేవలసంస్కృతా లున్నాయి. మన భాషలోకూడా యీమాదిరి రచన వుంటే బాగుంటుందేమో? మణిప్రవాళ నామధేయం (శిష్టులు సమ్మతిస్తే) దీనికే చెల్లుతుంది. కొంచెంతనానికి యెవరో చెప్పినవి యీలాటివి మనతెలుగులో స్వల్పంగా యింకా వున్నాయి.

శ్లో॥ అస్థివ ద్భుజవచ్చైవ చల్లవ ద్వెల్లకుక్కవత్
రాజతే భోజ తే కీర్తిః పున స్సన్న్యాసిదంతవత్.

శ్లో॥ ఏకైకదుర్గుః కులపండితానాం
దుర్గుద్వయం కుందలపండితానామ్
యేగాని యేగాని మహాకవీనాం....
(నాల్గవచరణం మఱచాను)

కవిత్వ మంటే తన మనస్సులో వున్న భావాన్ని యితరులకు తెల్పుడు చేయడమే తప్ప యేలాటిభాషలో తెల్పుడు చేస్తే యేమి అనేవాదం యిప్పుడు బయలుదేరింది. క్వాచిత్కంగా పండితులుకూడా దీనికి బాసటగా వుంటున్నారు. మునుపు (పాండిత్యం లేకపోయిన పక్షంలో) నిశితమైన ధార స్వతస్సిద్ధమైనది వుండిన్నీ యెందుకో దాన్ని వృథా చేసుకోవలసి వచ్చేది. యిప్పు డాలా కాకుండా ఆలాటి ధార కలవారి రచనకుకూడా శిష్టపంక్తిలోకన్నా హెచ్చు పంక్తిలో స్థానం దొరికింది. శ్రీనాథాదుల రోజులలో ద్విపద కావ్యానికే గణన లేనట్టు కనపడుతుంది. కాని సంస్కృతంలో వుండే అనుష్టుప్పునకు తెలుగులో సరిపోయేది ద్విపదే అనుకుంటాను. ద్విపదలు, రగడలు వగయిరాలు పదకవిత్వానికి చేరిపోయాయి. పద్యకావ్యాలలో యెక్కడేనా కీర్తన యిమిడిస్తే దాన్ని కవులు ఆక్షేపించేవారు. శ్రీమాడభూషి (అవరపండితరాయలు) వేంకటాచార్యులవారు పదకవిత్వాన్ని భరతాభ్యుదయంలో వాడేటప్పటికి అల్లంరాజు సుబ్రహ్మణ్యకవిగారు ఆక్షేపించడం నేను నాచిన్నతనంలో యెఱిగిందే. పద్యకావ్యాలలో ద్విపద లంతగా వాడడం లేదుగాని ప్రత్యేకించి ద్విపదగానే కొన్ని గ్రంథాలు పూర్వకవులు రచించారు. రంగనాథరామాయణం వాట్లలో అగ్రస్థాన మలంకరిస్తుంది. శైవకవులు పూర్తిగా ద్విపదలోనే రచన సాగించారు. నన్నయ్యగారినాఁటికి వ్యాపకంగా వున్న అక్కరలు, మధ్యాక్కరలు, తరువోజలు క్రమంగా నామమాత్రావశిష్టా లయినాయి. యిప్పుడు భావకవులు మఱికొన్ని క్రొత్తపేరులు కల్పించి కొని వాట్లలో తమభావాలను ప్రకటిస్తూన్నారు. కవిత్వానికి శ్రోతృరంజనం ముఖ్యం. దాన్ని మఱవకుండా రచిస్తే అది "లోకులరసనలె ఆకులుగా" చిరకాలం వుంటుంది. మనకి అచ్చుయంత్రం "నక్కపుట్టి నాల్గువారా లయిందన్నట్లు" నిన్నమొన్నగదా వచ్చింది. అంతకు పూర్వం పుట్టిన మన వారి రచనల జీవాతువులు "లోకులరసనలే" అన్నమాట యేకవిన్నీ మఱవ రాదు. తెలుగురచన అంతకు పూర్వం వున్నా దాన్ని మంచిత్రోవలో పెట్టి రచన సాగించి మన కింత భిక్షపెట్టింది నన్నయ్యభట్టు. అతనికి చేదోడువాదోడుగా వున్న మహావిద్వాంసుఁడు నారాయణభట్టు ఆంధ్రంలోఁగాని సంస్కృతంలోఁగాని కన్నడంలోఁగాని యేవో కొన్ని మహాగ్రంథాలు రచియించే వుంటాఁడు కాని అవి యింతవఱకు పైకి రాలేదు. కొందఱు నిన్న మొన్న వ్రాస్తారుకదా—"భారత రచన ఆనారాయణభట్టుదే. నన్నయ్య తద్దినం పెట్టేవాఁడి తమ్ముఁడు....లాగు వుండి వుంటాఁ"డని వ్రాశారు. ఆయీ మాట లోకానికి నచ్చితే సంతోషమే. వారిద్దఱూ కూడా మనకు రక్తసంబంధులుకారు. కవితారచనద్వారా బంధువులు- "ఘనమను వెల్లవారికి నకారణబంధులుగారె సత్కవుల్"

తెనాలిరామలింగాన్ని విశ్వబ్రాహ్మణులు మావాఁడని అభిమానించినట్లే నేఁడు కొందఱు నన్నయ్య మావాఁడనడమూ కలదు. ఇతణ్ణిగూర్చిమాత్రమే తేవారసాక్షినివలె యెవరి మట్టుకువారు మావాఁడే అనడానికి అవకాశం వుందికాని తదితరులనుగూర్చి అనడానికి అవకాశం లేదు. యిప్పుడు నేను భట్టుమూర్తిని మావాఁడంటే నే నాకులంలోకి చేరవలసి వస్తుంది. కాని అందుక్కూడా సిద్ధపడే వ్యక్తులు కొందఱు వున్నారు. దానిక్కారణం అతనికవిత్వమందుండే గుణమే. "కవీనాం కో దోష స్సతు గుణగణానామవగుణః" అన్నాఁడు మురారి. కవు లంతా రాముణ్ణే ప్రేమించినట్లు నన్నయ్యనీ ప్రేమిస్తారు. అతఁడు భిక్షప్రదాత— "సీ॥ నన్నయకవి పెట్టినాఁడుకదా? తిక్కనాదికవీంద్రులకాదిభిక్ష" నన్నయ్యంటూ పుట్టకే పోతే యేంజరిగేదో? అప్పుడు యావత్తుభారమూ తిక్కన్నగారిమీఁదే పడి భిక్షప్రదాత యీయనే అయేవారు. ఒక్కచేతిమీఁదుగా రచించినట్లయేది. ౧౫ పర్వములు రచించిన సోమయాజులుగారే ఆ మూఁడు పర్వాలూకూడా రచిస్తే అని విచారపడేవారున్నూ లేకపోలేదు. అట్లెందుకు జరగలేదో అది మనకు గోచరించేది కాదు. ఆయన ఆకాలంలో యెవరేనా యీప్రశ్న వేస్తే యేమని జవాబిచ్చేవారో తిక్కనగారు. ఆజవాబు వుక్కిటి పురాణంగానేనా చెప్పుకొనేవారు కవులలో వున్నట్లు లేదు. "అం దాదిఁ బొదంగి మూఁడు కృతులాంధ్రకవిత్వవిశారదుండు విద్యాదయితుం డొనర్చె మహితాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్" అని మాత్రమే సోమయాజులుగారు వ్రాసి వూరుకున్నారు. యిందులో వేసిన విశేషణాలు వొకటి ప్రాసక్రింద రెండుయతికింద జమకడితే మిగిలేదల్లా. నన్నయ్యభట్టుమాత్రమే."దక్షతన్" అనేది పాదపూరణార్థమైనా కావచ్చును. ఆయన్ని ద్వేషించేవారి కిదే మార్గం. శివకేశవులకు పరస్పరద్వేషాలులేనట్లే నన్నయతిక్కనలకున్నూ లేవు. వారు సమకాలీనులు కారుగదా? నన్నయ్యగారియందు యితరకవులతోపాటు తిక్కన్నగారికి పరమాదరమే అని మన మనుకోవాలి. ఆయీ అంశమును తిక్కన్నగారిప్రయోగా లుదాహరించి చర్చిస్తే కవిలోకానికి కొంత వుపకరిస్తుంది గాని అంత వోపికగాని, కొంత వోపికగాని నాకులేదు. యీప్రాఁత ఆకాశపురాణప్రాఁత. కొందఱు నన్నయ్యగారి ద్రౌపది,తిక్కన్నగారి ద్రౌపది అంటూ విడదీసి వారి వారి అభిప్రాయాలు ప్రచురిస్తారు. ఆయీ విషయం బొత్తిగా నిరాధారమని మన్మిత్రులు సతీర్థులు కాశీభట్ల సుబ్బయ్య శాస్త్రులవారు పెద్దవ్యాసం వ్రాసి బయలుపరచినారు. ద్రౌపది వ్యాస భట్టారకునిదే గాని యిం దెవ్వరిదిన్నీ కాదని నే ననుకుంటాను. కొంచె . మించుమించుగా అనువదించడం అనువాదకుల ఆచారం. అంతమాత్రంచేత వారికి వీరు వంకలు దిద్దినవారు కారు. అట్లు వ్రాయుట వ్యాస భట్టారకుని నిందించుటే.

ప్రసక్తానుప్రసక్తంగా చాలాదూరం వచ్చాం. వాల్మీకి వ్యాసుల ద్వారా పరిశీలించినా బ్రాహ్మణేతరులకూ కవిత్వానికీ చుట్టఱికం ఉంటుంది. అప్పకవిప్రాఁత స్థూలదృష్టిప్రయుక్తం. యింకో మాట వ్రాయడం మఱిచాను. యేదో శాసనంలో భారతాన్ని రాజనరేంద్రుఁడే రచించినట్టు కనపడుతుందనిన్నీ, అందుచేత నన్నయభట్టుకీ భారతానికీ సంబంధమే లేదనిన్నీ సుమా రిప్పటికి ముప్పైయేళ్ల నాఁడు వొక క్రొత్త వాదం బయలుదేఱింది. దానికి ఆధారం రాజనరేంద్రుఁడు భారతం రచింపచేశాఁ డని చెప్పడానికి 'కారయామాస' అనక 'చకార' అని అంతర్భావిత ణ్యర్థం వాడడమే. అక్కడక్కడ అంతర్భావిత ణ్యర్థాలు వాడడం కవుల ఆచారం వుంది. ప్రకరణాన్ని బట్టి వ్యాఖ్యాతలు వాట్లని వ్యాఖ్యానిస్తూ వుంటారు. "వ్యాఖ్యానతో విశేష ప్రతిపత్తిః" రాజనరేంద్రుఁడు భట్టారకుణ్ణి ఆహ్వానించడం వగయిరా పీఠికలో వుందాయె. (౧) "పాండవోత్తముల చరిత్ర నారు నతతంబు వినంగ నభీష్టము" (౨) "ఇవి యేను— భారత శ్రవణాసక్తియు...." ఇత్యాదిగా వుండే రాజుగారి వాక్యాలు అశ్వాసాదినీ అశ్వాసాంతాన్నీ వున్న పద్యాలు, గద్య వీట్ల నన్నిటినీ ఆ 'చకార' అనే క్రియ త్రోసివేయఁగలదా? కృష్ణదేవరాయలవలె రాజనరేంద్రుఁడు కవిగా యెక్కడా ప్రతీతి లేదు. కనక ఆవాదం కొంఁదికాలంలోనే అంతరించింది. నిన్న మొన్న నన్నయభట్టుసహాధ్యాయి నారాయణభట్టే కృతికర్తంటూ వాదం బయలుదేరింది. ఆమాటే నిజమైతే "పాయక పాకశాసనికి భారత .... లోదయి నిర్వహింపఁగన్" అనే పద్యం చాలా మార్చు చేయాలి. చేస్తేమాత్రం పండితలోకం విశ్వసిస్తుందా? అసలు కవులచరిత్ర బొత్తిగా లేనప్పుడే యేదో ఆకాశపురాణంగా చెప్పుకునేవాళ్ల ఆ వుక్కిడిపురాణ వాక్యాలు కొన్ని విశ్వాస్యాలుగా వుండకపోయినా అసలుకి భంగం గలిగించి తుందూ తుపాకీ లేకుండా యెగరఁగొట్టి "అహో మూలచ్ఛేదీ తవ పాండిత్య ప్రకర్షః" అన్నమాదిరిగా వుండేవి కావు. భారతానికీ నన్నయభట్టుకీ సంబంధమే లేకుండా వుండే చరిత్ర యెన్ని ఆధారాలతో వున్నా లోకం విశ్వసించదు. కాని, లెక్క వ్యక్తులు ఒకరిద్దరు మాత్రం చాలా సంతోషిస్తారు.


ఉ॥ "సీతయు లేదు రావణుని
చెల్లెలు లే దలరాముఁ డిట్టిలో

సేతువు గట్ట లే దతని
    చే దివిజాదులు చావలేదు సా
కేత పురమ్ము లే దచటఁ
    గేకయ పుత్రియు లేదు సర్వము
న్నూతన సృష్టియే యన జ
    నుల్ విని నవ్వుదు రేమొగమ్మునన్."

(ఇటీవలి పద్యం.)

గతించిన చారిత్రక సంగతులు యెవరు వ్రాసినా సరిగా వుండవు. పౌరాణికగాథలుకూడా సరిగావుండడం లేదు గదా? అతీంద్రియజ్ఞానం కల ఋషులే భిన్నభిన్నంగా వ్రాస్తే యితర పండితులను గూర్చి చెప్పే దేమిటి? యేరోజు జరిగింది ఆరోజు వ్రాసుకోవడం అప్పటి కాలపు పండితులకు అలవాటులేదు. కొన్ని గ్రంథాల చివర గద్యయే లేదు. పుష్పబాణ విలాసం ఆతెగకే చెందుతుంది. విపులమైన వ్యాఖ్యానం దానికి వుంది. కాని వ్యాఖ్యాత మూలకారుని పేరు వుటంకించలేదు సరిగదా తనపేరున్నూ ఉటంకించుకోలేదు. శ్రీకృష్ణుని శృంగార చర్యలు ప్రతిపాద్యములుగా పెట్టుకొన్నట్లు "భువనవిదిత మాసీద్ యచ్చరిత్రం" అనే శ్లోకంలో కనపడుతుంది. తరువాత యేశ్లోకంలోనూ ఆవాసన కనుపడదు. కొందఱు పుష్పబాణవిలాసం కాళిదాసకృత మనడం విన్నాను. యిలావ్రాస్తూవుంటే యేదో తరవాయి వుంటూనే వుంటుంది.

కవిత్వం బ్రాహ్మణుల సొమ్మే అని అప్పకవిగాని మఱివొకరు మాదే అని యెవరోగాని రిజస్టరు చేయించుకోవడానికి యత్నించడం పరిహాసాస్పదం. "దేవుని పెండ్లికి అందఱూ పెద్దలే."



ప్రశ్నమాల

•

= శ్రీ డా: సి. కున్హన్ రాజా =

ప్రశ్నమాల యను గ్రంథము రాజపుతానాలోని బికనీర్ ఫోర్టు నందలి వ్రాతప్రతులలోనిది. రఘువంశమునకు చెందిన కొన్ని క్లిష్టసమస్యలు, తత్సమాధానములు నిచట గలవు. ఇట్టి విమర్శనలుకూడ పూర్వమున గలవని నిశ్చయించుటలో మన కాశ్చర్యము కలుగక పోదు. గ్రంథకర్తనామము హోసింగనామాంతరము గల కృష్ణుడు. పదునేడవ శతాబ్దమందలి బికనీరుమహారాజ శ్రీకరణసింఘ్జీవారి యాస్థానమున నివసించినవాడు. ఇత డనేకములగు నమూల్యపుస్తకములను విరచించెను.

ఈ గ్రంథ మీ క్రింది యుపోద్ఘాతశ్లోకములతో నారంభమగుచున్నది:—

"వేత్తుం వాంఛతి గూఢ మర్థ మతులం
కీర్తిం నిజాం రక్షితుం
భూపాన్ తోషయితుం నృపస్య సకలం
చక్రంచ యో వై గుణీ
నానాశాస్త్ర రహస్యదీపనకరీం
శ్రీప్రశ్నమాలా మిమాం
సోఽయం కంఠగతాం కరోతు సుకృతీ
హోసింగకృష్ణోదితామ్.

చక్రం సేవ్యం నృపః సేవ్యో నసేవ్యః కేవలో నృపః
నృపచక్రప్రమాదేన విద్వాన్ ప్రేతత్వ మాగతః.

గురుముఖా దయమర్థోఽవగంతవ్యః. గుణః కృతాత్మసంస్కార ఇతి న్యాయేన గుణినామే వాతిశయిత చమత్కారాయ భవతీయమితి ధ్యేయం.

నకేవలం కావ్యమాత్రే ప్రశ్నసిద్ధాంతమాలికా
విద్యాస్థానేషు సర్వత్ర ప్రాయస్తిష్ఠతి సా యతః.

స్థాలీపులాకన్యాయేన విద్యాస్థానాన్యుదాహ్రియంతే. తథాహి—

శ్లోకే వ్యాకరణే కావ్యే మీమాంసాయుగళే తథా
ధర్మశాస్త్రేఽథవా తర్కే నాటకేవాపి యాజ్ఞికే
ప్రశ్నసిద్ధాంతమాలేయం వర్తతే గూఢదీపికా
యథారుచిపకైర్గ్రాహ్యా ఇత్థం విజ్ఞాపనా మమ
ఆదర్శముఖశోభేవ వైదుష్యం విదుషామపి
ప్రకాశతే నిజే గ్రంథే విదురానందదాయకే.

విదురాణా మానందకరణం శ్రేష్ఠ మిత్యుక్తం కాళిదాసేన—

ఆపరితోషా ద్విదుషాం
నసాధు మన్యే ప్రయోగవిజ్ఞానమ్
బలవదపి శిక్షితానా
మాత్మ న్యప్రత్యయం చేతః. (అ. శా.)

ఇతి. విద్వాంసోఽపి పరవచనేన తోష మాయాంతి. ఉక్తంచ ప్రసన్నరాఘవే—

అపిముద ముపయాంతో వాగ్విలాసైః స్వకీయైః
పరభణితిషు తోషం యాంతి సంతః కియంతః
నిజఘనమకరందస్యందపూర్ణాలవాలః
కలశసలిలసేకం నేహతే కిం రసాలః." (౧-౪)

ఇచ్చట నిక ప్రారంభము. ప్రథమ సమస్య నీ విధమున నావిష్కరింప జేయుచున్నాడు:

"అత్ర రఘుకావ్యే ప్రశ్నో యథా—
సమాప్త పునరాత్తత్వదోషగ్రస్తం పదద్వయమ్
అనిత్య ముపమానంచ కథం నిత్యస్య తత్కృతమ్."

దీని నీవిధముగ వివరించుచున్నాడు:

"అయమర్థః. జగతః పితరావిత్యేతత్పదం సంపృక్తావితిచ వ్యర్థం. ఆకాంక్షా విరహాత్. ఇద మేకం దూషణం. ద్వితీయంచ— వాగర్థయో రర్థయో రనిత్యయో రుపమానత్వం నిత్యయోః పార్వతీ పరమేశ్వర

యోః కథం సంభవతి ఇతి ప్రశ్నే. తైరపి టీకాకారై రిదం నాశంకితం నవోత్తరితం."

మనకు లభించు గ్రంథములో దాదాపు మూడు వంతు లీ ప్రశ్నమీదనే చర్చ గలదు.

ఈ గ్రంథమున దొమ్మిది ప్రశ్నల నెత్తినాడు. పుస్తక మసంపూర్ణము. ఈ ప్రశ్న లన్నియు మొదటి మూడు సర్గలమీదనే కలవు. ప్రథమ సర్గాంతమందలి గద్యపై నొక చర్చ కలదు. ప్రథమశ్లోకముపై చర్చ దీసిన తర్వాత "సోఽహ మాజన్మశుద్ధానాం" అను పంక్తులలోని "ఆ" ప్రత్యయ వివరణ కలదు. గ్రంథము నకు దిలీపవంశ మని కాని, రామవంశ మనికాని పే రుంచక రఘువంశ మని యేల పిలచె ననునది తర్వాతి ప్రశ్న. "విధేః సాయంతనస్యాంతే" అనుచో సంధ్యా కృత్యముల నాచరించినపిమ్మట రాజు ఋషిని దర్శించుట సంభవింప దను ప్రశ్నను తీసికొనినాడు. ప్రథమ ప్రశ్న విచారణ పెద్ద దగుటచే ముందు మిగిలినవానిని చూచి, ఆవల మొదటికి వచ్చెదము.

ద్వితీయ ప్రశ్న, దాని వివరణము ఇవి:

" మర్యాదీకృత్య జన్మాదీన్
శుద్ధ్యాదౌ సోఽహ మాదిషు
విగ్రహం యే ప్రకుర్వంతి
భ్రాంతా స్తే నాత్ర సంశయః.

అయం భావః. సోఽహమాజన్మశుద్ధానా మితిపద్యే జన్మ మర్యాదీకృత్య ఇతి విగ్రహో నకర్తవ్యః. నవా జన్మన ఆ ఇతి విగ్రహం కృత్వా ఆజన్మ మర్యాదా వాచ్యా. మర్యాదాలక్షణ జ్ఞానం జన్మని శుద్ధతా నాయాతి. తథాహి-తేనవినేతి మర్యాదాలక్షణస్య వైయాకరణైః కరణాత్. లక్ష్యంచ అముక్తేః సంసారః. ముక్తింవినా సంసార ఇతి. ప్రకృతే తథార్థకరణే జన్మని శుద్ధతా నాయాతి. మూలాశుద్ధ్యా ఉపరితనా శుద్ధి రప్రయోజికా."

తర్వాత దీనికే ఈవిధముగ సమాధానము చెప్పుచున్నాడు:

"తస్మా దభివిధిరే వాత్ర ఆజన్మ గ్రాహ్యః. తల్లక్షణంచ తేన సహే త్యభివిధిః. లక్ష్యంచ ఆబాలం హారిభక్తిః. బాలమభివ్యాప్య హారిభక్తి రిత్యర్థః. తేన కృతాయాం జన్మాభివ్యాప్త్యా వుపరితనా శుద్ధి రాయాతి. ఏవం ఫలోదయ మభివ్యాప్య కర్మ, సముద్ర మభివ్యాప్య ఈశిత్వం, స్వర్గ మభివ్యాప్య రథవర్త్మచ సిధ్యతి. నోచే ద్వ్యర్థాశ్రమో భవతి."

మాకు తెలిసినంతవరకు "ఆ" ప్రత్యయము నభివిధిగా గ్రహించుటయే సంప్రదాయ సిద్ధము. మల్లినాథు డీయంశముపై వివరములను తెలుపలేదు.

తృతీయప్రశ్న నీవిధముగ నుల్లేఖించినాడు:—

"దిలీపాదీన్ పరిత్యజ్య రఘువంశోఽయ మీరితః
రఘువంశ సమాఖ్యాయాం బీజం కేనావలోకితమ్.

దిలీపానా మన్వయం రామాన్వయం చేత్యప హాయ రఘూణా మితి ఉక్తం. తత్ర కిం బీజమితి ప్రశ్న ఇద మాభాతి. ద్వితీయసర్గే—'వంశస్య కర్తార మనంతకీర్తిం సుదక్షిణాయాం తనయం యయాచే' ఇత్యుక్తం. తేన వంశకర్తృత్వం రఘోరితి నిశ్చీయతే. అతఏవ రఘువంశఇతి సమాఖ్యా సాధు సంగచ్ఛతే."

సందేహాపునరుద్ధారణమే సమాధానముగ గన్పట్టుచున్నది. సమాధానముల నీయకపోయినను, ఇట్టి ప్రశ్నల నాకాలములో నడుగుటయే మనము ముఖ్యముగ గమనింపవలసిన విషయము.

చతుర్థప్రశ్న నీవిధముగ వివరించినాడు:—

" 'గృహాణ శస్త్రం యది గర్వ ఏష తే' (౩-౫౧)
ఇతి పాఠం పఠతి. తన్న. రాయముకుటేన—
'గృహాణ శస్త్రం యది సర్గ ఏష తే'

ఇతి పాఠో లిఖితః. సర్గో నామ నిశ్చయః. యది తే కార్య నిశ్చయః తదా శస్త్రం గృహాణ ఇతి తేనైవ వ్యాఖ్యాతం. తదిదమవిజ్ఞాయ గర్వ ఇతి పఠితం. తత్రే యం కారికా—

శస్త్రగ్రహే తు గర్వస్య త్యాగ ఏవోచిత స్తవ
ప్రమాణం ముకుటో రాజ్ఞాం వర్తతే సర్వదా యతః.
ఇతి."

"సర్గ" యనుటకు బదులు "గర్వ" యని పఠించినవా రెవ్వరో సరిగా దెలియదు. దీనితర్వాత గ్రంథము కొంత నశించినట్లు తోచుచున్నది.

"సుదక్షిణాయామనరపి న్యవర్తత" (౩-౬౨)

అను పంక్తిలో "దిలీపమూన్యః" అని యనక సుదక్షిణాపురుషని యేల వచించినా డని పంచమ ప్రశ్న గలదు.

"అత్ర సాక్షాదశ్వగ్రహణసామర్థ్యాభావేన నిర్బల త్వసూచనాయ దిలీపసూనురితి విహాయ సుదక్షిణేత్యుక్తం" అని సమాధానపరచినాడు.

"సంచారపూతాని దిగంతరాణి
కృత్వా దినాంతే నిలయాయ గంతుమ్
ప్రచక్రమే పల్లవరాగతామ్రా
ప్రభా పతంగస్య మునేశ్చ ధేనుః" (౨-౨౫)

అను శ్లోకవిషయకచర్చ ఆరవది. దానిపై నిట్లు వ్రాసినాడు:—

"ద్వితీయసర్గే పల్లవరాగతామ్రా మితి ధేను విశేషణ ముక్తం. తత్ర పల్లవస్య రాగః పల్లవరాగః. రాగో రక్తిమా. తద్వత్తామ్రా ధేను రితి వ్యాకుర్వంతి."

మల్లినాథుని వ్యాఖ్యకును, దీనికిని స్వల్ప భేదము కలదు. మల్లినాథుడు "పల్లవస్య రాగో వర్ణః పల్లవ రాగః. రాగోఽనురక్తౌ మాత్సర్యే క్లేశాదౌ లోహితాదిషు ఇతి శాశ్వతః. సఇవ తామ్రా పల్లవరాగతామ్రా. పతంగస్య సూర్యస్య ప్రభా కాంతిః" అని వ్రాసినాడు. కాని "పల్లవరాగతామ్రా" యనుదానిని ధేనువునకు విశేషణముగా చేయలేదు. తర్వాత తన విమర్శ నీవిధముగ వివరించినాడు:—

"తన్న. ద్రవ్యత్వేన ప్రధానభూతాయా గోః రప్రధానేన రక్తగుణే నోపమానోపమేయభావాయోగాత్. యదపి పల్లవస్య రాగో నామఖండ ఇతి వ్యాఖ్యానే నోక్తదోష ఇతి తన్న. తథాసతి లాఘవాత్ పల్లవతామ్రా మిత్యేవస్యాత్. కృతం రాగపదేన. తస్మాద ర్థేత్థం సమాధానం ప్రామాణికాః కుర్వంతి. పల్లవరాగ ఇతి మణివిశేషస్య సంజ్ఞా. పుష్యరాగః పద్మరాగః ఇతివత్ పల్లవరాగోఽపి మణివిశేష ఏవ."

ఈ సమాధానమును దృఢీకరించుటకు పేరు పొందిన వ్యాఖ్యాతల ప్రమాణముల నిచ్చినాడు—

"అభియుక్తైశ్చ హేమాద్రిణా అప్పయ్యదీక్షితైశ్చ పల్లవరాగపదేన మణివిశేష ఉక్తః. ఉక్తంచ దీక్షితైః స్వకోశే యోగాటరాగ ఇతి చక్రవర్తివ్యాఖ్యానాత్ మణివిశేష ఏవ పల్లవరాగ పదేనోచ్యతే ఇతి."

ఈ సందర్భమున కోశగ్రంథములు ప్రామాణికములా యను చర్చ కొంత గలదు. తర్వాత మహాభాష్యమందలి—

"వ్యాఖ్యానతో విశేషప్రతిపత్తిః; నతు సందేహా దప్రమాణం"

అను వ్యాఖ్యానమాత్రమును గ్రహించి తన సమాధానమును చెప్పినాడు—

"తస్మాద్ వ్యాఖ్యానతో విశేషప్రతిపత్తిః ఇతి మహాభాష్యం హృది నిధాయ సర్వశాస్త్రపారంగతైరప్పయదీక్షితైః ఉక్తం—పల్లవరాగో మణివిశేష ఏవ; యోగాటరాగ ఇతి చక్రవర్తివ్యాఖ్యానాత్ ఇతి"

తర్వాత నీసందర్భమున కనవసరమైన విశేషము కలదు.

"విధేః సాయంతనస్యాంతే
స దదర్శ తపోనిధిమ్
అన్వాసితో మరుంధత్యా
స్వాహయేవ హవిర్భుజమ్" (౧-౫౬)

అను శ్లోకవివరణ నేడవప్రశ్నగ గ్రహించినాడు.

"విధేః సాయంతనస్యాంతే స దదర్శ తపోనిధిమితి. అత్ర అంతపదేన హోమసమాప్తిరూపోఽర్థో యది గృహ్యేత తదా హోమాంతే ధేనో రాగమనే యత్

'ఇతివాదిన ఏవాస్య హోతు రాహుతిసాధనమ్
అనింద్యా నందినీనామ ధేను రావవృతే వనాత్'
(౧-౮౨)

ఇత్యాహుతిసాధనత్వం ధేనో రుక్తం తదనుపపన్నం. హోమాంతే ఆగతాయా ఆహుతిసాధనత్వాయోగాత్. సాయంకాలికదుగ్ధంవినా హోమ స్యాసంభవాచ్చ"

గ్రంథమంతటిలోను రమ్యమైనది, ధీప్రజ్ఞాయుతమైనది ఈప్రశ్న. ఋషిని రాజు దర్శించినతర్వాతనే

ధేను వరణ్యమునుండి మరలివచ్చినది. ఋషి యొనర్చు విధులకు పాలనిచ్చునదిగా నట నీయావు వర్ణితము. అట్టిచో రా జాతని దర్శించునరికే తన విధుల నారతడు నిర్వర్తించె నని పల్కుట యెట్లు పొసగును? దీనికి డొంకతిరుగుడుసమాధానము నొకదాని నిచ్చినాడు:

"తస్మాత్ 'అంతస్సాన్యద్దేశనాశయోః' ఇతికోశాత్ సాయంతనస్య అంతే ఇత్యనేన సాయంతనహోమస్య దేశే హోమశాలాయాం మునిం దదర్శ ఇత్యర్థః"

అట్టిచో 'హోమశాలాయాం' అని పలుకక 'సాయంతనస్యాంతే' అని కాళిదాసేల వ్రాసె ననుటకు సమాధాన మిచ్చుచున్నాడు:

"పక్షికాః సాయంకాలే సమాయాంతి ఇతి కృత్వా హోమశాలాపదం విహాయ సాయంతనపర్యంతం గత మిత్యేకా వ్యాఖ్యా. యద్వా స తపోనిధిం దదర్శ. కమివ? సాయంతనవిధే రంతే సాయంతనహోమాంతే హవిర్భుజ మివ ఇతి వ్యవహితే నాన్వయః. రాత్రౌ సౌర్యం తేజో వహ్నౌ వావిశతి' ప్రాతస్తు వహ్నేతేజ స్సూర్య మావిశతి ఇతి స్పష్టం శ్రుతౌ"

అని శ్రుతివాక్యము నుదాహరించి ఈ ప్రశ్నను ముగించినాడు.

అష్టమప్రశ్నను సూచించి, తన 'శాస్త్రీయ ప్రశ్నమాల'లో పూర్తిగ వివరించినట్లు చెప్పికొనినాడు—

(౧-౫౯) "'అథాథర్వనిధే స్తస్య' ఇత్యుక్తం. తత్ర సర్వవేదనిధే స్తస్య అథర్వవేదనిధిత్వం కథమితి ప్రశ్నే శాస్త్రీయప్రశ్నమాలాయా ముత్తరం నిగదితం"

నవమప్రశ్న నిట్లు లేవదీసినాడు:—

(౨-౭౫) "'అథనయనసముత్థం జ్యోతి రత్రే రివ ద్యౌః' ఇత్యత్ర చంద్రమివేతి వక్తవ్యే అత్రే ర్నయనసముత్థం జ్యోతిరితి త్యేతత్పర్యంతం కవినా కథం ధావనం కృతం. తత్రేయం కారికా—

ద్యౌశ్చంద్రమితి వక్తవ్యే మునే ర్నయనసంభవమ్
జ్యోతి శ్శ్రీకాళిదాసేన ప్రోక్తం తత్ర కిముత్తరమ్?

అత్రోత్తరం జగద్ధరేణోక్తం—కవేః ప్రౌఢోక్తి రియమితి."

ఆపై ప్రౌఢోక్తి యననేమో చర్చించుచు, ద్వంద్వాదుల ప్రమాణగ్రంథములను, తన పుస్తకమును గూడ నుల్లేఖించినాడు.

చివరవిషయము గద్యనుసరించి. వ్యాఖ్యాత లందరు నీవిషయముపై మౌన మవలంబించిరని చెప్పి స్వీయశక్తిసామర్థ్యముల కొలది సమాధానము నీయ ప్రయత్నించెదనని పలికినాడు—

"ఇతి శ్రీరఘువంశాదివాక్యజా యాదృశీ మతిః
సాతుర్వైః సాతురారూఢే కార్యే త్వేవం నిగద్యతే.

అతురారూఢా ఇత్యనేన లేఖనీశస్త్రతో వ్యథీకరణ వాచరూ...కా నిరస్తాః. రఘువంశే త్వ్యుపలక్షణం. ఇతి శ్రీభాగవతే ఇత్యాదౌ సర్వత్రాయం ప్రశ్నః. తత్ర సర్వేటీకాకారాః సుప్తాః ఏవ. మయాతు యథామతి పదార్థప్రదర్శనపూర్వకః శాబ్దబోధ ప్రకారో లిఖ్యతే."

సూక్తిరత్నాకరోక్తములైన 'ఇతి' శబ్దార్థము లన్నియు తర్వాతనిచ్చి, అమరుని నిర్వచనము, తద్వ్యాఖ్యాతలు, ఇతరనిఘంటుకారులు చెప్పిన అర్థములను పేర్కొనినాడు. ఇంతటితో నసమగ్రముగా నీగ్రంథ మాగిపోవుచున్నది.

ఇక ప్రథమశ్లోకవిషయికమైన మొదటి ప్రశ్నను చూతము. పార్వతికన్న లక్ష్మి యధికురాలని చెప్పి, యనేకప్రమాణముల నుదాహరించుటతో నీచర్చ మొదలిడుచున్నది. శివపార్వతులను వదలి, లక్ష్మీవిష్ణువులను నమస్కరించవలసిన దనుట కనేకగ్రంథముల నుల్లేఖించినాడు. ఇంతవరకు నలుబదినాలుగు పుటల గ్రంథము. ఈచర్చయొక్క సారాంశ మిది:—

"తస్మాత్

'వాగర్థావివ సంపృక్తౌ వాగర్థప్రతిపత్తయే
జగతః పితరౌ వందే లక్ష్మీనారాయణావుభౌ'

ఇతి విహాయ పార్వతీపరమేశ్వరౌ ఇతి కథముక్తం. అత్రోచ్యతే. ప్రాచీన టీకాకారేణ మల్లినాథేన అత్ర సమాహితం. తత్రేయం మమకారికా.—

గ్రాంథికం ప్రవదా మ్యత్ర సమాధానం నిరామయమ్, శబ్దార్థధారకౌ చేతౌ పురాణా దవధారితౌ."

దీని కాధారముగా వాయుపురాణము నుదాహరించి,

"తస్మా ద్వాగర్థయోః పార్వతీపరమేశ్వరాధీనత్వాత్ తావేవ తత్కామేన వంద్యౌ."

అని వ్రాసినాడు. "దాక్షాయణీ" యని యనక "పార్వతీ" యని యేల పలికె ననుటకు ప్రమాణముల నిచ్చుచు

"పార్వత్యా ఏవ బ్రహ్మోపదేశ కర్తృత్వం న దాక్షాయణ్యా ఇతి కృత్వా దాక్షాయణీ మహేశ్వరా ఇతి నోక్తం."

'సంపృక్తౌ' అను పదమును

"అథ వాగర్థ ప్రతిపత్త్యర్థం పార్వతీపరమేశ్వరయోః శబ్దార్థోభయధారకయో ర్నమస్కారాత్ తత్రోభయప్రాప్తిః. పరం త్వత్యంత విశ్లిష్టయో స్తయోః ప్రాప్తాసత్యాం శబ్దచిత్రార్థ చిత్రోభయకావ్యరూపత్వా దధమకావ్యత్వం స్యాత్. అత ఆహ సంపృక్తా వితి."

అని విమర్శించినాడు.

అనంతరము నిత్యమగు నుపమేయమునకు ననిత్యమగు నుపమానమునకు నౌచిత్యము లేదా యను ప్రశ్నను స్వీకరించినాడు.

"అథ నిత్యయో ర్నిత్య సంపృక్తయోః పార్వతీ పరమేశ్వరయో రనిత్యసంపృక్తాభ్యాం వాగర్థాభ్యాం కథ ముపమానోపమేయ భావః సమంజసః"

అని యడిగి మీమాంసాదర్శనములో శబ్దార్థముల సంబంధము నిత్యముగ సిద్ధాంతీకరింపబడిన దనుటచే నీ'సంపృక్తౌ' అనుపదము పార్వతీపరమేశ్వరులకు, వాగర్థములకు గూడ వర్తించు ననినాడు.

"జగతః పితరౌ" అను పదములు ఛందఃపూరకములు గావు. ఇట సమాప్త పునరాత్తత్వదోషము లేదు.

"జగతః పితరా వితి నిరాకాంక్షమితి చేన్న. తయో ర్నమస్కారాత్. వాగర్థయో ర్జ్ఞానే జాతేఽపి తత్రచనా కర్తృత్వ సామర్థ్యం నమస్కర్తు స్తదా భవతి యదా నమస్కార్యే కర్తృత్వంస్యాత్. అత ఉక్తం జగతః పితరావితి. జగత్కర్త్రో నమస్కారేణ స్వస్యాపి కావ్యకర్తృత్వం సమాపయతీతి కృత్వా జగతః పితరావిత్యుక్తం."

శైవుడగుటచే నిట కాళిదాసు పార్వతీపరమేశ్వరులను స్తుతించలేదు.

ఇచట నొక విశిష్టప్రయోజన మున్నది:—

"తదేవం పార్వతీపరమేశ్వరయో ర్నమస్కారకరణే ఉదాహృత వచనానాం మూలత్వే సతి పార్వత్యుపాసకతయా తయో ర్నమస్కారః కృత ఇత్యనన్యగతికం సమాధానం కుర్వంతః పరాస్తాః."

ఇతడు వ్రాసిన దుష్టదమన గ్రంథగద్యలో తన పేరు హోసింగకృష్ణుడని, తన తండ్రి రామేశ్వరభట్టని, గురువు నృసింహశక్కరని పల్కినాడు. ఈగురు వితని దుష్టదమన గ్రంథమును, కావ్యప్రకాశను వ్యాఖ్యానించెను. ఈదుష్టదమనమునకే కర్ణావతంస మను పేరు గలదు. ఇతని మఱియొక గ్రంథము శాస్త్రీయప్రశ్న సిద్ధాంతమాల. ఇట "మామకం పద్యం" అని బహు శ్లోకముల నుదాహరించినాడు. రఘువంశ వ్యాఖ్యాత యగు హేమాద్రిని పేర్కొనినాడు. తన కోశమున చక్రవర్తివ్యాఖ్యాన ముదాహృతము. మురారినాటకముపై భట్టోపాధ్యాయుని వ్యాఖ్య గల దనినాడు. మురారితండ్రి భట్టవర్ధమానుడట. 'లంజ' యనునది దాక్షిణాత్యపదమని—

"కార్యప్రతిబంధ నివృత్త్యర్థం తత్ప్రీతిఘాతార్థం వా రాజాధికృతేభ్యో యద్దీయతే ధనం స ఉత్కోచోపరః ఉత్కోచాపరపర్యాయః లంజ ఇతి దాక్షిణాత్యభాషా"

అనినాడు. జగద్ధరునికి సూచనలు కలవు. వామనునినుండి ఉదాహరించుచు నది దండ్యాచార్యుని దనినాడు. హారావళీ, సూక్తి రత్నాకరములు గ్రహింపబడినవి. సూక్తిరత్నాకరము మహాభాష్యముపైవ్యాఖ్యయైయుండనోపు.

"తన్త్రాదా ఇతిశబ్దస్య బహవోఽర్థాఃసూక్తిరత్నాకరోక్తాః ప్రదర్శ్యంతే. ఇతిశబ్దః క్వచిత్ సిద్ధార్థవిప

ర్యాసకృత్. గా రిత్యయా మాహ ఇతి. అర్థపదార్థగో శబ్దస్య శబ్దపదార్థకతా మత్ర కరోతి. తథా న వేతి విభాషా ఇత్యత్ర స్వం రూపం శబ్ద స్యాశబ్దసంజ్ఞా ఇతి శాస్త్రప్రసిద్ధం శబ్దపదార్థకత్వాపహారేణార్థ కతాం కరోతి నిషేధో వికల్పశ్చ విభాషాసంజ్ఞకః ఇత్యర్థః..."

ప్రాచీనులు వ్రాసినట్లుగా కొన్ని శ్లోకముల నుల్లేఖించినాడు. అందలివి—

"ఆలస్యం స్థిరతా ముపైతి భజతే
చాపల్య ముద్యోగితాం
మూకత్వం మితభాషితం వితనుతే
మౌఢ్యం భవే దార్జవమ్,
పాత్రాపాత్రవిచారణాది విరహో
యచ్ఛత్యుదారాత్మతాం,
మాత ర్లక్ష్మి తవ ప్రసాదవశతో
దోషా అపి స్యుర్గుణాః.

అరణ్యరుదితం కృతం శవశరీర ముద్వర్తితం
స్థలే జలజరోపణం సుచిర మూషరే వర్షితమ్
శ్వపుచ్ఛ మవనామితం బధిరకర్ణజాపః కృతః
కృతోంధముఖదర్పణో య దబుధో నృపః సేవితః.

పోతో దుస్తరవారిరాశితరణే
దీపోఽంధకారాగమే
నిర్వాతే వ్యజనం మదాంధకరిణాం
దర్పోపశాంత్యై సృణిః
ఇత్థం తద్భువి నాస్తి యస్య విధినా
నోపాయచింతా కృతా
మన్యే దుర్జనచిత్తవృత్తిహరణే
ధాతాపి భగ్నోద్యమః"

ఈ తృతీయశ్లోకము ననుకరించి మలబారునం దలి చాక్యారు లను నటవర్గము ప్రతిజ్ఞాయౌగంధరాయణ తృతీయాంకమున పఠింతురు. ఆపద్యము మళయాళభాషలో గలదు—

"దాహే తణ్ణీర్ కోటియవిర హేకాంతయోటుళ్ల సంగం
తాపోద్రేకే తణళతిమస్సఞ్చయే చ ప్రదీపః
వేవేళ్ళత్తిల్ పతనసమయే తోణి యిత్థం నరాణాం
ఆపత్కాలాత్తతినొరుసుఖప్రాప్తిరెతో సమావ్యా."

దీని యర్థ మిది:—"దాహములో నీరు; బాధాకరమైన విరహములో తన ప్రేయసితో సమాగమము; సూర్యరశ్మికి తపించినప్పుడు నీడ; గాఢాంధకారములో దీపము; వరదలో పడిపోయినప్పుడు పడవ— ఈవిధముగా నపాయవేళలలో మానవునకు దానినుండి బయలుపడుటకు తగిన సాధనమును మించిన దన్య మేమియు లేదు."

ఇవిగాక ననేకగ్రంథకర్తలను, వారి కృతులను, వేదగ్రంథములనుండి ఉదాహరణములను జూపినాడు. పైగా పక్షధరమిశ్ర, మహామహోపాధ్యాయ, విక్రమోర్వశీయ, భారవి, మాలతీమాధవ, భవభూతి, శ్రీహర్షాదికవులను, అమరము, తద్వ్యాఖ్యాతయగు రాయముకుట, మేదినీ, విశ్వము మొదలైనవానిని పేర్కొనినాడు. విశ్వకోశ మప్పయదీక్షితవిరచిత మట! వామనుని 'కావ్యాలంకార సూత్రవృత్తియందలి (3-౨-౨) "పదార్థే వాక్యవచనం" అను పంక్తిని దండిదిగా వచించినాడు. అప్పయ్యదీక్షితుడు వ్రాసిన కోశము నామసంగ్రహమాల యనునది. ఇతని గురువు నరసింహుడు, చక్రవర్తిగూడ నుదాహరింపబడినారు. సాహిత్యదర్పణ, కావ్యప్రకాశ, హారావళీగ్రంథములను స్మరించినాడు. తాను వ్రాసిన దుష్టదమన, ధర్మసారోద్ధార, రతివిలాసాదులు సూచితములు.

సంస్కృతవిద్యను, సంస్కృత పండితులను పోషించిన యొక మహమ్మదీయప్రభువును పేర్కొనినాడు. పార్వతీకన్న శ్రీ మిన్నయను సందర్భమున నీపంక్తులు కలవు—

"కిం వాససా నాత్ర విచారణీయం
వాసః ప్రధానం ఖలు యోగ్యతాయాః
పీతాంబరం వీక్ష్య దదౌ తనూజాం
దిగంబరం వీక్ష్య విషం సముద్రః.

దిగంబరం పరిత్యజ్య
గంగా రత్నాకరం గతా
కైవ వార్తాన్యనారీణాం
తస్మా ద్ధన ముపార్జయేత్

ఇతి. గూఢాశయేన నబాబ్ ఖాన్ ఖానేన స్వసేవకాః పండితాః పృష్టాః-మనుష్యేషు కః పుమానితి. తతః పండితమణినా తదాశయం బుద్ధ్వా ఇదముత్తరితం—

తిర్యక్త్వాం భజతు ప్రతారయతు వా
ధర్మక్రియాకోవిదం
హేతుం స్వాం జననీం పిబత్వపి సురాం
శుద్ధాం వధూం ముంచతు
వేదాన్ నిందతు వాసినస్తు జనతాం
కిం వావయా చింతయా
లక్ష్మీర్యస్య గృహే సఏవ భజతి
ప్రాయో జగద్వంద్యతామ్.

ఏతేన - యది బ్రాహ్మణాః శ్రేష్ఠాః తదా యుష్మాభి రస్మత్సేవా కథం విధీయతే. యది యవనా శ్రేష్ఠా భవంతో యవనా భవంతు - ఇత్యాక్షేపః పరాస్తః. శ్రీమాన్ యః స శ్రేష్ఠః. బ్రాహ్మణశ్చే చ్ఛ్రీమాన్ స యవనైరపి సేవ్యతే ఇత్యాది సహృదయైక వేద్యం."

తర్వాత నవాబ్ ఖాన్ఖానుని ప్రశంస గలదు.

దీనినిబట్టి చూడ నాకాలమున గొందరు మహమ్మదీయ ప్రభువులు సంస్కృతభాషను, పండితులను చక్కగ పోషించినారని, వారికి గౌరవమును జూపెడివారని తెలుచున్నది.

కర్ణావతంస మను మతియొక గ్రంథములో తన గ్రంథములను మూటిని పేర్కొనినాడు.

"శోచేత్తూర్ణం ప్రదాతవ్యం భుక్తం యద్వసు రాజకం
తత్రోత్తర మహం వచ్మి శ్రూయతాం బుధసత్తమాః
మత్కృతేఽద్వైతసారాఖ్యే గ్రంథే సమ్యక్సమాధితా"

ఇచట నతని యద్వైతసారము కలదు. రెండవది గుణజీవినాటిక. తృతీయము ఆహ్నికసారోద్ధారము.

"అతఏవోక్తం గుణజీవినాటికాయాం మయైవ"

"ఏతత్సమాధాన మస్మత్కృతగుణజీవినాటికాయాం స్పష్ట మవగంతవ్యం"

"తే సర్వేఽస్మత్కృతాహ్నికసారోద్ధారే చతుర్థసర్గటీకాయాంచ ద్రష్టవ్యాః"

దారాషుఖోయొక్క ఔదార్యాదికమును వచించినాడు—


"దారాసాహాధనం తాసు స్థాపితం తత్ర బుధితః"

దీనినిబట్టి హోసింగకృష్ణుడు సకలవిద్యాపారంగతుడని, సునిశితవిమర్శనాశక్తిసంపన్నుడని, సహృదయమూర్ధన్యుడని తెలుచున్నది.

ప్రశ్నమాలవంటి గ్రంథము ప్రాచీనకాలములో రచింపబడుట కడుంగడు ప్రశంసనీయము.

అనువాదము: పో. సు. శా.

క్లబ్బు వార్తాపత్రిక



వీరవల్లడు

[ఆఖ్యాయిక]

= శ్రీ విశ్వనాథ సత్యనారాయణ =

౧

అప్పటినించీ నే నిది కథగా వ్రాద్దామనే. అనుకున్నది యిరువది యేండ్లక్రింద. మానాన్న నన్ను కొత్తగా బస్తీకి తీసికొని వెళ్లి స్కూల్లో ప్రవేశ పెట్టాడు. ఆరోజున నే నొక క్లాసులోకి వెళ్లాను. నా కంతా క్రొత్తగానే ఉన్నది. మా ఊళ్లో బళ్లో ఒక్కడే పంతులు. ఆస్కూల్లో అదేమిటో! గంట గంటకీ పంతులు మారటం మొదలుపెట్టాడు. ఒక పంతులు నన్ను "నీ పేరేమిటి?" అని అడిగేడు. నేను వల్లప్ప అని చెప్పేను. ఆమేష్టరు పగటివేషాలవాళ్లు కళ్లు, ముక్కు త్రిప్పినట్లుగా త్రిప్పి "వల్లప్పా? వల్లకాడప్పా" అన్నాడు. తక్కిన పిల్లలందరూ పెద్ద అల్లరి చేశారు. నాకు కోపమూ, దుఃఖమూ రెండూ వచ్చినవి. నేను పల్లెటూరువాణ్ణి. అందులో మా ఊళ్లో మేమంటే దొరలం. మా తాతగారినాటికి మాది చాలా పెద్ద ఆస్తి. మా తాతలిద్దరూ పంచుకున్న తర్వాత, మా తండ్రులు ముగ్గురూ పంచుకున్న తర్వాత మాకు సుక్షేత్రమైన మాగాణీ నలభైయెకరము లున్నది. నలభై యెకరాల మాగాణీ అంటే సామాన్యమా యేమిటి? వాళ్ల పుణ్యమా అంటూ ఎప్పుడూ యుద్ధ మిట్లానే ఉంటేనా, రెండులక్షల ఆస్తి అన్నమాట. అందులో పట్టణాల్లో ఉండే అనేకవిధాల భయాలు లేవేమో. పల్లెటూళ్లో పరాఖత్ గా పెరిగేను. అప్పటికి కొంచెం పోటుగా ఉండేవాణ్ణి. "నా పేరు వల్లకాడేమి? నీ పేరు వల్లకాడు" అన్నాను. ఆయన గ్రహించాడు. నవ్వి "నవ్వుతూ అన్నానోయి. పేరు బాగా లేదు" అన్నాడు. నాకప్పటికి పదునాలు గేండ్లు. అప్పటి వరకూ బాగా ఉందనుకున్న నా పేరు అంతలో నాకూ బాగా లేదనిపించింది. ఇక పదిమాట లెందుకు? నా పేరు ఎప్పుడు క్లాసులో పిలిచినా అందరూ నవ్వటం, నేను సిగ్గుపడటం.

ఇల్లా మూడు నెలలు జరిగింది. ఎప్పుడు శలవలు యిస్తారు, ఎప్పు డింటికి పోతాము, నాన్నతో చెప్పి పేరు ఎప్పుడు మార్చుకుంటాను అన్నే ఊహ. ఐదురూపాయిలతో పేరు మార్చుకోవచ్చని అప్పుడు తెలియదు. పేరు మార్చుకోటం అంటే అదొక బ్రహ్మప్రళయమని. పే రెల్లా మారుతుంది. మన మొగం, ముక్కు, కళ్లు, మన ఒంటిరంగు యివ్వన్నీ ఎట్లా మారవో పేరూ అల్లాగే మారదని. తరువాత మార్చుకోవచ్చని తెలిసింది. మళ్లీ తర్వాత మారదని తెలిసింది. మారితే పేరునుబట్టి జాతకా లెల్లామారుతై. పేరు మారితే జాతకాలు మారుతై అంటారే.

సరే. యిదంతా ఎందుకు? శలవ లిచ్చారు. ఇంటికి వెళ్లాను. నేను కొత్తగా ఇంగ్లీషు చదువుతూ యింటికి వచ్చానని మావాళ్లకి నన్ను చూస్తే ఎవరో పెద్ద హైకోర్టుజడ్జిని నే నైనట్లే మావాళ్లు సంతోషించారు. అప్పుడు తెలిసింది, నాకు యింగ్లీషు చదువంటే. మరి అంతగొప్పవాణ్ని వల్లప్ప ఏమిటి? మానాన్న అదీ యిదీ నన్నడుగుతూ ఉంటే నేను వాటి కేమీ సమాధానం చెప్పకుండా "నాన్నా, నా పేరు వల్లప్ప బాగాలేదు. మార్చుకోవా" లన్నాను. మా నాయన గారి నాయనమ్మ బాగా ఉంది. ఆవిడ, మా నాయనమ్మ, మాఅమ్మ, మాఅప్పగార్లు అందరూ ఉన్నారు. మా నాయనగారి నాయనమ్మను మేము 'బామ్మ' అనేవాళ్లము. మా నాయనమ్మను 'మామ్మ' అంటాము. మా బామ్మ "ఇదేమి చదువురోయి. పేరు బాగా లేకపోవటం ఏమిట్రా? ఎక్కడైనా పేరు

బాగా లేకపోవడం ఉంటుందా? పేరంటే పేరే. అందులో వల్లడన్న పేరే బాగా లేదూ. వీర వల్లడిముందు నువ్వేమి పనికొస్తావు?" అన్నది. మా నాయన "నువ్వే బాగా లేదనుకున్నావా, ఎవరైనా అన్నారా?" అన్నాడు. నేను "మా మేష్టరు బాగా లేదు అన్నాడు" అన్నా.

మా మామ్మ "తలకు మాసినవాడు వాడెవడురా" అన్నది. ఆనిమిషంలో నాకదేమిటో 'వల్లప్ప' పేరు ఎందుకు బాగా లేదనుకున్నాను. బాగానే ఉందే అనిపించింది. మా బామ్మ, మామ్మ, నాన్న అందరూ బాగానే ఉందనుకుంటున్నారు. మా అమ్మ ఏమీ మాటాడలేదు. కాని వస్తూనే పేరు బాగాలేదన్నానుగా. అందుచేత ఆమాటమీదే కూచోని "మా మేష్టరంటే యస్. ఏ. ప్యాసయినాడు. ఆయనకన్న మీ కెక్కువ తెలుసా? ఏమయినాసరే మార్చాలిసిందే" అన్నాను. మా బామ్మకు కోపం వచ్చింది. అన్నదికదా—"నీవా పేరు మార్చుకుంటే నీతండ్రి ఆస్తి నీవు తింటానికి తగవు" అన్నది. మా నాయన నన్ను దగ్గరకు తీసికొని "బాబూ, నీకు తెలియదు. వల్లడు అన్నది చాలా మంచి పేరు. ఒక్కొక్క పేరు ఒక్కొక్క విధంగా మంచిదోయి. కృష్ణుడు అన్న పేరు ఉందనుకో. ఆ పేరు మంచిది కాదని ఎవరూ అనరు కదా. ఎందుకు అనరు! కృష్ణుడు గొప్ప పనులు చేశాడు కనుక ఆ పేరు అందరికీ మంచిది అనిపిస్తుంది". అన్నాడు. నేను "అయితే కృష్ణుడు అని పెట్టుకుంటాను. వల్లడేమిటి" అన్నాను. మా నాయన "అది కాదోయి. అందరి గొప్పతనమూ ఒకేమోస్తరుగా ఉంటుందా? కృష్ణుని గొప్పతనం కృష్ణునిది, వల్లని గొప్పతనం వల్లనిది." అన్నాడు. నేను "వల్లడెవరు?" అన్నాను. ఆయన "వల్లడా?" అని కొంచెమునే పాగి మళ్లీ యిల్లా అన్నాడు: "వల్లడు మా తాతగారి పాలేరు. మా నాన్నకుగూడా పాలేరే. నాకూ పాలేరే. చచ్చిపోయినాడుగాని నీకూ పాలేరే. వాడు మాలవాడు. వాడు మన పాలేరు. వాడి పేరు నీకు పెట్టాము. మా నాన్నే నా కాపేరు పెట్టలేదని అప్పుడప్పుడనిపించేది. అందుచేత నే నాపేరు నీకు పెట్టాను." అన్నాడు. నా కేమీ తోచింది కాదు. అప్పుడు నాకు మా నాన్న అన్న యీ మాటలలో లోతు తెలుసుకొనే వయస్సు లేదనుకుంటా. అన్నానుకదా— "మాలవాని పేరైతే నా కసలు అక్కరలే" దని. అవటంతోటే మా బామ్మ, మామ్మ యిద్దరూ నావంక కళ్లు ఉరిమి చూచారు. వాళ్లిద్దరికీ నేనంటే పట్టరానంత ఆపేక్ష. ఇదేమిటిరా బాబూ అనిపించింది. మా బామ్మ మా నాన్నతో అన్నదికదా "ఒరేయి, వీణ్ణి చదువు మానిపించేశెయ్యి" అని. అనేటప్పటికే నాకు కళ్ల నీళ్లు గిఱ్ఱున తిరిగినై. మా అమ్మ నన్ను దగ్గరకు తీసికొని నా కన్నీళ్లు తుడిచి మా నాన్న వంక కోపంగా చూస్తూ యిట్లా అన్నది: "వాడు పసివాడు. వాడి కేమీ తెలీయదాయె. మీరు వాడికి చెప్పరాదా" అని. మా నాన్న "ఎప్పుడూ ప్రసక్తి రాలేదు. చెప్పలేదు. వాడిదే తప్పేమిటి? వల్లడి విషయంలో చిన్నప్పుడు నేనూ తప్పు చేశాను. నా కడుపున పుట్టేడు కనక వాడూ చేస్తున్నాడు" అని. "రాత్రికి చెప్తాను" అని ఏదో పనిమీద వెళ్లిపోయినాడు.

ఆరాత్రి మా నాయన చెప్పిన కథ.

ఆరాత్రి వెన్నెల. వాకిట్లో మంచాలు వేసుకొని పడుకున్నాము. మా వాకిలిముందరే పశువుల పావడి ఉంది. అందులో గేదెలు, ఆవులు కట్టేసి ఉన్నై. ఎద్ల జతకూడా ఒకటి ఉంది. పశువులు పడుకొని బుస్సలు కొడుతున్నై. అవి గేదెలు అని తెలుస్తూనే ఉంది. ఎద్లు గాట్లో ఉన్న గడ్డిపరకలు ఒకటో రెండో లాగుతూ నములుతున్నై. బుస్సలు కొట్టేవి గేదెలని, మేసేవి ఎద్లని చూడకుండానే మాకు తెలుసు. మా నాన్నను "కథ చెప్తానన్నావుకదా, చెప్పు" మన్నా. మా నాయన యిట్లా మొదలుపెట్టాడు.

* * *

నాకూ అప్పటికి నీయీడే ఉంటుంది. ఒకరోజున ప్రొద్దున వాకిట్లో కూచోని ముఖం కడుగుతున్నా. ఇంకా బాగా తెల్లవారలేదు. మా నాయనమ్మ వాకిట్లో ముగ్గువేస్తూంది. మా నాయనగారింకా నిద్రలేవలేదు. నేను రోజూ ప్రొద్దున్నే లేవటం అలవాటు. బామ్మ నన్ను తెల్లవారకడనే లేపి తోం

తరగా ముఖం కడిగించి మజ్జిగచేసి రోజూ యింత వెన్నపూస పెట్టేది. నేను వాకిట్లో కూచోని ముఖం కడుగుకుంటున్నానని చెప్పానుకదా. అప్పుడు వల్లడు గబగబా వచ్చాడు. కేక లేసుకుంటూ వచ్చాడు. ఎవరినీ దనకుంటున్నావు? మానాయనమీద.

మొట్టమొదట వల్లడంటే ఎల్లా ఉంటాడో చెప్తాను విను. ఆజానుబాహుండైన మనిషి. చామన చాయ. వానికళ్లు, మొగం కొట్టవచ్చేటట్టు ఉంటై. వాణ్ణి పగలు జాము ప్రొద్దెక్కేంతర్వాత చూడాలి. పండు నీరుకావిధోవతీ కట్టి ఉత్తరీయం పైన వేసుకొని, ముఖాన నిలువుబొట్టు పెట్టి, కోల్పుకఱ్ఱ చేత్తో పట్టుకొని చెప్పులు తొడుక్కొని వాడు వస్తావుంటే, వాణ్ణి చూచి, ఎరక్కపోతే, మాలవాడని ఎవరూ అనుకోరు. వానిలో ఎంత ఠీవి, ఎంత హుందా! మాలవాడన టంతోటే పల్లెటూళ్లల్లో వాణ్ణి సులభంగా ఏది పడితే అది అంటూఉంటారు. కానిఊరిముత్తమ్మీద ఎవ్వరూ వాణ్ణి తిట్టటానికి సాహసించేవారు కారు. పైగా ఏమైనా వ్యవహారాలు వస్తే వాణ్ణి మధ్యవర్తిగా పిలిచేవారు. ఊళ్లో వా డొక పంచాయితీదారు. వాణ్ణి చూస్తే కమ్మో, రెడ్డో, కాపో అనుకోవాలి. ఆ రోజున కేకలు వేసుకుంటూ వచ్చాడు.

"ఏమరొయ్యోయి, దొరల్లే పడుకున్నావుకాబోలు! మంచం పట్టుకుంటే వదల్లేవు. కుప్ప దూసుకోపోయారు ఎవళ్లో. నేనేమో పెద్దముండాకొడుకును. అక్కరకు వచ్చా దొరవు అంటే నీవేమో కోడలమ్మను కావలించుకొని కూచోటంతప్ప యిల్లు కదలవు. నేను చచ్చింతర్వాత తెలుస్తై నీపాట్లు" అని యీధోరణిలో అన్నాడు.

మా పల్లెటూరివాళ్ల మాటలు మోటుగా ఉంటై. నీ వింగ్లీషు చదువుకుంటున్నావు. నీ కవన్నీ చెప్పడం ఎందుకు? వాడి ఆ మోటుమాటలు పల్లెటూరిలో సహజమైనా నాకు కోపం వచ్చింది. మా నాయనేమో పెద్ద రైతు. వాడు మాపాలేరు. అందులో మాలవాడు. నాకు కోపం వచ్చి వాణ్ణి బూతులు తిట్టేను. "నీకు ఒళ్లూ పై తెలియటంలేదు. ఎవరినిరా నీవనేది? దొరనేనా? డొక్క చీలుస్తాను......" ఏదో యీ ధోరణిలో అంటున్నాను. ఆ వల్లడి కేకలకే మా నాయన లేచాడుకాబోలు. వాడి కంఠస్వరం పుస్తకాలల్లో వ్రాస్తారే, మేఘగంభీరస్వనం. మా నాయన లేచి, కళ్లు నలుముకుంటూ బయటకు వచ్చాడు. నేను వల్లణ్ణి తిడుతున్నాను. ఆయన చూచాడు. చూచి తొందరపడుతూ "ఎవరినిరా? ఎవరినిరా తిడుతున్నావు? వల్లణ్ణే, వల్లణ్ణే? ఓరి బుద్ధిలేనివాడా! వల్ల డెవరనుకున్నావురా" అన్నాడు. నేను "కాదు నాన్నా, వాడు నీవంటే లెక్కలేకుండా మాట్లాడుతున్నాడు. వానికి ఒళ్లు పొగరెక్కింది" అన్నాను. అంత మా నాయన "ఛా. నోరుమూయి. వల్లడు నన్ను ఏమి అంటానికి అధికారం లేదురా వాడికి? నన్ను వల్ల డనకపోతే యింక ఎవడంటాడురా?" అన్నాడు. నా కింకా కోపం వచ్చి "నీ వలుసు యిస్తున్నావు. అల్లాగు యిల్లాగు" అన్నాను. మా నాయనగారు నన్ను కొట్టవచ్చాడు. వల్లడు ఆపాటున "ఇదిగో, బుడ్డాణ్ణి కొట్టేవు. కుఱ్ఱకాయి కేమి తెలుస్తుంది? రాత్రి ఎవళ్లో కుప్ప దూసుక వెళ్లారు. నేను ఊళ్లోలేను. వస్తూ కుప్పమీదుగా వచ్చాను. పది పనలపెట్టు దూసుక నలుచుకపోయారు. నీవు కోడలమ్మను వదల లేకుండా ఉన్నావు. రా పోదాం." అన్నాడు.

అంతట మా నాయనా, వాడూ వెళ్లారు. నాకు ఒళ్లు మండిపోతోంది. వాడు మాటిమాటికీ కోడలమ్మ అంటాడు. నేను పదునాలుగేళ్ల కొడుకు నుంటే మానాయన్ని వా డదేమిమాట. వాడు మాలవాడేమిటి? ఈ సంబంధం ఏమిటి? నా కేమీ తోచక ఏడుస్తున్నాను. ఇంటిలో మా నాయనమ్మ వచ్చి నన్ను ఓదార్చటం మొదలుపెట్టింది. ఆమె యీ జరిగిందంతా చూస్తూనే ఉంది. ఆమె నన్ను ఓదార్చ వస్తే నాకు పౌరుషం వచ్చి "నన్ను నీవు ముట్టుకో వద్దు. మాలవాడు కోడలమ్మట, కౌగలించుకొని పడుకోటంట. నాన్న ఊరుకున్నాడు. నీవు ఊరు కున్నావు. ఇంకో రైతే అయితే డొక్క చీల్చి డోలుకట్టడా" అన్నాను. మా నాయనమ్మ నన్ను ఓదారుస్తూ "వల్లడికి మనం అంటే ప్రేమలేదా, గౌరవం లేదా? నీకు మీ అమ్మ, మీనాన్నా పెద్ద

వాళ్లుగా కనపిస్తున్నారుకాని వాడికి చిన్నవాళ్లేను. వాడిచేతిమీదుగా మీనాన్నకు పెళ్లి చేశాడు. సంబంధం కుదుర్చుకో వచ్చింది వాడు. మీఅమ్మ అంటే వాడికి పసిపిల్లల్లే కనిపిస్తుంది. నాయనా, వాడి కదొక ముద్దు" అంది. నాలో ఉండే అహంకారం ఏమీ చావలేదు. అవ్వాళ వెన్నపూస పెట్టమని మా నాయనమ్మని అడగలేదు. నేను పడమటింటిలోకే పోలేదు. కొంతసేపు ఊరివెంబడి తిరిగి పొలాలకేసి పోయి తిరిగి మధ్యాహ్నం తిరిగివచ్చాను. మావాళ్లంతా నిద్రపోతున్నారు. నేనే అన్నం పెట్టుకు తిన్నాను. మళ్లీ ఎవళ్లకీ కనుపించకుండా వెళ్లిపోయినాను. రాత్రి ఎవళ్లకీ కనుపించకుండా వచ్చి మంచంమీద ముసుగెట్టుకొని పడుకున్నాను. మా నాన్నకు రాత్రికి నాఆజ వచ్చింది. మామామ్మ, అమ్మ అందరూ వెతికేరు. చివరకు నేను పడుకున్న చోటికి వచ్చి చూచారు. నన్ను బతిమాలి, బామాలి, అన్నం తినమన్నారు. నేను "వల్లణ్ణి పాలేరుతనంలోంచి తీసేస్తే గాని తినను." అన్నాను. అంతవరకూ బతిమాలిన మా నాన్నా, మామ్మ "పో వెధవా, నీవు తినకపోతే మానే" అన్నారు. నే నేం చెయ్యను. చివరకు గతిలేక నేనే అన్నానికి వెళ్లాను. నేను అన్నం తింటూ ఉండగా మా నాన్న వచ్చి దగ్గర కూచొని అన్నం పెట్టటం మొదలు పెట్టాడు. మజ్జిగ కాడికి వచ్చేటప్పటికి రాజీ కుదిరింది. మజ్జిగా అన్నం ముద్ద నా నోట్లో పెట్టవచ్చేటప్పటికి నేను మళ్లీ కొంచెం రాచరికపు టెత్తు లేవతీశాను. "నీవు నాకు అన్నం పెట్టనక్కరలేదు. నీకు నేనంటే కన్న వల్లడంటేనే అంత ప్రేమ ఐతే వాడికే పోయి అన్నం పెట్టు" అన్నాను. అప్పుడు మా నాన్న "నీవు మాబంగారుతండ్రివి, మా నాయనవు. వల్లడు మాపాలేరు. నా ప్రాణదాత. నీవు నా తలపుల్లు కడిగి రక్షించేవాడివి. నీవు నాకు ఉత్తరగతులు కల్పించేవాడివి. వల్లడు నన్ను నిలబెట్టినవాడు. వల్లడు మన కులదేవత. వల్లడంటే నాకు గౌరవం. నీవంటే ప్రేమ. నాయనా, అటు వల్లణ్ణీ వదలిపెట్టలేను, యిటు నిన్నూ వదలిపెట్టలేను. ఈ మజ్జిగాఅన్నంతిను. వల్లడు మనకేమి చేశాడో చెప్తాను. ఆకథంతా చెప్పింతర్వాతకూడా నీవు వల్లణ్ణి పాలేరుగా తీసెయ్యమంటే తీసివేస్తాను. వల్లణ్ణి నేను పాలేరుగా తీసివేస్తే వాడు యీవూళ్లో ఉండడు. ఏకాశీయో లేచిపోతాడు. వాణ్ణి వదిలి నేనుమాత్రం ఉంటానా ? నేనూ వాడితోనే వెళ్లిపోతాను. రెండు వందల యెకరాల సుక్షేత్రమైన మాగాణీ ఉంది. నీకూ యీడు వస్తోంది. నా కాలి చెప్పు నీ కాలికి సరిపోతోంది. నీపాలం అంతా నీవే చేసుకోవచ్చు. వాడూ నేనూ కాశీకో, ఎక్కడికో పోతాము" అన్నాడు. నేను మా నాన్నను బతిమాలి ఆ మజ్జిగాఅన్నంముద్ద నోట్లో పెట్టించుకోవలసివచ్చింది.

ఆరోజురాత్రి యివ్వాళకిమల్లేనే వెన్నెల. నీకుమల్లేనే నేను వింటున్నాను. నాకుమల్లేనే మా నాన్న యిల్లా చెప్పాడు.

౨

అసలు నీ కీకథ చెప్పటం మొదలుపెట్టకముందు మన వంశంవిషయం కొంత చెప్పితేనేకాని సరిగా తెలియదు. మన పూర్వులు మునుపు కృష్ణ అవతల ఉండేవారు. అక్కడ ఉన్న పొలాలన్నీ కృష్ణమ్మతల్లి తినివేసింది. బ్రతకటం కష్టమై, యీ ఊళ్లో వచ్చి ఉన్న మూలపురుషుడు మరి ఎక్కడైనా పోయి బ్రతకవలెనని బయలుదేరేడట. ఆయనకు చుట్ట కాల్చటం అలవాటు. మొదటినుంచీ మన్ను పిసుక్కొని బ్రతకటం అలవాటైనవాళ్లంకనక బ్రాహ్మణులమైనా మన వంశంలో చుట్ట కాల్చటం అనే దురాచారం కొందరు కొందరియందు ఉంటూవచ్చింది. ఆయన అల్లా బయల్దేరివస్తూ, మన యీ ఊరున్న ప్రదేశం మీదుగా వెళ్తున్నాడట—ఈదారిని పడి యింకేదో ఊరు పోదామని. అప్పుడు యిదంతా అడవి. మన యిల్లు కట్టిన చోట పెద్ద చింతచెట్టు ఉన్నదట. ఆ చెట్టులో తొఱ్ఱ ఉంది. ఈయన ఆచెట్టుక్రింద కూర్చుండి సగం త్రాగిన చుట్ట ఆతొఱ్ఱలో వదలిపెట్టి పోయినాడట. ఆ వెళ్లిన పని చూసుకొని తిరిగి పది రోజులకు మళ్లీ వస్తూ మళ్లీ ఆచెట్టుక్రిందే కూచున్నాడు. తీరా చూచేటప్పటికి ఆచుట్ట ఆరిపోలేదు. ఆ తొఱ్ఱ కొద్దిగా అంటుకొని నిప్పుఉన్నది. ఆయన 'యీ

స్థలం నిప్పుఉండేస్థలం. యిక్కడ ఊరు కట్టి, యిల్లుకట్టుకొని నివాసం చేద్దా' మనుకున్నాడు. అప్పుడు యీ అడవిచట్టాలు, అడవిలోంచి పుల్లతీసుకోపోతే శిక్ష వెయ్యటాలూ, యీలాంటివి లేవు. భూమి అంతా ప్రజలది; రాజుది కాదు. దున్నిన నేలమీద పన్ను మాత్రమే రాజుదికాని ధాత్రితో రాజున కేమీ అవసరం లేదు. ఈ అడవి ఆరువందల యెకరాల మేర ఉన్నది. ఈ ఆరువందల యెకరాల మేరా తనది అన్నాడు. ఈ చింతచెట్టుక్రింద ఒక చిన్న పాక వేసి పెళ్లాం బిడ్డలను తీసుకోవచ్చి కాపురం పెట్టాడు.

అంతా అడవి. వెలగపళ్లు, చింతనుంజు, రకరకాల ఆకుకూరలు అన్నీ సమృద్ధిగా ఉన్నవి. జొన్నలొక్కటే తక్కువ. ఒక ఎడ్లజతను తెచ్చాడు. కావలసినన్ని జొన్నలు పండించుకుంటున్నాడు. సంసారయాత్ర చేస్తున్నాడు. కాని అడవి అంతా కొట్టి ఆయకట్టంతా అదునులోకి తీసుకోరావాలి. తానొక్కడూ చేయలేడు. ఇట్లా ఉండగా ఒక రోజున యీ వల్లడి పూర్వుడు యీఅడవిలోంచి వెళ్తూ మన యింటికి వచ్చి 'ఆకలిగా ఉంది అన్నం పెట్ట'మన్నాడు. ఆయన అన్నం పెట్టి చుట్టపొగాకిచ్చి "ఒరేయి, యిక్కడ ఊరుకడదామని ఉంది. ఈ అడవి అంతా కొట్టాలి. నీవు వస్తావా? నీవుకూడా ఒక చిన్న కొంప వేసుకొని యిక్కడే ఉందుగాని" అన్నాడు. వాడు "దొరా, కడుపునిండా అన్నం పెట్టావు. నీమాట కాదనలేను. వస్తాను"అని నాల్గో రోజుకి వాడి పెళ్లాంబిడ్డలను తీసికోవచ్చాడు. ఒక పూట వాడికి సుప్పెడు మెతుకులు పెట్టినందుకు వాని కృతజ్ఞత చూడు. కృతజ్ఞత అనే గుణం వల్లడి కులంలో పుట్టింది. ఆనాటిమొదలు యీనాటివరకు వల్లడి వంశపు నెత్తురిలో యీదేవతాగుణం లేశమైనా చెదరలేదు. ఇద్దరూ కలసి అడవిలో చెట్లు కొట్టి బయలైనంతమేర జొన్నో, రాగో ఏదో పండించుకుంటూ కాలక్షేపం చేస్తూవచ్చారు. తరువాత కమ్మవారినీ యితరకులాలవారినీ తీసుకోవచ్చి వాళ్లకు భాగాలు పెట్టి అడవి అంతా కొట్టించి, చివరకు ఊరు యేర్పాటైంది. దానితో మనకు అవసరం లేదు. మన కుటుంబాలుకూడా యీ రెండుమూడు వందల యేండ్లు పెద్దగా పెరుగలేదు. ఊళ్లో తారగారున్నారే—వారి కుటుంబం, మన కుటుంబం. ఆయనా మానాన్నా తాతా సహోదరులు. ఆయనా ఆయనతమ్ముడు రెండు కుటుంబాలు. నేనూ నా తమ్ముడూ; మాతమ్ముడు వివాహం చేసికోనన్నాడు. కనక మనదీ, వాళ్లదీ రెండే కుటుంబాలు. వాళ్లూ మనమూ విడిపోయింతర్వాత వల్లడు 'పెద్దదొరవు నీదగ్గరే ఉంటా'నని మాతాతగారి దగ్గరే ఉన్నాడు.

ఎంత విడిపోయినా సమిష్టికుటుంబంగానే ఉంటూఉండేవాళ్లం. పొలం అంతా కలిపి దున్నటం, కలిపి పండించటం, కలిపి త్రొక్కించటం. నేనూ మా తమ్ముడూ చిన్న పిల్లలం. నా కొక ఎనిమిదేళ్లు ఉంటై. బాబాయి కో నాలుగేళ్లు. అప్పుడు మా నాయనగారు చనిపోయినారు. ఊళ్లో ఉన్న మన రెండోకుటుంబంలో అప్పటి పెద్దాయనపేరు రాయుడు. రాయుడుగారు వయస్సుచేత మానాన్నకన్న పెద్దవాడు. మనకుదురు యిక్కడకు వచ్చి నాయన పెద్దకొడుకూ ఆయన పెద్దకొడుకూ యిల్లా వచ్చిన సంతానం. ఊళ్లో పెత్తందారీ, మంచీ చెడ్డా అన్ని అజమాయిషీలు పెద్దకొడుకువందే ఉండటం అలవాటుగా వచ్చినా, రాయుడుగారు వయసున పెద్దవాడవటంచేత ఆయనయందే మర్యాద పెట్టి మానాయనగారుంటూఉండేవారు.అందుచేతవ్యవసాయంపనులన్నీ యీ మూడువందలయెకరాలమీద—తక్కిన మూడువందలూ వారికీ వారికీ యిచ్చి ఊళ్లో కుటుంబాలు యేర్పాటుచేశారుగా—రాయుడుగారే చేస్తూఉండేవారు. అంటే మా నాయనగారూ చేస్తూనే ఉండేవారు. పెద్దరికంమాత్రం ఆయనమీద ఉంచుతూఉండేవారు. కాని ఆయనకుమాత్రం మనసుల్లో గుబ్బుగా ఉంటూఉండేదిలే. వీళ్లది పెద్దకుటుంబం ఏమిటే, ఈ ఊరిమీద వీళ్లది అధికారం ;ఏమిటి అని. కాని మా నాయనగారంటే మనస్సులో భయం. మా నాయనగారు వెళ్లి "ఏమోయి బాబాయీ, యిల్లా చేశావు"అంటే "లేదురా నాయనా, లేదురా నాయనా"అంటూ సర్దుకోపోయేవాడట. ఈ పరిస్థితుల్లో మా నాయనగారు చచ్చిపోయినారు.

ఇదిట్లా ఉంచి, యింకో సంగతి చెపుతా విను. మాఅమ్మపుట్టిల్లు కృష్ణఅవతల. మీఅమ్మపుట్టిల్లూ కృష్ణఅవతలే. అక్కడనుంచి వచ్చారుకనుక మన కుదుట్లో ఆమూలపురుషుడుదగ్గరనుంచీ సంబంధాలు చెడిపోకుండా ఆ మేనమామల పిల్లనే చేసుకుంటూవచ్చారు. ఆకృష్ణఅవతల అది సముద్రతీరం. అన్నీ చవిటిపఱ్ఱలు. ఏమీ పండేవి కావు. మనవాళ్లెప్పుడూ వారికి చేతోడువాతోడుగా ఉంటూఉండేవారు. ఇప్పటికి మళ్లీనే చూస్తున్నావుగా ఎప్పుడూ మా మేనమామలూ మీ మేనమామలూవచ్చి నెలలతరబడి ఉంటూఉండేవారు. పైగా మనకదే అచ్చివస్తోంది. ఇల్లా మా నాయన గారు చనిపోయింతర్వాత ఆ రాయుడుగారు మా అమ్మని చాలా యిబ్బందులు పెట్టారు. "ఇంట్లో గింజలు లేవు" అంటే "నాకేం తెలుసు" అనేవాడట. ఆవిడ ఊళ్లో చాలా అప్పులు తేవటం, కోమటింటినుంచి అన్నీ అప్పుచేసి తీసికోరావటం. కోమటింట పద్దు పెరిగిన కొద్దీ వాళ్లూ యివ్వననటం. చివరకు వల్లడు అదరించి బెదరించి ఎక్కడోక్కడ ఓ బస్తా జొన్నలు తెస్తే అది ఒచ్చేపోయేవాళ్లతో రెండు రోజులన్నా రాకపోవడం. దారిమార్గాన వెళ్తాంటే ఎంతమంది బ్రాహ్మలైనా మరెంతమంది యితరులైనా ఫలానావారిల్లని మరీ మాయింటికే వస్తారు. రెండుమూడువందల ఏళ్లుగా యీ యింట్లో లేదన్న మాటలేదు. అప్పటికే మాఅమ్మగారు గుండెదిటవైనమనిషి. కొంచెం నోరు కలది. ఏమైతేనేమి, రోజులు గడచిన కొద్దీ ఊళ్లో ఉండటం కష్టమైంది. నాయకుడూ, మునసబూ, కరణం అందరినీ రాయుడుగారు ఆకట్టాడు. "పిల్లలను వేసుకొని పుట్టింటికి లేచిపోతుంది, ఆడదేమి చేస్తుంది" అని పన్నాగం ఎత్తాడు. ఊళ్లో అధికారులు తనకు అనుకూలంగా ఉన్నా, పిలిస్తే పలికే దిక్కు లేదు. వల్లడి అధికారంగూడా సాగలేదు. చివరకోరోజున మాకుకూడా అన్నంలేకుండా వల్లడితో చెప్పకుండా మాఅమ్మగారు పుట్టింటికి బయల్దేరి వెళ్లిపోయిందిట. నాకు లీలగా జ్ఞాపకం ఉందికాని ఆవిషయాలేమీ సరిగా బొమ్మకట్టవు. కాసేపు నన్ను నడిపించీ, కాసేపు తమ్ముణ్ణి నడిపించీ, ఒకప్పు డిద్దర్నీ చంకన వేసికొనీ ఆఊళ్లో ఆఊళ్లో వాళ్లనీ వాళ్లనీ అడిగి మాకు అన్నం పెట్టించి నానాకష్టములూ పడి చివరకు పుట్టింటికి చేరింది. ఆవిడ తోడపుట్టినవాళ్లూ అంత సామంతులు కారు. వ్యవహారనిష్ఠ లేనివారు. అవునంటే అవునని నడుము కట్టుకొని వ్యవహారాలు సాగించేందుకు మనిషిలో అదోక పలుకు ఉండాలి. అది దేవుడు యిచ్చేదికాని తెచ్చిపెట్టుకుండేది కాదు. వాళ్లూ పేదవాళ్లు; బ్రాహ్మణవృత్తిలో ఉండేవారు. "నీవూ నీపిల్లలూ సరే మాతోపాటు ఉండండి. కలో గంజో అలాగే త్రాగుదా" మన్నారు. కాని "అరే, అదేమిటి, నీఆస్తికి వాడెవరు?" అని కత్తికట్టే సామంతం లేనివారు.

రోజు లిట్లా గడుస్తూ ఉండగా యిక్కడ, ఇక చెప్పబోయేదంతా వల్లడు చెప్పిన కథ. వల్లడంటున్నాడు—

నేనా ప్రొద్దున కోడికూసేపాళ లేచి పొలం పోయి చూసుకొని దొరయింటికి వెళ్లాను. మా పెద్ద దొర-అంటే నేను-రోజూ వాకిట్లో పడుకుండేవాడు. ఆరోజున కనుపించలేదు. గొడ్ల సావిట్లో చూస్తే పాడి గేదె ముందరకాని, ఎడ్లముందరకాని గడ్డిలేదు. తెల్లార్లూ మేతలేక అవి డొక్కలు లోతుకుపోయి నన్ను చూట్టంతోటే గేద నాలిక వెడలపెట్టి అరిచింది. నేను గడ్డి తీసి వేశాను. దొరసాన్ని ఎన్నిసార్లు పిలిచినా ప్రతి లేదు. తీరా చూస్తే యింటికి తాళం వేసియున్నది. ఇరుగుపొరుగువారందరినీ పిలిచాను. అందరూ చెప్పారు. "మీదొరసాని నిన్న ప్రొద్దున్నే వెళ్లిపోయిందిరా" అని. నే నావెనక రెండురోజులూ ఊళ్లో లేను. నా చెల్లెలిని అదేదో ఊళ్లో యిచ్చాము. దానికి జబ్బుగా ఉందంటే చూట్టానికి వెళ్లాను. నాకేమీ తోచింది కాదు. కోపం వచ్చి రాయుణ్ని తిట్టాను. "నాదొర ఆస్తి వేసుకు తినేందుకు నీ వెవరు? చూడు ఏమి చేస్తానో. పిల్లల్నీ తల్లినీ ఊళ్లోంచి వెళ్లకొడ్తావా. ఈపూట తింటే ఆపూటలేకుండా వాళ్లని పస్తుపెట్టాడు. నాదొర బతికున్నప్పుడు కుక్కినపేనల్లే ఉండేవాడు. ఏసుకుతిందామనుకుంటున్నాడు కాబోలు. ఎట్టా తింటాడో చూస్తాను. మళ్లీ నాదొరఆస్తి నాదొర కప్పచెపుతాను. అప్పచెప్పకపోతే నాపేరు వల్లడు కాదు. నేను మాలవాడి కడుపున పుట్టలేదు" ఇల్లా

అంటున్నాను. చుట్టూ మూగిన కమ్మవారూ వారూ
ముసిముసినవ్వులు నవ్వేకకాని ఏమీ మంచిగా లేరు.
ఇంతలో ఊరినాయకుడు వచ్చాడు. అతను ఒత్తిఒత్తి
మాటాట్టం మొదలుపెట్టాడు. అంతా చూచాను. మన
కేమీ అనుకూలంగా లేదని తెలిసింది. కాని నే
నంటే ఏదో కొంత భయం ఉంది. పైగా న్యాయం
నాపక్షాన ఉంది. నేనేమి చేయటానికైనా చిన్న
దొరలూ, దొరసానీ ఊళ్లో ఉంటేకదా. లేకపోతే
"నీదేమి ఉంది పొమ్మంటాగు. వెళ్లి వెంటనే దొర
సాన్ని తీసికోరావా అనిపించింది. పొలాలన్నీ పంట
మీద ఉన్నై. కోయ్యాలి, గూళ్లు వెయ్యాలి,
తొక్కించాలి. చేస్తేగాని క్రొత్తగింజ రాదు. పాత
గింజ ఎక్కడా కనిపించటం లేదు.

ఇప్పుడే దొరసానీన్నీ, పిల్లల్నీ తీసికోవస్తే
వాళ్లని బ్రతికించటం కష్టమౌతుంది. అనుకొని మాట్టా
డకుండా యింటికి వెళ్లిపోయినాను. పగలూ రాత్రీ
యిదే ఊహ అనుకో. నేననుకున్న పతకానికి ఊళ్లో
కాపుల్నీ కరణాల్నీ తిరగతీస్తే గాని కుదరదు. దానికి
కొంత కాలం పడుతుంది. ఇదంతా నెమ్మదిమీద
జరగాల్సిన పనికాని తొందరపడితే లాభం లేదు.
ఆరోజున బువ్వ తిని పొలం పోయినాను. రాయుడుగా
రక్కడ కూచున్నాడు. నే నాయనవంకే చూడ
కుండా ఏదో పని చేస్తున్నాను. కాని కన్ను ఆయన
మీదే ఉంది. ఆయన నావంక కోపంగా చూస్తు
న్నాడు. ప్రొద్దున నే నన్న మాటలన్నీ యీాయనకు
తెలిసిఉంటవనుకున్నాను. నన్ను ఆయన చూస్తే
ఎల్లా ఉందంటే ఏం కదిలిస్తే ఏంమీదపడుతుందో
అనేట్టు ఉన్నా. "పులిమీదికి దున్నా రాలేదు,
దున్నమీదికి పులీ పోలేదు"

ఇలా వల్లడు చెపుతూఉంటే మానాన్న యీ
ప్రశ్న వేశాట్ట: 'ఇందులో దున్న ఎవరు, పులి
ఎవరురా?' అని. అప్పుడు వల్లడు "ఓయిదొరో, నీవు
గడుసెక్కావు"అని మళ్లీ చెప్పటంమొదలెట్టాడు—

నాలుగైదుప్రొద్దుల్లో ఆ ఉమ్మరాం తగ్గింది.
ఆయనదారిని ఆయనా, నాదారిని నేనూ పోతూ
ఉండేవారం. ఈపని చెయ్యమని ఆయన నాతో
చెప్పేవాడు కాదు. నాకు తోచిన పని, నాదొరచేలో
పని నేను చేసుకుంటూఉండేవాణ్ని. కాని ఆయన
కడుపులో కదులుతూనేఉందిగా. అందుచేత ఏచిన్న
విషయం వచ్చినా పాలేళ్లనందర్నీ కలిపి మందిమీద
తిడుతూఉండేవాడు. ఒకరోజున మరీ ఒడ్డెగిలిపోయి
నాడు. "ఎదవ, ఎదవ. వీడట, వాడి దొరపొలం వాడి
కిప్పిస్తాడట. వాడిదొరపొలం అంటూ ఎక్కడుందో
చూస్తాను. సిగ్గులేక ఏముహం పెట్టుకొస్తాడు యిక్క
డికి" ఇల్లా తొలకరి వేశాడు. ఇంతకన్న ఎక్కువ సం
టానికి నేనంటే ఆయనకీ దమ్ములు చాలవు. తప్పిం
చుక ఎక్కిరించాలికదా అని ఊరుకున్నాను. అప్ప
టినుంచీ నాకూ రగుల్తోంది. ఇంక పదిపదిహేను
రోజుల్లో జొన్నగూళ్లు కొడతాం. ఉలవా పెసరా
మినుమూ అన్నీ తయారైనై. ఇహ ఊళ్లో నలుసుర్నీ
భాగకట్టుకోవలసిన అవసరం కనపడ్డది. నేనంటే ఊళ్లో
కొంత మంచి ఉంది. మంచి అంటే ఎక్కడనుంచి
వచ్చింది. దొరలు మిమ్మల్ని పట్టే వచ్చింది. మీరూ
నేనూ యీగడ్డకు మొదటివారం. నేను పాలేరువాణ్ని
అయినా, దొరా, యీవూళ్లో నీమాట ఎట్లాగో నా
మాట అలాను. ఆమాటనే మీకోసమే ఉపయోగపెడ
దా మనుకున్నా. అక్కణ్ణించి మొదలుపెట్టాను.
దొరా, నమ్మితే నమ్ము, నమ్మకపోతే నమ్మకపో.
అప్పట్లో కంచంముందర కూచుంటే నాకు కూడు
సయించేదికాదు. నిద్దరపట్టేది కాదు. ఒకరోజున
చచ్చి సర్గాన ఉన్న పెద్దదొర కల్లో కనిపించాడు.
'వల్లా'అని పిలిచాడు. పొలానికి రమ్మంటున్నాడని
లేలగుడ్డ,కఱ్ఱకోసం వెతకపోయినాను. మెలకువవచ్చింది.
చూస్తే నాగుడిశెలో నే మన్నాను. నాభార్య
'ఏమిటి అల్లా లేచావు?' అంది. దాంతో చెప్పాను —
'దొర వచ్చి పిలిచేడు' అని! మేము భార్యాభర్త లిద్ద
రమూ యింతసేపు కడుపుమంట వలుకపోసుకున్నాము.
దొర చచ్చిపోయినాడు. కడుపునిండా కూడు లేదు.
కంటినిండా నిద్రలేదు. కష్టకోటానికి మనిషిపాత లేదు.
రాయుడుగారిని సాధిస్తాను. మళ్లీ నాదొరయింట్లో
దీపం పెడతా. [సశేషము]

హిమాలయమున మహాదేవుని విరహతాపము

= శ్రీ రా. వేం. మ. గం. రామారావు =

ఏల నిను వీడి నే నిట నేడ్వవలయు
కాలరాత్రుల నే నేల క్రాఁగవలయు
పార సంపూర్ణ దివ్య విహారశయ్య
వీడి యేల నే నిట్టులు పాడవలయు!

పిట్ట పిలుచుచు ప్రియఁజేరి పెనగులాడ
పువ్వు పువ్వును తలయూచి నవ్వుకొనగ
మంచుకొండలు మబ్బులో మగత నొంద
గుండె పగులగ నేనేల కూలవలయు!

నాదు విరహావిపంచికానాద మిపుడు
మేఘదూత్యమునను నీకు మేలుపలుకు
పలికి ఉడుకు వలపుతాకు నలుపు తెలిపి
ముద్దు మోహనరాగాన మూర్ఛపోవు.

అర్ధనారీశ్వరుండ నాత్మార్పణమున,
ప్రేమగంగాధరుండను భృత్యపదవి,
ప్రజ్వలింపగజేయ నే ప్రణయమహిమ
దివ్యసౌందర్యశోభితా దేవదేవి!

ప్రాణదేవతవౌట, హృద్రాజ్ఞివౌట,
ప్రణయదాతవౌట, యనంగలక్ష్మివౌట,
నిన్ను వీడి నే నిముషంబు నిలువలేను,
ఐక్యమొందగ నినుచేరి అరచుచుంటి.

అదియె స్తనితము, నోంకార మదియెచుమ్మ
దాన నుదయించె నా విశ్వ తాండవమును,
ప్రళయ మయ్యెడె నా మనః ప్రాభవంబు,
ధ్వంస ముద్భవ మచ్చటే తరలిపొంగు.

ఆత్మవిరహాగ్ని ప్రళయకాలాగ్ని యనుచు
కంఠ గద్గదికమె మహాగరళ మనుచు
నిన్ను కూడు తలపె జ్ఞాననేత్ర మనుచు
జనులు చెప్పంగ నిను కోరి జపముసేతు.

పాండురంగ మాహాత్మ్యము

పా ఠ ప రి శీ ల న ము

❋

= శ్రీ బులుసు వేంకటరమణయ్య =

సంస్కృతభాషాప్రవేశముఁ గోరువారికి రఘువంశాదు లగు పంచకావ్యములు ప్రథమపఠనీయములు. అట్లే ఆంధ్రసారస్వతతత్త్వ మారసి, కావ్యామృతరసము నాస్వాదింపఁ దలఁచువారికి 'ఆముక్తమాల్యద' మొదలగు పంచకావ్యములు అవశ్యపఠనీయములు. తెనాలి రామకృష్ణకవి రచించిన 'పాండురంగమాహాత్మ్య' మాయాంధ్రకావ్యపంచకమున గణనీయమైనది.

వసు, మనుచరిత్రాదులకు ప్రాచీనులును, అర్వాచీనులు నగు పండితప్రకాండులు రచించిన విపులవ్యాఖ్యలు ఉన్నవి. వానికి లిఖితప్రతులును పెక్కు కలవు. కావుననే పండితపరిశోధకులు ఆ గ్రంథములను సవ్యాఖ్యానముగ వీలగునంతవఱకు నిర్దుష్టపాఠములతోనే ప్రకటించియున్నారు. కావుననే అవి సులభగ్రాహ్యములై ప్రచారమున నున్నవి. పాండురంగమాహాత్మ్యము చేసికొనిన పాపమేమొ! దానికిమాత్ర మట్టి యదృష్టము పట్టలేదు. దానికి లిఖితమాతృకలు మిక్కిలి తక్కువ. ఉన్నవానిలో ఒకటి, రెండు తప్ప తక్కిన వసమగ్రములు; ప్రాచీనవ్యాఖ్యలు లేవు. అర్వాచీనవ్యాఖ్య యయినను లఘుటిప్పణీరూపమున నున్నది. అదియును శ్రీమాన్ తెన్మఠం శ్రీరంగాచార్యులవారి ధర్మమా యని వెలువడినది.

పాండురంగమాహాత్మ్యము ఇట్టి స్థితిలో నుండుటచే నిందు తప్పుపాఠములు లెక్కకు మిక్కిలి కనఁబడుచున్నవి. చాల పద్యములలో క్లిష్టపదములను టీకాకారులు చల్లగా జాఱవిడిచిరి. పెక్కుపద్యములు, గద్యములు అపపాఠబాహుళ్యము లగుటచే కొఱకరాని కొయ్యలై యున్నవి. ఇంతవఱకును పరిశోధకపండితు లీప్రబంధవిషయమయి ఎట్టి శ్రద్ధను తీసికొనలేదు. రమారమి నలువదియేండ్లక్రిందటి ప్రథమముద్రణ మెట్లున్నదో యిప్పటి యైదవముద్రణము నట్లే యున్నది.

పాండురంగమాహాత్మ్యము ప్రౌఢప్రబంధములలోఁ జేరెన్నిక గన్నది. ఇది ప్రబంధాంతరవిలక్షణము: పోకడలు క్రొత్తలు; పద్యమును బోలిన పద్యము కానరాదు; ఈ నియమము సీసములయెడ ఎక్కువగఁ గానవచ్చును. రచన యనుప్రాసబాహుళ్యము; వర్ణనలు చిత్రవిచిత్రములు. పదములు మాఱుమూలలనుండి వెదకి తెచ్చినవి; అందు పెక్కులు నిఘంటువులయందును మృగ్యములు. ప్రయోగములు విచిత్రములు. 'మాటల పోటు, నిర్లక్ష్యపు నడక, భావముల తీవ్రత' రామకృష్ణుని స్వభావమునందువలె రచనయందును కనఁబడుచున్నవని తెల్పిన శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మగారి* అభిప్రాయ మెంతయు సమంజసము. పయి లక్షణములకుఁ దోడు లిఖితప్రతులలోని తప్పులు ముద్రితప్రతుల కెక్కి గ్రంథమును దురవగాహము నొనర్చుచున్నవి. వ్రాఁతప్రతుల సాయమున చక్కని పాఠములను నిర్ణయించి, తగిన టీక రచింపఁబడిననే కాని యీ గ్రంథము నర్థముచేసికొనుట కష్టము.

ఈపాఠనిర్ణయమున నేను చేసిన కృషిని, వెనుకటిపాఠములయు, టీకాకారులయు పొరపాట్లను వివరించుచు సాధుపాఠప్రదర్శనపూర్వకముగ ఆంధ్రలోకమునకు మచ్చున కిచ్చుటయే ఈవ్యాసముయొక్క ముఖ్యాభిప్రాయము.

---

*చూ. భారతి సంపుటము ౧౧, సంచిక ౧: 'నిగమశర్మ అక్క'

౧. శా. "కద్రూజాంగదుతోడఁబుట్టువు శర
త్కాదంబినీ చంద్రికా

చిద్రూపాంచిత పద్మగర్భముఖరా
  జీవావళీహంసి వ
ర్ణద్రాక్షాఫలకీరి శారద కృపన్
  రామానుజామాత్యు వే
దాద్రిస్వామికి నిచ్చు నిచ్చలును వి
  ద్యాబుద్ధివాక్సిద్ధులన్" (౧-౮)

అని ముద్రితప్రతిలోని సరస్వతీ ప్రార్థనా పద్యము కలదు. దీని కీ క్రింది లఘుటీక కలదు:

"కద్రూజాంగదుఁడు = శివుఁడు. చిద్రూపాంచిత=జ్ఞానస్వరూపముచేత ఒప్పునది. వర్ణద్రాక్షాఫలకీరి=వర్ణములనెడి ద్రాక్షాఫలములకు చిలుక."

మీఁది వ్యాఖ్యలోని 'చిద్రూపాంచిత' అనునది ప్రత్యేకపదముకాదు; 'శరత్కాదంబినీ చంద్రికా చిద్రూపాంచిత' అను సమస్తపదములోని ఏకదేశము. టీకాకారులు 'చిద్రూపాంచిత'కు అర్థము నిచ్చిరే కాని సంపూర్ణమగు సమస్తపదమునకు అర్థము నీయలేదు; ఈ పదైకదేశము 'శరత్కాదంబినీ, చంద్రికా' అను పదైకదేశముతో ఎట్లు సమన్వయించునో సూచింపనైన లేదు. మనము ప్రయత్నించి సమన్వయింప సాహసించినను అన్వయము కుదురదు.

శరత్కాదంబినీ, చంద్రికలవలె 'చిద్రూపాంచిత' అందుమా? లేక 'శరత్కాదంబినీ, చంద్రికల యొక్క చిద్రూపాంచిత' అందుమా? ఎట్లనుటకును వీలు లేదు.

ఇచటి 'చిద్రూపాంచిత' పాఠము తప్పు; కాన దాని ననుసరించిన టీకయు నసంగతము.

ఇచట లిఖితప్రతిలో 'శరత్కాదంబినీ, చంద్రికాజిద్రూపాంచిత' అను పాఠ మున్నది. అదియే ఒప్పు. అర్థమేమన—'శరత్కాలమేఘమును, వెన్నెలను జయించు (తెల్లని) రూపముతో ఒప్పునది' అని. సరస్వతీదేవి సర్వశుక్ల యని ప్రసిద్ధి.

పయి 'శర......చిత' అను పదమును, తర్వాతి 'పద్మగర్భముఖరాజీవావళీహంసి' అను పదమును బట్టి చూడ రామకృష్ణుఁడు

"చతుర్ముఖముఖాంభోజ
  వనహంసవధూ ర్మమ
మానసే రమతాం నిత్యం
  సర్వశుక్లా సరస్వతీ"

అను దండిమహాకవి సరస్వతీప్రార్థనాపద్యమును మనమున నుంచికొని మీఁది పద్యమును వ్రాసినట్లు కన్పించుచున్నది. కాన 'శరత్కాదంబినీ, చంద్రికాజిద్రూపాంచిత' అను పాఠమే ఆదరణీయము.

ఆ. గీ. "పూవుఁదేనియఁ దడిసిన మావిచిగురు
  మీఁద నంటి చరించు తుమ్మెద దలిర్చు,
  సమయమాటయు మసినెయ్యి సమరి మరుఁడు
  త్రుప్పు వోఁదోము నీలంపుఁదునుకయనఁగ."
  (౧-౧౮౨)

పయిది వసంతర్తువర్ణనపద్యము. ఇది సులభమైనదని కాఁబోలు టీకాకారులు దీనికి టీక వ్రాయక విడిచిరి.

'మావిచిగురు పూవుఁదేనియఁదడియఁగా, దానిపై తుమ్మెద వ్రాలి యిటునటు చరించుచున్న దనియు, అప్పు డది వసంతసమయమున మన్మథుఁడు విరహులపై దాడివెడల నాయుధములను త్రుప్పువోవుటకు మసి, నెయ్యి కలిపి నీలంపుఁదునుకతోఁ దోమునట్లున్నది' అని పయి పద్యమున కర్థము తోఁచుచున్నది. కాని యిది సరిగాఁ గన్పడదు. ఇచటఁ దుమ్మెద నీలంపుఁదునుకతోఁ బోల్పఁబడినది. పూవుఁదేనియ నేతితోఁ బోల్పఁబడినది; కాని మావిచిగురున కుపమానము కానరాదు; అదియు నిట ముఖ్యమేగదా! అది లేనిచో దేనిని తోమినట్లు?

ఇచట 'సమయమాటయు' అనుట తప్పు. వ్రాఁతప్రతిలో 'సమయమగుటయు నసి నెయ్యి సమరి మరుఁడు' అని కలదు. ఇదియే యుక్తము.

ఈ పాఠమున మావిచిగురు కత్తి; దానిపై మరుఁడు పూఁదేనె యను నేతిని రాచెను; తుమ్మెద యను నల్లరాతితునుకతోఁ దోముచుండెను. మఱియు కత్తిని తోముటకు కావలసినది చమురు (నేయి); మసి

అనావశ్యకము. కావున ముద్రితపాఠముకంటె లిఖిత ప్రతి పాఠమే ఆదరణీయము.

3. మ. "లవలీపల్లవపాండురంబులగు గ
ల్లక్షోణులం జంద్రికా
లవలీలం దరహాస మింపెసఁగఁ గే
లన్ వైశ మగ్గోలచే
లవలీలం గొని తెచ్చి యంకకదళా
లంకారముం జేసి బా-
లవిధూ త్తంసుఁడు పల్కు మాధవకథా
శ్లాఘాసుఖాసక్తుఁడై." (౧-౧౯౪)

ఇది ముద్రితప్రతిలోని పద్యము. ఇందలి 'అగ్గోలచే, లవలీలన్' అనువాని వివరణముగ టీకలో 'అగ్గోల= అముగ్ధస్త్రీయొక్క. లవలీలన్ = లేశమువిధమున' అని వ్రాయఁబడినది. పయి మూలమునకుఁగాని, క్రింది వివృతికిఁగాని అర్థము కుదురను లేదు; బోధపడను లేదు.

ఈయెడ అముద్రితప్రతిలో 'అగ్గోలపేలవకీతిన్' అని కలదు. ఇదే యుచితము. 'అగ్గోలన్ =ఏమియు నెఱుఁగని - ఆ స్త్రీని. పేలవకీతిన్ =మృదువుగా' అని అర్థము. అది తరువాతి 'అంకకదళాలంకారముం జేసి' అనుదానితో అన్వయించుచున్నది. అనఁగా 'ఆమెను మెల్లగా తీసికొనివచ్చి తనతొడపైఁగూర్చుండఁ బెట్టుకొని' అని భావము.

౪. శా. "దిగ్వాసుం డురుపింఛలాంఛిత శిరో
దీర్ఘుండు వర్షాపయో
ముగ్వర్ణుండు నవాంబుజాహిత లతా
ముక్తాంగదుండుఙ్ సుధా
రుగ్విస్మేరముఖుం డనంగ శతకో
ట్రూపాధికుం డగ్రభూ
వాగ్గరోద్వద్భవభూమి శ్రీవిభుఁడు శ్రీ
వత్సాంక వక్షుండు నై." (౨-౪౩)

ఇది పాండురంగని వర్ణన పద్యము; ముద్రిత ప్రతిలో నున్నట్లు వ్రాయఁబడినది.

పై పద్యమున 'అగ్రభూ వాగ్గరోద్వద్భవభూమి' అనుచోట ప్రాసభంగము; ఆ సంగతి టీకాకారులు గమనింపక, 'అగ్రభూవాగ్గరోద్వద్భవ భూమి = బ్రాహ్మణుల మాటగర్వమునకు పుట్టినచోటు' అని యర్థమును వ్రాసిరి. ఆ టీక కభిప్రాయ మేమియో బోధపడలేదు.

ఇచటి మూలము, టీకయు తప్పు. 'అగ్రభూవాగ్వర్గోద్భవభూమి' అని యుండవలెను. లిఖిత ప్రతులలో అట్లే యున్నది. ఆ పాఠమున ప్రాస భంగమును లేదు. 'అగ్రభూవాగ్వర్గోద్భవభూమి' యనఁగా వేదములు పుట్టినచోటని యర్థము.

౫. చ. "ప్రతిదిన కేశలుంఛనపు
రాయిడి నెట్టన బట్టకట్టి పైఁ
బుతపుతమంచు నున్న కుఱు
బోడతలన్ ధరియింప నోడియున్
సతముగ సొమ్ము గాన నిడఁ
జాలవుగా శిఖిపింఛవల్లి సా
గతమతధుర్య! దానిఁ గటిఁ
గట్టుము, పుట్టము మిన్న కేటికిన్." (౨-౬౪)

దశావతార వర్ణనములోని బౌద్ధావతార వర్ణన మిది. ఇచట 'సతముగ సొమ్ముగాన నిడఁజాలవుగా శిఖిపింఛవల్లి' అనఁగా అర్థ మేమియో బోధపడలేదు. టీకయందు 'సతముగన్ =శాశ్వతముగ. శిఖిపింఛవల్లిన్ = తీఁగవంటి నెమలిపురిని' అనిమాత్ర మున్నది. అర్థావగతికి వివరణ మనుపయుక్తము.

వ్రాఁత ప్రతులను పరిశీలింపఁగా ఇచట 'సతమగు సొమ్ము గాన విడఁజాలవుగా శిఖిపింఛవల్లి' అని యున్నది. ఈ పాఠమున పద్యార్థము సుగమ మైనది. 'సతమగు సొమ్ముగాన = ఎల్లపుడు నుండు నగ యగుటచే. శిఖిపింఛవల్లిన్ = నెమలిపురిని. విడఁజాలవుగా = విడువఁజాలవు కదా!' అని యర్థము.

బౌద్ధావతారమున ప్రతిదిన కేశలుంఛనమువలన బట్టగట్టిన కుఱుబోడతలపై శిఖిపింఛవల్లిని ధరింప వలనుపడదు. అది సతమగు సొమ్ము కావున విడువను వలను కాదు. అందుచే దానిని వస్త్రమునకు బదులుగా కటియందు కట్టుము అని ఈ పద్యపుఁ దాత్పర్యము. ఇదియే సమంజస మైనట్లు తోఁచెడిని.

౬. క. "నరసింహామధ్య! యచ్చో
నరసింహుఁడు కుంజరాశనతఁ దాల్చుట న
చ్చేరువ దేవుఁడు నిజమం
త్రరాజ పూజైకతానతాయుతుఁ బ్రోచున్."
(౨-౧౨౮)

పాండురంగ క్షేత్రమునఁ గల దైవతాంతరములఁ గూర్చి తెలుపునపుడు శ్రీ నరసింహస్వామిని వర్ణించుచు శివుఁడు పార్వతితోఁ బల్కు పద్య మిది.

పయి ముద్రితప్రతి పద్యమును బట్టి 'నరసింహుఁడు కుంజరాశనతను (అశ్వత్థవృక్ష మగుటను) దాల్చుటచే-ఆ చేరువఁ గల దేవుఁడు తన మంత్రమును జపించువారిని రక్షించు' నను అర్థము తోఁచుచున్నది. ఇట్టి యర్థ మసంగతము. ఏమన - ఇది నరసింహవర్ణన పద్యము. ఇందాతని మహత్త్వము తెలుపక, ఆతని ప్రక్కనున్న మఱొక దేవుఁడు తనభక్తులను రక్షించుననుట అననుగతము. 'ఆ దేవుఁ డెవ్వరు? అతని మంత్రమేమి?' అని ప్రశ్నించినచో సమాధానమేమి? కుంజరాశనతఁ దాల్చిన మాత్రమున నరసింహుఁడు పూజా నమస్కారములు లేక బూజు పట్టవలెనా? అశ్వత్థపూజ నిషిద్ధము కాదే?

వ్రాఁత ప్రతులలో నిచ్చట 'కుంజరాశనతఁ దాల్చుట యచ్చెరు వద్దేవుఁడు నిజమం, త్రరాజ... బ్రోచున్' అను చక్కని పాఠము కలదు.

'నరసింహుఁడు కుంజరాశనతఁ దాల్చుట యాశ్చర్యము! ఆదేవుఁడు (నరసింహుఁడు) నిజమంత్రరాజ పూజైకతానతాయుతుని బ్రోచును' అని దీని యర్థము. ఈపాఠమున అప్రస్తుత దైవతాంతర ప్రసక్తి పటాపంచ లైనది.

'నరసింహుఁడు కుంజరాశనతను (గజభోక్తృత్వమును) దాల్చుట యచ్చెరు' వని, విరోధమును జూపి, 'కుంజరాశనతఁ దాల్చుట (అశ్వత్థ మగుట) యచ్చెరు' వని తదాభాసమును కవి శ్లేషమూలమున చమత్కరించి యున్నాఁడు. కావున లిఖితప్రతి పాఠమే ఉత్తమ మైన దని చెప్పక తప్పదు.

(ఇచటి టీకలో 'కుంజరాశనతన్ = అశ్వత్థము చేత' అని ఎందునకును పొందని యర్థము వ్రాయఁబడినది. అవ్రాఁత యసంగతము.)

౭. శా. "లోలత్వంబున మత్తకాశినుల కి
ల్లుం బొల్లునుం జెల్లఁగా
నేలా? వెచ్చముసేయ నెవ్వలన మ
న్నీ లాభ్యులుం జాలరే!
కోలంబో జనియించు వేడినను వీ
డ్కోలాభ మొహతంద్రి దు
శ్శీలాగారము వారయోషతము ని
న్నీ! పేటి పాటించునే?" (౩-౮౨)

నిగమశర్మయక్క తమ్మునికి 'చెడునడతలనుండి తలంగు'మని హితమును బోధించునెడ పయిపద్యము చెప్పఁబడినది. ఇందలి 'కోలంబో జనియించు వేడినను వీడ్కోలాభము' అను భాగమున కర్థము అగమ్యముగా నున్నది.

టీకాకారు లిచ్చట 'కోలంబు = ఆట' అని సాహసించి అర్థమును వ్రాసి యున్నారు. ఆ పదమున కాయర్థ మెట్లు వచ్చెనో, దానిభావమేమో, అసలు పద ముకారాంతమో ఓకారాంతమో తెలియదు. నిఘంటువులలో (సూర్యారాయాంధ్రనిఘంటువుమాత్రము నాకు లభింపలేదు.) ఈ పదమే కానరాదు. టీకాకారు లనుకొనిన ట్లిది ఉకారాంతమైనచో 'కోలంబే' అని యుండవలెఁగాని, 'కోలంబో' అన నెట్లు పొసగును? ఇది అగమ్యముగా నున్నది.

లిఖితప్రతులను జూడఁగా నిచ్చోడ 'కోలాభో జని యంచు వెండినిను' అని కనఁబడుచున్నది. పర్యాలోచించిచూడ 'కోలాభోఽజని యంచు వేడ నిను' అని పాఠ మంగీకరింపఁదగిన దని తోఁచుచున్నది. 'కోలాభోఽజని? = (ఇల్లుం బొల్లునుం జెల్లఁగా) నీ కేమి లాభము వచ్చినది? అంచు = అని; వేడ, నిను = నిన్ను బతిమాలుకొనఁగా ('వీడ్కోలాభ మొహతంద్రి!' అనుదానితో నన్వయము.)

రామకృష్ణుఁడు పాటించుచున్న అనుప్రాస నియమమునుబట్టియు 'కోలాభోఽజని' అను పాఠమే తగినదనవలెను. అపుడు 'కోలాభోఽజని యంచు వేడ

నిను వీడ్కోలాభమొతండ్రి!' అను మీఁది నియమము కుదురును. అర్థమును పొసఁగును.

౮. ఉ. "ఇంటికి వడ్డమాఁక యొక
యింతయు లేక చరించువాని, చే
వంటినఁగందు కెందళుకు
లంగమునం గలవాని, మిక్కిలిం
గంటికి నించువానిఁ, దెలి
కన్నులవానిఁ బిసాళిశాపనిం
బంటఁది గోరు చారుకుచ
పంజరకీరము గారవింపఁగన్." (౩-౬౧)

గాయపడిన నిగమశర్మ కాఁపుటింటఁ జికిత్స పొందుచుండఁగా ఆ కాఁపుకోడలు నిగమశర్మపై వలపుఁగొనిన సందర్భములోని పద్యమిది.

ఇందలి తప్పులసంగతి యెటులున్నను పద్యము మాత్రము సులభగ్రాహ్యముగనే యున్నది. కాని యిం దప్రస్తుతమగు 'పంజరకీరము గారవించుట' యెందులకో బోధపడుట లేదు. టీకయందు 'కీరమున్ = చిలుకను' అని వివృతికలదు.

లిఖితప్రతులలో నిచ్చట ఎట్టి పాఠాంతరమును లేదు. కాని 'ఇంటికి' అనుచో 'ఇంట' అనియు, 'తెలికన్నులవాని' అనుచోట 'తెరికన్నులవాని'అనియు నున్నది. ఈ పాఠాంతరము లుచితములు. 'ఇంటిలో అడ్డము, ఆఁకలేదను వాడుకనుబట్టి 'ఇంట' అనుటే యుచితమనియు, తదనుగుణముగ 'ఇంటను వడ్డమాఁక' అని సవరించుటయు మేలు. అట్లే 'తెలికన్నుల' కంటె 'తెఱికన్నుల' అనుట యుక్తము. అప్పుడా పదమునకు 'తెఱచుకొన్న కన్నులు కలవానిని- నలు కెలంకుల గమనించువానిని' అని యర్థము చెప్పుట బాగని తోఁచుచున్నది. 'తెలికన్నులవాని' యనుట సరసముగఁ దోఁచలేదు.

ఇఁక 'పంజరకీరము' సంగతిని గమనింతము. ఇచట 'పంజరకీరముగా రచింపఁగన్.' అనుట లెస్స. ఆపంజరకీర పదమును'చారుకుచపంజరకీర'మను సమస్త పదైకదేశ మని చెప్పవలెను. అపుడు 'పంటపడఁతి పిసాళి శాఁపనిని తన చారు కుచ పంజరమునకు కీరముగాఁ జేయఁ దలఁచిన' దని అర్థమును గ్రహింప వచ్చును. అనఁగా ఆ శాఁపఁ డింటిలో అడ్డము, ఆజ్ఞలేక స్వేచ్ఛగా సంచరించుటచే ఎల్లపుడు నతని తోఁ గూడి క్రీడింపఁదలఁచిన దని భావము.

ఇట 'పంజరకీరము' ప్రత్యేక పదముగను, 'కుచ' అనునది 'పంటదాని' విశేషణముగను గ్రహించుటకును అవకాశము లేకపోలేదు. కాని అది అంత సరసమైన సమన్వయముగా నాకు తోఁచుట లేదు. ఏలయన విశేషణము నిరర్థక మగును; 'పంజరకీరము' తెగిపోయిన పదమువలెఁ గానవచ్చును.

౯. తే. "అంబుజానన పెందొడ లరఁటు లగుట
దానఁ గలిగిన లావణ్యసూనభరము
వలని పైరేకు లొక రెండు వ్రాలి బోర
గిలఁబడినరీతి మీఁగాళ్లు లలరు సతికి."
(౩-౧౮౧)

రాధాదేవి వర్ణనలోని పద్య మిది. ఇందుఁ దొడ లరఁటికంబములవలెను, మీఁగాళ్ళు బోరగిలఁ బడిన అరఁటిపూ రేకులవలెను నున్న వని వర్ణింపఁబడి నది. పద్యము సుగమము. కాని రెండవపాదమునఁ గల 'దాన' అను పదమున కర్థము తెలియకున్నది. 'అందువలన' అనఁగా 'ఎందువలన ? ' అని ప్రశ్న వచ్చును. 'అరఁటులగుటవలన' అని జబాబు చెప్పఁ జనదు. 'అరఁటులగుట' అని మొదటిపాదముచివర నుండనే యున్నది.

వ్రాఁత ప్రతులలో 'దాన' కు బదులు 'వాన' అని యున్నది. ఆ పాఠమే యుక్తము. వాన పడిన పిదపనే అరఁట్లు పుష్పించుట ప్రసిద్ధము. అప్పుడే యరఁటిపువ్వులు లావణ్యమున నుల్లసిల్లును.

ఇచట 'పైరేకు లొకరెండు వ్రాలి' అనుచో '...ఒకరెండు రాలి' అనుట మేలు. అపుడు రెండు రేకులు రాలి, నేలపై చెట్టుమొదటఁ బడి మీఁగాళ్ల సామ్యమును పొందుచున్నవని చెప్పవచ్చును.

'వ్రాలి' కి 'రాలి' యని పాఠాంతరము లేకున్నను సందర్భమునుబట్టి యట్టిపాఠమును గ్రహించితిని.

పయి పద్యపుటీకలో 'సూనభరము=పూగుత్తి' అనిమాత్ర మున్నది.

౧౦. తే. "అతివ! తీర్థాదరత్వర వరుసచేంచి
త్రోవ నాకటివేళకు దొరకకునికి
కాంచ నీయాన యేఁగూటి కలన జఠర
వహ్ని నొకయేనకా చెట్టివాఁడు వెరియు."
(౪-౧౫౭)

తీర్థయాత్రాపరుఁడను వటు వొకఁడు క్షుధార్తుఁడై సుశీల యను పతివ్రత యున్న యింటికి వచ్చి యామె నన్నము పెట్టఁ గోరు సందర్భమున నున్న దీ పద్యము.

ఇందుఁ గల 'కాంచ, నీ యాన యేఁగూటి కలన-' అను పదసముదయమున కర్థము తెలియరాలేదు. 'కాంచక' అనఁగా 'దేనిని కాంచను?' 'కూటికలన' అనుదాని యర్థ మేమి ? ఇవి నా సందేహములు.

వ్రాఁతప్రతులలో నిరెయ్యెడ 'కాంతు నీయాన నేఁ గూటికలలె' అని యున్నది.

పాపము! వెడఁగువటుగు కూడు దొరకనందున దానినే ధ్యానము చేయుచున్నందున కూటికలలనే కను చున్నాఁడఁట! అం దసత్యము లేదని ఒట్టు పెట్టు కొనియుఁ గట్టిగాఁ జెప్పుచున్నాఁడు.

మఱొక సంగతి. ఈపద్యమున 'తీర్థాదరత్వర' అనుదానికి బదులు 'తీర్థాపరత్వర' అను పాఠము కన్పించుచున్నది. ఆపాఠము సరసమైయున్నది. తీర్థాటనపరులగు వటువులు త్వరత్వరగా తమయాత్రలను ముగింపఁదలఁచి ఒక తీర్థమునుండి వేఱొకతీర్థమునకుఁ బోవుచున్నారు. వా రేతీర్థమును సేవించినను పిదప ముందు తీర్థమునకుఁ బోవు దృష్టియే గాని వేరొక దృష్టి వారికి లేదు. కావుననే త్రోవలోఁ దనకు తిండి దొరకలేదని వటుగు విన్నవించుకొన్నాఁడు. కావ 'తీర్థాపరత్వర' అను పాఠమే యుక్తము. 'తీర్థాదరత్వర-' అనుట సుసంగతమును కాదు.

౧౧. వ. " ఇట్లరుణాగ్రహణప్రవణపురుషోపధికృతంబులు, ప్రాణవల్లభసమ్యగభిరక్షితంబులు, తదుపహితగణనావహంబులు.........సురభిళ్వంబులునైన పిష్టవికారంబులు నిర్వికారుండై భూసురకుమారుండు నిరవశేషంబుగా నాహారించియు......" (౪-౧౮౯)

సుశీల వటువునకుఁ బెట్టిన పిండివంటల వర్ణన ఘట్ట మిది. ఇందు 'అరుణాగ్రహణప్రవణపురుషోపధికృతంబులు' అను పదమున కర్థము తెలియరాలేదు.

టీకం బరికింపఁగా అందు 'అరుణ-...బులు=ఎఱుపును, అనగా కోపమును పొందుటయందు అసక్తుఁడయిన పెనిమిటిచేత కపటముగా చేయఁబడినవి' అని కలదు.

అమీఁద నా కీ సందేహములు కల్గినవి. అరుణ మనఁగా కోపమని యర్థము నెట్లు చెప్పవీలగును? 'ఈ రోజున కిన్ని' యని కొలిచి, భార్యకిచ్చి అఱకడుపునకు తిను లోభి యిన్ని పిండివంటలను చేయ సిద్ధపడునా? వానిని తానే తయారుచేసెనా? కపటముగా చేయుట యన అర్థ మేమి? ఈ సమస్తపదములోని 'పురుష' పదమునకుఁ బెనిమిటి యని యర్థము చెప్పినచో-దీనిప్రక్కనేగల 'ప్రాణవల్లభ...తము'లను చోట 'ప్రాణవల్లభ' పద మేల? అది పునరుక్తమగునే!

వ్రాఁతప్రతిలో 'ఇట్లరుణాగ్రహణప్రవణపురుషోపధికృతంబులు' అనుటకు బదులు 'ఇట్లు రుణాగ్రహణప్రవణపురుషోపదీకృతంబులు' అని పాఠాంతర మున్నది. దానిని సరిచేసికొన్నచో 'ఇట్లు ఋణాగ్రహణప్రవణపురుషోపదీకృతంబులు' అని సాధుపాఠము ఉపలబ్ధమగును. ఇయ్యదియే కవ్యభిప్రేతము.

దీని భావ మిది—సుశీల పెనిమిటికి ఆదాయపద్ధతియే గాని వ్యయము చేయఁదెలియదు. నానావిధముల సంపాదింపఁబడిన ధనము ఇంట మూల్గుచున్నది. దీని నెఱిఁగినవారు అప్పీయవలెనని యితనిని బాధింతురు. కాని యితఁడు లొంగఁడు. నిపుణుఁడగు నొక యర్థుఁడు రకరకముల మధురపదార్థములను తెచ్చి యితనికి బహుమానముగా నిచ్చి-మెప్పించి ఋణము గ్రహింపఁ దలఁచెను. సుశీలభర్త అతనికి అప్పిచ్చెనో, లేదో మనకుఁ దెలియదు; గాని బహుమానములు మాత్ర మీ లోభికి ముట్టినవి; వాని నాతఁడు అటుకపై భద్రముగా దాఁచుకొన్నాఁడు. ఈయంశమే 'ఋణాగ్రహణప్రవణ పురుషోపదీకృతము'లను పదమున వ్యక్తమగుచున్నది. ఇఁట 'పురుషుఁ'డన అప్పు తీసికొను పురుషుఁడనియు, 'ఉపదీకృతము'లన కానుకగా నీయఁబడిన వనియు నర్థము.

అఆకడుపునకుఁ దిని నోరు కాయకాచియున్న సుశీలభర్త ఆ పిండివంటల రుచులకుఁ బరవశుఁడైనను అప్పిచ్చునని కాఁబోలు ఆ పిచ్చిమనుష్యుని తలఁపు!

౧౨. క. "గోముసఁ జెరుగుచు ముయ్యా
జై మెలఁగుచు గర్భవైష్ణవాగ్రేసరులౌ
నాముద్దుకొమరులం గని
కామిని దీపించెఁ దోఁడ కాచినభాతిన్."
(౪-౨౬౧)

పుత్రులతోఁ గూడియున్న సుశీల వర్ణనపద్య మిది. ఇచట 'కామిని తోఁడ కాచిన భాతిన్' దీపించె నన అర్థము తెలియలేదు. 'తోఁట కాచినభాతిన్' అని యుండునేమో అని తొలుత ననుకొంటిని. లిఖిత ప్రతులలో నొకదానియం దియ్యెడ 'దొండ కాచినభంగిన్' అనియున్నది. దానింబట్టి ఇచట 'కామినిదీపించె దొండకాచినభంగిన్' అనునది సాధుపాఠమని నిశ్చయించితిని. కిలకిలలాడుచు పిల్లలు చంట, వెంట రా వచ్చు ముత్తయిదువలను 'ఈ యిల్లాలు దొండకాచినట్లు ఎంత అందగించుచున్నదో' అని యనుట ప్రసిద్ధము.

౧౩. ఆ. "పాతలతాంతమైన యారామమునుబోలె
విగతతారమైన విన్నుఁబోలె
గళితవర్ణమగుట గళితంబు దీనికి
మీరె తెలియవలయుఁ గారణంబు"
(౫-౭౧)

సుశర్మ యను దుష్టాత్ముని పాపములపట్టికను చిత్రగుప్తుఁడు పూర్వము తన కవిలెలో వ్రాసి సుశర్మ మరణసమయమునఁ జూడఁగా నందు వెనుకటి వ్రాఁత లేకపోయెను. ఆ సందర్భమున ఈపద్య మున్నది. ఇది చిత్రగుప్తుని వాక్యము.

ఇచట 'గళితవర్ణమగుట గళితంబు' అను భాగమున కర్థము కుదురలేదు. లిఖితప్రతులలో నొకయెడ 'గళితవర్ణమైన కడితంబు' అని యున్నది. అదే తగిన పాఠము. అక్షరములు లేని యాకడితము (కాగితము వంటిది) పూవులులేని తోఁటతోను, చుక్కలు లేని యాకసముతోను బోల్పఁబడినది.

౧౪. క. "నిష్కారణముగఁ దన్ను బ
హిష్కారణము నొందఁజేయు నిల్వలవైరిన్
శుష్కీభూతకరణహృ
త్పుష్కరుఁడితఁడనఁగ నన్ను దూఱందగునే?"
(౫-౨౧౯)

తన కోరికచొప్పున గృహస్థుఁడు కాక, ఆజ్ఞోల్లంఘన మొనర్చిన యయుతు నగస్త్యుఁ డిలువెడలఁ గొట్టెను. అయుతుఁడు ఒకయెడఁ దపోనిష్ఠ నుండెను. ఇంద్రుఁడు కపటముని వేషమున నటుకుఁబోయి యయుతునిబుద్ధి మరల్పఁజూచెను. అప్పు డయుతుఁ డాడిన మాట లివి.

పయి ముద్రితపద్యమునకు క్రింది యర్థము తోఁచుచున్నది.

'ఇల్వలవైరి (అగస్త్యుఁడు) నన్ను కారణము లేక బహిష్కరించినాఁడు. అతఁడు కొంచెమైనను దయలేనివాఁడని నే ననఁగా నన్ను నిందించుట మీకు భావ్యమా?' అని.

(పద్యమున 'శుష్కీభూతకరణహృత్పుష్కరుఁ'డని యున్నది. కరణ-కు బదులు 'కరుణ' అని దిద్దుకొనక తీరదు.)

పయి యర్థము ఇచటఁ గుదురకపోదు. కాని అయుతుఁడు 'తా నగస్త్యుని నిందించితి' నని యొప్పుకొనుటయుఁ, జెప్పుటయు నౌచితికిఁ గొంత దూరములు. ఇచట వ్రాఁతప్రతులలో 'శుష్కీభూతకరుణహృత్పుష్కరుఁ డితఁడనక' అని పాఠాంతర మున్నది. అది ఎంతయు మేలైనది.

ఈ పాఠమును గ్రహించినచో 'కారణములేకయే తన్ను తఱిమివేసిన యగస్త్యుఁడు దయమాలిన కటిక గుండెవాఁ డని మీవంటి పెద్దలు అనవలసినమాట! అట్లు చేయక మీరు మీదుమిక్కిలి నన్నే నిందించుట న్యాయమా?' అనురీతి అర్థము చెప్పవచ్చును. ఇది యుచితము. 'బిగి వదలక' పలుకు నయుతుఁ డిట్లనుట పాడియేగదా!

౧౫. తే. "వనజనాభుని యభిషేకమునకె గాని
కనకగర్భాదులకుఁ బొందుకొనఁగరాని
తీర్థపుంజాంబునికరంబు తెలవపిండు
గబ్బిచనుజక్కవలచేతఁ గప్పఁబడియె"
(౫-౨౯౩)

'కన్యకుబ్జ'రాజపుత్రి చెలులతోఁగూడ వచ్చి నృసింహతీర్థకుండజలముల నావిలపఱచు సందర్భమున సీసపద్యము కలదు. ఇచట 'పాదుకొనఁగరాని', 'చనుజక్కవలచేతఁ గప్పఁబడియె' అనువాని యభిప్రాయ మేమో తెలియలేదు. టీకయందు 'పాదుకొనక = స్థిరముగా నిలువక. తెలవపిండు = స్త్రీలగుంపు. గబ్బి = గంభీరమయిన' అనిమాత్ర మున్నది.

పయి మూల, వ్యాఖ్యలనుబట్టి వచ్చు నర్థము సంగతము కాదు. కనకగర్భాదులకు ఈ తీర్థోదకము 'స్థిరముగా నిలువఁదగినది కాదు' మఱి కొంతకాలము నిలువఁదగిన దని అభిప్రాయమా? అంబునికరంబు నంతను చనుజక్కవలు కప్పివేసినవా? అట్లయిన పైనుండి చూచువారి కందు చనుజక్కవలే కాని జలము గోచరమే కాకయుండునేమో!

లిఖితప్రతులయం దొకదానిలో 'పాఁదుకొనఁగరాని'కి బదులు 'వాడుకొనఁగరాని' అనియు, 'కప్పఁబడియె' అనుదానికి బదులు 'కలఁపఁబడియె' అనియు పాఠములు కానవచ్చుచున్నవి. వీనింబట్టి 'ఆ తీర్థజలము విష్ణువునకేగాని, బ్రహ్మాదులకుఁగూడ వాడుకొన (ముట్ట) వీలుకాదనియు, అట్టిజలమును ఉవిదలు తమ చనుజక్కవలచేఁ గొట్టుచు కలఁచివేసిరనియు' నర్థము వచ్చుచున్నది. ఇదియే యుచితమని తోఁచుచున్నది.

ఇట్లు మచ్చునకు ఆశ్వాసమునకు మూఁడేసి యుదాహరణము లీయఁబడినవి. వ్యాసము పెరుగునను భావమున సీసపద్యముల నుదాహరింపలేదు.

పయి యంశములనుబట్టి ముద్రితప్రతులలోనే యిట్టి తప్పులు కలవనియు, వ్రాఁతప్రతులు శుద్ధము లనియు ననుకొనరాదు. వ్రాఁతప్రతులయందలి తప్పులు చిత్రవిచిత్రములు. అందలివి చాల ముద్రితప్రతుల కెక్కినవి. ఏప్రతులయం దున్న నేమి? గ్రంథములోని పద్యములలో సగమున కెక్కువగా ఏదో యొక తప్పును కలిగియే యున్నవి. పరిశీలనవలనఁగాని పాఠనిర్ణయము చేయ వీలుపడదు.

రామకృష్ణకవి స్వేచ్ఛావిహారి. కాన ఈప్రబంధమునఁ జాలచోట్ల ప్రయోగములు వ్యాకరణశృంఖలలను తెంచుకొని స్వేచ్ఛావిహార మొనర్చినవి. కొన్నియెడల చమత్కారములు కలవు. అవి గూఢములై మిక్కిలి పరిశ్రమించిననేగాని యవగతములు కాకున్నవి. కొన్ని లోకోక్తులు విచిత్రములై గూఢార్థవిలసితములై యున్నవి.



దాంపత్యమున కుజవరుణుల వైరము

❀

= శ్రీ రాళ్లపల్లి గోపాలకృష్ణమాచార్యులు =

వ్యక్తులకు పరస్పరము జనించు సౌమనస్యవైమనస్యాదిసంబంధములు పరస్పర జాతకములందలి గ్రహములకుఁ గల మిత్ర, శత్రు దృష్టి యోగములచే సంభవించు నని కనుగొంటిమి. ఈసందర్భమున గ్రహముల నైజగుణ స్వభావములు సయితము ముఖ్యముగ గమనించవలసి యున్నది. ఏలన, నైసర్గిక శుభగ్రహములకుఁ గలిగిన యానుకూల్యదృష్టి సంబంధము వ్యక్తుల పరస్పర మైత్రిప్రేమల కెంత యమూల్యమో, నైసర్గిక క్రూరగ్రహములకు సంభవించిన ప్రాతికూల్యదృష్టి వ్యక్తుల వైమనస్యద్వేషానూయల కంత ప్రాబల్యము నిచ్చును. సహజసౌమ్యులగు గురుచంద్రుల కన్యోన్యముగ వచ్చిన అమిత్రదృష్టిచే కలుగు ప్రాతికూల్యమునకుఁ గాని, నైసర్గిక పాపులగు రవి, కుజ, శని, వరుణులకు సంభవించు మిత్రదృష్టిచే వచ్చు నానుకూల్యమునకుఁగాని సామాన్యముగ హెచ్చు వెల కట్టుట యనవసరము. ఈవిషయమున మన ప్రాచీన జ్యోతిశ్శాస్త్ర కర్తల దృష్టియిది. సహజశుభగ్రహములకు వచ్చు సమసప్తక దృష్టియైనను, కేంద్రదృష్టియైనను స్పృహణీయమే అనియు, స్వాభావికక్రూరగ్రహములకు వచ్చు నన్యోన్యదృష్టి త్రికోణదృష్టియైనను, అర్ధకోణదృష్టియైనను దూష్య మనియు మన ప్రాచీనులు సామాన్యముగ (కొన్ని సందర్భములలో తప్ప) భావించిరి. అనఁగా, సహజశుభుల శత్రుదృష్టిచే ఘర్షణ రాదని కాని, సహజపాపుల మిత్రదృష్టిచే సుయోగ ముండదని కాని అర్థము కాదు. యోగ్యులయిన వారు కలహించినా రసవంతముగ, రుచికరముగ నుండు ననియు, క్రూరు లాలింగన మొనర్చినా కటువై విరస ప్రసక్తి కలుగు ననియు మన ప్రాచీనుల దృష్టి. వారిది కేవల రసతృష్ణ.

"అరసికజన భాషణాత్
రసికజనైస్సహ వరం కలహః,
లంబకుచాలింగనాత్
తికుచకుచాపాదతాడనం శ్రేయః"

అనుట వారి దృక్పథము. చాలవఱకు, సర్వవిషయములయందును వారికిఁ గల యాధ్యాత్మికదృష్టి యొక్కటి. పాపాత్ముని యింటి పండుగభోజనము కన్న సత్పురుషుని యింటి యంబలి యారోగ్య మనుట వారి సంప్రదాయము.

సారాంశ మేమన, గ్రహముల నైసర్గికస్వభావములకు తాత్కాలికదృష్టిగుణములతో ధర్మైక్యము సిద్ధించెనేని, తదనుసారముగా సత్ఫలమో, దుష్ఫలమో సమృద్ధిగా లభించు ననుట! గురుచంద్రశుక్రుల కన్యోన్యజాతకములలో పూర్ణమిత్రదృష్టి గల వ్యక్తులకు దర్శనమాత్రముననే సౌహార్ద్ర ముత్పన్నమై, క్రమక్రమముగ నది ప్రేమగా మారి, పరిస్థితుల యానుకూల్యము ననుసరించి శాశ్వతస్థాయీభావ మందఁగలదు. అట్లే రవి, కుజ, శని, వరుణగ్రహములకు జాతకములలో నన్యోన్యముగ శత్రుదృష్టి గల వ్యక్తులు పరస్పరసందర్శన సంబంధాదులచే నొకరి నొకరు ద్వేషించి, అసూయామాత్సర్యాదుల నలవరచుకొని, యోగ్యతానుసారముగ జన్మద్వేషమును సాధింతురు.

కాని, ఇట్టి గ్రహవైషమ్యములు గలవా రందరి జీవితములలో ఫలపరిమాణము సమానముగా నుండుట సంభవము కాదు. వైయక్తిక శక్తిసామర్థ్య పరికరాది సౌకర్యముల ననుసరించి ఫలపరిమితి మార్పుచెందును. జట్కాబండి తోలి జీవించువారి కిట్టి గ్రహస్పర్ధ కలిగెనేని, రైలుస్టేషనుముందు ప్రయాణికుల నెక్కించుకొను విషయమున పోటాపోటీ వచ్చి, క్షణకాలములో ముష్టియుద్ధముగ పరిణమించి, పోలీసుభటుని కటాక్షవీక్షణము గలిగెనేని, న్యాయస్థానమున నాలుగణాలో, నాలుగురూకలో జుల్మానాపడుటతో పరిసమాప్తిచెందును. అట్లుకాక, ఇట్టి గ్రహస్పర్ధ దేశములను పాలించు రాజులకే కల్గెనేని, అంతర్జాతీయ రాజనీతివ్యవస్థలలో వైమనస్యవైషమ్యములతో నారంభించి, అక్షౌహిణుల కొలది సేనానివహములకు మారణహోమము జరిగి, దేశములు సంక్షోభించునుగదా!

ఇంతే కాదు. పాపగ్రహములలో నయితము భిన్న స్వభావము లుండుకారణమున, వారి విషమ దృష్టులవలన జనించు దుష్టఫలపరిణామములలోఁగూడ భిన్న స్వభావము లేర్పడుచున్నవి. మచ్చున కొకటి రెండు దృష్టాంతములు.

కుజశనుల వైరసంబంధము సామాన్యముగ క్రమక్రమముగ నభివృద్ధినొంది (శనిధర్మ మిది) చిర కాలము వ్యాప్తిలో నుండఁగలదు. మహనీయుఁడగు మన పంచమజార్జిసార్వభౌముని జాతకమున శని (యోగ కారకుఁడు) వృశ్చికరాశిలో ౧౫-వ భాగలో నున్నాఁడు. జర్మనీ హిట్లరుజాతకమున కుజుఁడు వృషభ రాశిలో (మృత్యుస్థానమున) ౧౬-వ భాగలోఁ గలఁడు. ఈ రెండు గ్రహములకు జన్మకాలిక ప్రాతికూల్యదృష్టి (సమసప్తకము) పూర్ణముగ నున్నదిగదా! దీని ఫలమే సర్వప్రపంచము నూటాడించు నిప్పటి ఘోరమహా సంగ్రామము! దశాపరిపాకము ననుసరించి యుక్తకాల మున కిది వచ్చినది. కాని, దీనిలో నున్న యొక విశే షమును చదువరులు గమనించకపోరు. స్పర్ధ కలిగినది కుజశనులకుఁగదా? జ్యోతిషసంప్రదాయమున కుజుఁడు జ్ఞానవయోధర్మములలో నడుకారని అత్రిగాఁడు. ఊరి ముందరి పరుగులు, వెనుకముందు చూడని సాహసము, వివేకము నెఱుఁగని యుత్సాహము, నిర్దయతోటి హింసాతత్పరత—ఇవి వీని గుణములు. పరిపక్వమయిన తెలివి, ప్రపంచానుభవమువలని వివేకము, తొణకని నెమ్మదితో పనుల నిర్వహించు నోపిక, పట్టినపట్టు వదలని శక్తి—ఇవి శనైశ్చరుని ధర్మములు. ఈగ్రహముల సహజస్వభావములోఁ గల యీ తారతమ్యమును గమ నించితిమేని, వీరి వైరమునఁ గలిగిన యుద్ధ మీ ప్రపంచమున నేమార్గమున నడచుచు, నేపరిణామమును గాంచుచున్నదో, కార్యకారణసమన్వయమగును. విశేష మేమన, కుజగోళపు ఘనపరిమాణముకంటె శనిగ్రహగోళఘనపరిమాణము ౫౦౦౦ అంతలు గొప్ప దఁట! ఖగోళమండలి యీగ్రహధర్మవిశేషము మిత్ర మండలివారి శత్రుజిగీషాకుతూహలమున కెంత సాహా య్యకారియో చదువరు లూహింపఁగలరు.

ఇఁక, కుజవరుణుల వైరములో నొక వైలక్ష ణ్య మున్నది. ఉడుకారని యోధ కుజుఁడు; నిరం కుశాధికారి యగు చండశాసనుఁడు వరుణుఁడు. శని కున్న నెమ్మది, ఓర్పు వీనికి లేవు. ఈ యిరువురి వైరము హఠాత్తుగ ఫలోన్ముఖమై పిడుగువలె ప్రమాద కరముగ పనిచేయఁగలదు. వాస్తవజీవితచరిత్రలో నెన్ని యో ఉదాహరణముల మనము కనుఁగొనవచ్చును. వివాహాది శుభకార్యావసరములందో, సాంఘికసమా వేశముల యాలమునందో పలువు రొకచోట చేరిన సందర్భములలో నాకస్మికముగ వారిలోఁ గొందరికి స్పర్ధలు, వైషమ్యములు, మెడపట్లు సంభవించుట మన మపుడపుడు చూచుచున్నారము. అట్టివారి జాత కములను సంపాదించి పరిశీలించినచో, వారి పరస్పర జన్మకాలికగ్రహవైరదృష్టివలని ఫల మిది యని సులభ ముగ బోధపడఁగలదు. నామిత్రులలో పరస్పర బంధువు లగు నిరువురికి కుజవరుణవైర మున్నది. ఒకరి కుజుఁడు మేషరాశి ౧౬-వ భాగలో నుండఁగా, రెండవయాతని వరుణుఁడు తులారాశిలో ౧౮-వ భాగయం దున్నాఁడు. వీరిరువురికిని నిష్కారణవైమనస్యము హఠాత్తుగ జనిం చినది. ఒకరు వెళ్ళిన గ్రామమునకు రెండవయాతఁడు వెళ్ళుటనయితే మిష్టములేని మనస్థితిలో వీరిపుడున్నా రని చెప్పినచో నీగ్రహవైరపు విలువను చదువరు లూహించుకోఁగలరు.

అన్యోన్యజన్మకాలికగ్రహముల శత్రుదృష్టి చే పురుషులలో పురుషులకే యిట్టి ఫలములు కలుగుచుం డఁగా, దాంపత్యధర్మమున ఆజన్మావధిగ నొకరినొక రాశ్రయించి అన్యోన్యప్రేమానుబంధమున బ్రతుకవల సిన వధూవరుల విషయమున నిట్టి క్రూరగ్రహముల విషమస్థితి ఎంతటి ప్రమాదకారియో వేరుగ విన్న వించుట యనవసరము. కుజశనుల సమసప్తకశత్రుదృష్టి పరస్పరజాతకములలోఁ గల దంపతుల జీవితపరిణామ మును గూర్చి కడచిన వ్యాసమున విన్నవించితిని. కుజ వరుణుల పరస్పర శత్రుదృష్టి కల దాంపత్యజీవితము నొకదాని నిపు డుదాహరింతును.

ప్రక్క పుటలో నున్నవి భార్యాభర్తల సాయన జాతకచక్రములు.

పొంతనములు చూచినచో నీదంపతులకు (ఉత్త రా, పూర్వఫల్గునీ నక్షత్రములకు) ౩౬ టికి ౨౩ గుణ

ములు వచ్చుచున్నవి. అనఁగా, నూటికి ౭౮ వంతున వచ్చినవనుట!

<table>
<tr><td>X ౮</td><td></td><td>కే ౧౮-౪౬</td><td>I ౧౬</td></tr>
<tr><td rowspan="2">శ ౧౦-౨౬
(వ)
గు౩-౨౧
(వ)</td><td colspan="2" rowspan="2">స్త్రీ జాతకము
—
(సాయనము)
—
ఉత్తర (౨)
—</td><td>ఇ ౦-౫౧</td></tr>
<tr><td>బు౧౨-౦
ర ౨౩-౧౬</td></tr>
<tr><td>ర ౧౫-౫౮
(వ)</td><td>రా౧౮-౪౬</td><td>కు ౨౦-౨౫</td><td>శు ౨౧-౫౮
చ౨౩-౧౯</td></tr>
</table>

<table>
<tr><td>I ౧౨
ర ౦-౭</td><td>కు ౧౬-౪౩</td><td></td><td>శు ౧౮-౨౮
ఇ ౨౮-౩౨
(వ)</td></tr>
<tr><td>రా౧౪-౩౫
బు ౩-౫౫</td><td colspan="2" rowspan="2">పురుష జాతకము
—
(సాయనము)
—
పూర్వ ఫల్గుని (౩)
—</td><td></td></tr>
<tr><td></td><td>కే ౧౪-౩౫</td></tr>
<tr><td>X౧౬-౩౦
శ ౦-౨౭</td><td>ర ౨౭-౫౯</td><td></td><td>గు ౫-౫౬
(వ)
చ౧౪-౨౧</td></tr>
</table>

భార్య మంచి రూపలావణ్యములు గలది. (కేంద్రములో నున్నవారు శుక్రచంద్రులు). లగ్నాధిపతి (బుధుఁడు) సౌందర్యమునకు పేరుగాంచిన సింహరాశిలో కటకనవాంశలో నున్నాఁడు. ఉపజ్ఞతో కూడిన చాతుర్య మీమెకుఁ గలదు. (బుధునిపై వరుణునికి పూర్ణ త్రికోణదృష్టి). బీదకుటుంబమైననేమి, మంచి ఆభిజాత్యము గలవారు తల్లిదండ్రులు. (దశమాధిపతియగు బృహస్పతి మకరమున దుర్బలుఁడైనాఁడు) విషయసుఖకాంక్ష యధికముగ కలదని శుక్రక్షేత్రమున పంచమభావములో నున్న కుజుఁడు సూచించును. సౌకుమార్యము గల దేహము, స్నిగ్ధమగు హృదయము, భోగలాలసత చంద్రశుక్రసంయోగ మిచ్చినది. లగ్నాధిపతితోఁ గూడ విక్రమభావమున ప్రబలుఁడుగ నున్న రవి స్థైర్యసాహసములతోడి చాకచక్యము నీయఁగలఁడు. సప్తమాధిపతి గురువు దుర్బలుఁడగుటేకాక, శని సంయోగము, ఇంద్రుని సమసప్తకదృష్టి, అష్టమస్థానస్థితి వానికిఁ గలవు. భర్తృస్థానమున నైచ్య మున్నదనియు, వైవాహికజీవిత మతృప్తికరమనియు ఇవి సూచించును. పైఁగా, కుజబుధులచే కలిగిన ధురుధరాయోగ మున్నది. దీని ఫలము సారావళి యిట్లు వర్ణించుచున్నది:

"అనృతికో, బహువిత్తః,
నిపుణో, తీక్ష్ణో, ధీరో, లుబ్ధః,
వృద్ధాఽసతీప్రసక్తః,
కులాగ్రణీ, శ్చశని భౌమబుధమధ్యే"

పయి గ్రహస్థితులవలన నీజాతకము దోషయుక్తమని చెప్పుట నా ఆశయము కాదు. దోషమే లేని జాతకముకాని, వ్యక్తికాని సామాన్యముగ సృష్టిక్రమములో కానరాదనుట యనుభవసిద్ధము. ఆశ్రమవాసమున గౌరవము దెచ్చు తాపసధర్మము, ఆహవరంగమున బిరుదులు వడయు సైనికధర్మము ఇవి స్థానములు తారుమారైనచో దోషములుగా పరిగణింపఁబడునుగదా? క్షణకాలమైనను భర్తృవిరహము నోర్వలేని కోమలహృదయయగు పతివ్రత భోగలాలసుఁడగు పనిపాటలు లేని జమీందారునికి తగునుగాని అశ్వారూఢుఁడై ఆయోధనరంగమున సేనానివహముల నడుపవలసిన దండనాయకునకుఁ దగునా? అంటిన కందు కుసుమార దేహము సాంసారికాకల్పము వదలు నవసరము లేని యంతఃపుర కాంతారత్నములకు శ్లాఘ్యమగు గుణమగు నేమోకాని, మిట్టమధ్యాహ్నమున మంటిగంపలు మోసి నాపటివేళ భుక్తికి సంపాదించవలసిన యొడ్డెపకులముకు తీరరాని దోషముగా పరిణమించును గదా? ఇట్టి దృష్టాంతములలో గుణదోషనిర్ణయము చేయవలసివచ్చినపుడు, ఏపరిస్థితులలో నేగుణము రాణించునో, దాని కాపరిస్థితులు లభించినానే శోభించు

ననియు, భిన్నపరిస్థితులు సిద్ధించినపుడు ఆగుణమే కళంకముగా మారుననియు మనము గమనించకతప్పదు.

"తమతమ నెలవులు తప్పిన
తమ మిత్రులె శత్రులగుట తథ్యము సుమతీ"

అను భద్రభూపాలుని నీతి వ్యక్తులకే కాదు-గుణములకు సయితము చెల్లును.

చెప్పవచ్చిన దేమన, చక్కని రూపలావణ్యములు, ముగ్ధమధురమైన సౌకుమార్యము, నవనవోన్మేషమగు విషయవాంఛ, మంచి వాకచక్యము, ముందంజవేయు ధైర్యసాహసములు, ప్రతిభాయుతమైన చాతుర్యము, అపారమగు స్వాతంత్ర్యప్రీతి—ఈగుణసమామ్నాయము గల తరుణి ఏ పరిస్థితులలో వన్నెకెక్కునో, అట్టి సౌకర్యములు లభించని నాఁడీ గుణముల పరిణామ మేమగునో ఊహించుకొనఁగలిగితేని, చదువరులు "ఆరోగ్య పాప"మనఁగలరు. రాజ్యకార్య నిర్వహణదక్షత లేక, అంతఃపురము విడిచి వెలువడు నభ్యాసము నలవరచుకొనక, సమర్థురాలగు భార్యకు సర్వాధికారము నప్పగించుటకు సిద్ధుఁడై, ఘోషాపద్ధతిపై నభిమానము లేని సుందరపురుషుఁడగు నొక చిన్న జమీందారుఁ డీజాతకురాలిని భార్యగా వరించియుండె ననుకొందము! ఆమెగుణములన్నియు నపుడు స్పృహణీయములై వన్నెకెక్కియుండు ననుట కెవరు సంశయింపఁగలరు?

భర్తజాతకము నించుక గమనింతము. నిండుకుండలో పడిన నిప్పువలె మీనరాశిలో నున్న పురుషజాతకపు రవియొక్క కాంతితో, సింహరాశిలో నిరర్గళముగ వెలుఁగుచున్న స్త్రీజాతకపు రవితేజస్సును పోల్చిచూడుఁడు! అర్ధకోణమిత్రదృష్టితో స్త్రీజాతకమున కుజుఁడు రవి కుత్తేజన మిచ్చుచుండఁగా, పురుషజాతకపు రవి శనితో కేంద్రశత్రుదృష్టిని బొంది స్తబ్ధత వహించినాఁడు. పైఁగా వరుణునితో సైతము కేంద్రస్థితి యొకటి కలదు. బుద్ధికారకుఁడగు బుధుఁడు లగ్నాధిపతియై స్త్రీజాతకమున విక్రమస్థానమున పరాక్రమించుచుండఁగా, పురుషజాతకమునందలి బుధుఁడు వ్యయస్థానము చేరినాఁడు. "సుఖము, భోగము" అని భార్యజాతకమున గృహ (వాల్గింట)స్థానమున చంద్రశుక్రు లవిశ్లిష్టులైయుండఁగా, "నాయింట సుఖము శూన్యము; స్వాతంత్ర్యము సున్న; ఉన్నదంతా క్లేశమే" అని భర్తజాతకమున వాల్గింట (భార్యజాతకపు చంద్రశుక్రులకు కేంద్రములో) నున్న కుజుఁడు టముటమ వేయుచున్నాఁడు. వాల్గింటి కుజానికి పారావళి చెప్పిన ఫల మిది:—

"బంధుపరిచ్ఛదరహితో
భవతి చతుష్పథవాహనవిహీనః
అతిదుఃఖై స్సంతప్తః
పరగృహవాసీ భవే త్పురుషః"

స్త్రీజాతకమున శుక్రుఁడు (సౌఖ్యకారకుఁడు) చేరి యొకచేత రవికుజులను సవరించుచు వారి సరిమధ్యమున గంభీరముగ నిలచి గర్వించుచుండఁగా, పురుషజాతకమందలి శుక్రుఁడు రవినుండి అర్ధకేంద్రదృష్టివలనను, శనినుండి సార్ధకేంద్రదృష్టివలనను భిన్నుఁడై తరుణులలో శృంగారరసమునకుమారు కరుణారసము ముద్బోధించుటకే తగియున్నాఁడు! ఎక్కడి కెక్కడి తారతమ్యము!!

పోనిండు. స్త్రీపురుషజాతకములందలి రవిచంద్రులకు (ఖగోళమునందలి సనాతనదంపతులకు) పరస్పరముగ మిత్రదృష్టియోగ మున్నచో, భార్యాభర్తల కన్యోన్యముగ భక్తికుదురును. అట్లే, శుక్రకుజులకు (ఖగోళమందలి కాముకీకాముకులకు) పరస్పరముగ నట్టి సంబంధ మలవడెనేని వారికి చక్కని రక్తియబ్బును. లగ్నములకు పరస్పరకోణార్ధకోణ సంబంధముండెనేని సఖ్యధర్మములలవడును. (ఇరువురి లగ్నములు వాయ్వగ్ని రాసులలోనో, భూజలరాసులలోనో యుండును కనుక.)

ప్రశంసలో నున్న స్త్రీపురుషుల జాతకములలో నివి యేవియును కావరావు. రవిచంద్రులకా ఔదాసీన్యము; కుజశుక్రులకా ద్వేషము; లగ్నములకా ప్రాతికూల్యము! ఇంతే కాదు! భర్తచంద్రునికి భార్యవరుణుఁడు కేంద్రము; భర్తశుక్రునికి భార్యశని కేంద్రము. కాక, భర్తజాతకపు కుజునితో భార్యజాతకమునందలి వరుణుఁడు సమసప్తకమున నిలిచి యుద్ధము చేయుచుండుట మనము ముఖ్యముగ గమనింపవలసియున్న యోగ

ము! అన్ని యోగములలో నిదియే మేరుపుష్ప! ఇట్టి యాకర్షణలతో దంపతులయిన స్త్రీ పురుషు లొక యింట కాపురము చేయఁగలరా, వైవాహిక సంబంధమును నిలుపుకొని నిర్వహింపఁగలరా? స్వప్నవార్త!

స్త్రీజాతకమునందలి లగ్నము జినవర్ష దశాపద్ధతితో చలించి మూర్ధాపయున్న నాటీనాఁటక మున్నే సప్తమాధిపతి (గురువు)తో వైరము సాధించుచున్న మాయలమారి ఇంద్రుని సంయోగ మందఁగలదు. ఇదియే యీ నాటకమునకు నాంది. మోసము, ద్రోహచింతన, వంశాచార ద్వేషము, ధర్మనాశనము ఇత్యాదిదుష్ఫలములు ఇంద్రగురువుల ద్వేషముగల దశలో కలుగునని పాశ్చాత్యజ్యోతిష శాస్త్రజ్ఞుల మతము. గురువుల నవమానించి ఇంద్రపట్టములో నున్న నహుషుఁ డేమిగతి పట్టెనో చదువరులు జ్ఞప్తికిఁ దెచ్చుకొన్నచో, ఈదశలోని పూర్వరంగ పశ్చిమ రంగములకుఁ గల సంబంధము వ్యక్తమగును. మధ్యావస్థారంభములోనే (పందొమ్మిదిసంవత్సరముల ప్రాయమందే) చలితరవి భర్తృస్థానమందున్న వరుణునికి సరిగా కేంద్రదృష్టిపాలగుట లేటస్థించుచున్నది. ఇంతటితో దాంపత్యజీవితమున కళనిపాతము రావలసిన దేకదా? అట్లే వచ్చినది. తరువాత నారేండ్ల కాలములో—అనఁగా, ప్రౌఢావస్థయారంభములో—చలితలగ్నము జన్మకాలికశని కెదురురాఁగలదు. ఈ నాటకమున కిది భరతవాక్యము. అటుమీఁద నీమె జీవిత మేపోకడలలో పోయినదో వర్ణించుట యనవసరము. దుస్సాధ్యముకూడ! పర్వతసానువులపై నమర్చిన యినుపపట్టాలపై గంట కరువదిమైళ్ల వేగమున నుచ్ఛృంఖలముగ పరుగెత్తుచున్న పొగబండి దారితప్పి పోని, ఎంతలోతునకు దిగి, ఏయగాధగర్తములో పడి, ఏ యంధకారములో మునిఁగి, యేమగునో ఎవరు చెప్పఁగలరు?

మన వేమన చెప్పిన నీతులలో నిది యొకటి:—

"పరగ చెట్టఁబట్టి పాలింపకుండినా
వెలగు దాటి, వీథి వెడలఁబారు
ఆఁడుదాని చిత్త మటువలె నుండురా
విశ్వదాభిరామ వినర వేమ"

ఇట్లనుటచే భర్తది లోప మనుట న్యాయమని యనుకొనరాదు. లోపము భార్యయందుకాని, భర్తయందుకాని లేదనుకొనుటే సమంజసము. విషమతత్త్వములు గల వీరి వివాహమునకలని విపరీతపరిణామమిది. పసుపునీటిలో సున్నము కలిపినచో రక్తికట్టును కాని, పాషాణము కలిపి వసంత మేల కాలేదన్నచో అది కలిపినవారి బుద్ధిలోపమా, పసుపుపాషాణముల గుణలోపమా?

పోనిండు. జాతకురాలితో కాపురము చాలించుకొన్న తరువాత పురుషుఁడు రెండవ వివాహమున నొక వధువును సంపాదించుకొనెను. ఆమెజాతక మీక్రింద నున్నది:—

	శ ౮-౧౩ చ ౭-౮౫	X ౯	రా ౨౭-౮
	రెండవభార్య జాతకము — (సాయనము) — ఉత్తరాభాద్ర		ఇ ౧౪-౩
ల౧౩-౮౫			I ౯
కే ౨౭-౮	ర ౧౨-౫౪	కు ౨-౮౨ శు ౧౪-౬ బు ౨౪-౫౪	గు ౧౦-౪

పొంతనములలో నీభార్యాభర్తలకు ౩౬ టికి ౧౫ మాత్రమే గుణములు వచ్చినవి. పాపము!

లగ్నము సింహము. గాంభీర్యౌదార్యములు సహజముగ నున్నవి. లగ్నాధిపతి రవి వృశ్చికరాశిలో నుండి గురువునుండి మిత్రదృష్టికి పాత్రుఁడగుటచే మంచి ఫల మున్నది.

"భూరిద్రవిణో దాతా
నృపమంత్రీ దండనాయకోవాపి
తరణౌ సురగురుదృష్టే
కుజభవనే జాయతే శ్రేష్ఠః" అని పారావళి.

కాక, ఈ లగ్నాధిపతికి చతుర్థకేంద్రస్థితి అభిజాత్యము, శీలము తెలుపును. ధనస్థానమున లగ్నాధి

పతికి లాభస్థానములో నున్న బృహస్పతి సంపత్తును సూచించుచున్నాఁడు. తృతీయాధిపతి శుక్రుఁడు తృతీయమందే స్వక్షేత్రమున (తులారాశిలో) నుండుట విద్య, శీలము, దైవభక్తి, గృహావసతి వీనినిచ్చును.

"ఆఢ్య స్సురుచిరభోగో
ద్విజదేవార్చనవిలబ్ధకీర్తిశ్చ,
శుక్రే తులాధరగతే
భవతి పుమాన్ పండిత స్సుభగః" (సారావళి)

"సహజే సహజేశ్వరే ధనీ
బహుధా విక్రమవాన్ యుత స్సుఖైః
సుఖ మిహాప్నోతి మశ్నుతే సదా
పరమానందితమంజుమందిరః" (సంకేతనిధి)

కాని, భర్తృస్థానాధిపతి (శని) నీచత్వము పాలయినాఁడు. శుక్రునికి (సుఖకారకునికి) సమసప్తక శత్రుదృష్టిలో నీశని యుండుటచే, భర్తనుండి యీమె సౌఖ్యమునకు కొదవయే! మనఃకారకుఁడగు చంద్రుఁడీశనితో కూడి ధర్మస్థానమం దుండుటచే నీకారణమున మనఃక్లేశ మనుభవించుటయు, విరక్తిఁదెచ్చుకొనుటయు తప్పినవి కావు. కాక రవి నాల్గింటనుండు కారణమున మనస్సునకు నెమ్మది యుండదు. కాని, లగ్నాధిపతిపై గురువునకుఁగల మిత్రదృష్టి వివేకవతి యీమె యని తెలుపును.

ఇఁక, భార్యాభర్తల జాతకములను పోల్చి చూతము. ఈసాధ్వి జాతకమందలి రవి భర్తృజాతకపు చంద్రునితో అర్థకోణమిత్రదృష్టిలో నుండుటచే నీవైవాహికసంబంధమున భక్తి ప్రధాన మని సూచించును. దురదృష్టవశమున కుజశుక్రులకుమాత్రము స్నేహబంధము కుదురలేదు. పురుషలగ్నమునకు స్త్రీలగ్న ముపచయస్థానమగుటచే వివాహమునుండి భర్త యభివృద్ధినే తెలుపును. కాక, భార్యనుండి భర్తకు సేవా సౌకర్యము సమృద్ధిగా లభింపఁగలదు. భర్తజాతకమున కళత్రస్థానములో నున్న చంద్రునిపై భార్యజాతకమున ధనస్థానమున నున్న బృహస్పతి వచ్చుటచే, భర్తకీమెనుండి సత్సంతానప్రాప్తియు, భాగ్యాభివృద్ధియు కలుగుట సిద్ధించినది.

భర్తృస్థానాధిపతికి నైచ్యప్రాప్తియను ధర్మము ఇరువురు భార్యల జాతకములందును సమానముగా నున్నది. మంచివో చెడ్డవో భర్తగారి శీలస్వభావముల నిరువురును సమానముగా రుచిచూచినవారే. కాని, పరిణామములోమాత్రము హస్తిమశకాంతర తారతమ్యమున్నది. భక్తి, రక్తి, ఆనుకూల్యము లేనిది ప్రథమ జాయ; రక్తి లేకున్నను ఆనుకూల్యముతోడి భక్తి నలవరచుకొన్నది ద్వితీయ. ఉచ్ఛృంఖలమయిన విషయవాంఛకు లోనయి వివేకమును గోలుపోయినది ప్రథమ; వివేకవతియగుటచే వాంఛల నణఁచుకొని విరక్తి తెచ్చుకొన్నది ద్వితీయ. స్వేచ్ఛాప్రవర్తనమునందలి సుఖమున కువిళ్లూరినది ప్రథమ; ధర్మమునకు కట్టుబడి నిగ్రహము చూపినది ద్వితీయ. ఈ తారతమ్యమునకు తగినట్లే యున్నవి వారి జీవితములు.

సత్సహవాసముతోడి విద్యావివేకములు, ఇంద్రియనిగ్రహముతోడి ధర్మశీలత, సాధువర్తనముతోడి దైవభక్తి ఈగుణములు భర్తయందు సమృద్ధిగా లభించి యుండినచో నీ రెండవభార్యజాతకమందలి సహజ ధర్మము లెంత బాగుగ ప్రకాశించియుండెడివో కదా!

నాటి కరువదినాల్గవంతున పొంతనములలో గుణములను మూటకట్టుకొని పరీక్షలో ప్రథమకక్ష్యలో నుత్తీర్ణురాలయి గౌరవము నార్జించినది మొదటి భార్య. రెండవభార్య యీపరీక్షలో పరాజయము నే పొందినదనక తీరదు. మఱి, వారి వైవాహికజీవితములలోఁ గల తారతమ్య మిపుడు చదువరు లెరుంగుదురు. సౌహార్దము మనస్సునకు చెందినదగుటచే వధూవరుల చంద్రరాసులకుమాత్రము పొంతనములు కుదిరినచో చాలు ననువా రీవాస్తవజీవితచరిత్రయందలి సత్యము నన్వేషింతురుగాక. సంసారమునకు స్వస్తిచెప్పి సాగిపోయిన ప్రథమభార్యకా, లేక సాధుశీలముతో మనస్సును స్వాధీనములో నుంచుకొని సంసారమును గట్టెక్కించుచున్న ద్వితీయభార్యకా సౌహార్ద్రము కుదురుట?

"నక్షత్రమాత్ర మేవాత్ర
జ్ఞాత్వా కార్యంతు మధ్యమం"

అను గర్గవాక్యమున కెంత వెల యున్నదో, పాఠకమహాశయులిపుడు గమనింపక పోరని నా నమ్మకము.

మొక్కుబడి

[చిన్నకథ]

= శ్రీ చాగంటి సోమయాజులు =

"ఈపొద్దు గోడపని ఐపోతాది. ఇయేళ ప్లీడరు బాబు డబ్బు ఇచ్చేస్తారు" అని మధ్యాహ్నం అంబలి తాగుతూ పైడితల్లి పెళ్లాంతో చెప్పేడు.

ప్లీడరుగారి దొడ్డిగోడ కంట్రాక్టుగా కట్టడానికి పైడితల్లి ఒప్పుకున్నాడు. చెప్పుకో తగ్గ పనివాడు. అవలీలగా పని పూర్తిచేశాడు. మేస్త్రీలకీ, కూలీలకీ పోను పదిపదిహేను రూపాయలు మిగులుతాయి.

డబ్బు అందుతుం దనగానే అంకి మొహం విప్పారింది. వాళ్ల గుడిసె ఎప్పుడూ పూటభత్యం, పుల్లవెలుగూ, అలాగ కాకుండా ఈమారు పదిరూపాయిల సొమ్ము ఒక్కసారి చేతిలో పడుతుంది. అంకికి ఊహాలు, ఉద్దేశాలూ ఎన్నెనా ఉన్నాయి.

అంకి ఆలోచించింది. సంసారానికి కావలసినవి ఎన్నో ఉన్నాయి. మంచినీళ్ల కడవ కొనాలి. అమ్మవారి పండుక్కి నలుగురు చుట్టాలొస్తే ఆటొచ్చే దాకలు కొనాలి. చలికాలం కప్పుకోడానికి పచ్చడం కొనాలి. పిల్లడికి మాయవెండిసరుకులు కొనాలి. ఇంకెన్నో ఆలోచించింది. ఆఖరుకి "ఈపాలి కొండెక్కాలి" అని మొగుడితో చెప్పింది.

"కోయింటోడి బాకీ పదిరూపాయిలు ఆడి కియ్యకపోతే ఆడు పిలక జాడిస్తాడు" అన్నాడు పైడితల్లి.

"కోయింటోడి బాకీ రెండురూపాయిలే. ఎనాళ్లైనా తీర్సొచ్చు."

"పదిరూపాయిలని నువ్వే సెప్పినావు!"

"ఔను, పదిరూపాయిలే. మొన్న మాయమ్మొచ్చి ఎనిమిది రూపాయిలు సేతులెట్టింది. కోక కొనుక్కోయే అంది. కోయింటోడి కిచ్చీసినాను."

"నాకు సెప్పకుండా ఆడి కెందు కిచ్చీసినావు?"

"ఆ డక్షమైన మాటలూ అంటే వాళ్లు మండి ఇచ్చీసినాను".

"నాతో సెప్పవలసింది."

"ఎందుకూ?"

"నాను సారావోడికి రెండురూపాయిలు బాకీ."

"ఆమాట సెప్పితే ఇవ్వకపోదునా! ఓలమ్మ కొడక, ఏటో అనుకొన్నాను. ఇంకా కోక తెద్దు నంటా డనుకొన్నాను! సారావోడికా! మాపుట్టింటో రిచ్చిందీ తాగీదా మనుకొన్నావా?"

"తాక్కాడ దేటి?"

"తాగుదువుగాని. ఈపాలి కొండెక్కాలి. ఎర్రులకి పోకు" అన్నాడి.

పైడితల్లి గణింపు మంచిదే. రోజుకి ఒకటి రెండు రూపాయిలు తెస్తాడు. కాని తాగేస్తాడు. అతనికి కల్లు తాగడం తప్పని సరి. సారా తాగడం గొప్ప. తాగగా మిగిలిన డబ్బులు పెళ్లాంకి సంసారంకింద ఖర్చుపెట్టమని ఇచ్చేస్తాడు. అంకి సంసారాన్ని పొదుపుచేసి, వెయ్యి కూడికలు చేసి అందులోనే మొగుడికి తెలియకుండా పావలా, బేడా వెనకేసి డబ్బు చేస్తుంది. పుట్టింటిపేరు చెప్పి సమయాసమయాల్లో సంసారానికే ఖర్చు పెడుతుంది. ఆ బాపతు డబ్బుతో కోమటి బాకీ తీర్చేసింది.

"ఇంకా అంబలి కాలేదురా?" అంటూ అసిరిగాడు లోపల కొచ్చాడు.

"ఓ రుంగ్రడ వొస్తాను" అన్నాడు పైడితల్లి. ఉన్న అంబలంతా జుర్రేసి గట్టిగా తేన్చి లేచాడు.

గుడ్డ ఉయ్యాల్లో వెచ్చగా పడుకొని నిద్రపోతున్న పిల్లడు "ఎఎం" అంటూ లేచాడు. అసిరిగాడు ఉయ్యాల్లోంచి నల్ల గుమ్మడికాయలాంటి పిల్లణ్ణి తీసి ఎత్తుకున్నాడు. పిల్లడు కిరకిర కొట్టుకుంటూ గుక్కపెట్టి ఏడ్చాడు.

"అరే చిమాద్దిరీ, నాకాడికి రావా?" అంటూ పెద్దచప్పుడుతో అసిరిగాడు ముద్దెట్టుకున్నాడు.

"ఓ రసిరిగ, కురుపు రేపేసినావురా. ఇలా తే పిల్లాణ్ణి" అని అందుకుంది అంకి.

"కురు పెక్కడ?" అన్నాడు అసిరిగాడు.

"మొన్న నొద్దంటూ ఉంటే ఆనస పెట్టగు టీకాలు పొడిచీసినాడు. జొర మీా పొద్దే తగ్గినాది. రాత్రిళ్లు బాధబాధ సచ్చిపోతున్నాము."

అసిరిగాడు టీకాలు చూశాడు.

"ఇంకా మొగ్గరంగా ఉన్నాయి. పసుపెట్టు. మావోడికి నిరుడావిటికి టీకాలేయించినాము" అన్నాడు.

"ఔనుగాని అసిరిగా, మొన్న సొసన మొచ్చింది. అదెవరో అట. ఎందుకొచ్చి నావు కావు అనడిగినాడు. తెలివొచ్చి పరకాయించి చూస్తే ఏటీ నేదు. గుండె జల్లుమంది. మావోళ్ల నడిగితే చిమాద్దిరప్పన్న అన్నారు. అదేటో నీకు తెలుసా?"

"మొక్కుకున్నా రేటి?"

"కుర్రాడికి బాగునేకపోతే మొక్కుకున్నాము కాదా?"

"ఐతే ఇకనేం? ఎల్లండి ఎంటనే. దేముడితో పరాచికాలు కాదు. ఈపొద్దు పైడితల్లి పదేను రూపాయిలు పుచ్చుకొంటాడు"

పైడితల్లి పొగాకుబొండాం విప్పి చుట్టలు చుట్టుకొంటున్నాడు.

"నీకేం కబుర్లు సెపతావు. ఆరు రూపాయిలు ఖరుసవుతుంది. ఎట్టుకోవొద్దా?" అన్నాడు పైడితల్లి.

"పదేను రూపాయిలొస్తే ఆరురూపాయి లెట్టుకోలేవా?" అన్నాడు అసిరిగాడు.

"అంతా అగ్గిమీాద గుగ్గిలమేసేవోళ్లే. అది మొక్కుకోడ మెలాగుందో నువ్వెళ్లమండ మలాగుంది." అన్నాడు పైడితల్లి.

"లెంపలోయించుకో! దేముడితో పరాచికాలు కాదు" అన్నాది అంకి.

"లెంపలోయించుకోనా? ఇదిగో వోయించుకున్నాను. సరా? పిల్లడికేటీ నేదురా. రెండు తుమ్ములు తుమ్మినాడు. సరి మొక్కేసింది. ఇనాగైతే ఎవడి తరం? దేముడితో పని. తప్ప దెల్లాలి." అన్నాడు పైడితల్లి.

గుర్రెడుతూ అంకి గుండెలమీద పిల్లడు నిద్దరపోయాడు.

"నిద్దరొచ్చిందా? అమ్మా, నీకు నిద్దరొచ్చిందా? మా బాబు రేపు చిమాచెలం ఎళతారేటి? కొండ ఎక్కుతారేటి? అబ్బో అబ్బో! ఈ బాబు రెయ్యిలుబండి ఎక్కుతారా? రెయ్యిలుబండి ఝుఫ్‌ఝుఫ్" అంటూ పిల్లణ్ణి మళ్లా అంకి ఉయ్యాల్లో పడుకోపెట్టింది.

చుట్టలు చుట్టుకుని పైడితల్లి లేచి మూరు మీది తాపీ తీశాడు. అసిరిగాడు చెవులో చుట్ట తీసి నోట్లో పెట్టి జేబులో అగ్గిపెట్టి తీశాడు.

"మామా చూడు. అసిరిగోడు అగ్గిపెట్టి తీసినాడు" అన్నాది అంకి.

అసిరిగాడు పుల్ల తీసి వెలిగించబోయాడు.

"ఎలిగించ కుండు. కుంపట్లో అగ్గినివ్వుండగా అగ్గిపెట్టె తీసినాడు! ఊరకొచ్చిందిరా అగ్గిపెట్టి? కొంప లినాగే కూలిపోడం" అని కుంపట్లోంచి అగ్గితొర తీసిఇచ్చింది.

"అంకీ, కేత్రికి సేప లొట్టుకురా" అన్నాడు పైడితల్లి.

"ఇయేళ సేపలు కొనాలా? నావొల్ల కాదు బాబూ ఈసంసారం. నిన్న పావలా డబ్బు లిచ్చినావు. బియ్యమేటి తెమ్మన్నావు? కూరేటి తెమ్మన్నావు? ఈపొద్దు సేప లెక్కణ్ణుంచి తెమ్మన్నావు?" అంది అంకి.

"ఓ లెవడికాడేనా ఉచ్చుకోయే" అన్నాడు పైడితల్లి.

"ఉచ్చుకోనా? అప్పుచేసి కొప్పునవరం. ఈపొద్దు గోగాకుపులుసుకి గతి నేదు"

"సందవేళ నానే బజారు కెల్లి నవల్లు తెస్తాను"

"నువ్వేటీ తేవొద్దు. డబ్బంతా నా సేతు లెట్టకపో నీపని సెపతాను. నవల్లా తెస్తావు, వొంజిరంముక్కలూ తెస్తావు!"

మేస్త్రీలు వెల్లిపోయారు. తాపీగా రెండుగంటలు కూచుని అంబలి తిని అంకి పడుకుంది. లేచేసరికి సూర్యుడు వాలిపోయాడు. రోడ్లనిండా వసంతంలాగ ఎండ వాలికింది. బియ్యపుచీటీ తీసి, బుట్ట తీసి, చంకలో పిల్లాణ్ణేసుకుని బజారుకి వెల్లింది. ఉప్పుగర్ర, మిరపకాయ, చేపా కెల్లా కొంది. కాణీ కొబ్బరుంక కొని తింటూ చిన్నముక్క పిల్లడికి పెడుతూ గుడిసె కొచ్చింది.

చీకటి పడ్డాది. పిల్లడు కేకలు పెడుతూ గుడిసంతా బగురుతున్నాడు. అంకి అరికాల్లో దురదేసింది.

"బాబూ, మనం చిమాచెలం ఎళతాము" అని కొడుకుతో చెప్పింది. కొడుకు బోసినవ్వు నవ్వేడు. అంకిఅరిచెయ్యి దురదేసింది.

"బాబూ, నా అరిసెయ్యి దురదేస్తున్నాది. మియ్యయ్య డబ్బు తెస్తాడు. నా సేతులో డబ్బు పడతాది. కొండెక్కుతాము.

ఏం?"అని కొడుకు నడిగింది. కొడుకుబోసి నవ్వు గుడిసంతా మతాబాలాగ వెలిగింది.

అంకి పొయ్యంటించి చేపలకూర మొగుడికి హితవయినట్టు వొండింది. వంట పూర్తి కాగానే కాళ్లూ చేతులూ కడుక్కొని, కొప్పు సవరించుకొని, మొగుడు ఎప్పుడు వస్తాడు ఎప్పుడు వస్తాడని చూస్తూ అరుగుమీద కూచుంది వాసకసజ్జిక.

ఎంతరాత్రయినా పైడితల్లి ఇల్లు చేరలేదు. అసిరిగాడు తప్పతాగి తందనాలు తొక్కుతూ వీధిలో కొచ్చాడు.

"అంకీ, పైడితల్లీ మేమూ తాగీసినాము. చిమాద్దిరప్పన్న మొక్కు సారాకొట్లో తీర్చీసినాము."అని చెప్పేడు.

"ఓలమ్మ తాగీసినావే!" అని అంకి గుడ్లలో నీరు నింపుకొంది.

అసిరిగాడికీ, బండిరామయ్యకీ పెద్దజట్టీ అయిపోయింది. అసిరిగాడు రామయ్యకి అరణాలు బాకీ. వాడు బాకీడబ్బు లడిగేడు. నే నివ్వను నీతాతతో చెప్పుకో అన్నాడు అసిరిగాడు.

అసిరిగాడు తాగి పిచ్చెత్తిఉన్నాడు. రామయ్యతాగుడులేక పిచ్చెత్తి ఉన్నాడు. ఇద్దరూ జుత్తులు పట్టుకొని కలబడ్డారు. వీధివాళ్లంతా విడిపించారు. అసిరిగాడి పెళ్లాం కణికి లబోలబోమని, నెత్తీ నోరూ కొట్టుకుంటూ వొచ్చింది.

"వొగ్గండి నన్ను. ఇయేళ ఆడో నేనో కడతేరిపోవాలి"అని గింజుకుంటున్నాడు రామయ్య. కణికికి సంసారం దుర్భరమైపోయింది.

"ఇదేనా నీవాళకం? ఇంట్లో ఏటీ నేదు. మూణ్ణాళ్లయి ఏటి తింటున్నామో, పేణాలతో ఎనాగ నిలబడిఉన్నామో బగమంతుడికెరుక. మొన్న తాగీసినాడు. నిన్న తాగీసినాడు. ఈపొద్దు తాగీసినాడు. ఈడి బుర్ర పడిపోను."అంటూ కణికి ప్రారంభించింది.

పట్టుకున్నవాళ్లని ఒక్క దులుపుతో విడిపించుకొని అసిరిగాడు పెళ్లాంమీద పడి దాన్ని దబడదబడ చితకతన్నడం ప్రారంభించాడు.

"అంకీ!" అని గట్టిగా ఆబోతుఅంకె వేస్తూ పైడితల్లి వచ్చేడు.

"అంకీ, పదేనురూపాయి లొచ్చినాయి. రెండు మల్లుచొక్కాలు కుట్టించినాను. ఒక పంచ కొన్నాను. తరవాత తాగీసినాము. అసిరిగోడు, వెంకటరామయ్య, పొట్టిఎదవ, దాలిగోడు, సిన్నోడు కలిసి తాగీసినాము. హిహ్వాహ్వ!"అని నవ్వేడు.

"పోన్నె!"అంది అంకి.

"డబ్బుకేటి నే. ఎదవడబ్బు. నలుగురు తాగినాం."

"ఆళ్లందరికీకూడా ఎడితే మన దినం ఎళతాదా?"

"సీకేటో అంకీ! నువ్వు మేస్త్రీపెళ్లానివి. మనం నాలుగురోజులు కష్టపడితే నెల్లాళ్లకూడు" అని అంకిముక్కు పట్టుకున్నాడు.

"చాలు సరసం, ఎళ్లు"

"ఎక్కడ కెళ్లమన్నావు? సారాముండ దగ్గిరికెళ్లమన్నావా? దాని జుట్టూ, దాని కట్టూ బలేగా ఉంటాయి. దాని పేరు మాణిక్యం. ఛీ! నే నలాటోణ్ణి కాదు. ఎవడి నడుగుతావో అడుగు. పెళ్లాముండగా ఎదవబుద్దులు తప్పని అందరినీ తిడతాను."

"ఎవక కల్లు, సారాదుకాణా లెత్తేస్తా రనుకొన్నారు. ఎత్తేసినా బాగుణ్ను." అని అనుకొంది.

"ఏటన్నావు? కల్లుపాకలు పీకేస్తారనా? నాకు తెల్దనుకొన్నావేటి? నాను పెద్దోళ్ల కాడ తిరుగుతున్నాను. ఎవక కొన్నిసోట్ల మనోళ్లే కల్లుదుకాణాలు పీకించీసినారు. ఇప్పుడు మళ్లా గవర్నమెంటోళ్లు అక్కడా కల్లు, సారా అమ్మమన్నారు. ఇదెవడి రాజ్జెం అనుకొన్నావు? మా కడ్డు నేదు. మాకేటో అంకే"

"ఔన్నే. మంచిపని నోకంలో ఎవడూ సెయ్యడు"

"కూకుని కబుర్లు సెపతావేటి. నెగు. కూడు తినాలి"

"కడుపునిండా కూడే. నానీపొద్దొండ నేదు"

పైడితల్లి గుడిసెలో దూరేడు. అసిరిగాడి జట్టీతో గూడెం గొల్లుమంటున్నాది. పైడితల్లి కూరకుండని పట్టుకుని బైటికొచ్చాడు.

"సేపలకూరొండినా? వొండనన్నావు?" అన్నాడు.

"సెపలసిత్తందాన్ని. నీకు సెయ్యక పోతే ఇంకెవ్వడికి సెయ్యమన్నావు? నీ మొక్కుబడి అయినాకే అన్ని మొక్కులూ. లోపలకి నడు. కుండట్టుకుని ఈదిలో కొచ్చావు" అని లేచింది.

"అప్పన్నకొండకీఎప్పుడెల్లినగాని"- అని పాడుకొంటూ పైడితల్లి పిల్లిలాగ ముడుచుకుని తిండికి కూచున్నాడు.

రాత్రిలో రంపకొండలు

= శ్రీ కొమరవోలు వెంకటసుబ్బారావు =

ఎన్ని యుగాలనాఁడు తమ రిచ్చటికిం దిగజాఱినారు? మీ
కున్న వయ స్సదెంత? తమ రూరక యోచన సేయుచున్న యా
యున్నతశంక లేమి? తమ రొంటరిగా శయనించియుండ మీ
కన్ను మొగుడ్పు మాటుకుఁ గల్గదుగా యొక భంగ మెన్నఁడున్?

ఏదో పెద్ద యమోఘమహా విషయమే యేకాగ్రచిత్తమ్ములోఁ
బాదుంగొల్పినవారు! దాని నరిగాఁ బాకమ్ము జేకూరున
ట్లేదో దానికి దేనిదే పయికి మీ రేతెంచినట్ స్వర్థమాఁ
గాదా యిన్ని యుగాలు వట్టిశ్రమయుం గష్టమ్ములున్ నిద్రయున్?

చాలాతూకముగాఁ బరుంటిరి ప్రభో! స్వాధీనముం దప్పెనో
కాలుం జేతులు నుర్లుగాని దిగెనో! కంపింప రేమాత్రముం
గాలుల్ వానలు హోరుమంచుఁ దలపై గాఢమ్ముగాఁ గ్రమ్మినన్
ఆలోచించుట మాని రందున రహస్య మ్మెంత క్రీడించునో.

పులులా, కారెనుబోతులా, ఎలుగులా, భూతమ్ములా, క్రోతులా,
తలపై నెక్కి విహారము సేయు నయినం దా నింతయుం జంక క
ట్టులె నిష్కంప సమాధి బూని, కడు విస్తారంపు రీతిన్ దప
స్సులు గావించెద రే మహాఫలము లీశుం డిచ్చునో దీనికిన్?

రాముం డెక్కెనో, లక్ష్మణుండు దిగెనో, లంకేశ్వరుం డంపఁగా
నా మారీచుఁడు కృష్ణసారమయి తా నందందు లంఘించెనో
మీమీ పుణ్యశిర స్తటావనులపై మేల్కాంచియే యున్నవాఁ
డేమైనన్ మఱి చెప్పిరో తమకు వారి చొప్పెఱింగింపుఁడీ.

జ్వాలాతోరణ భూష లేమిటికిఁ గన్పట్టున్ భవన్మౌళిపై
మీలోఁ జొచ్చిన దేమొ మృత్యువు, సమున్మేష స్ఫురద్వక్త్రి దం
ష్ట్రా లగ్నాయుత సామిదష్టతను ధారావచ్ఛిత్రితా స్రుక్ఛిఖా
కీలాకారము దాల్చి, సంభరిత గంభీరాంధకారాళియై.

ఏదో జన్మమునందు మీ రెవనినో ఇన్నెక్కరుం జేసి, యి
చ్చో దుఃఖమ్ముల మ్రింగఁబెట్టితిరొ! యిచ్చో నేదో యుద్యోగమున్
మీ దారిద్ర్యపుఁ బేర్మిఁ జేసితిరో కానీ! యీ భవంబందు మీ
రీ దయ్యమ్ముల రూపు లొందితిరి మీ కేనాఁటికిన్ మోక్షమో?

సెగ లూదెన్ దెస లెల్లఁ, బండ్ల నికిలించె న్నింగి దయ్యమ్ము, క్రొం
బొగ లూరెన్ భువనోదరమ్మున, దిగుల్ పుట్టెన్ నిశాదేవికిన్
దెగిపోయెన్ బవనాంఘ్రము లిమ్మెడల మీ తిండ్రించు చక్కట్లు సూ
డగ నేవో విపరీత భావములు పుట్టంజొచ్చెఁ జిత్తంబునన్.

అంతిమొకాని నాకుఁ గడు వాప్తులు మీరలు, రోజు ప్రొద్దునో
రంతయు మీకుఅంగటనె యోఁకని యీపనిఁ జేసికొంచు నే
గింతును నాకు మీఱి తెలిఁగించెడు వార్త లవేని యున్నఁ బం
పింతును భారతీసదనవీథికి సత్వరమే వచింపుఁడీ.

ఆంధ్రదేశ్యము - అన్యదేశ్యము

*

= శ్రీ కోరాడ రామకృష్ణయ్య =

ఇప్పుడు ప్రపంచమున వ్యవహారమం దున్న భాషలను వేలసంఖ్యచే లెక్క పెట్టవలసియుండునుగదా. కాని వీనిలో వేరొక్కటిగాని యేయితర భాషతోను ఎట్టి సంబంధము లేక స్వతంత్రముగ నిలిచియున్న దని చెప్పుటకుమాత్ర మవకాశము లేదు. కాలగతిని మానవ సంఘములలో బరస్పరము కలుగు సంబంధములవలెనే వారిచే వ్యవహరింపబడు భాషలకును బరస్పరసంసర్గము కలుగుచుండుటయు, నొకటి మఱియొకదాని నుండి పదములను, పదబంధములను, రచనారీతులను మొదలగువానిని సంగ్రహించుచుండుటయు ననవరతము తటస్థించుచునేయుండును. కాని మానవసంఘమునందు వలెనే యీసంసర్గఫలము భాషావిషయములోగూడ సులభముగ గుర్తింపబడకపోవచ్చును. అట్లే యైనను మానవసంఘమునుగూర్చి చరిత్రకందని విశేషవిషయములను భాషాచరిత్ర సూచింపగలుగుచుండుననుటకు సందేహము లేదు.

ఒకభాషలోని శబ్దములను, ఆభాషాతత్త్వమును గూర్చి విచారించి వాని నితరభాషలతో బోల్చిచూచినచో, నాభాషకు సహజములైన మూలపదము లేవో, అం దేయేపదము లేయే కాలములం దేయేభాషలతో గలిగిన సంసర్గముచే నందు జేరియున్నవో తెలిసికొను నవకాశము లీకాలమున గలుగుచున్నవి. ఇప్పటి ఇంగ్లీషుభాషలో ననేకములగు నితర దేశభాషాపదములు చేరినవని చెప్పబడుచున్నది. అట్లన్యదేశీయపదములను విరివిగా దీసికొనుటవలననే యాభాష యంతగా నభివృద్ధి నొందిన దనియు దలంపబడుచున్నది. ఇప్పు డది ప్రపంచమం దంతటను ప్రసిద్ధినొందిన భాషలలో ముఖ్యమైనదిగా నున్నది. దీని కాభాషను వ్యవహరించువారు భూభాగమునం దనేకదేశముల ప్రబలులై యుండుటయేకాక, ఆభాషలో నాధునిక ప్రాపంచిక విజ్ఞానమంతయు నెలకొనియుండుటగూడ నొక కారణమని చెప్పవచ్చును. మొన్న మొన్నటివరకు హిందూదేశమున సంస్కృతభాష కట్టి స్థానమే కలదు. అది హైందవవిజ్ఞానమున కంతకు నాకరమై యుండుటచే హైందవుల నిత్యవ్యవహారమునుండి తొలగినను, ఈదేశమున దీని కట్టి స్థానమే లభించినది. కావుననే అప్పకవి యిట్లు చెప్పియున్నాడు.

"తమతమ భాషల కవితలు
దమతమ దేశముల కొప్పిదములగుఁబరదే
శములకుఁ గూడ నొకింతయు
నమరోక్తులు సకలభూములందును వెలయున్.

తలపగ సంస్కృతకావ్యం
బులు తమ యర్థములు సకలభూజనములకున్
దెలిసినను దెలియకున్నను
బొలుపొందఁగనిచ్చు నాల్గుపురుషార్థములన్."

దేశీయవిజ్ఞానమున కాకరమగుటచేతనే యీ భాష నిత్యవ్యవహారమందు లేకున్నను, సర్వజనులకు దాని యర్థము తెలిసినను దెలియకున్నను పురుషార్థప్రదాయినిగా గ్రహింపబడుచున్నది. ఈదేవభాష అనుదానిలోగూడ ననేకములగు విదేశీయపదములు చేరియేయున్నవి. కాని తరువాతి వైయాకరణులు వాని యర్థములకు దగినట్లు ధాతువులనుండి వ్యుత్పత్తులను గల్పించుటచే నవి యన్యదేశీయములుగా బరిగణింపబడుటలేదు. పిక, కాకశబ్దములు రెండును కై, గై శబ్దే అను ధాతువునుండి నిష్పన్నములైనట్లు లింగాభట్టీయము చెప్పుచున్నది. కాని 'పిక' శబ్దము లాటిన్ భాషలోని **'Pecus'** అనుశబ్దమునకు సంబంధించినది. ఇట్లే 'దీనార' శబ్దము గ్రీకుభాషలోని **'Dinarious'** అనుశబ్దమునుండి వచ్చినది. ఇట్లే యీభాషలో నింక పారసీక, యవన, రోమక, బర్బరాద్యన్యదేశభాషాపద

ములు చేరినవనియు, అట్టివాని కిటీవలి వైయాకరణులేవో సంస్కృతధాతువులనుండి వ్యుత్పత్తులను గల్పింపబూనుటయుక్తముకాదనియు, కుమారిలభట్టాచార్యులన్యదేశపదముల కర్థనిర్ణయము చేయు టెట్లు అను విచారణసందర్భములో దన తంత్రవార్తికమున జెప్పియున్నాడు.* సంస్కృతభాషకు లాటిన్, గ్రీకు మొదలగు భాషలతో గల సజాతీయతను సం. పితా - లా. పెటర్; సం. సప్త - గ్రీ. సెప్టెం - లా. హెప్త; సం. భరామి - లా. ఫెరో, ఫెరో మొదలగు శబ్దములయు వ్యాకరణరూపములయు సామ్యమే వ్యక్తముచేయుచున్నది. కాని పిక, నేమ, దీనారాదిశబ్దము లాయాభాషలలోనుండి యర్వాచీనకాలమున వచ్చి యిందు కలిసినవి. కాని వీనికన్నిటికిని సమానముగనే వైయాకరణులు వ్యుత్పత్తులను గల్పించుటచే నేవి సజాతీయములో (Cognate words), ఏవి ఎరవుగా వచ్చి కలిసినవో (Borrowings) తరువాత తెలిసికొనుట కవకాశము లేకపోయినది.

ఇట్లే ఆర్యులు హిందూదేశమున నెలకొన్న తరువాత వారి భాషలో దేశీయములగు శబ్దము లెన్నియైనను చేరియుండునుగదా. కాని యట్లార్యభాషలో చేరిన శబ్దములను గనిపట్టి వానిని దేశీయములుగనో, లేదా విదేశీయములుగనో వైయాకరణులు పరిగణించినట్లగపడదు. క్రీ. శ. ౭-వ శతాబ్దిని కుమారిలభట్టు విదేశీయపదములకు వైయాకరణులు సంస్కృతధాతువులనుండియే వ్యుత్పత్తులను గల్పింపజూతురని చూపుటకు కొన్నికొన్ని ద్రావిడ భాషాశబ్దములను గ్రహించినాడు. అట్టి పాప్, పైర్, అతర్ మొదలగునవికూడ నుదాహరణమునకుమాత్రమే యతనిచే గ్రహింపబడినవిగాని, ఆపదము లార్యభాషలో చేరినవనికాదు. తరువాతి ప్రాకృతవైయాకరణులైనను ప్రాకృతభాషలలో చేరిన దేశీయశబ్దములను 'దేశీనామమాల'లమూలమున ప్రత్యేకించి చెప్ప దొడంగిరి కాని సంస్కృతవైయాకరణు లట్టి పదములను ప్రత్యేకింపలేదు. వానికి కొన్ని ధాతువులను గల్పించి సంస్కృతపదములుగనే గ్రహించియుండురు. కావుననే దేశి, అన్యదేశి అను ప్రత్యేకపరిగణనమున కవకాశమే లేకపోయినది. ఆర్యులీదేశమునకు వచ్చి నెలకొనిన తరువాత వారికి తెలియని దేశీయములగు క్రొత్త వస్తువుల పేళ్లైనను గ్రహింపకతప్పదుగదా. దేశీయులతోడి సంసర్గము పెరిగినకొలది తామెంత నాగరకులైనను వారి భావములను, ఆచారములను కొంతవరకైన గ్రహింపకయుండలేరు. ఆధునికహైందవ నాగరకత యనునది ప్రాచీనమగు నార్యనాగరకత యొక్కయు, దేశీయమగు ననార్యనాగరకత యొక్కయు సహజసమ్మేళనముచే నేర్పడినదే యని తత్వజ్ఞులు తలంతురు. అట్లే ప్రాచీనార్యభాషలో వేదకాలముననే-అనగా ఋగ్వేదభాష సజాతీయములగు తక్కిన ఇండోయూరపియన్ భాషలనుండి విశేషముగ మార్పు నందలేదని చెప్పదగిన కాలముననే దేశీయపదము లనేకము లాభాషలో చేరినట్లు విమర్శకులు చెప్పుచున్నారు. అట్టివానిలో ద్రావిడభాషలకు సంబంధించినవిగా నీక్రింది శబ్దములు తలంపబడుచున్నవి. అణు, అరణి, కటుక, కపి, కర్మార, కలా, కాల, కితవ, కుట, కుండ, గణ, నానా, నీల, నీహార, పుష్కర, పుష్ప, పూజన, ఫల, బిల, బీజ, మయూర, రూప, సాయం, వట్టు మొదలగునవి. కాలక్రమమున నీభాషలో ప్రవేశించిన యనార్యశబ్దము లింకను పెరుగుచువచ్చినవి. బ్రాహ్మణములు రచింపబడిన కాలమున కీక్రింది దేశీయపదములుకూడ నాభాషలో చేరినవి. ఆటవ, ఆడంబర, కులాల, తండుల, తిల, మర్కట, వలక్ష, వల్లి, వ్రీహి, శవ మొదలగునవి.† కాలము గడచినకొలది కేవల వస్తుద్యోతకశబ్దములేకాక, భాషావిష్కరణరీతులుకూడనీభాషలలోనికి సంక్రమింపదొడగినవి. కృ, భు, అస్ వంటి ధాతువుల సహాయమున నేర్పడిన భూతభవిష్యదర్థకరూపములు (ఏధాంచక్రే, పాతయామాస, గన్తా,

---

* "తద్యథా ద్రావిడాదిభాషా స్వేవృశీ స్వచ్ఛందకల్పనా తదా పారసీకబర్బరయవన రోమకాదిభాషాసు కిం వికల్ప్య కిం ప్రతిపత్స్యత ఇతి నవిద్మః"

† History of the Bengali Language by S. K. Chatarji.

గన్తాస్మి మొదలగునవి.) పాణినికి బూర్వమే సంస్కృతభాషలో పొడచూపినవి. సంపూర్ణ క్రియారూపములకు బదులు క్తాంతరూపముల ప్రయోగముకూడ వాడుకలోనికి వచ్చినది. ఇంకను తరువాతికాలమున నార్యజన సంఘమునకు దేశీయులతోడి సంబంధము,కలయిక పెరిగినకొలది, దేశీయు లార్యజనసంఘములో జేరి వారి భాషను నేర్చుకొని వ్యవహరింపనొడగినకొలది ఆర్య భాషలో దేశీయభాషాసంప్రదాయానురోధముగ ధ్వనులయందు మార్పులు, లింగవిభక్తివచనాదులందు మార్పులు, క్రియారూపములందు, వాక్యనిర్మాణ పద్ధతులందుగూడ మార్పులు కలుగజొచ్చినవి. తొలి కాలమున నీమార్పు లుచ్చారణ రీతులలో మాత్రమే పొడచూపినపుడు ప్రాచీనార్యభాష తత్తద్దేశభేదమును బట్టి శౌరసేని, మాగధి, మహారాష్ట్రి మొదలగు ప్రాకృతముల రూపమును బొందినది. ఈ ప్రాకృతావస్థయందు భాషారూపములలో మార్పులు గలుగుట, దేశీయపదజాలము విశేషముగా జేరుట సంభవించినను, తరువాతి యాధునికార్యభాషలలోవలె వ్యాకరణ పద్ధతులందును, వాక్యరచనారీతులందును విశేషములగు మార్పులు కలుగలేదు. ఈమార్పులు సహజపరిణామము వలననే కలిగినవని తలచువారు కలరు కాని యివి చాలవరకు దేశీయములగు ద్రావిడభాషాలక్షణసామాన్యములగుటచే,తద్భాషాప్రభావమే ప్రాచీనార్యభాషపై ప్రసరించి తత్తద్దేశకాలానుగుణములగు మార్పులను కల్పించి, యాప్రాచీనార్యభాష తొలుత ప్రాకృతభాషలుగను,తరువాత నపభ్రంశములుగను,తుదకు త్తరహిందూస్థానమున నిపుడు వ్యవహరింపబడుచున్న యాధునికార్యభాషలుగను, పరిణామమును బొందుటకు ప్రధానకారణ మైనదని తలంచుట యుక్తియుక్తముగ దోచకపోదు. పైనుండి వచ్చిన విదేశీయు లెంత నాగరకులైనను, దేశీయులను వారు మూలముట్టుగ నశింపజేయగలిగిననేమోగాని, వారితో గలిసి దేశమున నివసింపదొరకొనినపుడు వారి భాషావిజ్ఞానముల ప్రభావము వీరిపై నొకకొంతయైన ప్రసరింపకమానదుగదా!

ఇట్లుత్తరహిందూస్థానమందు వ్యవహారములో నున్న ప్రాచీనప్రాకృతములు, ఆధునికార్యభాషలును గూడ ప్రాచీనార్యభాషాభవములే యగుటచేత నిటీవల కొంత విజాతీయసంస్కారము గలిగినను, మొత్తముపై నందలి శబ్దజాలము, వ్యాకరణరీతులు నార్యభాషాసంబద్ధములే యనుట సుప్రసిద్ధమే. అట్లేయైనను ప్రాకృతవైయాకరణులగు హేమచంద్రాదులు ఆ భాషలకు లక్షణము చెప్పునపుడు వానిని తత్సమము, తద్భవము, దేశి అని మూడు భాగములుగ జేసిరి. ఆభాషలోని సామాన్య శబ్దజాలమేగాక యందలి వ్యాకరణరీతులు, సుప్తిఙంతములైన పదములు మొదలగు నవన్నియు గూడ ప్రాచీనార్యభాషాభవములే యగుటచే నాభాషలు తద్భవములగుటలో విప్రతిపత్తి లేదు. ఇందలి శబ్దజాలములో నెరవు తెచ్చుకొనిన దేశీయశబ్దములు కొన్ని గలుగుటచే అట్టివానిని వైయాకరణులు 'దేశి'యను విభాగమున జేర్చి చెప్పవలసి వచ్చినది. పైనుండి వచ్చి కలిసిన యీ 'దేశి'వర్గ మీ భాషలనుండి తొలగించినను, వాని స్వతంత్రస్థితి కట్టి లోపము కలుగదు. ఈ దేశివర్గములో వస్తుద్యోతకములగు శబ్దములు మాత్రమే గాని వ్యవహారమునకు, వాక్యనిర్మాణమునకు నావశ్యకములగు సుప్తిఙాదిపరికరమేమియు నీవర్గములో జేరలేదు. కేవలశబ్దమాత్రముచేతనే వాక్యనిర్మాణము కాదుగదా. శబ్దము, లేదా ప్రాతిపదికము సుప్తిఙాదులతో గూడికాని పదముగాదు. పదముగాని సాకాంక్షితమగు వాక్యములో జేరదు. ఆకాంక్షావిరహితము వాక్యముకాదుగావున అన్వయములేని కేవల శబ్దములచే వాక్యమెట్లేర్పడును? శబ్దము లొక భాషలోనివి మఱియొక భాషలో జేరవచ్చునుగాని అన్వయరీతి వ్యాకరణపద్ధతి ఎరువుసొమ్ముగా మారునది కాదు. ఏ భాషాపద్ధతి ఆభాషదే. రామ, ధర్మ, గురు మొదలగు శబ్దములు సంస్కృతభాషా సంప్రదాయమున రామః, ధర్మః, గురుః అను రూపములను బొంది వాక్యమున బ్రయోగింపబడుచున్నవి. ఇవే ప్రాకృతమున రామో, ధమ్మో, గురు అనియు, ఆంగ్ల భాషలో రామ, ధర్మ, గురు అనియు, తెలుగులో రాముడు, ధర్మము, గురువు అనియు తత్తద్భాషావ్యాకరణసంప్రదాయానుసారముగ మారుచున్నవి. ఇట్లు శబ్దము లీభాషలలోనికి సంక్రమించినను, వానిని వాక్యమున బ్రయోగించునపు డవి పొందు మార్పులు

తత్తద్భాషాసంప్రదాయానుసారములై యుండకమానవు. ఈ సంప్రదాయములను బట్టియే ప్రధానముగా భాషల ప్రత్యేకత యేర్పడుచుండును. "రామం పూజయంతి-రాముని పూజించుచున్నారు." ఇచ్చట శబ్దములు సమానమే యైనను పదములు భిన్నరూపములు దాల్చినవి. **They worship Rama** అనుచో వాక్యనిర్మాణమే మారినది. కావున శబ్దములు సమానమే యైనను వానిని వాక్యమున బ్రయోగించు రీతినిబట్టి భాషలు భిన్నము లగుచున్నవి. కావున దేశియశబ్దములుత్తరదేశభాషలలో జేరినను అవి తద్భాషాసంప్రదాయముల కనుకూలములగు మార్పులతో వాక్యమున బ్రయోగింపబడుచున్నవి. ఇట్టి దేశిశబ్దములుగావున 'దేశి' శబ్దవాచ్యములైనను యూరపునందలి భాషలతో సజాతీయములగు సంస్కృతాద్యార్యభాషలకివి సహజముగ విదేశీయములే గావున నాదృష్టితో జూచినపుడు వీనిని అన్యదేశ్యము లనియే చెప్పవలసియుండును. కాని ప్రాకృతభాషలు సంస్కృతభవములగుటచే, వైయాకరణులు స్వరముల మార్పులవలన నందుండి గలిగిన శబ్దములను, పదములనుగూడ తద్భవములని చెప్పి, దేశీయములగు శబ్దములను 'దేశి' యను పేరనే విభాగించినారు. ఇది యుత్తరహిందూస్థాన భాషల స్థితి.

తొలుత వైదికసంస్కృతభాషలలోను, పిదప ప్రాకృతాదులలోను చేరిన యీ దేశిశబ్దము లనునవి ఆర్యులీదేశము చేరునప్పటికీ దేశమున నివసించుచున్న కోలులు, ద్రావిడులు మొదలగు జాతులవారి భాషలలోనివై యుండవలయును గదా. అట్లుగాక ఇప్పటి భారతీయభాష లన్నియు సంస్కృతభవములో, ప్రాచీనార్యభాషాభవములో యగు నన్నచో నార్యులీదేశమున బ్రవేశించునప్పటికీదేశము నిర్జనమై యుండెననికాని, లేదా వా రీదేశమువారిని సంపూర్ణముగ రూపుమాపిరనిగాని చెప్పవలసియుండును. అట్టి నిదర్శనములు లేకుండుటయేకాక మతసాంఘిక సంస్కారాది విషయములందువలెనే భాషా విషయమునగూడ ఆర్యానార్యసమ్మేళనము కాలక్రమమున జరిగినట్లు తెలియవచ్చుచున్నది. ఆర్యులీదేశమునకు వచ్చునప్పటికి అనార్యజనులు (దస్యులు, వ్రాత్యులు, మ్లేచ్ఛులు మొదలగువారనేకులు) ఈదేశమున నెలకొనియుండి వారి నడుగడుగునకు బ్రతిఘటించుచు వచ్చిరనుటకు ఋగ్వేదాది వైదికవాఙ్మయమునందలి నిదర్శనములే చాలును. ఈ యనార్యజనములో నిప్పుడు దక్షిణదేశమున వ్యవహరింపబడు ద్రావిడభాష లనబడువానితో సజాతీయములని చెప్పదగిన భాషలనే మాట్లాడినవారుకూడ ఆకాలమున నుత్తరదేశమున నెలకొనియుండి క్రమముగ దూర్పుదేశము నాక్రమించుచుండిన యార్యులను ప్రతిఘటించినవారిలో నుండిరనుటకు ఇప్పటికిని పశ్చిమోత్తరభాగమున వ్యవహారమున నిలిచియుండి ద్రావిడభాషాకుటుంబములో జేరిన బ్రాహూయీభాషయే నిదర్శనము. అతిప్రాచీన మగు మొహెంజోదారో నాగరకత యంతయు దేశీయులగు ననార్యజాతులకు సంబంధించినదే యని తలంపబడుచున్నదిగదా. ఇదిగాక ఆర్యులు వాయవ్యదిక్కునుండి తూర్పు దక్షిణభాగము లాక్రమించుచువచ్చినకొలది యార్యసంఘములో జేరని యనార్యజాతులవారు వారిముందు నిలువలేక క్రమముగ భారతదేశ మధ్యభాగమును, దక్షిణదేశము నాక్రమింపజొచ్చిరి. తరువాతికాలమున వీరిపై నార్యభాషాప్రభావ మెంత ప్రబలినను, సహజమగు దేశీయత వీరిభాషలలో రూపుమాసిపోవుట తటస్థింపలేదు. ఉత్తరహిందూస్థానమందువలె నిచ్చట అనార్యభాషలను రూపుమాపి యార్యభాషలు వాని స్థానము నాక్రమింపలేక పోయినవి. ఆర్యభాషనుండి పదపరికరమును విశేషముగా గ్రహించినను ఇచ్చటి దేశీయములగు ననార్యభాషలు తమ సహజతత్వమును గోలుపోలేదు. కావుననే ఇప్పటికిని భారతదేశ మధ్యభాగము నాక్రమించియున్న కొండజాతివారు మాట్లాడు ఖాండ్, మాల్టో, కుయి మొదలగు భాషలు ఇటు దక్షిణదేశభాషలగు తెలుగు, తమిళము మొదలగు భాషలతోను, అటు బ్రాహూయీ భాషతోను సోదరభావమును వహించి యేకకుటుంబమునకు జెందినవిగా నున్నవి. దీనినిబట్టి యొక కాలమున నిప్పుడు బ్రాహూయీ భాష మాట్లాడువారు నివసించు పశ్చిమోత్తర దిగ్భాగమునుండి హిందూదేశ మధ్యభాగమునను, దక్షిణదేశమునను గూడ— అనగా

దాదాపు హిందూదేశ మంతటను గూడ నిప్పుడు ద్రావిడ కుటుంబ మనబడుదానిలో జేరినభాషలను మాట్లాడిన జనమే యాక్రమించియుండె నని యూహించుట కవకాశ మేర్పడుచున్నది. ఆర్యు లీ దేశమును క్రమక్రమముగా నాక్రమించుకొని వచ్చుచుండి రనుటకు వైదిక వాఙ్మయమున గానవచ్చు బ్రహ్మావర్త, ఆర్యావర్తాది విభాగమే నిదర్శన మగుచున్నది. భాషావిషయమునగూడ ప్రాచ్యదేశమునందలిదానికంటె ఉదీచీదేశమునందలి భాషయే పరిశుద్ధ మైన దని, ప్రాచ్యభాగమునకు వచ్చినకొలది ఆర్యభాష సాంకర్యమును జెందుచుండినదని ఆకాలపువారు తలంచినట్లు స్పష్టము. "తస్మాత్ ఉదీచ్యాం దిశి ప్రజ్ఞాతతరా వాగుద్యతే. ఉదంచ, ఉ, ఏవ, యంతి వాచం శిక్షితుం, యోవా తత ఆగచ్ఛతి తస్యవా శుశ్రూషంత ఇతి"* (శతపథ బ్రాహ్మణము). బ్రహ్మావర్త మనునది - ఇదియే మధ్యదేశమనికూడ చెప్పబడును-సరస్వతీ దృషద్వతుల నడుమగల దేశము. అనగా వింధ్యాహిమాలయముల మధ్యను తూర్పున గంగాయమునల సంగమము గల ప్రయాగయే సరిహద్దుగా గలది. ఒక కాలమున దీనికి తూర్పున గల దేశములు కోసల, మగధ, వంగ, రాఢ మొదలగునవి. అనగా నిప్పటి బీహారు, బెంగాలు దేశభాగములు ఆర్యనివాసయోగ్యభూములు కాకపోవుటచే నచ్చటికి బోగూడ దను నిషేధము, వెళ్లినవారికి ప్రాయశ్చిత్తముకూడ ధర్మశాస్త్రములలో విధింపబడినది.

"అవంతయోఽంగ మగధాః సురాష్ట్రా దక్షిణాపథాః
ఉపావృత్సింధుసౌవీరా ఏతే సంకీర్ణయోనయః.

ఆరట్టాన్, కారస్కరాన్, పుండ్రాన్, సౌవీరాన్, వంగాన్, కళింగాన్, ప్రానూనా నితిచ గత్వాపునస్తోమేన యజేత సర్వపృష్ఠయావా.
పద్భ్యాం స కురుతే పాపం యః కళింగాన్ ప్రపద్యతే." (బోధా. ధర్మ. సూ. (౧-౧-౩౦)

వంగదేశము నాశ్రయించియున్న వంగ, పుండ్ర, రాఢ మొదలగు జనులు మ్లేచ్ఛజనులుగా బరిగణింపబడియున్నారు. ఐతరేయబ్రాహ్మణమున నీపుండ్రులతో జేర్చి ఆంధ్రులుకూడ మ్లేచ్ఛులుగనే గ్రహింపబడియున్నారు. "త ఏతే ఆంధ్రాః పుండ్రాః పులిందాః మూతిబాః" దీనినిబట్టి అవంతి, మగధ, అంగ, వంగ మొదలగు ప్రాచ్యదేశము లన్ని యొకకాలమున బ్రహ్మావర్తమున జేరక, అనగా నార్యులకు నివాసభూములు కాక, అనార్యులు మ్లేచ్ఛులు ననబడు దేశీయులచే నాశ్రయింపబడియున్నవనియు, కాలక్రమమున నీదేశములుకూడ నార్యులచే నాక్రమింపబడినట్లును తెలియుచున్నది †. వంగదేశము ఆర్యాక్రమణమునకు బూర్వము అనార్యజనులకు నివాసమై యున్నదనియు, నచ్చటి ప్రాచీనభాష అనార్యభాషయే యనియూ, మిథిల, మగధదేశము లార్యవిజ్ఞానమునకు, భాషకు స్థానము లైనపిదపనే వంగదేశమున నార్యవిజ్ఞానము, భాష వ్యాపించిన దనియు నిశ్చయింపదగియున్నది. ఇది సుమారు క్రీస్తుశక ప్రారంభము కావచ్చునని తద్భాషాచరిత్రకారుడగు సునీతికుమారఛటర్జీగారి యభిప్రాయము. అంతకుపూర్వ మిచ్చట నివసించియున్న జనులలో కోల్, ద్రావిడజాతులువారుకూడ నుండియుందు రనియు, ఆకారణముచేతనే తరువాత గలిగిన ఆర్యభాషాప్రాబల్యమునుబట్టి బెంగాలీభాష ఇప్పు డార్యభాషాజన్యమే, లేదా ప్రాకృతజన్యమే యని తలంపబడుచున్నను ఆభాషలో ద్రావిడభాషాసంప్రదాయములు విశేషముగా కనబడుచున్నవనియు నాతడు నిదర్శనపూర్వకముగా దెలిపియున్నాడు. ఒక్క బంగాళీభాషలోనేగాక ఇతరములగు ఆధునికార్యభాషలలోగూడ నీ ద్రావిడభాషాసంప్రదాయములు కనబడుచునేయున్నవి. కావుననే ఆర్యులీదేశము నాక్రమించుటకు పూర్వ మీదేశ మంతటిలోనుగూడ ననార్యులగు ద్రావిడజను లచ్చటచ్చట నివసించిరేయుందురని, ఆర్యజనుల యాక్రమణమును తొలికాలమున ఆఫఘనిస్థానము, పంజాబుప్రాంతముల నుండి ప్రతిఘటించినవారిలో నీద్రావిడభాషలను

---

* In the Northern quarters is speech utterd with more discernment, and North ward go men to learn speech; he who comes thence, to him men hearken."

† ఈ దేశములలో నగ్ని ముందు ప్రవేశించి పవిత్రమైనవానినిగా జేసినట్లు కథలు గలవు.

వ్యవహరించిన జనులుకూడ నుండియుందురని నిశ్చయింపదగియున్నది. ఉత్తరదేశము క్రమముగా నార్యుల వశము కాజొచ్చినపిదప వీరిలో కొందర రచ్చట నిలిచిపోయి యార్యజనసంఘములో కలిసి వారి భాష నభ్యసింపగా, మరికొందరు దక్షిణాభిముఖులై స్వీయ భాషను వ్యవహరించు జనులతో గలిసిపోయియుందురు. ఇట్టివారినే యార్యులు ద్రావిడులని చెప్పియుందురు. తొలుత జాతివాచకముగా గనబడుచున్న 'తెలంగు' శబ్దము తరువాతికాలమున 'త్రిలింగ' శబ్దభవముగా పండితులచే సమర్థింపబడుచుండినట్లుగానే 'తమిల్' శబ్దముకూడ తరువాతికాలమున 'ద్రావిడ' శబ్దభవముగనో, లేదా దానికి ప్రకృతిగనో సాధింపబడుట తటస్థించినది. ఎట్లైనను దక్షిణదేశీయములు, ద్రావిడ శబ్దసంకేతితములు నగు తెలుగుతమిళకన్నడాదులును, దీనికి సంబంధించిన బ్రాహూయీ, గోండు, మాల్టొ, కుయి మొదలగు నాటవికభాషలును ఆర్యు లీదేశమునకు వచ్చుటకు పూర్వమే యీదేశమున వ్యవహారములో నుండిన వనుటకు సందేహము లేదు. కావున నార్యభాషలనుబట్టి చూచినపుడివి దేశీయములే. వీనిలో నార్యభాషాశబ్దములు చేరినపుడివి అన్యదేశీయములే యగును గాని వేరు కావుగదా. హిందూస్తానీ, ఇంగ్లీషు మొదలగు భాషలలోని తాసిల్దారు, ఆసుపత్రి, లాంతరు, రోడ్డు మొదలగు శబ్దములు తెలుగున జేరినట్లే పుడమి, సిరి, వాక్కు మొదలగునవి సంస్కృతమునుండి వచ్చిచేరినవి. మరి కొన్ని అకారాంత శబ్దములు రాముడు, వనము మొదలగునవి తెలుగుప్రత్యయములను గ్రహించినవి. అట్లే దీర్ఘ సమాసములును చేరినవి. ఇట్లీ భాషలో సంస్కృత భాషలోని శబ్దములే వచ్చిచేరినవి గాని యార్య భాషలే యగు ప్రాకృతములు, ఆధునికములగు నుత్తర హిందుస్థానభాషలలోవలె సంస్కృతభాషలోని పదములు (అనగా సుప్తిఙంతములగు పదములు) కూడ తద్భవములుగా చేరలేదే. "రాజ్ఞో వాశిష్ఠీపుత్రస్య మహాదేవీ ఆజ్ఞాపయతి" అను సంస్కృతశబ్దములను అట్లే "రణ్ణో వాసిఠీపుతస్స మహాదేవీ ఆణవేది" అని ప్రాకృతముగా చెప్పుట కవకాశము కలదు. కావుననే యీ భాషలు సంస్కృతభాషాజన్యము లనియో, లేదా ప్రాచీనార్యభాషాజన్యము లనియో చెప్పగలుగుట. పైపదములను తెలుగుభాషలో చెప్పవలె నన్నచో, ఆశబ్దములనే గ్రహించి చెప్పినను అన్వయము, పద్ధతి అంతయు మార్పుపలసివచ్చునుగదా. "రాజుఅయిన వాసిష్ఠీపుత్రునియొక్క....మహాదేవి... ఆజ్ఞాపించుచున్నది." ఈ అన్వయపద్ధతి,రూపనిష్పత్తి సంస్కృతప్రాకృతములకంటె భిన్నమేగదా. సంస్కృతము మొదలగు ఇతరభాషలలోని ప్రాతిపదికలు, ధాతువులు నెన్ని యీభాషలో చేరినను, వాక్యనిర్మాణపద్ధతిమాత్రము (**Syntactical form**) దక్షిణదేశీయమే. ద్రావిడభాషా సామాన్యపద్ధతి ననుసరించి నదేగాని ఆర్యభాషాపద్ధతి ననుసరించినది గాదు. ఆధునికార్యభాషలలోనికి దక్షిణదేశీయ వ్యాకరణ పద్ధతి కొంత సంక్రమించినదిగాని, దక్షిణదేశీయములగు ద్రావిడభాషలలోనికి ఆర్యభాషా వ్యాకరణపద్ధతి సంక్రమింపలేదు. ఈ భాషల లక్షణరచనాపద్ధతిమాత్రము పాణిన్యాదుల సంస్కృతభాషావ్యాకరణప్రణాళిక ననుసరించి రచింపబడుట తటస్థించినది. అదియు నేతద్భాషాసంప్రదాయ దృష్టితో జూచినపుడు కొంత యనర్థహేతువే యైనదని చెప్పకతప్పగు. అయినను, తొలికాలమునుండియు శబ్దజాలము మాత్రమే వచ్చిచేరినదిగాని నిర్మాణపద్ధతి, వ్యాకరణరీతులు ఇందు చేరలేదు. ఇట్టివానిని వైయాకరణులు మొదటినుండియు వారి గ్రంథములలో వారించుచునే యుండి రనుటయే యిందుకు నిదర్శనము. తెలుగు భాషకు తొలుత లక్షణము చెప్పిన కేతన ఈ విషయమును ఈ క్రిందిరీతిని సువ్యక్తమే చేసినాడు. సంస్కృతపదములను తెలుగుగావించు తెరంగునుగూర్చి చెప్పుచు—

" వృక్షేణ దత్తాయ పక్షిభిః పుత్రస్య
యను విభక్తులు దెనుంగునకుఁ జొరవు
అస్తి ప్రయాతి గాయంతి భుంక్తే సంతి
నయతి స్మరతి యను క్రియలు సొరవు
గత్వా హసిత్వా ప్రకాశ్య సంత్యజ్య నా
దనరు క్త్వాంతల్యబంతములు సొరవు
గంతుం పురీం రిపుం హంతుం సుతం పాతు
మను తుమున్నంతంబు లరయఁజొరవు

అపిచ తుహి హైన వా నను లనఁగ జెప్పు-
లవ్యయంబులు చొరవెందు నాంధ్రకవిత
జెరపదంబులతోఁడను దొరలినిల్చు
నవి తెనుంగులు గావింతు నభిమతముగ."

అని చెప్పినాడు. అనగా సంస్కృత ప్రాతిపదికములు, ధాతువులేగాని వాక్యనిర్మాణమున కావశ్యకములగు విభక్తి ప్రత్యయములతో గూడిన రూపములుగాని, అవ్యయాదులు గాని యిందు ప్రయోగింపబడవని నిషేధించినట్లయినది.* ప్రాకృత వ్యాకరణ విషయ మట్లుకాదు. ప్రాకృత వ్యాకరణ కర్త యగు హేమచంద్రుడు "అథ ప్రాకృతం" అను ప్రాకృత వ్యాకరణ ప్రారంభసూత్ర వ్యాఖ్యాన సందర్భమున సంస్కృతానంతరమున ప్రాకృతానుశాసనము సిద్ధ సాధ్యమాన భేదము గల సంస్కృత జన్య భాషకే యీ లక్షణము గాని దేశ్యమునకు గాదని జ్ఞాపకము కొరకని తెలుపుచు నీ ప్రాకృతమున ప్రకృతి ప్రత్యయ లింగ కారక సమాస సంజ్ఞాదులు సంస్కృతమందువలెనే తెలిసికొనవలె ననియు, లోకమునుండి కొంత తెలిసికొనవలసినది కూడ కలదనియు చెప్పినాడు.† ప్రాకృతాది భాషలవిషయమున నే ప్రకృతి ప్రత్యయ లింగకారక సమాసాదులు సంస్కృతమువందువలెనే తెలిసికొనవలసినట్లుగా జెప్పబడినవో, అవే తెలుగు విషయమున భిన్నము లగుటచే "చొర వెందు నాంధ్ర కవిత" అని కేతన చెప్పవలసి వచ్చినది. కావుననే యితర భాషలనుండి శబ్దజాల మెంత వచ్చి చేరినను, తెలుగు ప్రాకృతాదులవలె సంస్కృతజన్య మగు 'వికృతి' భాష కాక ప్రత్యేక స్వతంత్ర మగు భాషగా గ్రహింప దగిన దని వ్యక్తమగుచున్నది గదా. ఈ విషయమునే కేతనయు,

"తల్లి సంస్కృతంబె యెల్ల భాషలకును
దానివలనఁ గొంత గానఁబడియెఁ
గొంత తాన కలిగె నంతయు నేకమై
తెనుఁగుబాస నాఁగ వినుతి కెక్కె"

అని తెలుగంతయు సంస్కృతభాషకు వికృతియనియే చెప్పక కొంత తాన కలిగినది కలదని చెప్పుటయేగాక, "తెలుఁగై సంస్కృతము చెల్లు తెఱఁగులను గూర్చి" అనగా సంస్కృతపదంబులు తెనుంగుగావించు రీతులనుగూర్చి ప్రత్యేకముగా జెప్పవలసినవాడైనాడు. ప్రాకృతవ్యాకరణము రచించిన హేమచంద్రున కీతత్సమ రూపములను గూర్చి ప్రత్యేకముగా చెప్పవలసిన యావశ్యకత లేకపోయినది. "సంస్కృత సమంతు సంస్కృతలక్షణేనైవ గతార్థం" అని చెప్పి యూరకున్నాడు. తెలుగుభాష ప్రాకృతాదులవలె సంస్కృతజన్యము కాక విజాతీయ మగుటచే దానే తద్విభక్తులు ప్రాకృతాదులందువలె నిందు చొరవుగావున సంస్కృతమును తెలుగులో గలుపుకొనదగిన పద్ధతులను గూర్చి లాక్షణికులు చెప్పవలసి వచ్చినది. దానినే

* అట్లు అవ్యయముల ప్రయోగము నిషేధింపబడినను దేశమున సంస్కృతమునకు గల ప్రాబల్యము వలన వ్యవహారములో సదా, వృథా, సర్వత్ర, మొదలగునవి కొన్ని చేరినవి. కవులును బ్రయోగించినారు. ఇవియు కేవలశబ్దములే. విభక్త్యంతములు గావు. అనంతుడు 'వృథా' యనుదాని ప్రయోగము నంగీకరించినాడు.

"వృథయనునవ్యయ మొక్కఁడు, ప్రథితంబై చెల్లు
గృతుల వృథసేయక" అట్లె-సర్వదా-
"ఒకదివసంబు నానందకాననమునందు సర్వదా
సిద్ధించున్." (శ్రీనాథుడు. కాశీ.)
"సర్వత్రిజగత్రయీ భువనశాసనకర్తకు."(భాగవతము)
"నాకున్ గించిత్తయిన మనోభవవంచన
మిచ్చోటలేదు." (జై. భార.)

† "అథ ప్రాకృతం" ప్రకృతిః సంస్కృతం. తత్ర భవం తత ఆగతం వా ప్రాకృతం. సంస్కృతానంతరం ప్రాకృతస్యానుశాసనం సిద్ధ సాధ్యమాన భేద సంస్కృతయోనే రేవ తస్య లక్షణం న దేశ్యస్య ఇతి జ్ఞాపనార్థం. సంస్కృత సమంతు సంస్కృత లక్షణేనైవ గతార్థం. ప్రాకృతేచ ప్రకృతి ప్రత్యయ లింగ కారకసమాస సంజ్ఞాదయః సంస్కృతవ ద్వేదితవ్యాః. లోకాత్ ఇతి చ వర్తతే. అస్వరం, వ్యంజనం, ద్వివచనం, చతుర్థీ బహువచనం చ నభవతి" (హేమచంద్ర ప్రా. వ్యాకరణం).

"మను సంస్కృతపదములపై
దెనుగువిభక్తులు ఘటించి తేటపడగ జె
ప్పిన నది తత్సమ మనఁజను"

"ఇల సంస్కృతపదములపై
నెలకొని నిల్చిన విసర్జనీయంబులు సు
న్నలు నిలువవు తెనుగులలో
నలవడగా బల్కుచోట నభినవదండీ"

ఇత్యాదులచే "తెలుగున సంస్కృత పదములు పలికెడి తెఱఁ గెఱిఁగినంత ప్రవ్యక్తముగాఁ దెలిపితి" నని చెప్పినాడు కేతన.

ఇట్లే యీతని తరువాతి లాక్షణికుడగు పెద్దనయు నీతని మార్గమునే యనుసరించి

"పరగ సంస్కృతంబుపైఁ దెనుంగువిభక్తు
లనుపఁబడి ప్రసంగియుండెనేని
తత్సమంబునాఁగఁ దగ నండ్రు సుకవులు
తద్విహీనకావ్యతతియు లేదు"

అని శబ్దము సంస్కృతమైనను దానిపై విభక్తులు తెనుంగువిభక్తులు చేర్పబడినచో నది తత్సమ మగునని చెప్పి, యట్లు "పలయు సంస్కృతంబు తెలిఁగించు తెఱఁగు"ను-అనగా సంస్కృతశబ్దములను తెలుగులోనికి దెచ్చుకొను రీతులను ప్రత్యేక ప్రకరణములో జెప్పినాడు.

ఇక నీతనికి దరువాతి లాక్షణికుడు, ఛందోదర్పణకారుడు నగు ననంతామాత్యుడు ఛందోలక్షణమునే ప్రధానముగా దెలుపనెంచినవాడైనను, చతుర్థాశ్వాసమున దోషాధికారసందర్భమున అపశబ్దదోషప్రసంగము నాధారముగా జేసికొని కొంత భాషాలక్షణమునుగూడ జెప్పవలసినవాడైనాడు.

"కనుగొనంగ నాదికవుల కావ్యంబుల
లలితమైన లక్ష్యలక్షణములు
రూఢిగాని పెఱవిరోధోక్తు లపశబ్ద
సంజ్ఞికంబు లండ్రు జగతి కృష్ణ."

ఇట్టి లక్ష్యలక్షణరూఢి లేని యపశబ్దదోషములలో పుష్పవిల్లు, భూరుహపంక్తులవంటి వైరిసమాసములను జేర్చుటయేగాక 'దుష్ప్రయోగ' మను దోషమున సంస్కృతవిభక్తులను దెనుగుపదములతో వాక్యమున నన్వయింపజేయు 'మణిప్రవాళ' పద్ధతిని జేర్చి దానిని పరిహరించినాడు. దుష్ప్రయోగము—

"సత్వము సన్నృపస్య పదం
గత్వా యాతఁడు నిహత్య కంటకులసభీ
ధృత్వా మెలఁగెడు నన్నుఁగ
విత్వవిదులు దుష్ప్రయోగవిధ మండ్రు హరీ."

అనుకరణవిధానమునమాత్ర మిది సుప్రయోగమే యగును.

"నిక్కమగు సుప్రయోగము
'ధిక్కృతదురితాయ భగవతేస్తు నమో' యం
చక్కడ నీశను నమరులు
మ్రొక్కుదురని తిబ్బబంతములఁ గూర్ప హరీ"

ఇట్లు విసంధికదోషపరిహారార్థము సంధిసమాసములనుగూడ చేర్చినాడు.

పిదప నీభాషలోని కారకశబ్దములను దెలుపుచు తత్సమ, తద్భవ, దేశి, అచ్చతెనుగు భేదము నొకటి యిద్దరు లాక్షణికులవలెనే వ్యక్తముచేసినాడు. కాని యీశబ్దములలో గ్రామ్యమును జేర్చినవాడు కాడు. కారణ మీతడు కావ్యలక్షణములో దోషాధికారమును జెప్పచుండుటయే కావచ్చును.

"సంస్కృతము తెనుఁగైనఁ దత్సమపదంబు
దానబుట్టి తెనుంగైనఁ దద్భవంబు
దేశి తెనుఁగు దేశజ, మచ్చతెనుఁగు తెనుగు
నిర్మలుఁడు సిరి యొడయఁడు నిక్కమనఁగ"

కేతన, పెద్దన, అనంతులు ముగ్గురునుగూడ తెలుగైన సంస్కృతమే తత్సమమని వ్యక్తముచేసినారు. కాని యీతొలిలాక్షణికులు ఆంధ్రభాషావికృతి యనువారుగా గనబడరు. అయితే సంస్కృతంబుపై తెనుంగువిభక్తులను జేర్పగా నవి తెలుగుపదములై నవి గదా! కాగా వీనిని సంస్కృతసమములని-తత్సమములని చెప్పనేల? తెలుగుపదము లని, తెలుగుపదములతో సమానములైనవని చెప్పటయే సమంజసముగా గనబడును. సంస్కృతంబునంబుట్టి తెనుగైనవి తద్భవములై

నది. అందుబుట్టుట యనగా నేమో పెద్దన వ్యక్తముచేసినాడు. "సిద్ధాక్షరముల వర్ణముల దూలిపోబలుకఁగ నర్థమై ప్రాకృతనిభ మగునది తద్భవపదము" అని వర్ణములందు మార్పు గలిగి యేర్పడినది తద్భవము కాగా, అట్లు మార్పేమియు లేక యేర్పడినచో నది ప్రాకృతములందువలె సంస్కృతసమము కావచ్చును. కావుననే హేమచంద్రుడు దానిని "సంస్కృతలక్షణే నైవగతార్థం" అన్నాడు. కాని తెలుగున తత్సమము లేర్పడురీతికూడ ఒక ప్రకరణముగా జేసి చెప్పవలసి వచ్చినది. గౌరీ-గౌరి యయినది. వాణీ-వాణి యయినది. వానునకు వంతుడు, మానునకు మంతుడు, ఉల్లింతముపై వుల్లు, అల్లింతముపై ముల్లు, ద్విట్పదమునకు ద్విషుడు, భుక్-భుజుడు, దిక్-దిక్కు, భూ-భువి, నౌ నావ ఇత్యాదులు మార్పు లనేకములు. ఈ మార్పు లన్నియు నాపదములను తెలుగుపదములుగా జేయుటకై చేయబడినవే కాని సంస్కృతసమములుగా జేయుటకు కావుగదా. కావున వీనిని సంస్కృతసమము లనుట యంత సమంజసముగా కనబడదు. కాని భాష నిట్లు విభాగించు సంప్రదాయము వీరి కెచ్చటినుండి వచ్చినది, ఏ రెండు కట్లైభాషను విభాగింపవలసివచ్చినది, ఒక భాషలోని కితరభాషలనుండి సంక్రమించిన పదము లన్నిటిని అన్యదేశ్యములుగా బరిగణించిన చాలదా అని విచారించినచో వీరి కీసంప్రదాయము ప్రాకృతవ్యాకరణములఫక్కి ననుసరించుటవలన వచ్చినట్లు తెలియకపోదు. మొదట 'తత్సమతద్భవదేశి'విభాగము ప్రాకృతవ్యాకరణములలో కనబడుచున్నది. ఆంధ్రవైయాకరణులును వాని మార్గమునే యనుసరించియుందు రనుటకు సందేహము లేదు. కేతన సూచనమాత్రముగ దెలిపినను పెద్దన యీవిషయమును వ్యక్తమే చేసినాడు. గీర్వాణభాషాకావ్యలక్షణము లన్నిటిని దెచ్చికూర్చినను తెనుగుకావ్య మనగానే, తెలుగించు జెవినిబెట్టక తెలుగు దేశభాష, వ్యవహారమున దెలిసికొనవలసినదే దీనికి వ్యాకరణ మేమిటని యీసడించువారికి సమాధానముగా విన్నకోట పెద్దన

"విక్రుతులు హేమచంద్రత్రివిక్రమాదు
లొనరఁజూపిరి ప్రాకృతంబునకు ద్రోవ
ఆంధ్రభాషయు ప్రాకృతాహ్వయముగాన
నలయు దల్లక్షణంబును వరుసదెలియ"

అని ఆంధ్రభాషను ప్రాకృతాదులలో జేర్చి తాను తలపెట్టిన భాషాలక్షణరచనాకార్యమును సమర్థించుకొనినాడు. కేతనకూడ—

"సంస్కృతప్రాకృతాదిలక్షణముఁ జెప్పి
తెనుగునకు లక్షణముఁ జెప్పకునికి యెల్ల
గవిజనంబుల నేరమి గాదు నన్ను
ధన్యు గావింపఁ దలఁచిన తలపుగాని."

అని సంస్కృతప్రాకృత లక్షణములను స్మరించి యప్పటికి దెనుగునకు లక్షణ మేర్పడకుండుటను సూచించుచు తాను "క్రొత్తగ నాంధ్రభాషకును గొండొక లక్షణ మిట్లు చెప్ప" బూనుకొనినట్లు తెలిపి యున్నాడు. కావున సంస్కృతభాషాలక్షణముతో పాటు ప్రాకృతభాషాలక్షణముకూడ వీరి దృష్టిపథమందున్నట్లు స్పష్టమగుచున్నది. కావున ప్రాకృతభాషాలాక్షణికులు చేసిన తత్సమతద్భవదేశ్యవిభాగమునే వీరు నవలంబించియుందు రనుటకు సందేహము లేదు. ఆభాషలలో విభక్తిప్రత్యయములతో గూడిన పదములు సంస్కృతమునందువలెనే మార్పు లేకయుండుటచే సంస్కృతసమము లనుట యుక్తమేగాని, ఈభాషలో క్రొత్త ప్రత్యయములతో గూడి ప్రాతిపదికములలో గూడ మార్పులు గలుగుచున్నపుడు తత్సమము లనుట యుక్తముగా గనబడదు. కన్నడవైయాకరణులుగూడ నీవిభాగక్రమమునే యవలంబించినారుకాని వారు మార్పేమియు లేకయే కన్నడమున జేరిన శబ్దములను సమసంస్కృతములని (అనగా రామ-రామం, భీమ-భీమం, నారద-నారదం ఇత్యాదులు), సంస్కృతమందును, కన్నడమందును వ్యవహారములో నున్న శబ్దములను తత్సమములని ఒకవిధమైన విభాగమును గల్పించినారు. సంస్కృతకన్నడములందు సమానముగా నున్న శబ్దములు తత్సమములని చెప్పి, అట్టి శబ్దముల నిరువదింటి నొక పట్టికగా 'శబ్దమణిదర్పణ' కారు డిచ్చియున్నాడు. మణి, మంచం, తోరణం, కంకణం, గోణి, మాలె, అట్టం, గణం, గంధం- ఇత్యాదులు. ఇవి రెండు భాషలకు సమానములనుటలో

గల విశేష మేమనగా నీ తత్సమపట్టికలోని శబ్దములు సంస్కృతశబ్దములతోను, కన్నడశబ్దములతోనుగూడ సమాసమున నిలువగలిగియుండుటయే. సమసంస్కృతము లట్లు నిలువగూడదట. తత్సమశబ్దములకు సంస్కృతశబ్దములతోను, కన్నడశబ్దములతోను సమాసములు కూడును. ఉదా-దినమణి, ఉడెమణి, రత్నమంచం, తూగుమంచం, మకరతోరణం, తళిర్దోరణం ఇత్యాదులు. సమసంస్కృతముతో దేశ్యశబ్దము సమసించినచో నది అరిసమాస మగునుకావున ముఖతావరె, అరసకుమారం ఇత్యాదులు నిషిద్ధములైనవి. మొత్తము మీద నీకన్నడమున తత్సమశబ్దమున కొక క్రొత్తయర్థము కల్పింపబడిన ట్లగపడుచున్నది గాని కేవలము తెలుగులోవలెగాదు. తొలుత నీశబ్దమును వాడుకలోనికి దెచ్చిన ప్రాకృతవైయాకరణులు దీనిని వర్ణములం దెట్టిమార్పునులేక ప్రాకృతభాషలో నట్లే నిలిచిన సంస్కృతశబ్దముల పరముగా వాడిరనుటకు సందేహము లేదు. ఉదా:కమల, తరల ఇత్యాదులు. ఇక జన్యభాషలలో గొన్ని మార్పులకు లోనై చేరిన సంస్కృతశబ్దములు తద్భవము లైనవి. ఈతద్భవశబ్దములలో గలిగిన మార్పులు చాలవర కుత్తరదేశభాషలలోను, దక్షిణదేశభాషలలోను సమానములుగనే యుండుట మనము గమనింపదగిన విషయము. ఇట్లగుటకు దేశీయులగు ఆనార్యజనుల యుచ్చారణరీతులు, సంప్రదాయములు మొదలగువాని ప్రభావముకూడ నొక కారణమైయుండు నని తలంపనగును. ఏలయనగా నీప్రాకృతభాషలలో గలిగిన మార్పులు ద్రావిడభాషాసహజ సంప్రదాయముల కనుగుణములయియేయున్నవి.

ఉదా (౧) పదాదియందలి శ, షలు 'స'గా మారుట. ద్రావిడభాషలలో ఊష్మవర్ణములు లేవు. cf తె. శాణము - సాన, శ్రీ సిరి etc.

(౨) పదమధ్యమున సంయుక్తాక్షరము నిలువదు. ద్విత్వాక్షరము నిలుచును. సం. పుత్ర - ప్రా. పుత్త; సం. ఆర్యపుత్ర - ప్రా. అజ్జఉత్త; cf సం. ఋక్క- తె. రిక్క.

(౩) ప్రాకృతములలో భకారము హాకారముగా మారును. ద్రావిడభాషలలో మహాప్రాణములు లేవు. సం. భవతి- ప్రా. హోది- హోఇ; భవిష్యతి- (శౌ) హావిస్సది; సం. ముఖ-ముహ; (తె. మొహము) సం. మేఘ-మేహ, అభినవ-అహినవ etc.

(౪) పదమధ్యమునందలి క, త, ప వర్ణములు గ, ద, బలుగా మారును. ఇదియు ద్రావిడభాషా సంప్రదాయమే. సం. అతిథి-(శౌ) అదిధి; సం. పారితోషిక-శౌ. పారికోసియ; సంస్కృత-సక్కద, సం. లోక-(అర్ధ. మా) లోగ; సం. ఆకాశ-ఆగాస; పట-పడ; కుటుంబ-కుడుంబ.

(౫) పదాదియందు సంయుక్తాక్షర ముండదు. ద్రావిడభాషలలోను అట్లే. స్నానము-తె. తానము; వ్యాపార-బేహార.

పదమధ్యమందలి సంయుక్తాక్షరము ద్విత్వమును జెందుటయో, లేదా స్వరభక్తిచే రెండక్షరములగుటయో తటస్థించును. ఇంద్ర-ఇందర; ద్వార-దువార; వర్ష-వరిస; హర్ష - హరిస; సం. యుక్త-జుత్త; ఉత్పల-ఉప్పల; అగ్ని-అగ్గి; వింధ్య-వింఝ; వల్కల-వక్కల; పక్వ-పక్క; సత్య-సచ్చ; చక్ర- చక్క.

ఇట్టి మార్పులను బొంది సంస్కృతము ప్రాకృతముగా మారినది. దక్షిణదేశభాషలలోను సంస్కృతభవముల కిట్టి మార్పులే కనబడుచున్నవి గదా. కాని సంస్కృత శబ్దములు దక్షిణదేశభాషలలో నెట్టిమార్పులను బొంది తద్భవములై ప్రవేశించినను అన్యభాషాశబ్దము లీభాషలలో ప్రవేశించినట్లే యగునుగదా. కావున నన్యదేశీయములే యని యెందుకనగూడదు?

[సశేషము]

భారతదేశీయ ఆర్థికాభ్యుదయ ప్రణాళిక*

=== శ్రీ ఆర్దేషీరు దలాల్ ===

దారిద్ర్యం అనేది మొదటినుంచీకూడా భారతదేశానికుండే పెద్ద సమస్య. లేమి అంటే ఏమిటో ఎరగకపోవడంకన్నా గొప్ప స్వేచ్ఛ లేదు. ఎందువలన నంటే లేమి లేకపోతే తతిమ్మా స్వేచ్ఛలన్నీ వాటంతటఅవే ప్రాప్తమవుతవి. తతిమ్మాస్వేచ్ఛలకు లేమి లేకపోవడం మూలకందం అన్నమాట. ఇప్పుడు భారతదేశం క్లిష్టరాజకీయపరిస్థితులతోను, సాంఘికఒత్తిడివల్లను బాధపడుతూ ఉంది. దేశంలోంచి దారిద్ర్యం కొంత వెళ్లగొట్టబడి, ప్రజల్లో జీవితసౌకర్యపరిమాణం (Standard of living) హెచ్చుచేయబడితే యీ ప్రయాస అంతాకూడా తొలగిపోతుంది. ఏదేశపు భాగ్యోన్నతికైనా ఆదేశంలో ఉన్న ప్రజాబాహుళ్యం, పదార్థసౌలభ్యాలు ముఖ్యమైన కారణాలు. ఈరెండు విషయాల్లోకూడా ప్రకృతి హిందూదేశానికి బాగా తోడ్పడింది. మానవజాతి ఐదుపాళ్లలో ఒకపాలు మనదేశంలో నివసిస్తున్నది. దేశానికి కావలసినన్ని పదార్థాలు దొరక్కపోయినా, ఉన్నవిమాత్రం బహుళంగానే దొరుకుతవి. ప్రపంచంలో ఉత్తమశ్రేణికి చెందిన ముతకలోహపు గనులు యిచ్చటనున్నన్ని మరెచ్చటా లేవు. అభ్రకం హిందూదేశంలో తయారైనంత మరొకచోట తయారుకాదు. 'మాంగనీసు' అనే మరొక లోహం తయారుచేయడంలో మన దేశం రెండవ స్థానాన్ని పుచ్చుకుంది. ఈ విషయాల్లో పురోగామిత్వం అందుకున్న జర్మనీ జపానుదేశాలకంటే ప్రకృతి మన దేశాన్ని బాగా అనుగ్రహించింది. కాని భగవంతుడు ప్రసాదించిన ప్రకృత్యాధారాలను (Natural Resources) పూర్తిగా ఉపయోగానికి తీసుకురావాలి. ప్రజ జీవించడానికి ముఖ్యావసరమైన సౌకర్యాలు లేకుండాపోతున్నారు. ఈసందర్భంలోగనక ఆర్థికదుస్థితి సంభవించినట్టయితే ప్రస్తుతం వంగదేశం ఎట్టి క్షామదేవతపాలయిందో అల్లాగే దేశమంతా అల్లకల్లోలంలో పడవలసివస్తుంది.

ఒక తరంకన్నా తక్కువకాలంలోనే దేశాభివృద్ధిలో గల చురుకుతనాన్ని పెంపుచేయవచ్చుననీ, దాని ఆర్థికావస్థ మార్చుకోగలమనీ రష్యా ప్రపంచానికి వెల్లడిచేసింది. ఈమార్పులు ఇంతత్వరలో కలగడానికి శిల్పశాస్త్రాదివిద్యలలో గల గమనమే కారణము. ఇప్పుడు కలిగిన విజ్ఞానాభివృద్ధివల్ల ప్రపంచమంతా కలుపుతీరా వస్తువుల నుంచుకోవడమేకాకుండా యితరుల కివ్వడానికి సరిపోయేలాంటి పరిస్థితులు ఏర్పడినవి. కాని మానవస్థాపితమైన సంస్థలు, మానవులకుండే దురాశ,మానవకల్పితమైన యీర్ష్యలు ప్రపంచసుఖానికి అడ్డుతగులుతూ ఉన్నవి. "ఆర్థికసమస్యలైన లేమి, దారిద్ర్యం అనేవి వర్గాల్లో, జాతుల్లో ఉండే ఆర్థిక సంఘర్షణలు. మరేమీ కావు. అవి భయానకమైన చిక్కులు. తాత్కాలికముగా ఉండే అనవసరమైన చిక్కులు" అని 'కెయిన్సు' (Keynes) అనే శాస్త్రజ్ఞుడు చెప్పాడు. శాస్త్రపరిశోధనాఫలితాలను పంచుకొనడానికి అసంపూర్ణాభివృద్ధిని పొందిన ఆసియాఖండవాసులమైన మనము మనతో తులతూగుతూ

---

* సర్ ఆర్దేషీరు దలాల్ గారు ౨౮ ఫిబ్రవరి ౧౯౪౪ తేదీన భారత, వంగజాతీయ, మార్వాడీ, మహమ్మదీయవాణిజ్యసంఘములయెదుట కలకత్తాలో గావించిన ఉపన్యాసమునకు అనువాదము.

వున్నవారితోపాటు వారసులము. శిల్పాదిశాస్త్రాలవల్ల కనిపెట్టబడిన క్రొత్తక్రొత్త విశేషాలను మనపదార్థ సౌలభ్యాలకొరకుపయోగించుకొని పాశ్చాత్యదేశాలు మొదటిలో పొందజాలని అభివృద్ధిని పొందటానికి మనకు అవకాశాలున్నాయి. పరిశ్రమలు అభివృద్ధి అయిన దేశాలు చేసిన తప్పులు మనము గమనించి వాటిని దిద్దుకోవడమేకాకుండా వాగుచూపిస్తూవున్న వరవడిని మనము తీసుకుని బాగుపడవచ్చు. మనము పెట్టుకున్న లక్ష్యాల్ని మనం చేరకపోవడానికి కారణాలు మనలో తగినంత ఆత్మశక్తి, ప్రయత్నం, మనోనిశ్చయం యిప్పటిదాకా లేకపోవడమే.

ఇప్పటి ప్రపంచసంగ్రామం ఇతరదేశాలతోపాటు మన దేశానికికూడా ఆర్థికప్రణాళికలను తయారుచేసే ఆవశ్యకతను కలుగజేసింది. యుద్ధానంతర పునర్నిర్మాణపు ముచ్చట్లు ప్రతీచోటా జరుగుతూనే ఉన్నాయి. కొన్ని దేశాల్లో అవి కొంతదూరం అమలులోకూడా పెట్టబడినయి. దురదృష్టవశముచే ఇప్పటిదాకా మన దేశంలో ఏమీ జరగలేదు. గతరెండు సంవత్సరాలనుండి, అంతకుముందునుంచీకూడా ప్రభుత్వంవారు కమిటీలను నియమించినారు; కాని వారు చెప్పుకోతగ్గ పర్యవసానాలు ఏమీ లేవు. యుద్ధం అయిపోయిన తక్షణం చూడవలసిన సమస్యలను — అనగా బర్తరఫు చేయబడిన సేనానుల సర్దుబాట్లు, వారికి జీవితంలో స్థానం కనుక్కోవడం, వాసస్థలాల్లో మార్పులు మొదలైనవి — మాత్రం యీకమిటీలుచూస్తున్నారు. ఈసమస్యల్ని ఎదుర్కోవక్కరలేదని నేననను. కాని దేశాన్ని పీడిస్తున్న దారిద్ర్యబాధను, లేమిని సమూలంగా తొలగించడానికి సరిపడే పెద్ద ప్రణాళికను తయారుచేసే విషయమై తగినంత శ్రద్ధ చూపించబడడం లేదని మాకు తోచింది. ముఖ్యమైన యీపెద్దపెద్ద సమస్యల ఆవశ్యకతను అందరికీచూపించే నిమిత్తమే ఈ ప్రణాళికను మేము తయారుచేసినది. అందులో చెప్పినట్టుగా మాది సర్వంకషప్రణాళిక కాదు; సూక్ష్మాంశాల్లోకి పోకుండా మోటుగా సూచనలుమాత్రం చేయబడినయి. ఇంత పెద్దదయిన భారతదేశఆర్థికప్రణాళికలో సూక్ష్మాంశాలను పేర్కొనాలంటే అది రెండుమూడేండ్లు కష్టపడి, సమస్యలనన్నింటిని సమాలోచించి ఒక ప్రత్యేకకమిటీవారు చెయ్యాల్సిన పని. ముఖ్యాంశాలను సూచించి వాటివిషయమై ఉత్సాహం, వాటిని చర్చచేయడానికి కోరిక కల్పించడమే మాయుద్దేశం. ఇది చాలావరకు నెరవేరిందనే మేము చెప్పుకోవచ్చును.

మా ప్రణాళిక ప్రజల్లోనేకాకుండా ప్రభుత్వంవారిలోకూడా కొంత ఉత్సాహాన్ని కలుగజేసింది. ఇతరులెవరన్నా యింతకంటె ఉపయోగమైనటువంటిన్ని, ఫలవంతమైనటువంటిన్ని సలహాలను యిచ్చినాసరే, లేక ప్రభుత్వంవారే దేశాదాయాన్ని వృద్ధిచేయడానికి, దేశంలో జీవితసౌకర్య పరిమాణం హెచ్చుచెయ్యడానికి తగినటువంటి ఒకప్రణాళిక ప్రజలయెదుట పెట్టినాసరే మాఉద్దేశం నెరవేరినట్టుగానే భావిస్తాము.

మా ప్రణాళికలో మేము నిర్ధారణచేసుకున్న కొన్ని ముఖ్యవిషయాలు కలవు. మొదటిది: దాన్ని అమలుపెట్టే బాధ్యత ఆర్థికవిషయాల్లో పూర్ణస్వాతంత్ర్యం కలిగిన కేంద్రజాతీయప్రభుత్వానికే ఉంటుందని అనుకోవడము. రెండవది: యుద్ధానంతరప్రభుత్వవిధానంలో ఏమార్పు కలిగినా భారతదేశంలో ఆర్థికంగా ఐక్యత నిలబెట్టబడుతుందని ఊహించడం. అసలు మాప్రణాళికను నడపడంలో ప్రతియొక్కచోటాకూడా ప్రభుత్వయాజమాన్యం, ప్రభుత్వోద్యోగ సంపర్కం కావలసివస్తుంది. ప్రజలలో నిలవద్రొక్కుకున్న అభ్యాసాలను, అలవాట్లను, ఆచారవ్యవహారములనుకూడ ఈప్రణాళిక ఒక్కొక్కప్పుడు తారుమారు చేయగలదు. ఇలా మార్చటానికి ప్రజల సానుభూతి కావాలి. జాతీయప్రభుత్వం ఉంటేనే ప్రజాదరణ కలగడానికి అవకాశాలుంటవి. మా ప్రణాళిక ప్రజలలో వొకవిధమైన త్యాగాన్ని, ఉత్సాహాన్ని అర్థిస్తుంది. వాటిని సంపాదించడానికి జాతీయప్రభుత్వానికే సాధ్యమవుతుంది. ఆర్థికవ్యవహారాలను చేతులో ఉంచుకొని పెద్దపెద్ద మొత్తాలను వెచ్చించే అధికారంకూడా అది కోరుతుంది. ఈవిధంగా ఖర్చువెచ్చాలు చెయ్యడానికి పూర్ణాధికారం ఉన్న కేంద్రజాతీయ

ప్రభుత్వానికే వీలంటుంది. ఆర్థికాభివృద్ధికి సంబంధించిన విషయాలన్నిటిలో దేశం అంతా కూడా ఒక్కటిగా భావించడం చాలా అవసరం. మాకు రాజకీయ విషయాలతో పని లేదు. సమిష్టిరాష్ట్రవిధాన మేదయినా సరే మాకు సమ్మతమే. కాని, ప్రత్యేకరాష్ట్ర కూటమిలోను, విభజనలోను వాటి కిచ్చే స్వాతంత్ర్యం మాత్రం వాటివాటి ఆర్థికాభివృద్ధికి అనుగుణ్యంగా ఉండేటట్టూ, వివిధజాతుల సమరసభావాన్ని హెచ్చు చేసేటట్టూ అయితే చాలు. ఒక్క విషయం గమనించాలి. ఆర్థికఐక్యత లేకపోతేమాత్రం యీ ప్రణాళిక సఫలీకృతం ఎన్నటికీ కానేరదు. స్వతంత్రమైన సంస్థానాలు కాని, రాష్ట్రాలుకాని పరసంస్థానంనుండి, రాష్ట్రంనుండి వచ్చే సరకుమీద పన్నులు వగైరా వసూళ్లు చేయడం ఈ ప్రణాళిక జయప్రదంగా అమలులో పెట్టడానికి కలిగే గొప్ప విఘాతం. ముడిపదార్థాల విషయమై సువిశాలమైన దేశమంతా మనసులో ఉంచుకొని ఈ ప్రణాళిక నిర్మింపబడింది. అల్లా కాకుండా ఏ రాష్ట్రసీమలో దొరికే సరకు ఆసీమలోనే ఉండేటట్టు విభాగింపబడితే యీ ప్రణాళిక ముక్క చెక్కలయి పోతుంది. రాజకీయమైన సమస్యలవల్ల ఆర్థికమైన సమస్యలు కలిగి చివరికి దేశాన్ని ఆర్థికదుస్థితిలో తప్పకుండా ముంచివేస్తయి.

ఈ ప్రణాళికను విపులంగా వర్ణించే ముందు నేనొక అంశాన్ని వివరించి చెప్పదలచుకొన్నాను. ఖర్చు వెచ్చాలను గురించి మేము చేసిన అంచనాలు బ్రహ్మాండముగానున్నవి. అందుచేత అవి కేవల ఊహామాత్రాలనీ, సుసాధ్యములు కావనీ కొందరికి తోచవచ్చును. గత యుద్ధానికి పూర్వం రష్యా జర్మనీ దేశాల అనుభవం, తదనంతరం మరికొన్ని దేశాలు సంపాదించిన అనుభవంవల్ల తెలియవచ్చిన దేమిటంటే ఒక దేశ ఆర్థికసంప్రదాయానికి ధనంసేవకునివలె సాధనభూతమేకాని యజమానివలె సర్వాధికారి ఎంతమాత్రం కాదని. ప్రజాసమూహంమీదా, పదార్థసముపార్జనమీదా నిజమైన దేశసౌభాగ్యం ఆధారపడి ఉంటుంది. వీటిని వాడుకలోకి తీసుకువచ్చే సాధనమాత్రమే అవుతుంది ధనం. పూర్వకాలపు ఛాందసులు ధనానికి, రాజకీయ ద్రవ్యవ్యాపారాలకు యిచ్చిన అర్థాలన్నీ యుద్ధం రాగానే తుడుచుకు పోయాయి. యుద్ధానికి పూర్వమే రష్యాదేశం వీటి నిర్వచనాన్ని మార్చివేసింది. అర్థశాస్త్ర పండితుడైన 'కెయిన్సు' చెప్పినట్లు రాజకీయ ద్రవ్యవ్యాపార కృత్రిమాన్ని మనము చూస్తూనే ఉన్నాము. పదార్థాలను, సేవావృత్తులను కొలిచే కొలబద్దగా ధనాన్ని ఉపయోగించు తున్నాము. ఆ కొలప్రమాణము ఒక్క విధంగా ఉండటానికి ద్రవ్యసాంకేతికమైన రూపాయ నాణెమును ౧౯౩౧-౧౯౩౯ సంవత్సరముల మధ్యనుండే ధరవరుల పరిమాణానికి సరిపోయేలాగ పెట్టుకున్నాము.

ఏ ప్రణాళికయొక్క దూరలక్ష్యమైనా దేశానికి ప్రకృతి ప్రసాదించిన ఆధారాలను చూచుకొని ఆర్థికంగా వస్తుసామగ్రిని సాధ్యమైనంత హెచ్చుగా ఉత్పన్నం చెయ్యడమే. మాచే తయారుకాబడిన యీ ప్రణాళిక పదిహేను సంవత్సరముల కొరకేర్పాటుచేయబడినది. మానవ జీవితానికి అత్యవసరమైన వస్తుసామగ్రులు సంపాదించుకొన్న తర్వాత పైగా కొంత మిగిలేటట్టు చేసే జీవితసౌకర్యపరిమాణము కలిగించడము మా ప్రణాళిక ముఖ్యోద్దేశము. అయితే, మానవజీవితానికి కావలసిన ముఖ్యావసరా లేమిటి? తినుటకు భోజనము, కట్టుటకు బట్ట, ఉండుటకు నివాసము, ఇవి కాక అనారోగ్యంగా ఉన్నప్పుడు వైద్య సహాయం, లోకంలో ఉపజ్ఞతో బ్రదకడానికి సరిపోయే విద్య.

మొదటిది భోజనము. సకటువ భారతదేశములో ఉండే యావత్తు ప్రజకూడా సరీగ్గా బ్రదకడానికి సరిపోయే భోజనం లేకుండాఉంది. ఈవిషయములో ప్రమాణ ప్రాయంగా ఉండే ధీశాలుర అభిప్రాయాన్ని బట్టి సమపాళ్లుగా ఉండి సరీగ్గా సరిపోయే భోజనము ఒకొక్క వ్యక్తికి రోజుకు ౨౮౦౦ కాలరీ * లుండాలని నిశ్చయించినాము. ౩౮.౯ కోట్ల భారతదేశ ప్రజకు యిది సంపాదించాలంటే సాలీనా దీని క్రింద ౨౧౦౦ కోట్ల రూపాయలు కావలెను.

---

* కాలరీ అంటే శరీరంలో ఉత్పన్నమైన వేడి. ఈ వేడి ఉంటేనే జీవించడానికి అవకాశం ఉంటుంది.

బట్ట: ఇప్పటి వాడుకనుబట్టి నూలుబట్టలు మనిషికి పదహారు గజాలని అంచనా కట్టినారు. మా అంచనా ప్రకారం వ్యక్తికి అత్యవసరమైన బట్ట ముప్ఫయి గజాలు. దీని క్రింద ౩౫౫ కోట్ల రూపాయలు కావలెను.

ఒక వ్యక్తి నివసించడానికి అధమం ౧౦౦ చదరపు గజాల స్థల మవసరమని మా అభిప్రాయం. బస్తీలలోను, పల్లెలలోను ఉండే చాలా యిళ్లు తిరిగి కట్టవలసి ఉంటవి. అది కాక క్రొత్తగా కట్టవలసిన యిండ్ల నిమిత్తం విరివిగా ఏర్పాట్లు చెయ్యాలి. మోటు అంచనా పైని యీ విషయం పెట్టుబడి క్రింద ౧౪౦౦ కోట్లున్నూ, సాలీనా సంరక్షణ (**Maintenance**) ఖర్చుల నిమిత్తం ౨౫౭ కోట్లున్నూ రూపాయలు కావలెను.

ఇతర దేశాల కంటే మన దేశంలో ఆరోగ్య పరిమాణం (**Standard of health**) ఎంత తక్కువగా ఉందో యీ క్రింది వివరాలు తెలుపుదు చేస్తాయి.

	ఇండియా	ఇంగ్లాండు (వేల్సు స్కాట్లాండుసహా)	అమెరికా సం॥ రాష్ట్రాలు
౧౦౦౦ మందిలో చనిపోవువారి రేటు	౨౧.౮	౧౨.౨	౧౦.౬
మగవారిలో జీవిత పరిమాణం (**Expectation of life**)	౨౬.౯	౬౦.౧	౬౦.౬

ఆరోగ్య విషయాల్లో జబ్బులు రాకుండా చూసే సామాన్యవిధానాలు అనగా, గ్రామపారిశుద్ధ్యము, నీటిసరఫరా, టీకాలు వేయడం, గర్భిణీ స్త్రీలయు చంటిపిల్లల శ్రేయస్సు - యింక వచ్చే జబ్బులు కుదర్చడానికి ఆస్పత్రులు, వైద్యశాలలు మొదలైనవి మేము చక్కగా యోచించినాము. కొన్ని కుగ్రామాల కొక్క వైద్యశాల ఉండాలని మా అభిప్రాయం. ౧౦,౦౦౦ మంది లేక కొస్తపైగా జనాభా కల బస్తీలలో వైద్యశాలలు, గర్భిణీల కొరకు మాతృత్వాలయాలు(**Maternity Clinics**)ఉండాలి. ఇది కాక కుష్ఠు, వ్రణములు, శరీరావయవములలో ఒక విధమైన పురుగువల్ల కలిగే జబ్బు (**Tuberculosis**) యిటువంటి రోగాలకు నిపుణుల యాజమాన్యం క్రింద సున్న సంస్థలు కావాలి. పారిశుద్ధ్యానికి, వైద్యసౌకర్యాలకు పెట్టుబడి క్రింద ౨౧౭ కోట్ల రూపాయలు, సాలీనా వ్యయం క్రింద ౧౭౫ కోట్ల రూపాయలు వేసినాము.

పదేండ్లకు మించిన ప్రతివ్యక్తి కూడా చదువను వ్రాయను శక్తికలిగి ఉండాలని మా ఆశయం. హిందూ దేశములో ఐదేండ్లకు పైగా నున్నవారిలో అక్షరాస్యత ౧౦౦ కి ౧౪.౬. ముందంజవేసిన యితర దేశాల్లో యిది ౧౦౦ కి ౭౦. ప్రాథమిక విద్యావిధానం నిమిత్తం, ౧౧ నుండి ౫౦ ఏండ్ల వయస్సు వచ్చిన వయోజన విద్య నిమిత్తం సాంవత్సరిక వ్యయం ౧౫౪ కోట్ల రూపాయలు, పెట్టుబడి వ్యయం ౭౬ కోట్లని అంచనాకట్టినాము.

ఈ విధంగా మానవజీవితానికి అత్యవసరములయిన భోజనము, బట్ట, ఉనికి, పారిశుద్ధ్యము, విద్య విషయాలు అన్నీ చేకూర్చడానికి కావలసిన మొత్తం ౨౯౦౦ కోట్ల రూపాయలు-లేక తలావ్యక్తికి ౭౮ రూపాయల ఆదాయ మన్నమాట. డాక్టరు వి. కె. ఆర్. వి. రావుగారు బ్రిటిషు యిండియాలో వ్యక్తి ఆదాయం ౬౫ రూపాయలని దేశాదాయం గురించి వేసిన అంచనా చాలా నమ్మకమైనది. దానిని మేము పరిగ్రహించినాము. వారి అంచనా ప్రకారం చూచి నట్లయితే ప్రస్తుత దేశాదాయం అత్యవసరమైన మానవ సౌకర్యాలకు సరిపోయే పాటి అయినా కాక అంత కన్నా తక్కువ అని తెలుస్తుంది. ఒక విషయం మాత్రం మనం గమనించాలి. మన దేశంలో సిరి చాలా విపరీతంగా ప్రవర్తించింది. అపారమైన భాగ్యవంతుల మధ్య కడునిరుపేదలు వేనవేలున్నారు. అందుచేత సకటున తలవక్కంటికి ౬౫/- రూపాయల అర్జన అంటే అది నిజానికి వ్యక్తికి ౪౦ రూపాయలుగాని యింకా దురదృష్టవంతులకు అంతకన్నా తక్కువగా కూడా కావచ్చును.

భారతదేశంలో తలకి ౬౫ రూపాయల దేశాదాయం అంటే ఇంగ్లాండు సంయుక్త దేశములో తలకి ౯౭౦ రూపాయలు, అమెరికా సంయుక్త రాష్ట్రా

లలో తలకి ౧౦౦౪ రూపాయలతోను పరిపోల్ప వచ్చును. మా ఉద్దేశం యీ దేశాదాయాన్ని పది హేను ఏళ్లల్లో త్రిగుణంగా చెయ్యాలని. ఏటా ౫ కోట్ల చొప్పున జనాభా పెరిగినా కూడా మా ఉద్దేశ ప్రకారం ఆ కాలంలో వ్యక్తి ఆదాయం ద్విగుణీకృతం అవడానికి వీలుంటుంది. అందుచేత యిప్పుడు మేము వేసిన అంచనా ౨౨౦౦ కోట్ల రూపాయలు ౬౬౦౦ కోట్లకు హెచ్చించాలి. ఇల్లా హెచ్చించినట్లయితే పది హేనేళ్లలో వ్యక్తి ఆదాయం ౬౫ రూపాయల నుండి రూ ౧౩౫ లు ఎక్కువ కావచ్చును ఆకాలంలోనే. అయిదేండ్ల ప్రణాళిక నారంభించిన దగ్గరనుండి పంద్రెండేండ్ల లోపుగా రష్యా దేశాదాయాన్ని అయిదింతలు హెచ్చు చేయ గలిగిందంటే మా ఆశయం చాలా వినయంగా ఉం దనే చెప్పితీరాలి.

దేశాదాయాన్ని మూడింతలు హెచ్చుచేయ డం కోసం మొదట బహుళంగా ఉన్న వ్యవసాయము తగ్గించి ఆర్థికపరిస్థితులు సరీగ్గా ఉంచడానికి యత్నిం చాలి. వ్యవసాయమే ఆర్థికసంప్రదాయంగా ఉన్న ఏ దేశంకూడా ధనధాన్యాలతో, సంపత్తితో తుల తూగడం లేదని చరిత్ర రుజువుచేస్తున్నది. ఇది కాక, ప్రస్తుతపు యుద్ధపురోజుల్లో విరివిగా పరిశ్రమాభివృద్ధి లేని ఏ దేశంకూడా స్వాతంత్ర్యం నిలబెట్టుకోవడం దుర్ఘట మని గత యుద్ధమే కాక యిప్పటి సంగ్రామం కూడా ముఖ్యమైన పాఠాన్ని మనకు చెబుతూనే ఉంది. బ్రిటిషు యిండియాలో (అనగా సంస్థానాలు విడిచి తతిమ్మా దేశం) పరిశ్రమలు, వ్యవసాయం, వ్యాపార వృత్తులు దేశాదాయానికి తోడ్పడుచున్న సంఖ్యలు క్రమంగా నూటికి ౧౭, ౫౩, ౨౨. ఈ సంఖ్యలను మేము ౩౫, ౪౦, ౨౦ కి యావ ద్భారతదేశానికి (సంస్థానాలతో సహా) రెట్టిద్దామని సూచించినాము. అంటే పరిశ్రమల నుండి వచ్చే ఆదా యం ౧౦౦ కి ౫౦౦ న్నూ, వ్యవసాయంవల్ల ఆదా యం ౧౦౦ కి ౧౩౦ న్నూ, వ్యాపార వృత్తులవల్ల ౧౦౦ కి ౨౦౦ న్నూ రెట్టించా లన్నమాట. వ్యవ సాయంవల్ల వచ్చిన ఆధాయం నూటికి ౧౩౦ అయి, పరిశ్రమలవల్ల వచ్చినది అయిదింతలైనా వ్యవసాయమే దేశంలో ముఖ్యవృత్తిగా ఉంటుంది. ఏఏటా వృద్ధి అవుతున్న జనాభా పరిశ్రమాలయాల్లో చేరిపోతూ ఉంటారనీ, మేమనుకున్న కాలాంతానికి వ్యవసాయ ములో పనిచేస్తున్న సంఖ్య ఏమాత్రమూ తగ్గిపోదనీ మా భావన.

పరిశ్రమల విషయంలో భోగ్య వస్తువులు తయారు చేసేవాటి కంటె (**Consumption Industries**) ఆధారభూతమైన వాటికి (**Basic Industries**) హెచ్చుశ్రద్ధ నివ్వాలని చెప్పినాము. ఇంకా అట్టి ఆధారభూతమైన పరిశ్రమలలో శక్తి సంపాద్యమైనది (**Power**) మొట్టమొదటిది. ఎందువలననంటే శక్తిపైననే తతిమ్మాపరిశ్రమల యభివృద్ధి ఆధారపడి ఉంటుంది. రష్యాదేశంలో కూడా మొదట విద్యుచ్ఛక్తిని కలుగ జేసే పరిశ్రమలు పూర్తి అయిన తర్వాతనే అయిదేండ్ల ప్రణాళిక ప్రారంభింపబడింది. మన దేశంలో జల పాతం ద్వారా విద్యుచ్ఛక్తిని కలుగజేసే శక్తి (**Hydro-electric energy**) ౨౬ మిలియనుల కిలోవాటు*లని అంచనా వేసినారు. ఈ అంచనాలో ఉపయోగానికి తీసుకురాబడినది కేవలం ౩ మిలియను శక్తిమాత్రమే. ఇతర ఆధారభూతమైన పరిశ్రమ లలో ఖనిజములు (**Mining**), లోహతత్వజ్ఞానము (**Metallurgy**), గృహ, రహదారి, వారధి కర్మాల యాది నిర్మాణము (**Engineering**), రసాయనాదిక ములు (**Chemicals**), సరఫరా విషయములు (**Transport**) మొదలైనవి చేర్చబడినవి. ఇతర పరి శ్రమలకు పనికి వచ్చే యంత్రాలు, పనిముట్లు, మూల వస్తువులు తయారుచేసే మూలాధార పరిశ్రమలు - వీటి అభివృద్ధిపైననే దేశభాగ్యోన్నతి ఆధారపడి ఉం టుంది.

పరిశ్రమాలయాల్లో ఖర్చులు పోను తయారయ్యే వస్తుసామగ్రికిన్నీ, అవి తయారు చెయ్యడానికి కా వలసిన మూలధనానికిన్నీ ఉండే వ్యత్యాసం ౧:౨.౩. ఈవరవడిని సంవత్సరానికి ఖర్చులు పోగా తయా

* కిలోవాటంటే విద్యుచ్ఛక్తిని ఉపయో గించుకొన్నప్పుడు దానిని కొలిచే పరిమాణము.

రయ్యే సామగ్రులు రాబోయే సంవత్సరానికి కావలసిన మూలధనాధారం కలుగజేస్తాయి. ఈవిధంగా ఏటేటా మూలధనాధారం పోగుచేస్తూవుంటే దేశాంతరాలనుండి వచ్చే మూలధనంమీద ఆధారపడడం క్రమేణా తగ్గిపోతుంది. అయితే హద్దుమీరి అతి తొందరగా భోగ్యవస్తువులను తయారు చేసే పరిశ్రమలకన్నా మూలాధారభూత పరిశ్రమలు అభివృద్ధి చేయరాదని యిచ్చట హెచ్చరించవలసి యున్నది. ప్రణాళికను అమలులో పెట్టే మొదటిరోజులలో మూలాధారభూత పరిశ్రమలకు కావలసిన యంత్రాలు, కార్ఖానాలు పై దేశాలనుండి దిగుమతి చేసుకోవలసిఉంటుంది. అనగా దేశాంతర మూలధనంమీద హెచ్చుగా మొదటిలో ఆధారపడవలసి ఉంటుం దన్నమాట. అదికాక పెద్ద తరహా పరిశ్రమలలో పైనుండి యంత్రాలు మొదలయినవి దిగుమతి అయిన దగ్గరనుండి కర్మాగారనిర్మాణం పూర్తి కాబడి, ఆధారవస్తువులు తయారై అవి ఉపయోగ మయ్యేవరకు, చాలా హెచ్చైన కాలపరిమితి ఉంటుంది. ఈ వ్యవధిలోగా ఖర్చుచేసిన ధనానికి ధరవరులని హెచ్చుచేసే లక్షణం ఉండడం కద్దు. భోగ్యవస్తువులు తయారుచేసే పరిశ్రమలు, మూలాధారభూత పరిశ్రమలు ఏవిధంగా వృద్ధికావలెనో వాటి గమనాన్ని నిశ్చయించే మరియొక ముఖ్యవిశేషం ఉంది. పెద్దతరహా మూలాధార పరిశ్రమలు ఆధునిక యంత్రాది సహాయముతో బాగా వృద్ధి పొందితే వస్తుసామగ్రు లేమో హెచ్చు కావచ్చును గాని దాని వెంబడినే శిల్పాది శాస్త్రజ్ఞులలో నిరుద్యోగం సంభవిస్తుంది. ఇప్పట్లో భారతదేశ కర్తవ్యం అన్ని పరిశ్రమలనుండి హెచ్చుచేయడమే కాకుండా ప్రజలలో చాలామందికి ఉద్యోగ సౌకర్యాలు సమకూర్చడం కూడాను. గృహపరిశ్రమలలోను, చేతిపనులలోను ఉపయోగింపబడిన యంత్రాలు మోటుగా ఉంటవి. పెట్టుబడికి తగిన ఆదాయం (ఖర్చులుపోను), వారు వాడుక చేసిన ధనానికి ప్రతిఫలం యుక్తమైన తృప్తికరంగా ఉన్నా, గంటకి తలా మనిషిచేసే తయారు కాబడిన సామగ్రిమాత్రం తక్కువ. కాబట్టి వారి జీవితపరిమాణ సౌకర్యం చాలా తక్కువ.

స్వల్పంగా దొరికే మూలధనం, విరివిగా దొరికే కార్మిక వర్గాన్ని వీలైనంత హెచ్చుగా ఉపయోగించుకొనడానికి మనం యత్నించాలి. ఈ సందర్భంలోనే మధ్యరకంగా ఉండే పరిశ్రమలు, గృహపరిశ్రమలు, చేతిపరిశ్రమలు— వీటినిగురించి ఆలోచించవలసివస్తుంది. మూలాధార వస్తువులను తయారు చేయు పరిశ్రమల కెక్కువ ప్రాముఖ్యత నిచ్చి, భోగ్యవస్తువులను తయారుచేయు పరిశ్రమలను వెనకచూపు చూచినట్లయితే ధనాధిక్యత కలిగి, అది వ్యయించడానికి మార్గము లేక, ధరలలో కల్పిత మయిన చురుకుదనం సంప్రాప్తిస్తుంది. అదికాక దేశాంతర మూలధనంమీద ఆధారపడడం హెచ్చైపోతుంది. ముఖ్యంగా ప్రణాళికను అమలుపెట్టే మొదటి రోజుల్లో ఈ పై కారణం వల్లను దేశంలో బాహుళ్యంగా దొరికే కార్మికవర్గాలకెల్లా ఉద్యోగం కల్పించడానికి, భోగ్యవస్తువులను తయారుచేసే పరిశ్రమలకు వీలైనంత ప్రాధాన్యత యివ్వబడింది. ఇల్లా ప్రాధాన్యత యివ్వకపోవడం వల్లనే రష్యావారి ప్రణాళిక చాలా చిక్కులకు, కష్టాలకు లోనయింది. రష్యనుల పద్ధతిని గాని, వారి తొందరపాటును గాని మేము అనుకరించ దలచుకొనలేదు. అందువలన అయిదేండ్ల ప్రణాళిక యొక్క మూడు భాగాల్లో కూడా భోగ్యవస్తువులను తయారు చేసే పరిశ్రమలకు సరిపడినంత వీలు నిచ్చినాము. అంతే కాకుండా ప్రణాళిక మొదటికాలంలో మూలాధార పరిశ్రమలకన్నా భోగ్యవస్తు పరిశ్రమలకు ఎక్కువ ప్రాధాన్యత యివ్వబడినది.

ఈ అయిదు విధాల పరిశ్రమాభివృద్ధికి కావలసిన మూలధనం ౨౨,౮౦ కోట్ల రూపాయలు.

మన ఆర్థిక సంప్రదాయంలో వ్యవసాయం పునాది వంటిది. దీనితో సంబంధం కలిగిన సమస్యలు పెద్దవి. చాలా చిక్కులతో కూడుకొన్నవి. అన్నిటికన్నా ముఖ్యమైనవాటిలో ఒకటి పొలముల పరిమితి అనేది. ఆస్తుల పంపకాలలో పొలాల విభజనము చాలా హెచ్చుపెరిగి ఒక సెంటుభూమికూడా దుక్కి చేయడం చూస్తున్నాము. పొలాలను యిట్లా చీలికలుచేసే దౌర్భాగ్యాన్ని సహకారపద్ధతిమీద వ్యవసాయం నడిపించి, పోగొట్టడానికి సూచనలు

చేసినాము. ఒకవిధమైన చాదస్తానికి అలవాటుపడిన మన రైతుగణం-భూస్వాములున్నూ-యీవిషయంలో శాసనాధికారం ఉంటేనేగాని లొంగరు. అందుచేత శాసనాలేకాకుండా కొంత బోధన, ప్రభుత్వంవారివల్ల ఒత్తిడికూడా కావాలి. ఉప్పెనలవల్లా, వరదలవల్లా భూమి వ్యవసాయార్హత లేకుండా పోతున్నది. వీటి విషయమై తగిన కట్టుబాట్లు ఆవశ్యకము. భూమిని వరదలవల్ల కాపాడడానికి ౨౦౦ కోట్ల రూపాయలు, పెట్టుబడివ్యయంక్రింద ౧౦ కోట్ల రూపాయలు సాలీనాఖర్చులక్రింద అంచనా వేసినాము. వ్యవసాయంలో ఔన్నత్యం లేకుండా పాడుచేసేది రైతులను పీడిస్తూవున్న ఋణబాధ. యుద్ధపురోజుల్లో యీ ఋణబాధ కొంత తగ్గినట్టుంది. వ్యవసాయంవల్ల వచ్చే ఆదాయం యీ క్రిందిమూడువిధాలా హెచ్చు చెయ్యవచ్చును:—

(౧) ప్రస్తుతంకన్నా ఎక్కువపరిమితి గల భూమిని దుక్కిక్రిందకి తీసుకునిరావడం.

(౨) పంటలో ప్రశస్తమయిన పంట పొందడానికి యత్నంచేయడం.

(౩) పై రెండువిధాల కలయిక.

బ్రిటిషుయిండియాలో ౧౦౦ కి ౧౮ పాళ్లు భూమిని బంజర్ల క్రింద లెఖ్ఖ వేసినారు. కాని వీటిలో ఎక్కువభాగం సాగులాయకు అవునో కాదో సందేహాస్పదం. ఇతరదేశాలతో సరిపోల్చిచూస్తే మన దేశంలో పంటలవల్ల ఆదాయం చాలా నికృష్టంగా ఉంటుంది. సరియైన జలాశయాలు కల్పించి, పైరులను మార్చి, మంచి విత్తనాలను వాడి, ఎరువులు సారవంతమైన గత్తాలను వాడి, శ్రేష్ఠమైన నూతనపనిముట్లను ఉపయోగించి ఫలసాయాన్ని నిశ్చయంగా హెచ్చు చేయగలము. నదులవల్ల, కాలువలవల్ల సాగుచేయబడుతున్న భూవిస్తీర్ణాన్ని ౧౦౦ కి ౨౦౦ పాళ్లు వృద్ధి చేయమని మాకోరిక. క్రొత్తపద్ధతులప్రకారం సాగు చేయడం, పశువులను పెంచి పాలు, పాలదినుసులు సరఫరాచేయడంగురించి ప్రతిఅయిదూళ్లలోను ఒక ఆదర్శసేరీ (**Dairy Farm**) ని స్థాపించుటకున్నూ, విరివిగా తత్సంబంధమైన వ్యవసాయం చేయుటకున్నూ మేము సలహాల నిచ్చుచున్నాము. దీనికి ౭౪౫ కోట్ల రూపాయలు పెట్టుబడిక్రింద, ౮౦౦ కోట్ల రూపాయలు సాలీనాఖర్చులక్రింద అంచనా వేసినాము.

పరిశ్రమలద్వారా, వ్యవసాయముద్వారా ఆదాయము హెచ్చుతూఉంటే వస్తువులు, వృత్తులు ఒకస్థలాన్నించి వేరొక స్థలానికి పోతూఉండాలి. ఈ రవానానిమిత్తం సరఫరాశాఖ (**Transport**) లో అభివృద్ధి తప్పకుండా కావాలి. రైలుమార్గాలలో ౧౦౦ కి ౫౦ పాళ్లున్నూ, రోడ్లు, రహదారీలలో ౧౦౦ కి ౧౦౦ పాళ్లున్నూ హెచ్చుకావలెనని కోరుతున్నాము. ఇట్లు వృద్ధిచేయడానికి ౯౦౦ కోట్ల రూపాయలు పెట్టుబడిక్రింద, ౫౦ కోట్ల రూపాయలు సాలీనాఖర్చులక్రింద కావాలి.

ఇంత పెద్ద ప్రణాళిక నమలులో పెట్టాలంటే యిచ్ఛతో కూడుకున్న ప్రజాదరం తప్పకుండా ఉండితీరాలి. వారు చెయ్యవలసిన దేమిటో, వారికొరకు ఏమి చేయనెంచుచున్నామో తెలుసుకోడానికి విద్య అవసరం. విద్యావంతులైతేనే వారిచ్చే సానుభూతి పనికివస్తుంది. దానిమీద ఆధారపడవచ్చును. ప్రతి అంశములోను, శాఖయందును సుశిక్షితులైన ఉద్యోగుల అవసరం ఎంతేనా ఉంది. సార్జెంటుదొరవారిచ్చిన విద్యావిధానంప్రకారము భారతదేశానికి ౧,౮౦౦,౦౦౦ మంది ఉపాధ్యాయులు కావాలి. అల్లాగే వైద్యశాలలకు, ఆస్పత్రులకు వైద్యులు, దాదులు (**Nurses**) చాలామంది అవసరం. శిల్పాదిశాస్త్రజ్ఞులు, భూమిని కొలిచేవారు (**Surveyoss**), భూతత్వజ్ఞులు (**Geologists**) యింకా యిట్టి విద్యావంతుల ఆవశ్యకత హెచ్చుగా ఉంటుంది. ఈలక్ష్యం నెరవేరాలంటే యువకులకు పనికివచ్చే విద్యావిధానమే కాక మధ్యమవిద్య (**Secondary education**), ఉన్నత (**University**) విద్య, వ్యాపార, లేక వృత్తి (**Vocational**) విద్య, శిల్పాదిశాస్త్రవిద్య (**Technical and Scientific**), శాస్త్రపరిశోధనము (**Research**) యివన్నీకూడా యివ్వవలెను. దేశాదాయంలో నూటికి ఒక అర (ఒకటిలో సగముపాలు) శాస్త్రపరిశోధనక్రింద వెచ్చించా

లని మాకోరిక. ఇన్నివిధాల విద్యలకి కావలసిన పెట్టుబడి ౨౬౭ కోట్లరూపాయలు, సాలీనా ౨౩౭ కోట్ల రూపాయలు.

మేము తయారుచేసిన ప్రణాళికక్రింద మొత్తం వ్యయం ౧౦,౦౦౦ కోట్లరూపాయలు. ఈధనం యీక్రిందివిధంగా పంచబడినది:—

	రూపాయలు (కోట్లలో)
పరిశ్రమలు	౪౪౮౦
వ్యవసాయం	౧౨౪౦
సరఫరా	౯౪౦
విద్య	౪౯౦
ఆరోగ్యం	౪౫౦
గృహనిర్మాణం	౨౨౦౦
యితరవిషయములక్రింద	౨౦౦
	౧౦,౦౦౦

ఇటుతరవాతిసమస్య యింత పెద్దమొత్తాన్ని ఏ విధంగా సేకరించగలమనేది. ఈవిషయములో దేశాంతరములనుండి వచ్చే సామగ్రులకు, విదేశీయులు మన దేశంలో చేస్తూఉన్న వృత్తులకు ప్రతిఫలంగా వెచ్చించే ధనానికి కావలసినది బాహ్యరాజస్వము (External Finance). ఇంక దేశంలో ఆంతరంగికముగా కొంత సేకరించాలి. దీనికి ఆంతరంగికద్రవ్యమని (Internal Finance) వ్యవహరించినాము. బాహ్యరాజస్వము వచ్చే మార్గాలు ఈక్రింద సూచింపబడినవి:—

	రూ. కోట్లు.	రూ. కోట్లు.
దేశంలో నిలవచేసుకున్న ధనం	౩౦౦	
ఇంగ్లాండులో బంగారునాణెముల నిలవబాకీ	౧౦౦౦	
దిగుమతులు పోగా ఎగుమతుల వల్ల మిగిలే ఆదాయం	౬౦౦	
విదేశీయుల రుణం	౭౦౦	౨౬౦౦

ఆంతరంగికరాజస్వాన్ని యీక్రిందివిధముగా కేటాయించాము:-

ప్రజ నిలవచేసుకున్నది	౪౦౦౦	
'సృష్టించిన' ద్రవ్యం	౩౪౦౦	౭౪౦౦
		౧౦,౦౦౦

అంతర్జాతీయస్థానికనిధి (Bank) ౧౯౩౪-౩౫ సంవత్సరములలో మన దేశంలో నిలువగా కూడబెట్టిన ద్రవ్యాన్ని ౧౫౦౦ కోట్ల రూపాయలని అంచనా కట్టింది. ఇప్పట్లో నిలవధనం ౧౦౦౦ కోట్లని అంచనా వెయ్యవచ్చు. నిలవధనాన్ని బాహ్యరాజస్వంగా ఎందుకు నిర్వచించారని అడుగుతారేమో ? దిగుమతి చేసుకొనే దినుసుల వెలను ఎంతమట్టుకు నిలవబంగారముతో యివ్వగలుగుదుమో అంతకన్నా నిలవకి ఎక్కువవిలవ లేదు. మాప్రణాళికను విమర్శచేసిన వారిలో కొంతమంది నిలవధనంక్రింద ౩౦౦ కోట్లు అంచనాకట్టడం సమంజసంగా లేదన్నారు. నిలవచేసిన వారు సామాన్యప్రజ (Masses) కాబట్టి అంతపైకము వారివద్దనుండి ఊడిపడ దన్నారు. మానమ్మకంమాత్రం వేఱు. జాతీయప్రభుత్వమేగనక ఏర్పాటుఅయితే దానియందు ప్రజకి విశ్వాస ముంటుంది. నిలవని ఊడ పీకడానికి క్రమమయిన మార్గాలు కనిపెట్టబడితే అది తప్పకుండా బయటపడుతుంది. నిన్నమొన్నటిదాకా యిబ్బంది లేమీ లేనివారుకూడా బంగారాన్ని కూడ బెట్టినారని మనము ఆలోచించినట్టయితే, సదుపాయమైన పరిస్థితులు కల్పిస్తే యిది (నిలవధనం) తప్పకుండా బయటపడుతుంది.

ఇంగ్లాండులో నున్న బంగారు నిలవ బాకీ మన అవసరానికి రాదనే ప్రశ్నను గూర్చి వాదోపవాదాలు యితీవల జరిగినవి. నాణెముల ఏర్పాటుకు యీ బంగారు నిలువ తరుచుగా నుంచినందువల్ల ఇట్టి వాదాలకు, చిక్కులకు అవకాశం కలిగిఉండవచ్చు. నాణ్యముల యేర్పాట్లు అనే యింద్రజాలంతో నిలవలో పెద్దభాగాన్ని మాయం చేస్తారని కొంతమంది భయపడ్డారు. ప్రజ తమ రక్తాన్ని, చెమటని, కన్నీళ్లని, శ్రమని ధారపోసి యీ నిలవను సంపాదించిందన్నమాట వీరు మరచిపోతారు. ఆ నిలవ ప్రజ చేయక తప్పని నిలవ. బలాత్కారమువల్ల కలిగినది. దేశంలో భోగ్యవస్తువులను అనుభవించే భాగ్యం లేకుండా చేసి ఆర్థిక (వ్యయ) సంప్రదాయాన్ని రమారమి శిథిలమైనదాకా తెచ్చిపెట్టి యీ నిలవని పోగు చేశారు. ఇంతకష్టంతో, ఇంత త్యాగంతో సంపాదించిన నిలవ నాణ్యాల ఏర్పాటు అనే గారడీవిద్యచేత

మాయం చెయ్యడానికి వీలులేదు. ఈ విషయాల్లో ప్రామాణికులైనటువంటి రిజర్వునిధి గవర్నరుగారైన సర్ చింతామణి దేశముఖుగారు యిల్లా చెప్పారు:—

"విదేశీయ ఆస్తుల అభివృద్ధికిన్ని, ఆంతరంగికమైన వ్యాప్తికి, లేక ద్రవ్యసంబంధమైన ఉబ్బుదల (నాణెము లధికములై ధరలు చురుకుగా నుండుట) కు సహజమైన గాని, అవసరమైనగాని సంబంధము లేనేలేదు. ఈ రెండు విషయాలను ముడిపెట్టడం కేవలం యిచ్ఛామాత్రం."

నాణ్యముల ఏర్పాట్లకు యీ నిలవ కుదువగా ఉన్నా దాన్ని మనము మదుపుధనం (Capital fund) గానే భావించుకొనవచ్చు. పరిశ్రమల వ్యాప్తికోసం విదేశాలనుండి మూలసామగ్రులు దిగుమతి చేస్తే వాటి ఖర్చులు భరించడానికి పనికివస్తుంది. ఈ నిలవ అదృశ్యమైపోవడానికి నా కొక్క మార్గమే కనిపిస్తూన్నది. రూపాయ నాణ్యం మూల్యం గనక హెచ్చు చేసి మారకాన్ని (exchange) పరిసమానంగా ఉంచకపోతే యిది జరగవచ్చును. ఇండియా ప్రభుత్వం వారు అంతర్జాతీయ నాణ్యముల ఒడంబడిక చేసుకున్నా మానినా, లేక రూపాయని ఇంగ్లాండులో బంగారు నాణెముతోను, అమెరికా డాలరు నాణెముతోను సంబంధం ఏర్పరిచినా లేకపోయినా, మారకపు రేటు మాత్రం అంతర్జాతీయ కొనుబడి తాహత్తు (International purchasing power parity) కు సరిపోయే విధంగాను, దిగుమతులు ఎగుమతులకు సరాసరి ఉండేలాగ నియమించడం మాత్రం వారి ప్రథమ కర్తవ్యం.

పైకారణాలవల్ల యింగ్లండులో ఉన్న బంగారం నిలవ మనకు లభిస్తుం దని భావిస్తూఉన్నాము. ఇది ఏరూపంగా లభిస్తుందో, ఎప్పటిలోగా లభిస్తుందో భారతదేశం బ్రిటనుతోను, అమెరికా సంయుక్త రాష్ట్రాలతోను చేసుకోబోయే యుద్ధానంతర నాణ్యముల యేర్పాట్ల ఒడంబడికపైని ఆధారపడి ఉంటుంది. యీ వస్తు నిలవకూడా పది సంవత్సరాల లోపుగా లభ్యం కావడానికి ఏవిధమైన అడ్డు ఉండకూడదు. మనము గాని అంతర్జాతీయ ద్రవ్యపు టొడంబడికలో చేరినట్లయితే దీనిలో (నిలవలో) కొంత భాగాన్ని డాలరుల క్రింద మార్చుకొనవచ్చును.

యుద్ధానికి పూర్వం దిగుమతుల విలువ పోగా ఎగుమతుల క్రింద నిలవ సాలుకి ౮౦ కోట్ల రూపాయలని వేసిన అంచనా యీ పదిహేనేళ్లకూడా మనకు లభించవచ్చును. వ్యవసాయాదాయాన్ని మేము తగ్గించిన మాట వాస్తవమే. కాని, దేశంలో అవసరములను చేకూర్చడానికి ద్రవ్యసేచన చేసే కొన్ని పంటలు ఎగుమతి కాబడుతవి. దీనితో పరిసమానంగా పరిశ్రమలుకూడా అభివృద్ధిని పొందుతవి. దేశానికి కావలసిన తినుబడిపంటలు పండించబడుతవి. వెంటనే దిగుమతుల మొత్తం క్షీణిస్తుంది. మనము విదేశీయరుణాలను చాలామట్టుకు తీర్చివేసినాము. కాబట్టి సాలీనా ౮౦ కోట్ల రూపాయలు దిగుమతుల విలువ పోగా ఎగుమతుల క్రింద నిలవగా మనకు లభించితీరవలెను.

విదేశీయఅప్పుల మొత్తం ౭౦౦ కోట్లు వేశాం. మనము ద్రవ్యాన్ని గనక సృష్టించడం మొదలుపెట్టితే, విదేశీయరుణాలు దొరకవని అన్నారు. సృష్టిచేయబడిన ద్రవ్య మేమో త్వరలోగా సామగ్రులను తయారు చేయించి వెంటనే తీర్మానాన్ని పొందుతుంది. అంచేత విదేశీయరుణాలు దొరకడానికి అడ్డంకి అవుతుందని మేము తలచము.

దేశంలో కూడికద్వారా నిలవచేసుకొనే మొత్తం దేశాదాయంలో నూటికి ఆరువంతులని అనుకున్నాము. ఈవరవడిని పదిహేనేళ్లకి కూడికనిలవ ౮౦౦౦ కోట్లు కావాలి. మాఅంచనాకన్నా ఎక్కువ కూడికధనం ప్రాప్తమయితే 'సృష్టించవలసిన ద్రవ్యం' మొత్తం తగ్గిపోతుంది. అల్లా కానప్పుడు సృష్టించవలసినద్రవ్యం ౩౮౦౦ కోట్లూ ఉండవలసినదే. ఈ మాఅభిప్రాయం కల్పితనాణ్యాలవల్ల ధరలు పెరిగించడమేననే విమర్శకు గురిఅయింది. అయితే యిప్పుడు అమలులో ఉన్న ధరల ఉబ్బుదలకు (రూపాయనోట్లు హెచ్చుగా ముద్రించడంవల్ల) మేము చేసిన కల్పితధనానికి చాలా భేదం ఉంది. ఇప్పుడు ధరల్లో చురుకుతనం, నోట్ల చలామణికి కారణం ప్రజలలో కొనుబడితాహత్తు (Purchasing power) కిన్ని, దొరికే వస్తువులు,

వృత్తుల (Services) కున్న మధ్య ఉండే వ్యత్యాసమే. మేము చేసిన సూచనలలో కల్పితమైన యావత్తు సొమ్ము యిప్పటి రూపాయనోట్లు లాగకాక సామగ్రులు తయారుచేయడానికి ఉపయోగపడుతుంది. ధరలు పెరుగుతాయని ఏమాత్రం భయం లేదు. అయితే సామగ్రులు తయారయ్యేదాకా యిది ఉండవచ్చు. ఈ చికాకు లేకుండా వ్యక్తుల ఆర్థికజీవితంలో ప్రతిఅంశమును ఖచ్చితంగా ఖాయిదా చెయ్యాలని సూచించినాము.

పదిహేనేళ్ల ప్రణాళికకూడా ఐదేళ్ల చొప్పున మూడు భాగాలు చేయబడినది. మొదటి భాగంలోని వ్యయంకన్నా తరువాతి భాగంలో వ్యయం ద్విగుణంగా హెచ్చించబడినది. మొదటిభాగంలో ౧౪౦౦ కోట్లు, రెండవ భాగంలో ౨౯౦౦ కోట్లు, మూడవ భాగంలో ౫౭౦౦ కోట్లరూపాయలు. అభివృద్ధిఅంతస్థులను నిర్ణయించడంలో దేశంలో ఆసమయానికి దొరికే కార్మికపాటక జనసంఖ్య, పెట్టుబడిక్రింద వచ్చేధనం, యాజమాన్యనిపుణత (Managerial Ability) యొక్క లభ్యత్వం గమనించబడినవి. మొదటిలో చాలామంది శిల్పాదివిజ్ఞులను (Technicians) దిగుమతిచేసుకోవలసివస్తుంది. రాను రాను మన కార్మికులను, పైతరగతి ఉద్యోగులను సుశిక్షితులనుగా చేయవలెను. మూలాధార వస్తువులు తయారుచేయడానికి మొదటిలో యంత్రములను కార్ఖానా (Plant) లను విదేశాలనుండి తెప్పించుకోవలసివస్తుంది. ప్రణాళికలో వీటి అన్నిటికి తగ్గనన్ని ఏర్పాట్లు చేయబడినవి. ఈకారణములవల్ల మొదటి అయిదేడులలో ౧౪౦౦ కోట్ల రూపాయలకన్నా హెచ్చువ్యయం చేయడానికి తలపెట్టలేదు. అయిదేడులలో ౧౪౦౦ కోట్లు, అనగా సాలీనా ౨౮౦ కోట్ల రూపాయలు వ్యయంచేయడానికి భారతదేశంలో తాహత్తు లేదనడం భావ్యం కాదు. ౧౯౩౯ సంవత్సరాంతంనుండి యిప్పటిదాకా ఇండియాప్రభుత్వంవారి వ్యయం సకటున ౪౮౦ కోట్లు సాలీనా; గత సంవత్సరమాత్రానికే దరిదాపు ౮౦౦ కోట్ల రూపాయలయిందికాబట్టి మాఅంచనా సరియయినదని మా జబాబు. భారతదేశానికి అయిదేండ్లలోగా ౧౪౦౦ కోట్లున్ను, సాలీనా ౨౮౦ కోట్లున్ను వ్యయించడానికి తాహత్తు లేదని ఎవ్వరూ సందేహించరు. యుద్ధానంతరం ధరలుగాని తగ్గినట్టయినా అంతపాటి వ్యయం ఎలాగా చెయ్యవలసివస్తుంది. తరువాత భాగాలకి ముందుకాలంలో తయారయ్యే సరుకులు, విదేశీయమూలధనంపైని ఆసరా పూర్తిగా పోయేదాకా మూలధనంగా పనిచేస్తాయి. ఇవన్నీ అమలుపెట్టడానికి సూచింపబడిన తీక్ష్ణత (Tempo) చాలా భావ్యంగా చెప్పబడినది. భోగ్యవస్తుపదార్థాలపై ఎక్కువదృష్టి ఉంచబడినది. అంచేత ప్రజకు ఏమాత్రం కష్టంకూడా కలగదు. నా కున్న యీ కొద్దికాలంలో, దీని విషయమై, ప్రణాళికలో చెప్పిన సూక్ష్మవివరాలన్నీ చర్చించడానికి వీలులేదు. కాని మేము వర్ణించిన మూడు అయిదేండ్ల భాగాలను బాగా పరీక్షచేసినట్లయితే పైని నేను చెప్పినదల్లా నిజమని తేలితీరుతుంది.

ప్రణాళికలో వివరాల గమనిక పూర్తిఅయింది. ఇప్పుడు దానిపైని వచ్చిన విమర్శలకు జబాబు లివ్వవలసియున్నది. ప్రణాళికను తయారుచేసిన మేము యుద్ధానంతరం జాతీయప్రభుత్వం స్థాపించబడుతుందని ఉత్సాహంతో విశ్వసిస్తున్నామనీ, అది పొరబాటనీ అన్నారు. అటువంటి జాతీయప్రభుత్వమేగనక స్థాపింపబడకపోతే ప్రణాళిక ఎంతమాత్రమూ అమలులో పెట్టడానికి వీలులేదు. జాతీయప్రభుత్వమే కాదు; దేశంలో ఆర్థికసమత్వంకూడా మే మాశిస్తున్నాము. ఎంతవరకు అట్టి సమత్వం లభ్యంకాదో అంత పర్యంతం ప్రణాళిక చెడుతుంది. ఒక వేళ పూర్తిగా పనికిరాకపోవచ్చుకూడాను.

ప్రణాళిక సమగ్రంగా లేదని అన్నారు. ప్రభుత్వయాజమాన్యానికిన్ని, ఆర్థికవస్తు సామగ్రులు ప్రజలలో పంపకాని (Distribution) కిన్ని తావివ్వ లేదని అన్నారు. మేము ఆ మాట చెప్పనే చెప్పినాము. ఇంకొక రహస్యం. ప్రభుత్వయాజమాన్యం (Govt. Control) ప్రజలలో వస్తుపంపకం (Distribution), వ్యక్తిగతోద్యమాల (Private enterprise) కు రాజోద్యమాలకు సంబంధం, యుద్ధానంతరం ఖాసాదార్ల (పెట్టుబడిదార్లు : Capitalists)

ఆర్థికసంప్రదాయాలు, వాటికి వచ్చే అడ్డంకులు, పాటకసమస్యలు (Labour), సాంఘికస్థిరత్వము మొదలైన విషయాలను గురించి సంచిక నొకదానిని ప్రచురించాలని మొదటిలో మేము ఉద్దేశించాము. కాని ప్రజకు సంచిక మూలంగా బోధపరిచినతరువాత ప్రణాళికను తయారుచేస్తే అనవసరంగా కాలాతీతం అవుతుందనిన్ని, అంతకన్నా భారతదేశ ఆర్థిక పునర్జన్మ (Economic Regeneration) కొఱకు అన్నివిధాలా తగిన ప్రణాళికయొక్క ఆవశ్యకతను గూర్చి ప్రచారంచెయ్యడం అవసరమనీ తోచింది. ఉత్సాహాన్ని, చర్చలుఫలపడానికి కోరికను ప్రజలలో కలిగించడానికే మే మీ ప్రణాళికను తయారుచేసినది. కాని యిందులో సూచింపబడిన ప్రతిఅంశాలనుగూర్చి వివరాలు విపులంగా చర్చించి తరువాత ప్రకటిద్దామని అనుకున్నాము.

ఒక విమర్శకుడేమన్నా మేము ధనికులను మరీ ధనవంతులుగాను, పేదలను యింకా నిరుపేదలుగాను చేయడానికి ఉద్దేశించామని అన్నాడు. తయారుకాబడిన వస్తుసామగ్రులు ప్రజలలో పంపకవిషయమై మేము వివరింపకపోయినా, వ్యక్తులలో జీవితసౌకర్య పరిమాణం వృద్ధిచెయ్యాలనే సదుద్దేశంతో యీ ప్రణాళిక ఆరంభింపబడింది. అందులోను, మానవునికి కావలసిన భోజనము, బట్ట, ఉనికి, ఆరోగ్యము, విద్యావిషయాలన్నీ లక్ష్యంగా పెట్టుకున్న దీనిని వైవిధంగా విమర్శించడం కేవలం హాస్యాస్పదము.

ప్రభుత్వఖాయిదాలవిషయంలో రెండువిధాలైన విమర్శలు వచ్చాయి. మేము పారిశ్రామికులము కాబట్టి మా స్వలాభానికొరకే ప్రణాళికను తయారుచేశామనీ, తద్వారా కాకతాళీయంగా దేశానికి లాభించవచ్చుననీ కొంద రన్నారు. మరికొందరు మా ప్రణాళికను కత్తిలేని సామ్యవాద (Socialism) మనీ, ఫాసిజం అనీ, ప్రతిపెట్టువద్ద ప్రభుత్వశాసనం, ఖాయిదా సూచింపబడినయి అనీ అన్నారు. ఈ రెండు విమర్శలు కూడా తప్పని మేము చెప్పుతున్నాము. పారిశ్రామికులు వారి యిష్టం వచ్చినట్లు డబ్బుచేసుకొనడమే మెంత మాత్రం కోరము. ఆర్థిక పద్ధతి గతంలో కాని, యికముందుకాని ప్రభుత్వ ఖాయిదాను దేశ మంతటికీ ఉపయోగపడేటట్లు వర్తింపిస్తుంది. కాని అన్యథా కాదు. ప్రణాళిక నడపడంలో ప్రతి అంశములోను ఆర్థిక జీవితాన్ని కఠినఖాయిదాలకు లోబరచాలనే మేముకూడా చెప్పినాము. ఈఖాయిదా ఒక్కొక్కప్పుడు వ్యక్తిస్వాతంత్ర్యాన్ని, ఉద్యమాలను ఆరంభించేందుకు స్వేచ్ఛను లేకుండా చేయవచ్చుకూడాను. అల్లా కాకుండా ఉండాలనే మా ఆశ; కాని ప్రణాళికను తయారుచేసిన నా యితర స్నేహితుల అభిప్రాయాలు ఎల్లా ఉన్నా నేను మట్టుకు సకలప్రజోపయోగార్థమై ప్రభుత్వంవారి ఖాయిదా వచ్చినట్లయితే తప్పకుండా దాన్ని అమలు చెయ్యడానికి అభ్యంతరం చెప్పను. ఈ యుద్ధం రోజుల్లో ప్రభుత్వఖాయిదా ఎల్లా ఉందో చూస్తూనే ఉన్నాము. యుద్ధం అయిపోయిన వెంటనే యిది ఆపివేయబడుతుం దని మాలో బహుకొద్దిమందే భావిస్తున్నాము. ఎగుమతులు దిగుమతులపైనను, కొన్ని వస్తువులకు అన్నిటికంటె ముందు ప్రాముఖ్యత (Priority) యివ్వడంలోను ఖాయిదా కొంత కాలంవరకు ఉండితీరాలి. బాహ్యాంతరాల మూలధనంపైని, దేశంలోను పైనను ధనాన్ని బ్యాంకులలోను షేర్ల క్రిందను వేయడం (Investment) లోనూ తగినంత ఖాయిదా మా ప్రణాళికలోనే సూచింపబడిఉన్నది. ఫాసిస్టు, లేక యితర నిరంకుశ దేశాల ఆర్థిక సంప్రదాయాన్ని మేము ఒప్పుకొనము. ప్రజాస్వామిక స్వాతంత్ర్యాన్ని నిలబెట్టుకుంటూ మేము అనుకున్న లక్ష్యాలను చేరగలమనే మా అభిప్రాయం. రాజకీయ వాతావరణమంతా ప్రజాస్వామిక ఖాయిదాలను పురస్కరించుకొని వ్యక్తిగతోద్యమాలను (Private enterprise) ఒక పద్ధతికి లోబడచే యాజమాన్యం క్రింద నడపబడితే యిది తప్పకుండా సిద్ధిస్తుంది.

మేము చేసిన ద్రవ్యసంబంధమైన సూచనలు ప్రసిద్ధి కెక్కిన కొంతమంది ఆర్థికశాస్త్రజ్ఞులు కూడా హెచ్చుగా విమర్శించారు. ఇందులో సూచనలను వివరించే ఆ యా చోట్ల విమర్శకు తగిన సంజాయిషీ చెప్పినాను. వాటిని పునశ్చరణచేసి పాఠకులను విసిగింపదలచుకోలేదు.

అను : బక్షీ నారాయణరావు.

కాంచన

[నాటిక]

= శ్రీ మూర్తిబాబు =

తక్షశిలలో ఉపగుప్తాచార్యుని ఆశ్రమోపవనం. వసంతకోకిలల కుహూకుహూ నినాదాలు దూరపు కొండలమీది సెలయేళ్ల గలగలశబ్దాలలో ప్రతిధ్వనించి ఒక వినూత్న స్వరాన్ని సృష్టిస్తున్నాయి. వాటి నమకరిస్తూ—

కాంచన

కుణాలా! ఏమి టంత తీవ్రంగా ఆలోచిస్తున్నావు? అదిగో ఆ మామిడిగున్నమీది మగకోయిల చూడు!

కుణాలుడు

అవును కాంచనా! అది ఋతులక్షణం. ముదురు చిగుళ్లు మరగిన మగకోయిలకు తన ప్రియురాలి సౌకుమార్యం ఎలా అర్థమౌతుంది చెప్పు!

కాంచన

అది ఋతులక్షణమా! ఆ తుమ్మెద చూడు. తామరలతోబాటు కలువలుకూడ తన్ను ఆహ్వానిస్తున్నా, అది తామరలమీదే వాల్తోంది. అబ్బా, ఎంత పక్షపాతం!

కుణాలుడు

పిచ్చిదానా! అది పక్షపాతం కాదు; జాతిలక్షణం. ఆ భ్రమరం తేనెకోసం వస్తే, ఆ నీటికాకి చూడు చేపలకోసం ఎలా పొంచి చూస్తోందో. ఆయా జాతిలక్షణాలు ప్రకృతిలోనే భేదించినవి.

[పెద్దగాలి]

కాంచన

అబ్బా... అటుచూడు, ఆ కలువ తేనె త్రాగుతున్న తుమ్మెదను లేవగొట్టడానికి కాబోలు తామరపువ్వుమీద పడుతోంది.

కుణాలుడు

అవును. ఆ తామర తానే దూరంగా తప్పుకోవడం చూడు. ఆ ఓర్వలేనితనానికి యీ ప్రతిక్రియ చక్కగా ఉందికదూ?

కాంచన

పాపం! దుష్టులకు దూరంగా ఉండడం మంచి దనుకున్నట్టుంది.

కుణాలుడు

ప్రకృతి రహస్యాలు యిప్పటికయినా అర్థమవుతున్నాయా కాంచనా?

కాంచన

కుణాలా! ఈ రోజంతా భావగర్భితంగానే మాట్లాడుతున్నావే!

కుణాలుడు

ఏముంది కాంచనా, ఏదో తుమ్మెద పూవులను గురించి నీవు చెబితే మనుష్య ప్రకృతికూడా అలా ఉండవచ్చు నన్నానే కాని మరేం లేదు.

కాంచన

అబ్బా, మరేం లేదా! అయితే యిక నాతో మాట్లాడ నక్కరలేదులే.

కుణాలుడు

అదిగో, అంతలోనే కోపమా! ఏదీ ముందు నీ వొక చిన్న నవ్వు నవ్వితే... అంతవరకు నేనూ మాట్లాడను.

కాంచన

అంతా చిలిపితనమే. అవును మరి. కోపంకూడా అందాన్నిచ్చే కళ్ల లో చిలిపితనం మరెంత రాణిస్తుందో!

కుణాలుడు

అవును. నీ కోపంలోని నవ్వు నల్ల కలువల్లోని పారిజాతంలా మిలమిలలాడితే ఎవరైనా దొంగిలిస్తా రని భయపడుతున్నట్టున్నావు.

కాంచన

అహ్హహ్హ! మాట్లాడనని ఎలా మాట్లాడావు?

కుణాలుడు

మరి నీవో!

(ఆ ఆనందంలో వారిరువురూ ఏకవాహినియైన రెండు సెలయేళ్లయ్యారు.)

[తెరలో] కాంచనా!

కాంచన

నాన్నగారు! కుణాలా, గురుపాదులు పిలుస్తున్నారు, వినిపించటం లేదూ?

కుణాలుడు

ఉపగుప్తులే! కాంచనా, నాసర్వస్వాన్ని నీవశం చేసిన తరువాత ఎలా వినిపిస్తుంది చెప్పు.

(ఉపగుప్తాచార్యుని ప్రవేశం)

ఉపగుప్తుడు

కుమారా!

కుణాలుడు

గురుపాదులకు వందనం.

(కాంచన అర్ధనిమీలిత నేత్రాలతో, నునుసిగ్గు తొణికిసలాడే మోములోని రక్తిమను తండ్రికి చూపకుండా ఉండడానికో అన్నట్టు తలవంచింది.)

ఉపగుప్తుడు

కుమారా, బుద్ధదేవుడు మిమ్ముల ననుగ్రహించుగాక! రాజధానీ నగరంనుంచి వచ్చినప్పటినుంచీ ఎక్కడా కనుపించడం లేదే అంతగా?

కుణాలుడు

క్షమించాలి. ఆశ్రమానికి వస్తూనే ఉన్నాను.

ఉపగుప్తుడు

ఓహో! ఆశ్రమంలో ప్రకృతిపాఠాలు నేర్చుకుంటున్నట్టున్నావు. కుమారా, నీ వీ మధ్య ఏదో తీవ్రాలోచనలో ఉన్నట్టున్నావే?

కుణాలుడు

ఏమీ లేదు. భగవానుడైన బుద్ధదేవుని దివ్యక్షేత్రాలు సేవించా లనే సంకల్పం కలిగింది. దానిని గురించి...

కాంచన

మొన్నటివరకు తిరిగివచ్చి మళ్లా వెళ్లాలనా ఆలోచన!

ఉపగుప్తుడు

అవునమ్మా, యీసారి నీతో కాబోలు.

కుణాలుడు

ఇంకా ఆలోచించలేదు.

ఉపగుప్తుడు

అసలు వచ్చిన విషయం మరిచాను. కుమారా, రాజధానీ నగరంనుంచి వార్తాహరుడు వచ్చి వేచియున్నాడట.

కుణాలుడు

కెలవు.

(నిష్క్రమిస్తాడు.)

౨

తక్షశిలానగరంలో కుణాలుని మందిరం. మేజామీది పుష్పాలు, గోడలనున్న పటాలు, సంగీత పరికరాలూ అతడు ప్రకృతిసౌందర్యోపాసకుడని చెబుతున్నాయి. గోడ మధ్య నున్న పెద్దపటం పూలమాలలతో అలంకరింపబడి ఉంది. యువరాజు దీర్ఘాలోచనతో పచారుచేస్తూ—

అమ్మా! నా కళ్ళతో నీ అమృతమయమూర్తిని తనివితీరా చూశాను. పండువెన్నెలలో జారిపడు నక్షత్రకాంతిలా నవ్వే కాంచన నవ్వును నాకళ్లలో ప్రతిబింబింపజేసుకున్నాను. బుద్ధదేవుని దివ్యస్వరూపానికి దేవాలయాలైన నా కళ్లు నా పినతల్లి కామవాంఛకు గురిఅయ్యాయి. ఈ కళ్లే కాంచనలో ప్రేమను, పినతల్లిలో కామాన్ని వృద్ధి చేశాయి. అబ్బా! ఇంత పరస్పర విరుద్ధ స్వభావాల కలయికలైన కళ్లలోని అందం కూడా శత్రువే అయింది. 'కుణాలా, పాముతో చెరలాడుతున్నావు. అపాయంసుమీ!' అన్న పినతల్లి ఎంతైనా చేయగలదు. బుద్ధదేవుని సాక్షిగా నా సర్వస్వం కాంచనదే. నా కళ్ళలో కాపురం చేయతగ్గ ప్రేమైక జీవి కాంచనే. తుచ్ఛకోర్కెలకు స్థానం కాలగర్భమే!

(సేవకుడు ప్రవేశించి)

యువరాజులకు జయం.

కుణాలుడు

ఎవరది?

సేవకుడు

రాజధానినుండి వార్తావహుడు ప్రభూ!

కుణాలుడు

మంచిది! ప్రవేశపెట్టు.

(వార్తావహుడు ప్రవేశించి)

జయము, జయము, యువరాజులకు.

కుణాలుడు

ఏమైనా ముఖ్యమైన వార్తలా?

(వార్తావహుడు రాజముద్రతో నున్న కాగితము నందిస్తాడు. కుణాళుడు కళ్ళ కద్దుకొని చదువుతాడు.)

కుణాలుడు

'కుణాలుని కండ్లు పెరకి దేశాంతరానికి పంపాలి.— తిష్యరక్షిత.' ఆఁ! కండ్లు పెరకమని ఆజ్ఞ! చక్కగా ఉంది. ఏ కండ్లయితే ఆమెకామవాంఛకు జన్మస్థానాలైనవో ఆ కళ్లే దానికి స్మశానవాటిక కావాలని ఆశించింది. పగ తీర్చుకోవడంలో నైనా కొంత పరమార్థం చేకూర్చుకుంది. రాజాజ్ఞ శిరసావహిస్తాను.

అయితే తండ్రిగారెక్కడ?

వార్తావహుడు

చక్రవర్తులు రాజధానిలోనే ఉన్నారు ప్రభూ. ఏడు దినాలు రాణిగారు పరిపాలన కనుజ్ఞ తీసుకొని రాజ్యాన్నేలుతున్నారు ప్రభూ. నా చేతులతో తమ కళ్లు......

కుణాలుడు

మంచిది. నీకార్యాన్ని నీవు నెరవేర్చుకో. రాజాజ్ఞను వ్యతిరేకించడానికి తగినంత ధైర్యం ఉందా?

వార్తావహుడు

ధైర్యం లేకపోయినా హృదయముంది ప్రభూ!

కుణాలుడు

ఆ ఈర్ష్యాగ్ని ముందు యీసౌందర్యం

ఏపాటిది! పిచ్చివాడా, నీది పేదగుండె అయితే అదికూడా ఆ అగ్నికి ఆహుతౌతుంది. జాగ్రత్త. రాజాజ్ఞ నెరవేర్చు.

(కాంచన ప్రవేశం)

వార్తావహుడు

ప్రభూ! గురుపుత్రి.

కుణాలుడు

ఆఁ, [illegible] నే !

కాంచన

ఎక్కడి కీ ప్రయాణం కుణాలా? నాతో చెప్పకుండానే వెళదామనా?

కుణాలుడు

కాదు... ఏమీ లేదు. ఇప్పు డీ అసమయంలో వచ్చా వెందుకు, కాంచనా?

కాంచన

నీ వింత కఠినుడ వనుకోలేదు. ఎక్కడికో వెళుతున్నావు కదూ నాతో చెప్పకుండా.

వార్తావహుడు

(కన్నీటితో) అమ్మా, యువరాజులు చెప్పలేకుండా ఉన్నారు. దీని కంతకూ కారణం రాణి తిష్యరక్షితా దేవి.

కాంచన

ఏమైంది చెప్పు. నీవైనా చెప్పవా?

(వార్తావహుడు ఆజ్ఞాపత్రిక నిస్తాడు. కాంచన 'ఆఁ' అని నిశ్చేష్ట యైంది.)

కుణాలుడు

అబ్బా! అనుకున్నంతా అయింది. సేవకా, గురుపుత్రిని పేద చేర్చి ఆశ్రమానికి చేర్పించు. (వార్తావహునితో) ఇక నడు. ఆమె తెలివితేరకు చూస్తే నీ ప్రాణాలు దక్కవు. రాణిగారి ఆజ్ఞ నెరవేర్చుకో.

వార్తావహుడు

ప్రభూ, గురుపుత్రి... అచేతన...

కుణాలుడు

ఊఁ. ధర్మానికి హృదయం లేదు. నడు.

(నిష్క్రమిస్తారు.)

3

పట్టణం వెలుపల.

కుణాలుడు

ఇప్పటికి నా పినతల్లి క్రోధం తీరిఉంటుంది. ఇక నాజీవితం శాంతంగా బుద్ధదేవుని సేవలో గడుపుకోవచ్చు.

(తెరలో) కుమారా! కుణాలా!

కుణాలుడు

ఎవరది? నా కాంచన కంఠంలా ఉందే? గురుపాదులు సహితం వచ్చిన ట్టున్నారు!

ఉపగుప్తుడు

కుమారా! ఈర్ష్యే జయించింది నాయనా. ఇక యీ ప్రకృతి సౌందర్యాన్ని చూచి తన్మయుడవయ్యే యోగ్యత పోయిందా!

కాంచన

కుణాలా, నన్ను ఏకాకిని చేసి దేశాంతరం పోవాలనుకున్నావా? అబ్బా! కరుడు కట్టిన సౌందర్యంలా కలకల నవ్వే కళ్లను కడుపున పెట్టుకున్న పిన్నత్తగారి అసూయ యిప్పటికి చల్లారింది.

కుణాలుడు

కాంచనా, పెద్దలయందు ఈర్ష్య తగదుసుమా! గురుదేవా, సర్వం తెలిసిన తమరు కూడా ఈర్ష్యే జయించిం దంటున్నారా? ఈ జయం క్షణికం. మానవుడు తాత్కాలిక కష్టాలకు గురికావడం కూడా ప్రకృతిసహజమే!

ఉపగుప్తుడు

కుమారా, నీ కష్టసహిష్ణుత మానవాతీతం. ఈ పరీక్షలు నీ స్వచ్ఛతకు గీటురాళ్లు నాయనా.

కుణాలుడు

ఆచార్యా, విధి బలీయం కదా! పినతల్లి కళ్లు తీయించినా హృదయం ఉంచినందుకు కృతజ్ఞుణ్ణి. బాహ్య ప్రపంచాన్ని చూడకుండా మానసిక ప్రపంచంలో విహరించడానికి ఆస్కారం కలిగించిన పినతల్లి నిజంగా కీడు తలపెట్టినా మేలే చేసింది. బుద్ధదేవుని సేవించే నిమిత్తం పోవా లనుకున్న సంకల్పం యీ విధంగానైనా నెఱవేరుతున్నందుకు సంతోషం.

కాంచన

(కన్నీళ్లతో) నిన్నే సర్వంగా నమ్మిన నన్నేం చేయదలుచు కున్నావు?

కుణాలుడు

పిచ్చిదానా, నీవుకూడా సామాన్య స్త్రీవలె విచారిస్తే ఎలా? బుద్ధదేవుని సేవ మరువకు.

కాంచన

నీ సేవలో భగవానుని సేవించ లేనా? కుణాలా, నీ సుకుమారమైన వ్రేళ్లు వీణా తంత్రులపై నాట్యం చేయకపోతే నా కంఠం అపశ్రుతిలో పలుకదూ! ప్రకృతికన్య పరవశ అయ్యేటట్టు పాడే నీ సంగీతం వినకపోతే నా హృదయ వీణా తంత్రులు పలుకవు కుణాలా. మన హృదయ దుఃఖాలనైనా యిరువురం కలిసే పాడుకొందాం!

ఉపగుప్తుడు

కుమారా, నిన్నే తననుగా ప్రేమించిన కాంచన దేహమాత్రంగా నా ఆశ్రమంలో ఉండడం నేను మాత్రం భరించగలనా? చంద్రుని నుండి చంద్రికను వేరు చేయడం సాధ్యమా! కాంచనను నీతోనే ఉండనీ.

కుణాలుడు

అంత సుకుమారిని కష్టపెట్టడం యిష్టంలేక అలా అన్నానేగాని మరేం కాదు. నా విధిని నే ననుభవిస్తాను. నా శిక్ష ఆమె భరించడం ఓర్వలేను గురుదేవా!

కాంచన

కుణాలా, నన్ను నీతో వేరు చేస్తున్నావు కదూ. అబ్బ! ఎంత కఠినుడివి. కష్టాలు పడడంలో ఆడితేలితేనట్టు చెబుతున్నావే!

ఉపగుప్తుడు

కాంచనా ... బాధలో మాటలు తొందరపడుతున్నట్టున్నాయి సుమా!

కుణాలుడు

ఆచార్యా, అది బాధా తీవ్రతేగాని మాటల తొందర కాదు. ఇక నా కాంచన నాతోనే వస్తుంది.

ఏదీ — ... కాంచనా, నీ కళ్లు నీళ్లతో నిండాయా? పిచ్చిదానా, నేను నిజంగా కఠినుణ్ణేకదూ! సరే నడు. మనిద్దరం జీవిత దుఃఖాలకు శాశ్వత ఆనంద సామ్రాజ్యంలో తావు లేకుండా చేద్దాం. నీ అమృతమయమూర్తి ఎదుట లేనిదే నా వ్రేళ్లు మాత్రం నాట్య మెలా చేస్తాయి కాంచనా! రాజాజ్ఞను మీరుతున్నట్టున్నాం. గురుదేవా శెలవా?

(కాంచనకళ్లలో దుఃఖానందాశ్రువులు నిండుగా ప్రవహించే గంగా యమునా సంగమంలా పొడకట్టాయి.)

ఉపగుప్తుడు

నాయనా! నా నోటితో సెలవియ్య గలనా? ప్రేమజీవుల కీ లోకంలో అడ్డు లేదు. అమ్మా కాంచనా, నీ ప్రియుణ్ణి ధ్రువ తారలా వెంట నంటి నడిపించు.

కుమారా, బుద్ధదేవుడు మిమ్ముల ననుగ్రహించుగాత. (ఆశీర్వదిస్తాడు.)

(కుణాలుడు, కాంచన నిష్క్రమిస్తారు.)

ఉపగుప్తుడు

వసంతునితో బాటు కోయిల కూడా నిష్క్రమించింది. అబ్బా! ప్రేమబంధ మెంత బలీయమైంది!

౪

రాజధానీ నగరంలో రాజమహలు. ప్రియ దర్శనుడు కొలువులో.

ప్రియదర్శనుడు

సేవకా, అవంతీపురము నుండి వచ్చిన అంధగాయకుణ్ణి లోనికి ప్రవేశపెట్టు.

సేవకుడు

చిత్తం ప్రభూ. (నిష్క్రమిస్తాడు)

(మాసి అక్కడక్కడ చినుగులతో నున్న గుడ్డలతో, క్షురకర్మ నెరుగని జుత్తుతో కుణాలుడు, శిశిరపుగాలులకు గురియైన వసంతంలా కాంచన ప్రవేశం)

మహారాజులకు జయము.

ప్రియదర్శనుడు

చారణా! యీ అంధునిలో నాకు సన్నిహితత్వము గోచరించుచున్నది. కారణ మేమై యుండునో! సరి... మోడులను సహితం చిగురింపజేసే మీ గానంతో మా పట్టణాన్ని ఆనందతరంగాల్లో ఊగించి నట్టు విని, మీ గానాన్ని వినే కుతూహల ముతో పిలిపించాను. మా కోర్కె నెఱ వేరుస్తారని తలుస్తాను.

కుణాలుడు

ప్రభూ, రాజసభలో పాడ దగినంత శక్తివంతులం కాము. ఏదో వీధి గాయ కులం. జీవనోపాధికి మాత్రమే మాకు సంగీతం.

కాంచన

ప్రభూ, యీ సభలో కుణాల మహా శయు లున్నారా? వస్తువులోని సౌందర్యాన్ని అనుభవించడానికి ఎదుటి హృదయా లింకా సౌందర్యవంతా లైయుండాలి కదా!

ప్రియదర్శనుడు

అమ్మాయీ, మీ శక్తిని పరీక్షించి పారితోషికం నిర్ణయించగల హృదయ మున్నవాడు కుణాలుడే. అతడు తక్షశిలలో గురువులవద్ద నున్నాడు.

కాంచన

ప్రభూ, వారిని కూడా పిలిపించండి. తరువాత ...

కుణాలుడు

క్షమించాలి ప్రభూ. ఏదో తమ కార్యక్రమాన్ని తానే నిర్ణయిస్తున్న దీమె. సంగీతద్రష్టలైన మీ కంటే యువరాజులకు మాత్రం ఎక్కువ తెలుసునా? మేము శక్తి హీనులం, క్షమించాలి.

ప్రియదర్శనుడు

చారణా, యువరాజునకు వెంటనే వార్త పంపు.

చారణుడు

ప్రభూ! యువరాజులు ... రాణిగారి ఆజ్ఞవల్ల ... దేశాంతరం వెళ్లారు.

ప్రియదర్శనుడు

ఆఁ! నా కుణాలునికి దేశాంతర వాసమా! రాణి ఆజ్ఞ! ఎవరక్కడ?

సేవకుడు

ప్రభూ.

ప్రియదర్శనుడు

తక్షణం రాణిని సభకు రావలసిందని మా ఆజ్ఞగా చెప్పు. మంత్రీ, యింతవరకు నా కెందుకు తెలియ జేయలేదు? అంతా ద్రోహం!

చారణుడు

ప్రభూ, క్షమించాలి. మసిపాతకట్టిన మాణిక్యంలా వెలిగే యీ చిరంజీవే యువ రాజులై యుండవచ్చు.

ప్రియదర్శనుడు

ఆఁ! అంధగాయకుడా యువరాజు!

కుణాలుడు

తండ్రీ, క్షమించు. రాజాజ్ఞను మీరి దేశంలో ప్రవేశించిన ద్రోహానికి శిక్షార్హుణ్ణి.

ప్రియదర్శనుడు

(కౌగిలించుకొని) కుమారా, నీకేనా యీ స్థితి? ఆదుర్మార్గు రాలేనా నీ యీ స్థితికి కారణం! అయ్యో, నా యింట జరిగే కుట్రలకే నేను అంధుణ్ణయ్యాను. నాయనా నేనే శిక్షార్హుణ్ణి.

కుణాలుడు

తండ్రీ, గురుపుత్రి కాంచన అంధకారంలో వేగుచుక్కలా నా జీవితాన్ని వెలుగుదారుల్లో నడిపింది.

ప్రియదర్శనుడు

అమ్మా, నా కుమారుని తిరిగి నా కిచ్చిన నీకు నే నేమి చేయగలను?

(కాంచన సిగ్గుతో తలవంచింది)

కుణాలుడు

మా జీవితాలు శాంతంగా గడుపుకునే టట్టు అనుగ్రహించండి. అదే పదివేలు.

ప్రియదర్శనుడు

నాయనా! ఇక నే నీ రాజ్యభారాన్ని భరించలేను కదా. శాంతి నీకా నాకా? తిష్యరక్షిత కుట్రకు శిక్ష విధించడం నీ వంతు నాయనా!

కుణాలుడు

ధన్యుణ్ణి. అదే మిమ్ములను కోరదలచింది కూడా. పినతల్లి నాకు మహోపకారం చేసింది. నాకు విధించిన శిక్షలో తన హృదయ దౌర్బల్యాన్ని, అధర్మచింతను సహితం త్యజించి పవిత్రురాలైం దామె. ఆమె సహాయంతో తా మీ సామ్రాజ్యాన్ని ఏలుతూ నా కీ భారాన్ని నెత్తి నెత్తవలదని ప్రార్థన.

ప్రియదర్శనుడు

కుమారా! నీహృదయ వైశాల్యతకు నా ధన్యవాదాలు. తప్పు చేయడం మానవ సహజం. కాని దానిని మన్నించగలగడమే దైవత్వం.

సేవకుడు

జయము జయము మహారాజులకు. ఉపగుప్తాచార్యులవారు ప్రభూ.

కాంచన

తండ్రిగారు!

కుణాలుడు

గురుపాదులే!

ప్రియదర్శనుడు

ఆచార్యులను వెంటనే ప్రవేశపెట్టు.

(ఉపగుప్తుడు ప్రవేశం.)

గురుదేవులకు నమస్సులు.

ఉపగుప్తుడు

బుద్ధదేవుని ఆశీర్వాదాలు. తిష్యరక్షితాదేవి ఆత్మహత్య ప్రభూ!

ప్రియదర్శనుడు

కుట్రకు తగిన శాస్తి జరిగింది.

కుణాలుడు

ఆఁ! పినతల్లి ఆత్మహత్యా! ఆ పవిత్రాత్మకు మన అశ్రుతర్పణా లర్పిద్దాం, రా, కాంచనా!

(ఇద్దరూ నిష్క్రమిస్తారు.)

ప్రియదర్శనుడు

ఈ విచిత్ర సంఘటనల భారాన్ని నా పేదగుండె భరించలేకపోతోంది గురుదేవా!

ఉపగుప్తుడు

బలహీనమైన హృదయాల కీలోకాన స్థానం లేదు ప్రియదర్శనా!

[తెర]

అరివరులందు నీ వొకనినైన వధింపఁగఁ గన్న నెంతగా
మురియునో రాజరాజు రణభూమిని గీడ్పడి నీదు చేతికిన్
దొరికినయట్టి నల్వురను ద్రుంచక నూరక బోవనిచ్చి నీ
పరువును స్వామికార్యమును భగ్నమొనర్చితి విట్టు లర్కజా!

అధిపు జయమును గోరు పుణ్యాత్ముఁడెవఁడు-పోరఁ జిక్కిన వైరుల న్జారవిడుచు
భానుసుత! యిట్టిదే నీదు స్వామిభక్తి - యింతకన్న ప్రభుద్రోహ మింకఁ గలదె?

తల్లి కొసంగినట్టి వరదానము నిల్పఁగ రాచకార్యముల్
గల్లయొనర్చి యెన్నఁడును కౌరవనాధున కీర్తి తెల్పకే
పొల్లు ప్రతిజ్ఞల న్నలిపి మోద మెలర్పఁగఁ బ్రోత్సహించి భూ
వల్లభు కొంప తీసి తిది స్వార్థము కాదొకో సూతనందనా!

గురుభీష్మాదులు పాండుపుత్రులను మాకు న్గెల్వరాదంచుఁ జె
ప్పిరి, మఁమ్మాటికిఁ గెల్తు నేననుచు దోర్వీర్యంబునన్ బల్క, తా
కురు రాజేంద్రుఁడు విశ్వసించి నినుతాఁ గోల్పోయె సర్వస్వమున్
అరరే! నీవును చేతఁగా దనిన కయ్యంబు న్విసర్జింపఁడే?

కౌరవుల న్జయించి మురఘస్మర! పాండవు లెట్టులైన, నీ
ధారుణి నేలఁగాఁగలరు తప్పదు సుమ్మని పల్కె తెన్నియో
నేరుపుమాట లియ్యవియె నీవు సుయోధనుతోడఁ బల్కినన్
దారుణ బంధునాశము వృథాకలహంబును నంత మొందవే?

ఎంతటి విరోధ మున్నఁ గాసింత యేని - దయయు ధర్మంబు నతిపట్లఁ దలఁపవలదె
ద్రౌపదీదేవి వంచింపఁ దలఁచి నీదు - ఘనయశంబెల్ల మంటిలోఁ గలిపితౌర!

అక్కట వల్దటంచుఁ గమలాప్తుఁడు బల్కఁగ వేఱ యేమి నా
కక్కఱలే దటంచు దివిజాధిపుఁ డాడఁగ త్యాగమూర్తివై
యక్కవచంబుఁ గుండలము లంతటఁ గోసి యొసంగి తౌర, యీ
యొక్కటియే భవత్కథకు నొప్పును గూర్చె మహోన్నతంబుగన్.

కలగూరగంప

సుమిత్ర యేరాజు కూఁతురు ?

సంస్కృతమునఁ బెక్కు రామాయణములు విరాజిల్లుచున్నను, అందు నతి ప్రాచీనమును, బరమ ప్రామాణికము నగునది వాల్మీకి కృత రామాయణ మనుట యెల్ల రెఱింగిన యంశమే. వాల్మీకిరామాయణమందుఁ దొలుతఁ గ్రమముగా నయోధ్యయొక్కయు, దశరథమహారాజుయొక్కయుఁ, నయోధ్యా పురజనము యొక్కయు, దన్మంత్రిజనముయొక్కయుఁ బ్రస్తావములు గలవు. దశరథుని భార్యాత్రయముఁ గూర్చిన ప్రశంస లేనేలేదు.

మంత్రిజన వర్ణనానంతరము వాల్మీకీయమందు నిట్లు గలదు :

"తస్యత్వేవం ప్రభావస్య ధర్మజ్ఞస్య మహాత్మనః
సుతార్థం తప్యమానస్య నాసీ ద్వంశకర స్సుతః
చింతయానస్య తస్యైవం బుద్ధి రాసీ న్మహాత్మనః
సుతార్థీ హయమేధేన కిమర్థం నయజామ్యహమ్."
(బాలకాండ, ౮-వ సర్గ.)

వాల్మీకేతర రామాయణములందుఁ గొన్నిటఁ బ్రథమముననే కౌసల్యాదుల పేళ్లు పేర్కొనఁబడి యున్నవి.

ఇంత గొప్ప ఇతిహాసమందు భార్యల మాటయే చెప్పఁబడక యనపత్య విషయము మాత్రమే వచింపఁబడుట క్రమము గా దను తలంపునం జేసి కాఁబోలు వావిలికొలను సుబ్బారావుగారు దమ యథావాల్మీకమునందుఁ బై సందర్భమున మూలములో లేకున్నను భార్యా ప్రశంసను జేసిరి :

"[illegible]కల రాతనికిని మువ్వురు
జలజాక్షుని సతులఁబోలు చంద్రనిభాస్యల్...
సతత ధర్మానుకూల్య కౌసల్య యనఁగఁ
బాత్రజనవసుగోత్ర సుమిత్ర యనఁగఁ
గాంత నార్షదరూపైక కైక యనఁగ
నాఖ్యలు వహింతు రాతని యబ్జముఖులు."

వాల్మీకమందు విష్ణుమూర్తి సాక్షాత్కరింపఁగా దేవతలు దమ సంకటములను దెలుపు సందర్భమున దశరథునకు భార్యలు మువ్వురని చెప్పఁబడినది.

"రాజ్ఞో దశరథస్య త్వ మయోధ్యాధిపతేః ప్రభోః!
ధర్మజ్ఞస్య ప్రభావస్య మహర్షి సమ తేజసః
తస్య భార్యాసు తిసృషు హ్రీశ్రీకీర్త్యుపమాసుచ
విష్ణో! పుత్రత్వ మాగచ్ఛ కృత్వాత్మానం చతుర్విధమ్."
(బాలకాండ, ౧౫-వ సర్గ)

ఇందుకూడ భార్యలపేళ్లు పేర్కొనఁబడవు. పాయసవిభాగ సందర్భమున వారి పేరులు మనకుఁ దొలుతగాఁ గనఁబడుచున్నవి.

"కౌసల్యాయై నరపతిః పాయసార్ధం దదౌ తదా
అర్ధా దర్ధం దదౌ చాపి సుమిత్రాయై నరాధిపః
కైకేయ్యైచావశిష్టార్థం దదౌ పుత్రార్థకారణాత్."
(బాల. ౧౬ వ సర్గ.)

దశరథునకు కౌసల్య, సుమిత్ర, కైకేయి యను పేళ్లు గల మువ్వురు భార్యలు గల రని యిందుఁ దెలియుచున్నది.

రామాయణమునఁ గౌసల్యా కైకేయులు కోసల కేకయాత్మజలుగా నందందుఁ బెక్కుసారులు పేర్కొనఁబడిరి. అనఁగాఁ గోసల కేకయ దేశముల రాజుల తనయ లని యర్థము. ఇవి యపత్యార్థమున నేర్పడిన పేళ్లే కాన వారి నిక్కములైన నామము లెవ్వియో యెందును గానరాదు. కోసలరాజు భానుమంతుఁ డని పూర్వగాథాలహరిలోఁ గలదు. కేకయరాజు పేరేమో. వీనితో మన కిప్పుడు పనిలేదు.

సుమిత్ర యేదేశపు రాజు కూఁతురో తెలియుట లేదు. ఆమె తండ్రిమాత్ర మేమి పాపము చేసినాఁడో?

అతఁడే దేశమునకును రాజు కాఁడా? అగస్త్యభ్రాత వంటివాఁడా? ఎవరో శబ్దసామ్యముచే సుమిత్రా (ద్వీప) దేశపు రాజు కూఁతురనఁగా వినియున్నాను. ఇది హాస్యమునకుఁ జెప్పఁబడిన మాట.

సంస్కృతాంధ్ర రామాయణములందు నాదృష్టికి సుమిత్ర యద్దేశాధీశ పుత్త్రియో కనఁబడలేదు. కాని యీ క్రింది పింగళి సూరనార్యకృత రాఘవపాండవీయ పద్యమును గనుఁడు.

"కృతిఁ గుంతి మద్రభూపతుల నెయ్యఁపుఁగన్య
కలవన వాలుఁదూపుల జయించి
యలరారు వరమజయశ్రీల వరియించె
యవన సౌరాష్ట్ర భూధవుల గెలిచె
ద్రవిడ కళింగ సాళ్వ విదర్భ వసుధాధి
పతుల నోడించి కప్పములఁ గొనియె
చోళ నేపాళ పాంచాల కేరళ మత్స్య
వత్సభూపతుల గర్వం బడంచె
శక యుగంధర ఘూర్జరాశ్మంత సింధు
లాట భూపాల ముఖ్యుల నోటువఱచె
జగతిఁ గోసల కేకయ మగధుల తన
యల వరించిన యాజ్ఞలో మెలఁగఁజేసె."

(౧-౭)

గీతపదోత్తరార్థమునకు భారతపక్షార్థము:—

జగతిఙ్, కోసల, కేకయ, మగధులు + అ = ఈ దేశపురాజులే, తన + అలవరించిన + ఆజ్ఞలో = తా నేర్పరచిన యాజ్ఞలో, మెలఁగఁజేసె.

దానికే రామాయణ పక్షార్థము:—

జగతిఙ్, కోసల కేకయ మగధుల- తనయలఙ్- కోసల కేకయ మగధ దేశాధిపుల కూఁతులను, అనఁగా కౌసల్యా కైకేయీ సుమిత్రలను, వరించి - కోరి, వివాహమాడి, నయ + ఆజ్ఞలో, మెలఁగఁజేసె.

పైపద్యమువలన కోసల తనయ కౌసల్య, కేకయ తనయ కైకేయి, మగధ తనయ సుమిత్ర యని యేర్పడు చున్నది.

కవిరాజరచితసంస్కృత రాఘవ పాండవీయ మున నిలాగు గలదు:

"కరగ్రహో త్కోసల కేకయేంద్ర
భువోర్దురు శ్రీర్విలస త్సుమిత్రః
పృథావరోధస్సమరే జితారి
ర్గోప్తా హిమాద్రీశ్వరతాం స లేభే."(౧-౫౪)

కవిరాజ సంస్కృత రాఘవపాండవీయమునకు సూరన రాఘవపాండవీయ మనువాదము గాదు. సంస్కృతాంధ్ర రాఘవపాండవీయములకు నించుకం తయు సంబంధ సామ్యములు లేవు. ఈ విషయ ముభయ గ్రంథములను సామాన్యగ్రముగాఁ జదివినఁ దెలియఁ గలదు. సంస్కృత రాఘవపాండవీయము నునికియే మన సూరనార్యునకుఁ దెలియదని చెప్పవచ్చును.

మనకుఁ బ్రస్తుతము లభించిన యాధారమును బట్టి సుమిత్ర మగధ దేశాధిప తనయ, మాగధి యని నిస్సం శయముగా వక్కాణింప నగుచున్నది. మగధ తనయ యనుటకు సూరన కే గ్రంథమునం దాధారము గలదో విజ్ఞులు పరిశీలింపవలసియున్నది.

రావూరి దొరస్వామి శర్మ.

కీ. శే. మహామహోపాధ్యాయ కుప్పుస్వామి శాస్త్రిగారు

ఎం. ఏ., ఐ. ఇ. యస్. (౧౮౮౦–౧౯౪౩)

కీర్తిశేషులగు యస్. కుప్పుస్వామి శాస్త్రుల వారు మన భారతదేశమునకును, సంస్కృత లోకమున కును తిలకమువంటివారు. వీరు ౧౯౪౩-వ సంవత్సర మున కాలధర్మ మందిరి. ఇవి వారి ప్రథమవర్ధంతి రోజులు. కాన నిప్పుడు వారి స్మరణ చేయుట నా విధిగా తలంచుచున్నాను.

శ్రీ శాస్త్రులవారి జీవితచరిత్ర మనేక సద్గుణ ములతో విలసిల్లి వారి దీక్షకు మతంత వన్నె పెట్టినది.

శాస్త్రిగారు ముప్పదియేడు వత్సరము లధ్యా పక వృత్తియందే తమ జీవితమును సార్థక్య మొనరిం చుకొనిరి. వారి పాండిత్యము సర్వజనాదరణీయ మై గంభీరమై యతిశయించినది.

శాస్త్ర మనభ్యాస మగుచో విషతుల్యమని పెద్దల సంప్రదాయము. అట్టి శాస్త్ర మొకదాని నైనను జక్కఁగ నధ్యయనము చేయుటయే మిక్కిలి గొప్పతనము. అట్లయ్యును నాలుగు శాస్త్రములలో సర్వంకష మగు పాండిత్యము గడించిన వారి వైదగ్ధ్యము మిక్కిలి ప్రశంసనీయము. ఇంతియకాక సువర్ణమునకు సౌరభ మబ్బినటుల నీ శాస్త్రపరిచయ ముతోబాటు సాహిత్యము సయితే మలవడియుండుట మిక్కిలి ముదావహము.

కనుకనే వారిని కంచి కామకోటిపీఠాధిపతు లగు శ్రీసచ్ఛంకర జగద్గురువర్యులు "దర్శనకళానిధి" అను బిరుద మొసగి గౌరవించిరి.

అలంకార శాస్త్రమందు విశేషించి సిద్ధహస్తు లగుట సామాన్యుల కలవికాని "ధ్వన్యాలోకము" మున్నగు గ్రంథములను సులభముగ గ్రహించున ట్లొనరించి విద్యార్థి లోకమునకు వీ రాదర్శకు లైరి. కాశ్మీరదేశమునకు జెందిన "ఆనందవర్ధన", "అభినవగుప్త" మహాకవులచే విరచింపబడిన ధ్వన్యాలోక, లోచనము లను గ్రంథములు దక్షిణదేశమందలి పండితలోకములో మిక్కిలి వ్యాప్తి జెందలేకపోయినవి. ఈ అవ్యాప్తిదోషమును బాపదలచిన వీ రంతకు ముందే యుండిన కౌముదీ వ్యాఖ్యకు 'ఉపలోచన' మను వ్యాఖ్యానము స్వయముగ విరచించి లోకమున కెంతయో మహోపకార మొనరించిరి.

మదరాసు, అణ్ణామలై విశ్వవిద్యాలయములందలి ప్రాచ్య బిరుదము (Oriental Titles) లను శీర్షిక క్రింద సంస్కృత ద్రావిడ భాషలకు ప్రత్యేక గౌరవమును గలిగించిరి. దీనికై శిక్షాప్రణాళిక (Syllabus) నేర్పరచి తదనుకూలముగ సాహిత్య గ్రంథములను నిర్ణయించుటలో నధిక శ్రద్ధ వహించినవారు శ్రీ శాస్త్రిలవారే.

మదరాసు దొరతనమువారి ప్రాచ్య లిఖిత గ్రంథాలయమునందు దమ పరిశీలనా నైపుణ్యముచే స్వయం కృషిసల్పి సంస్కృతాంధ్ర ద్రావిడ కర్ణాట కేరళాద్య ముద్రిత గ్రంథములకు వివరణపట్టికలను ప్రకటించి విద్యాలోకమునకు మే లొనగూర్చినవా రైరి. లేకున్న నీ తాళపత్రగ్రంథము లన్నియు జెదలపాలు గావలసినవే కదా!

శాస్త్రిలవారు తమ చిరుతప్రాయమునందే మైలాపూరు సంస్కృతకళాశాలకు ప్రధానోపాధ్యాయులుగా నియమింపబడి తత్కళాశాలను వృద్ధికి దెచ్చిరి.

తంజాపురీ మండలములోని తిరువాడియందలి రాజావారి సంస్కృత కళాశాలకును ప్రధానోపాధ్యాయులుగ గొంతకాలమువఱ కుండి దానినికూడ మహోన్నతదశకు దెచ్చిరి.

వీరి శాంతభావ మత్యద్భుతము. మందబుద్ధులగు శిష్యులు సయితము వివేకసంపన్నులై గురువర్యుల పాండిత్యపటిమను ప్రకటింపజేసిరి. సజ్జను డగుశిష్యుడు గురువుల ప్రతిష్ఠకు వన్నె దెచ్చునని కాళిదాసే ప్రస్తావవశమున నిర్వచించెను. గురుశిష్యసంయోగమే ఉపాసనకు ముఖ్యమైన దని ఉపనిషత్తు లుద్ఘోషించుచున్నవి కదా. ఈ యనుభవమును శ్రీ శాస్త్రులవారియొద్ద జేరిన ప్రతి శిష్యునకు ననుభూత విషయమైయున్నది.

భారతవిజ్ఞానాభివృద్ధికి సర్వప్రయత్నములు గావించిన శ్రీ మహామహోపాధ్యాయ కుప్పుస్వామి శాస్త్రులవా రాధునికులలో నగ్రగణ్యులు. అందును వీరు సంస్కృతభాషకు గావించిన సేవ అపారము.

వీరి పేరుప్రతిష్ఠ లీ ప్రదేశమందే కాక దేశదేశాంతరములవఱకు వ్యాపించినవనుట నిర్వివాదాంశము.

దువ్వూరి రామలింగారెడ్డి.

ఆంధ్రాభ్యుదయము: ౧



శ్రీ దామోజీపురపు సత్యజగన్నాథరావుగారు, బి. యస్. సి. (సిరమిక్స్)

కాశీ హిందూవిశ్వవిద్యాలయంలో "సిరమిక్స్" (Ceramics) శాస్త్రమున ప్రథమ తరగతిలో ప్రథమమున ఉత్తీర్ణులయిన ప్రప్రథమ ఆంధ్రుడేకాక ప్రప్రథమ భారతీయుడుకూడ. వీరు కొవ్వూరు వాస్తవ్యులు. ప్రస్తుతము వీరు జంషెడ్పూరులో తాతాకంపెనీ రిఫ్రాక్టరీ డిపార్టుమెంటులో పనిచేయుచున్నారు.

రమణి

[కథానిక]

= శ్రీ ఎ. శేషగిరిరావు =

అసలీవిషయం ఎవరితోనూ ఎప్పుడూ చెప్పకూడ దనుకున్నాను. కాని అది నామనస్సులో చాలా బాధపెడుతూంది. చెప్పేస్తే కొంత బాధైనా తగ్గ తుందనే అభిప్రాయం కలిగింది. మరొకటి: నాస్థితి లోనే మరెవరైనా ఒకప్పుడుంటే వాళ్లకి దారికూడా చూపవచ్చుననే భ్రమకూడ కొంచెం కలిగింది. అందుచే బైట పెడుతున్నా.

ఇది జరిగి యిరవైయేళ్లైంది. కాని నాకు నిన్నో, మొన్నో జరిగినట్లుంది. తలపుకొచ్చినరోజున నిద్దర పట్టదు. ఇంతకూ నేను చేసిన తప్పు నాకు స్పష్టం కాదు. కాని వెనకనుంచి యేదో తప్పుచేసినట్లు మనస్సు బాధిస్తూంటుంది.

నేను మొదట రమణిని చూచినప్పుడు నాకు పదకొండేళ్లు. నాలుగోఫారంలో చదవడానికి మాపల్లెటూరినుండి పట్నం వెళ్లేను. నాకంతా క్రొత్తగా ఉండేది.

నాకు అక్కలు చెల్లెళ్లేగాని, అన్నదమ్ములు లేరు. ఆడపిల్లలు పాడే పాటలు పాడేవాడిని. చాలా బాగా పాడతా నని అందరూ అనేవాళ్లు. బలవంతం చేసి మా మేష్టరుగారు బడినాటకంలో వేషంకూడా వేయించారు. చూడ్డానికి వచ్చినాయ నొకరు ఒక మెడలుకూడ యిచ్చేరు. నాకు సిగ్గు, భయం అట్టే ఉండేవి కావు. ఎవరు పాడమన్నా పాడేవాడిని. నాకు వాళ్లు టిఫినులూ అవీ పెడుతూఉండేవారు. నేను కొందఱు పెద్ద విద్యార్థులతో ఒక లాడ్జిలో ఉండే వాడిని. సాయంత్రం బడినుండి రాగానే యేవో పాటలు పాడుతూ, ఆడుతూ ఉండేవాడిని. నాకు పువ్వుల తోట అంటే సరదా. మాలాడ్జిలో చాలా స్థలం ఉండేది. కొన్ని మొక్కలు నేనే తెచ్చి వేసి వాటికి నీళ్లుపోస్తూ పాడుకుంటూఉండేవాడిని.

మాలాడ్జి కెదుటింట్లో ఒకపోలీసు ఇనస్పెక్టరుగా రుండేవారు. ఒకనాడు సాయంకాలం మొక్కలకు నీళ్లుపోసేక వీధిగుమ్మంలో ఒక్కడినీ నిలబడ్డాను. ఇనస్పెక్టరుగారి భార్య "అబ్బాయీ! ఇలా రా " అని పిలిచింది. నేను వెళ్లేను. సావిట్లో కూర్చోపెట్టి "నిన్న పాడిన పాట ఒకసారి పాడు" అంది. పాడేను. "ఆ పాట నాకు వ్రాసియిస్తావా?" అంది. 'సరే' అన్నాను. ఆమెకుమార్తె తొమ్మిది, పది వత్సరములు గల రమణి కాగితమూ పెనసలూ వెంటనే తేగా వ్రాసియిచ్చేను.

ఇంతలో మావాళ్లు నే నాయింట్లోంచి రావడం చూచి "ఏంరా, అమ్మాయితో స్నేహం కుదిరిందిరా" అని కొంచెం వేళాకోళం చేశారు. జరిగింది చెప్పేను. మరోనాడు ఇనస్పెక్టరుగా రున్నప్పుడే పాటలు పాడించి మిఠాయి పెట్టేరు. ఇంతలో నా చామంతితోట బాగా పెరిగింది. రమణి పువ్వు లడిగేది. కాని నేను సామాన్యంగా యిచ్చేవాడిని కాను. అసలు ఎవరినీ కోయనిచ్చేవాడినే కాను. కొద్ది కాలంలో నాపాటలు చాలా రమణికీ, రమణిపాటలు కొన్ని నాకూ వచ్చేయి. వాళ్లు నేను పాటలు పాడినప్పుడల్లా ఫలహారములు పెట్టేవారు. అంచేత వారు కోరినప్పుడల్లా పాడేవాడిని.

అప్పటికి నేను స్కూలుఫైనల్‌లోకి వచ్చేను. హఠాత్తుగా రమణి నాలుగురోజులు కనపడలేదు. తరువాత పైటవేయడం మొదలుపెట్టింది. మొదట చూచి నపుడు నాకు కొంచెం నవ్వువచ్చింది. రమణికూడా నవ్వుతూ లోపలకు పారిపోయింది. తరువాత రమణితో నే నెప్పుడూ మాటలాడలేదు. నాకు కొంచెం చదువు హెచ్చైంది. పాటలు తగ్గేయి. కాని బడినుంచి వస్తూ అప్రయత్నంగా లాడ్జిలోకి వెళ్లేముందు రమణిగుమ్మం వేపు తప్పక చూచేవాడిని. ఆమె నేను వచ్చే సమయానికి వాళ్ల కిటికీలో కూర్చునిఉండేది. నన్ను చూచి చిరు నవ్వుతో లోపలికి వెళ్లిపోయేది. నేను పాట పాడినప్పుడల్లా సావడికిటికీలోకి వచ్చి కూర్చునేది.

నాపరీక్షలు కాగానే మావూరు నేను వెళ్లి పోయేను. వెళ్లేముందు ఇనస్పెక్టరుగారి భార్యతో 'వెళుతున్నా'నని చెప్పేను. ఆయన యింట్లో లేరు. రమణి తల్లి ప్రక్కనే ఉంది. ఏదో మాటాడాలని ఉన్నట్టు కనపడింది. కాని మాట్లాడలేదు. నాకూ మాట్లాడా లనిపించింది. కాని యేమి మాట్లాడ్డం?

మరి నాలుగేళ్లవఱకు నేను విశాఖపట్నం పోలే దు. అప్పటికి నేను బి. యే. ప్యాసు అయాను. ఉద్యోగప్రయత్నంమీద విశాఖపట్నం వెళ్లేను. పూర్వపు స్నేహితులను, పూర్వము మేముండే లాడ్జిని తలుచుకుంటూ ఆవీథంటే సముద్రపుటొడ్డుకు వెళు తున్నాను. నే ననుకోకుండా నామనస్సు రమణిమీ దకు, నాదృష్టి ఇనస్పెక్టరుగారి యింటివైపునకు వెళ్లేయి. ఆయన ఒక సంవత్సరం క్రిందటనే ప్రమాద వశమున మరణించినట్లు పేపరులో చూచేను. అది తలపునకు వచ్చి నేను కొంచెము విచారిస్తూ వెళుతూ ఉంటే ఒక యెనిమిదేండ్ల బాలుడు వచ్చి "అమ్మ మిమ్మల్ని పిలుస్తూంది." అన్నాడు. 'ఎవరా యీ అబ్బాయి' అని కొంచెం ఆలోచించగా ఇనస్పెక్టరు గారి కొడుకని జ్ఞాపకం వచ్చింది. పరామర్శచేయు టకు నేనే వెళ్లవలసింది; పిలిచినాకూడా వెళ్లకుండా యెలా ఉండను? సావిడిలోకి వెళ్లగానే ఆవిడ కొంత విచారించగా ఓదార్చడము చేతకాకపోయినా యేదో ఓదార్చి, నాచదువువిషయ మడుగగా చెప్పేను. ఆమె సంతోషించి "ఎక్కడ బసచేసేరు?" అంది. "ఒక పూటకు ఎక్కడైతే నేమిటి? హోటలులో భోజనము చేసేను. రాత్రి అక్కడే పడుకుంటా. రేపు వెళతా." అన్నాను. "ఇక్కడ ఉండడాని కభ్యంతర ముంటుం దా? ఈరాత్రి కిక్కడ ఉంటే నాకష్టాలన్నీ మీతో చెప్పుకుంటాను. అవి చెప్పుకోడానికి వినేవాళ్లైనా లేరు. అందుచేత మరీ బాధగా ఉంది." అంది. "సరే" అన్నాను.

తర్వాత ఆవిడ చెప్పిన విషయములను బట్టి యిన స్పెక్టరుగారు ఏడాదిక్రిందట పోయారనీ, అప్పటి కాయిల్లూ, ఆమెవంటిమీది బంగారమూతప్ప వేరే ఆస్తి లేదనీ, సంసారము గడపడముబాధ్యత ఆమెమీద పడ్డ దనీ, మీవంటివారి దయవలన ఎలాగో కాలక్షేపము చేస్తున్నామనీ, యేవేవో చెప్పింది. పిమ్మట కాస్త దాహమునకు మంచినీళ్లిమ్మన్నాను. లోపలకు వెళ్లి ఐదునిమిషములలో తిరిగివచ్చి "కాస్త ఫలహారంకూడ పుచ్చుకోవాలె" నంటూ "రమణీ!" అని పిలిచింది.

ఆమెతో మఱల లోపలికి వెళ్లి తిరిగివచ్చి, "మా యిల్లుమీకు క్రొత్తకాదు రండి; లోపలకు" అని ఆహ్వానించింది. "ఎందుకు లెండి!" అంటూ అక్కడే కూర్చోబోగా లోపలకు రమ్మని బలవంతంచేస్తే వెళ్లేను. వరండాలో ఒక కుర్చీమీద కూర్చున్నాను. రమణి ఒక ప్లేటులో రెండు చపాతీలు తెచ్చిపెట్టి చిరునవ్వుతో నిలుచుంది. రమణి కిప్పుడు పదహారేండ్లు వుంటాయి. నాకు ఆశ్చర్యం వేసింది. నాలుగేండ్లక్రిందటే నాతో మాట్లాడడం మానేసి, కన బడకుండా ఉండే పిల్ల యిప్పు డిలా ఆహ్వానించడం అంటే ఆశ్చర్యం కాదూ!

అప్పుడు వాళ్ల తల్లివైపు చూచి "మీ అమ్మా యికి పెండ్లిచేశారా?" అని అడిగేను. "ఏం పెళ్లి లెండి; మాలో అంత సుళువైన విషయం కాదు. రమణి అభిప్రాయం నాతో యేమీ చెప్పదు. స్నేహి తులుగనక మీతో చెబుతుందేమో? నాకు తెలియదు బాబూ! ఈకాలపువాళ్ల మనస్సులు తెలుసుకోవడము ఎవరికి తరం?" అని ఏవేవో అంటూంది. ఈలోపుగా వీధిగుమ్మంలో ఎవరో కేక వేస్తే ఆవిడ వెళ్లింది. వెం టనే వస్తుందేమో నని కదలకుండా మెదలకుండా చూసేను. రెండు నిమిషాలవఱకు. కాని వీథి అరుగు మీద కైతాయించినట్లు తోచింది.

రమణి ప్రక్కనే నిలుచుంది. ఆమెముఖము చూచేసరికి కొంచెం విచారముతోను, ఆలోచనతోను ఉన్నట్లు కనపడింది. రమణి చిన్నప్పుడూ అందమైన పిల్లేకాని అంత అందమైనదని అంతకుముం దెన్నడూ అనుకోలేదు. "రమణీ, నన్ను పూర్తిగా మరచిపోయా వా" అని అన్నాను. "నేను మరవలేదుకాని మీరు పూర్తిగా మరచిపోయినట్టు నాకు తెలుసు" అని అన్నది. "ఏమీ?" అన్నాను. "మానాన్నగారు పోయినట్లు తెలిసీకూడా మాయింటివైపేనా చూడ కుండా వెళ్లడమే" అంది. "అబ్బే! మరచిపోవడం కాదుకాని, నాకు పరామర్శచేయడం తెలియకపోవ డంచేతను, మాటాడితే బాగుంటుందో లేదో అన్న అనుమానంచేతను వెళ్లిపోయా" నన్నాను. "అయితే మళ్లా యెందుకు వచ్చారు?" అంది. "మీతమ్ముడు పిలిస్తే" అన్నా. "ఏమని" అని అడిగింది. "మా అమ్మ పిలుస్తున్నారని." "మాఅమ్మ నాసంగతేమైనా చెప్పిందా"? "లేదుకాని నీవేమి అలా ఉన్నావు?" అన్నా. "మీ రెందుకు వచ్చారు? మీ రిలా వస్తారని నే నెప్పుడూ అనుకోలేదు. మీరు చాలా పెద్దమను

ష్యులని నేను నమ్ముతూ ఉండేదాన్ని" అంది. "అయితే నాకిప్పుడేం లోటు"? అన్నా.

"మీకు వివాహమైందా?"

"లేదు; నీవెందుకు చేసుకోలేదు?"

"నాకా? తెలిసా, నిజంగా తెలియక అడుగుతున్నారా?"

"ఏం, యెలా తెలుస్తుంది?"

"వినిరాలేదూ? అమ్మ చెప్పలేదూ?"

"ఏం చెబుతుంది" అన్నా. ఒక్క నిట్టూర్పు విడచి నావేపు పరిశీలనతో చూస్తూ "మాకులం మీకు తెలీదూ?" అంది. "నాయుళ్లు" అన్నా. "కాదు. భోగంవాళ్లు" అంది తల వంచుకొని.

నాకు ఒక్కసారి భయం, సిగ్గు వేసింది. నేను భోగంవాళ్ల యింట్లో ఆరాత్రి ఉన్నట్లు ఎవరికేనా తెలిస్తే యేమనుకుంటారు? వెంటనే లేచి వెళిపోదామనిపించింది. కాని అంత అమాయకంగా నిజం చెప్పిందే, ఏదో కష్టదశలో ఉన్నట్లుందే, కనుక్కోకుండా వెంటనే వెళితే యేం బాగుంటుంది అనిపించింది. రెండునిమిషాలు ఆలోచించి "అయితే?" అన్నా. "అందుకే మాఅమ్మ మిమ్మల్ని పిలిచి ఉంటుంది. నేను యీవిధంగా డబ్బుగణించిపెట్టాలిట" అంది దీనంగా. "అందుకే మీరు వచ్చేరనుకున్నా. క్షమించాలి. నేను తప్పుఅభిప్రాయపడ్డాను" అన్నది సిగ్గుతో. "గణిస్తున్నావా?" అన్నా. "ఏమి చేయమంటారు? నాకు చిన్నతనంలో తెలిసినవారు మీరొక్కరే. ఒకసారి మీ కుత్తరము వ్రాయా లనుకున్నాను. కాని దానివలన నాకు లాభము లేకపోవడం సరేకదా మీకు నష్టం కలుగుతుందేమోనని వ్రాయలేదు" అంటూ ఉండగానే కళ్లవెంబడి రెండు కన్నీటిచుక్కలు రాలేయి. వెంటనే కనబడకుండా తుడుచుకుంది. మరి నోట మాట రాలేదు. రెండునిమిషాలవఱకు ఎవరమూ మాటాడలేకపోయాము. తరువాత నేనే "నీవు యెవరినైనా పెండ్లిచేసుకోకూడదూ?" అన్నా. "అది మా అమ్మకు యిష్టంలేదు. ప్రేమలేనివారిని పెండ్లిచేసుకున్నా, ఈవృత్తిలో ఉన్నా ఒకటే అని నా అభిప్రాయం" అంది. "ప్రేమించినవారినే పెండ్లియాడరాదూ?" అన్నాను.

"అది అసాధ్యమేమో అని తోస్తోంది"

"ఏం" అన్నా.

"అది మీరే చెప్పాలి" అంది.

"అదేమిటి"

"నేను ప్రేమించింది మిమ్మల్నే" అంది. నేను ఆశ్చర్యంతోను, అనుమానంతోను ఆమెముఖము వైపు పరిశీలనగా చూచేను. నాదృష్టికి ఆగలేకేమో అన్నట్లు ఆమె ముఖం కొంచెం వంచి దాచుకుంది. "అది అసంభవం, అబద్ధం. మీకులంవాళ్లు చేసే మాయల్లో యిది ఒకటాయేమిటి?" అన్నాను. "మీరు నమ్మరని నాకు మొదటే తెలిసి మీకు వ్రాయలేదు. మీరు నమ్మకపోవడంలో ఆశ్చర్యమేమీ లేదు. మావాళ్లు అటువంటి వేషాలు వేయడంకూడా ఉండవచ్చు. కాని చిన్నతనం నుండి కులంవాళ్లలాగ పెరగలేదని మీకు తెలుసు. అదీగాక మీరు ఒకప్పుడు నన్ను ప్రేమించారేమో అనే ఆశతో ఇన్నాళ్లాయి ఉన్నాను. ఇప్పుడు మీతో చెప్పేసేను. నమ్మినా సరే, నమ్మకపోయినా సరే" అంది. నేను ఆమెను ప్రేమించానా అని ప్రశ్న మనస్సునకు వేసేసరికి నావొళ్లు ఝల్లుమంది. నేను చిన్నతనంలో ప్రేమ, పెళ్లి గురించి యెప్పుడూ అనుకోలేదు. నాపాట ఆ అమ్మాయి వినాలనీ, నన్ను పువ్వులు అడగాలనీ, కొంతసేపు యేడిపించి యివ్వాలనీ ఉండేది. తరువాత కిటికీలో కూర్చుంటే బడినుండి వచ్చేటప్పుడు తప్పకుండా చూచేవాడిని. చిరునవ్వులు కూడ ఇటూ అటూ చూచి నవ్వుకొనేవారము. అటువంటి పిల్లను పెండ్లాడాలని ఒకసారి అనిపించింది. కాని నేను బ్రాహ్మణుడను. ఆమె బ్రాహ్మణేతర. అందుచే ఆమెను పెండ్లాడాలనే కోరిక నాకెప్పుడూ కలగలేదు. ఇప్పుడామె అందం, చందం, మాట, యౌవనం చూడగానే మనస్సులో చాలా ఆందోళన కలిగింది. కొంచెం మనస్సు చలించింది. ఇప్పటికి సరే అంటే ఏంపోయింది అనిపించిందికూడాను. కాని ముందుసంగతి ఆలోచించగా భయం వేసింది. అంత మోసం చేయడమా అనిపించింది. తుదకామెముఖము వైపు మరల చూసేను. ఆశ, అమాయకత్వం చిత్రించినట్లు కనపడ్డాయి. నాతలపులు నాకే సిగ్గుకలిగించాయి. "నేను నిన్ను ప్రేమించడానికి వీలులేదు" అన్నాను. "ప్రేమకు వీలుంటుందా? పెళ్లికి కాని" అంది. నిజమే అనిపించింది. నాజీవితంలో ఏదో వెల్తిగా కనపడింది. నాకు ఆమె కావాలి అనిపించింది. కాని చంద్రుడు కావాలంటే వస్తాడా? కాక ప్రేమించి లాభమేమిటి? పెండ్లాడకపోతే? ఒకవేళ కులంసంగతి యేమనుకున్నా ఆవృత్తిలో అప్పుడే దిగినఆమెను పెండ్లాడడమెట్లా? కాక ఆవృత్తిలో దిగి జీవనం కొంతకాలం గడుపుతున్నవాళ్లకి ప్రేమ ఉంటుందా అని నాకు గొప్ప సంశయం. ఈతలంపులన్నీ రెండునిమిషాల్లో నాతలలో

పరిగెట్టాయి. గుండెనిబ్బరం చేసికొని గుటకలు మ్రింగుతూ "నీవన్నది నిజమే కాని, ప్రేమ, పెండ్లి రెండూ ఒకటే అని నా అభిప్రాయం. మన కుల మర్యాదల ననుసరించి మన కది తలపెట్టడానికి వీలులేని విషయం. నీవు నటిస్తున్నావో, లేక దుర్భ్రమపడ్డావో తెలియదు." అన్నాను.

ఒక చిన్న నిట్టూర్పు విడచి, కంట తడివత్తుకొని "మీరు ఇలా అంటారని అనుకోలేదు. ఇది నా అదృష్టం. మీరేంచేస్తారు? మిమ్మల్ని వివాహంచేసుకోవలెనని కూడ పోనీ నే కోరను. ఎప్పుడైనా మీ దర్శనం ఇవ్వడానికి వీలౌతుందా? దీనికి కూడ మీ సంఘము అడ్డుతుందా?" అంది. "అది నా నైతిక జీవనానికి విరుద్ధం. నిన్ను నేను ప్రేమించడానికి వీలులేదు. నన్ను వెళ్లనీ" అంటూ నే లేచాను. "పోనీ, మిమ్మల్ని ప్రేమించానని జ్ఞాపకమైనా ఉంచుకోండి. వీలైతే" అంది. ఆమె నావైపు అతిదీనంగా, నిరాశతో చూచింది. నాగుండె నీరైపోయింది. అక్కడ ఉండడానికి భయమేసింది. గుండెలు త్వరితంగా కొట్టుకుంటున్నాయి. మనస్సు బిగబట్టి నే వీధిలోకి వచ్చేను., ఆమె గదిలోకి వెళ్ళింది. వెక్కి వెక్కి యేడుస్తున్నట్లు నాకు కొంచెం వినపడ్డది. తల్లి వీథరుగుమీంచి లేచి "అయ్యో, వెళ్తున్నారేం?" అంది. "నే వెళ్లాలి" అంటూ గుమ్మం దిగి గబ గబ తిరిగి చూడకుండా వెళ్లేను.

ఆ వీథంట మళ్లీ వెళ్లకూడ దనుకున్నా. కాని ఆ మలువాడు స్నేహితులతో అలాగే వెళ్లవలసి వచ్చింది. రమణిశవం వీథిగుమ్మంలో ఉంది. ఆమె ఆత్మహత్య చేసుకొనినట్లు ఉత్తరముదొరికినదని అచటి వారు చెప్పుకుంటున్నారు. నేనే ఆమె ఆత్మహత్యకు కారకుడనేమో అని భయం, బాధ కలిగేయి. వెంటనే స్నేహితులతో షికారుపోవుట మాని బసకు చేరాను. కిటికీలోంచి పోస్టువా డొక కవరు పడవేసి పోయినాడు. వెంటనే విప్పుకొని చూడగా దానిలో—
"నమస్కారములు.

నిజము ఈ నాడే మీరు తెలుసుకో గలరు. నన్ను జ్ఞాపకముంచుకోవలయునని నా ఆఖరు కోరిక.

ఇట్లు మీ
ర ...."

తరువాతి అక్షరములు కన్నీటి చుక్కల్లో కరిగి పోయాయి. ఆ ఉత్తరం ఇప్పటి కింకా నాదగ్గరుంది.

లోకం అంతా మరచినా నేను రమణిని మరువలేదు. మరువలేను. లోకంకూడా మరువకూడదని ఈ కథ వ్రాసేను. నా కిప్పుడు నలభై దాటాయి. నలుగురు పిల్లలు. నా పెద్దకూతురు పేరు రమణి. అది మూడు మూర్తులా రమణే. ఆమె మా యిద్దరిలో ఎవరినీ పోలక రమణిని పోలుట మిక్కిలి యాశ్చర్యము. అందరిలోకీ అందమైనది. ఆమె మీద తక్కిన పిల్లలందరి కంటే ఎందు కంత ప్రేమో అని అందరూ ఆశ్చర్యపోతూ ఉంటారు. రమణి కాలగతి పొందునప్పటికి పదునెనిమిదేండ్ల నిండు జవ్వని. మా రమణి కిప్పుడు పద్దెనిమిది వత్సరములే. ఆ రమణియే బ్రాహ్మణ కులంలో పుట్టిఉంటే ఎంత బాగుండేది. లేక నేనే కులభేదాలు పాటించకుండా ఆమె మాట నమ్మితే ఎంత బాగుండేది!



విమర్శనము

ధర్మజిజ్ఞాస

రచయిత : దూర్వాసుల నరసింహమూర్తిగారు. డెమ్మీ ౧౫౫ పుటల గ్రంథము. వెల రూపాయి. విలాసము : నక్కపల్లి, విశాఖపట్టణంజిల్లా.

ఈ గ్రంథము తత్త్వశాస్త్ర విషయమగు దీర్ఘ వ్యాసము. ఇందు ఐదు అధ్యాయములలో నైతిక విషయములను, తత్త్వశాస్త్రవిషయములను చక్కటి తేట తెలుగులో పర్యాలోచింపబడినవి. ఆంగ్లమున 'ఫిలసాఫికల్ ఎస్సే' అనబడు రచన కొక విశిష్టస్థానమున్నది. ఈ రచనలు తెలుగులో చాలతక్కువ. కనుక, గ్రంథకర్తయొక్క ఈ కృషి అభినందనీయము. ప్రతిగ్రంథాలయమువను ఈ గ్రంథమునుంచినచో, కేవలము ఆంధ్ర భాషాద్వారముననే జ్ఞానోపార్జన మొనర్చుకొనువారికీగ్రంథము అత్యంతోపకారి కాగలదు.

గ్రంథకర్త మాంసాహారము నధర్మమని నుడివిన విషయము వివాదాస్పదము. గ్రంథమును సంపూర్ణముగ పఠించుటకు ఓపికలేని 'కవిసార్వభౌము'ని అభిప్రాయము గ్రంథగౌరవము నేరీతిగ వృద్ధిపఱచుచున్నదో తెలియకున్నది. ధర్మజిజ్ఞాసగలవారందఱును ఈపుస్తకమును పఠింతురుగాక.

నిర్వికల్పానందస్వామి.

మునిపత్ని

ఏకాంకనాటిక. రచయిత : రెండుచింతల లక్ష్మీనరసింహశాస్త్రిగారు, గుడ్లవల్లేరు, కృష్ణాజిల్లా. ద్వితీయముద్రణము, వెల ౮ అణాలు.

చ్యవనమహర్షి వృద్ధాప్యమున శర్యాతి మహారాజ తనయయైన సుకన్యను వివాహమాడిన సంఘటనమును, ఆసాధ్వీశీలమునకు మెచ్చిన అశ్వినీకుమారుల యనుగ్రహమున చ్యవనుడు తిరిగి యౌవనమును పొందిన వృత్తాంతమును సామాన్య కథాప్రాయముగా ఈచిన్న నాటిక రచింపబడినది. కల్పనలో విశిష్టత లేకపోయినను రచన అక్లిష్టమయియున్నది.

అవ్వారి సుబ్రహ్మణ్యశాస్త్రి జీవిత చరిత్రము

ఆంధ్రధ్వని, తెలుగు కావ్యాదర్శము మొదలైన గ్రంథములను రచించి పండిత ప్రకాండులుగా విఖ్యాతి గడించి కీర్తిశేషులైన ఈమహోదయుని జీవిత విశేషములు సప్రమాణముగా ఈ గ్రంథమునందు నిబద్ధములై యున్నవి. వారి కవితా విశేషములును, విద్యావినోదములును, తదితర వ్యాసంగములు కూడ ఇందులో వివరముగా ఉల్లేఖింపబడినవి.

గ్రథకుడు : అవ్వారి వాసుదేవశాస్త్రి గారు. ప్రాప్తిస్థానము : అవ్వారి వేంకటేశ్వరశర్మగారు, గార్లపాడు, పెదనందిపాడు పోస్టు, గుంటూరుజిల్లా. వెల ౧ రూపాయ.

అలంకార వసంతము

రచయిత : చలమచర్ల రంగాచార్యులుగారు. ప్రకాశకులు : విజ్ఞానవర్ధినీ పరిషత్తు, హైదరాబాదు. వెల ౧ రూపాయ.

సంస్కృతాలంకార వాఙ్మయములోని అలంకారముల నన్నిటిని స్వరూపోదాహరణములతో నిర్వచింపగలిగిన చంద్రాలోకము, కువలయానందము మొదలయిన రచనల ఛక్కికలో రచింపబడిన అలంకార గ్రంథ మిది. అలంకార సామాన్య స్వరూపము, దానికి గ్రంథకర్త స్వయముగా రచించిన ఉదాహరణ పద్యములు, పద్యములకును అలంకార స్వరూపమునకును సమన్వయ నిర్వచనము—ఈ క్రమములో గ్రంథమంతయు నడచినది. ప్రాచీనాలంకార గ్రంథముల నన్నిటిని పరిశోధించి తమకు వచ్చిన విధానము చొప్పున

౯౬ అలంకారములను ప్రపంచించి, గ్రంథకర్త వివాదములజోలికిని, చర్చల ప్రమేయమునకును పోనందున ఎక్కువ విమర్శ కిందు తావుకానరాదు. అలంకార సామాన్యస్వరూప పరిజ్ఞానమునకు ఈ గ్రంథము ఉన్నంతలో చక్కగా అక్కరకు రాగలదనుటకు సంశయింప బనిలేదు. మరియొక విశేషము. ఉదాహరణ పద్యములు మంచి ధాటిలో సరళశైలిలో నడచినవి. వృత్తభేదమును గ్రహింపక ఒక్క సీస పద్యములతోనే ఉదాహరణల నన్నిటిని నిర్వహించి యున్నారు. ప్రాథమిక విద్యార్థులకు ఇది మిక్కిలి ఉపయోగకారి కాగలదు.

సుఖసంసారము

గ్రంథకర్త: పుచ్చా వెంకటరామయ్యగారు, ప్రకృతికార్యాలయము, బెజవాడ.

దాంపత్యజీవితములో పారపొచ్చెములు రాకుండ, 'సంసారం సాగరం దుఃఖం' అను సామెతకు ఆస్కారము లేకుండ, సంసారమును సుఖమయముగ గడపుటకు దంపతులు అవలంబింపవలసిన హితచర్యలు శాస్త్రీయముగా, సప్రమాణముగా ఈ పుస్తకమునందు వివరింపబడినవి. శాస్త్రగ్రంథమైనను ఇది కరతలామలకమైన సులభశైలిలోనున్నది. దాంపత్యశాస్త్ర విషయములన్నియు ఇందులో మరుగు మర్మము లేక కథారూపమున, విసువుపుట్టించని క్రమములో, ఉత్తరోత్తర చదువుటకు ప్రేరేపించుపద్ధతిలో విశదీకరింపబడియున్నవి. ఇటువంటి శాస్త్రగ్రంథములు తెలుగులో ఎన్నయినను రావలసియున్నవి. కామశాస్త్రమునకును దాంపత్య సుఖజీవితమునకును గల సన్నిహితసంబంధములోని సామంజస్యమును తెలిసికొనుటకు దీని ఉపకారము బహుబహుంశమయి తీరగలదు.

పాడిపంటలు

మద్రాసుప్రభుత్వ వ్యవసాయశాఖవారు గ్రామీణులలో వ్యవసాయ ప్రబోధము గావించుటకై తెలుగులో క్రొత్తగా ప్రారంభించిన వ్యవసాయ మాసపత్రిక. వెల గిల లేక ఉచితముగానే దీనిని పంచిపెట్టదలచిన సంకల్పము శ్లాఘ్యమైయున్నది. వ్యవసాయము., ఆరోగ్యము, సహకారము మొదలైన విషయాలనుగురించి వివిధాకరములనుండి కూర్చబడిన చక్కని వ్యాసములు వాడుకమాటలలో, మామూలు రైతులకుగూడ బోధపడు శైలిలో ఉండి ఈతొలిసంచిక చక్కనిభవిష్యత్తును సూచించుచున్నది. వ్యాసములే కాక ఊహాలు రేకెత్తించు బొమ్మలు, అనుభవజ్ఞుల అభిప్రాయాలు, కథలు, టుమ్రీలుకూడ ఉన్నవి.

గ్రంథ స్వీకారము

అభినవాంధ్ర ధ్వన్యాలోకము

(ప్రథమోద్ద్యోతము)

గ్రంథకర్త: భాగవతుల కుటుంబశాస్త్రిగారు, హిందూకాలేజి, బందరు. వెల రెండు రూపాయలు.

రష్యావిప్లవం

గ్రంథకర్త: పి. వి. సుబ్బారావుగారు, ప్రకాశకులు: జాకోబిన్ పబ్లిషర్సు, తెనాలి. వెల రూపాయి పావలా.

లెనిన్

రచయిత: క్లారాజెట్కిన్, అనువాదకులు: పండితారాధ్యుల నాగేశ్వరరావుగారు. ప్రకాశకులు: సంస్కృతి గ్రంథమండలి, వంగల్ బిల్డింగ్సు, పెరంబూరు, మద్రాసు. వెల ౭ అణాలు.

గాంధీవాదము-పునఃపరిశీలన

గ్రంథకర్త: ప్రొఫెసర్ యం. యల్. దంతవాలా. అనువాదకులు: మైనేని రామకోటయ్యగారు, ప్రకాశకులు: దేశకవితామండలి, ఘంటశాల, కృష్ణాజిల్లా. వెల అర్ధరూపాయి.

జగత్తు-జీవము

గ్రంథకర్త: వసంతరావు వెంకటరావుగారు, యం. యస్. సి., మహారాజావారి కళాశాల, విజయనగరము. వెల ఒక రూపాయి.

సోవియట్ స్త్రీలు

రచయిత: పి. పిచుగీనా. అనువాదకుడు: యన్. వి. యస్. ప్రసాదరావుగారు. ప్రకాశకులు: స్వతంత్ర ప్రచురణాలయము, జమీదింటకుర్రు, కృష్ణాజిల్లా. వెల 3 అణాలు.

౧. తోకచుక్క
౨. పాతమంగలి

రచయిత: చక్రపాణి. వెల ఒక్కొక్కటి ౧౨ అణాలు.

3. హంపీకన్యలు

౪. మంగమ్మ

రచయిత: నుడిపాటి వెంకటచలంగారు. వెల: తొలిది ముప్పావలా; మలిది రూపాయి.

౫. పల్లీయులు

౬. బడదీదీ

రచయిత: శ్రీ శరచ్చంద్ర ఛటర్జీ. అనువాదకులు: 'చక్రపాణి'గారు. వెల: తొలిదిరూపాయిన్నర; మలిది ముప్పావలా.

౭. ఆనాపీలర్

రచయిత్రి: శ్రీ సౌరిస్. వెల ౧౨ అణాలు.

౮. మూగజీవాలు

రచయిత: మా. గోఖలేగారు. వెల ౧౨ అణాలు.

౯. మూరుపేర్లు

రచయిత: కొడవటిగంటి కుటుంబరావుగారు. వెల ౧౨ అణాలు.

౧౦. వనఫూల్ రచనలు

అనువాదకుడు: 'చక్రపాణి' గారు. వెల ౧౨ అణాలు.

ఈ గ్రంథదశకము యువబుక్ డిపో (43, ఆచారప్పన్ వీధి, జి. టి. మద్రాసు) వారి ప్రచురణలు.

సాభిప్రాయ విశేషాలు

లక్ష్మణరాయవర్ధంతి:

క్రిందటినెల విశేషాలలో ఎన్నికగన్నది శ్రీ లక్ష్మణరాయవర్ధంతి. ఆంధ్రదేశమునందు ఇది పలు చోట్ల అతివైభవముగా జరుపబడినది. విధ్యుక్తమును ఏమరక ఇటువంటి కవి, పండిత, వీరపూజలు చేయుచున్న ఆంధ్రుల శ్రద్ధాభక్తులు మెచ్చుకొనదగినవి.

నవ్యపరిశోధనల కన్నుమెంగ మెరుగని ఆ తొలిరోజులలో ఆంధ్రవాఙ్మయ,చరిత్రలయందు సరికొత్తపరిశోధనను ప్రారంభించి, క్రొత్తక్రొత్త వెలుగులతో సారస్వత సేవచేసిన తొలిపూజారులు పలుగురైదుగురిలో శ్రీ కొమర్రాజు లక్ష్మణరావుగారొకరు. వారి పాండిత్యము, వారి ప్రతిభ, వారిసర్వతోముఖపరిశోధనలు అసమానమైనవి. వారి అకుంఠిత సారస్వత సేవకు అక్షరస్వరూపమున నిలచియున్న విజ్ఞానచంద్రికా గ్రంథములును, వారు మృత్యువు మిగిల్చిపోయిన ఆంధ్ర విజ్ఞాన సర్వస్వ ప్రథమసంపుటములును ప్రత్యక్ష సాక్ష్యములై యున్నవి. వారి పేరు శాశ్వతబ్రహ్మకల్పముగా నిలుపుటకు ఇవియే శాశ్వతచిహ్నములై యున్నవి.

ఇట్టి మహనీయుని నిత్యస్మరణ నిస్సంశయముగా ఆంధ్రులకు అభ్యుదయశ్రేయోహేతువు.

లక్ష్మణరావుగారు సంకల్పించి మొదలుపెట్టిన ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము — అమృతహస్తులైన శ్రీ నాగేశ్వరరావు గారు చేపట్టి, ఆంగ్ల విజ్ఞాన సర్వస్వములను తలదన్న గలిగిన సంవిధానములో కూర్పులు, తీర్పులు, మార్పులుచేసి పెంచి పెద్దచేసి వన్నెచిన్నెలంకూర్చి సరికొత్తగా ప్రారంభించి నిర్వహించిన ఆంధ్రవిజ్ఞానసర్వస్వము వారితోనే అర్థాంతరముగా ఆగిపోయినదనుకొనుట పొరబాటు. ప్రపంచావృతములైన అవాంతరములలో అది తాత్కాలికముగా ఆగియున్నను కాలము, దేశము, దేవుడు కలిసివచ్చిన వెంటనే తిరిగి పూర్వాధికమైన వేగముతో సమగ్రముగా వెలువడితీరగలదు. లక్ష్మణరావుగారి సంకల్పబలము, నాగేశ్వరరావుపంతులుగారి హస్తవాసి వృథా పోనేరవు.

Printed and Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, No. 7, Thambu Chetty St, Madras. Editor:— S. Sambhu Prasad.

ఇండియన్ టీలలో అత్యుత్తమమైనది





చక్కని రుచి, ఘుమ ఘుమలాడే సువాసన, నేత్ర పర్వంగావుండే రంగు, తక్కువధర, వీటి అన్నింటి నిబట్టి లిప్టన్స్ టీ గర్ల్ మిగతా వాటిని తలదన్ని అత్యధిక గౌరవాన్ని తెచ్చుకున్నది.

లిప్టన్స్ టీగర్ల్

మృదు మధురమైన ఇండియన్ డస్ట్ టీ

LTK 84 G